సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 235

గురువారం 16-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి. దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'



బీజేపీకి రాములమ్మ రాం రాం

బీజేపీకి ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి రాజీనామా. -5లో



ఎవరెస్ట్ జంప్

భారతీయ స్కై డైవర్ శీతల్ మహాజన్ ఎవరెస్ట్ ఎదుట పక్షిలా ఎగిరారు. -13లో



'షమీ' ఫైనల్

ప్రపంచకప్ ఫైనల్లో భారత్

- 7 వికెట్లతో న్యూజిలాండ్‌ను పడగొట్టిన షమీ..
- కోహ్లి, శ్రేయస్ సెంచరీలు



50 సెంచరీలతో సచిన్ రికార్డు బద్దలు

శతకోటి భారతావని కోరుకున్నట్లే కివీస్‌పై ప్రతీకారం తీర్చుకున్న టీమిండియా ప్రపంచకప్‌లో ఫైనల్ చేరింది. బుధవారం జరిగిన తొలి సెమీస్‌లో భారత్ 70 పరుగులతో న్యూజిలాండ్‌పై గెలిచింది. మొదట టీమిండియా 50 ఓవర్లలో 4 వికెట్లకు 397 పరుగుల భారీస్కోరు చేసింది. కోహ్లి (113బంతుల్లో 117; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) 50వ సెంచరీతో సచిన్‌ను దాటాడు. శ్రేయస్ అయ్యర్ (70 బంతుల్లో 105; 4 ఫోర్లు, 8 సిక్స్‌లు) కూడా శతక్కొట్టాడు. తర్వాత న్యూజిలాండ్ 48.5 ఓవర్లలో 327 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో మిచెల్ (119 బంతుల్లో 134; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) భారత శిబిరాన్ని వణికించినా... షమీ (7/57) ఎక్స్‌ప్రెస్ బౌలింగ్ జట్టును గెలిపించింది. భారత బౌలర్లలో వన్డేల్లో షమీదే అత్యుత్తమ ప్రదర్శన.

14లో

ఆ ఓటే కాటేస్తది..

కాంగ్రెస్‌ను నమ్మి అధికారమిస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తది

బోధన్, నిజామాబాద్ అర్బన్, ఎల్లారెడ్డి, మెదక్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

- కాంగ్రెస్ పార్టీ ఉన్న తెలంగాణను తీసుకెళ్లి ఆంధ్రాలో కలిపింది
- సాగునీరు, తాగునీరు, కరెంటు ఇవ్వకుండా 55 ఏళ్లు గోసపెట్టింది
- మన పోరాటాలతో గత్యంతరం లేక ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది
- ఇప్పుడు మన వేళ్లతో మన కళ్లే పొడుచుకునేలా చేస్తోంది
- కాంగ్రెస్ ధరణిని బంగాళాఖాతంలో పడేస్తే.. రైతులు అరేబియా సముద్రానికి వెళ్లాల్సి వస్తుంది
- 2024లో కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే..
- తెలంగాణలో ఎంపీ సీట్లన్నీ గెలిస్తే ఢిల్లీలో తడాఖా చూపించవచ్చన్న సీఎం

"కాంగ్రెస్ నాయకులు రాహుల్, రేవంత్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని అంటున్నారు. అలా చేస్తే రైతులు అరేబియా సముద్రానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. ధరణి తొలగిస్తే దళారీ వ్యవస్థ రాజ్యమేలుతుంది. రైతులను నంజుకుతింటారు.అది మనకు అవసరమా? 3 గంటల కరెంటు అని పీసీసీ అధ్యక్షుడు చెప్తున్నాడు. పది హెచ్‌పీ మోటార్లు పెట్టాలంటడు. పది హెచ్‌పీ మోటార్లంటే.. 30 లక్షల బోర్లకు రూ.30 వేల కోట్లు ఖర్చు చేయాలె. వాళ్లకు ఏమన్న తెలుస్తుందా? కాంగ్రెస్ నాయకులు మన వేళ్లతో మన కళ్లనే పొడుచుకునేలా చేస్తున్నారు.

- కేసీఆర్

- వివరాలు 2లో



'హంగ్' ప్రసక్తే లేదు!

- పూర్తి మెజారిటీతో మూడోసారి అధికారంలోకి బీఆర్‌ఎస్
- గతంలో మహా కూటమి కట్టినా కాంగ్రెస్‌కు అధికారం దక్కలేదు
- కర్ణాటక మోడల్ అట్టర్ ఫ్లాప్
- నెత్తీ కత్తీ లేని బీజేపీ హామీలకు విలువ లేదు.
- తెలంగాణ వ్యతిరేక శక్తులతో రేవంత్ అంటకాగుతున్నారు
- ప్రశాంత్ కిషోర్ మాతో పనిచేయడం లేదు
- మీట్ ది ప్రెస్‌లో మంత్రి హరీశ్‌రావు

- 2లో

అయితే ఓకే!

ఫలించిన 'బుజ్జగింపులు'

- కీలక స్థానాల్లో నామినేషన్లు ఉపసంహరించుకున్న కాంగ్రెస్ రెబెల్స్
- సూర్యాపేటను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధిష్టానం...
- పటేల్ రమేశ్ రెడ్డి ఇంటికి రోహిత్, మల్లు రవి
- ఫోన్‌లో మాట్లాడిన కేసీ వేణుగోపాల్ నల్లగొండ ఎంపీ టికెట్‌పై భరోసా
- ఆదిలాబాద్ మినహా అన్నిచోట్లా బడానేతల ఉపసంహరణలు
- కొన్నిచోట్ల పోటీలో చిన్న నేతలు



నామినేషన్ ఉపసంహరించుకుంటున్న రమేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్, సూర్యాపేట, కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపులు ఫలించాయి. రెండు రోజులుగా దృష్టి పెట్టి చర్చోపచర్చలు జరపడంతో ప్రస్తుతానికి ఆ పార్టీకి రెబెల్స్ గండం తప్పింది. కీలక స్థానాలైన సూర్యాపేట, వరంగల్ వెస్ట్, బాన్సువాడ, జుక్కల్, డోర్నకల్ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను దెబ్బతీయగలిగిన నేతలు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించలేకపోయినప్పటికీ భవిష్యత్తులో మంచి అవకాశాలిస్తామని, అటు పార్టీలో,

మిగతా 3వ పేజీలో ▶

బరిలో 2,290 మంది..

- నామినేషన్లను ఉపసంహరించుకున్న 608 మంది అభ్యర్థులు

5లో



ఆ 7 స్థానాల్లో అదనపు బ్యాలెట్ యూనిట్లు







మాజీ సీఎం ఫోన్! మీ ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తుందనుకున్నారట సార్!



మేడిగడ్డను ముంచిన మామా అల్లుళ్లు

- రీడిజైనింగ్ పేరిట కోట్లు దోచుకున్నారు: రేవంత్‌రెడ్డి
- ప్రజలకు ఎంట్రీలేని ప్రగతి భవన్‌ను పేల్చితే తప్పేంటి?
- గెలిస్తే రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను తెస్తాం

సచివాలయానికి రాని సీఎం అవసరమా?

3లో

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- తెలంగాణ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

అసైన్డ్ భూములపై హక్కులిస్తాం



- వాటిని అమ్ముకోవచ్చు, కుదువ పెట్టుకోవచ్చు: కేటీఆర్
- దరిద్రానికి నేస్తం.. కాంగ్రెస్ హస్తమని విమర్శ
- వారిని నమ్మితే నష్టపోతామని వ్యాఖ్య

- వివరాలు 2లో

గజ్వేల్, కామారెడ్డిలో మాదే గెలుపు



- కేసీఆర్, కేటీఆర్ ఈ ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయం
- సీఎంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది
- బీజేపీ 111 స్థానాల్లో, జనసేన 8 స్థానాల్లో బరిలో ఉంది
- కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

-5లో

కశ్మీర్‌లో ఘోర ప్రమాదం

- బస్సు లోయలో పడి.. 38 మంది మృత్యువాత
- మరో 20 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలు
- దోడా జిల్లాలో ఘటన.. ప్రధాని దిగ్భ్రాంతి

6లో



అవినీతి, కుటుంబ పాలనతో తెలంగాణలో 'కారు'చీకట్లు



కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో....

- కష్టాల్లో చిన్న, సన్నకారు రైతులు
- కొలువులు దక్కని నిరుద్యోగులు
- పేదలకు దక్కని డబుల్ బెడ్ రూంలు
- భ్రష్టు పట్టిన విద్యా వ్యవస్థలో విద్యార్థులు
- సకాలంలో జీతాలు అందక ఉద్యోగులు
- అప్పులకుప్పగా మారిన రాష్ట్ర ఆర్థిక స్థితి
- సమస్యల వలయంలో సకల జనులు

చివరకు గొప్పగా చెప్పుకున్న కాళేశ్వరం గోదారి పాలు

రండి....

బిజెపి ని గెలిపించుకుందాం...

తెలంగాణను కాపాడుకుందాం

కమలం పువ్వు గుర్తుకే మన ఓటు



క్లుప్తంగా...

30న వేతనంతో కూడిన సెలవు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 30వ తేదీన ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఫ్యాక్టరీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు ప్రకారం తెలంగాణలోని మొత్తం 33 జిల్లాల్లో వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించింది. కార్మికులు, ఉద్యోగులు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలన్నింటికీ ఇది వర్తిస్తుందని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఐ.రాణి కుముదిని బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

కేసీఆర్‌ని సవాల్ చేసే నైతికత రేవంత్‌కి లేదు

- రేవంత్ చంద్రబాబు చెంచా.. తెలంగాణ ద్రోహి: దాసోజు



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ ముందు రేవంత్ రెడ్డి కుప్పిగంతులు హనుమంతుడి ముందు చిట్టెలుక తరహాలో ఉన్నాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ ముందు మాట్లాడే నైతికత లేని రేవంత్‌రెడ్డి సవాళ్లు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కొడంగల్‌లోనే రేవంత్‌ను కర్రుకాల్చి వాత పెట్టిన జనం, కామారెడ్డిలో కసురు కక్కిస్తారని హెచ్చరించారు. చంద్రబాబు చెంచాగా, తెలంగాణ ద్రోహిగా పనిచేసిన రేవంత్‌కి అమరవీరుల గురించి మాట్లాడే అర్హత లేదని, సొంత పార్టీ టికెట్లను అమ్ముకున్న ఆయనను ఎట్టి పరిస్థితిల్లో అసెంబ్లీ మెట్లు ఎక్కనీయకూడదని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్‌పై కామారెడ్డిలో చర్చకు రావాలని సవాల్ చేస్తున్న రేవంత్ 24 గంటలపాటు ట్రాన్స్‌ఫార్మర్‌లో చేయిపెట్టి నిల్చోవాలని, ఏం కాకపోతే కరెంటు లేనట్టు భావిస్తామని అన్నారు. తెలంగాణ రాకముందు పవర్ హాలిడేలను తట్టుకోలేమని పరిశ్రమల నిర్వాహకులు, రైతులు దీక్షలు చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని కోరారు. పథకాలని సరిగ్గా అమలు చేయకపోవడం వల్లనే కొత్త ప్రభాకర్ రెడ్డిని కత్తితో పొడిచారని రేవంత్ మాట్లాడటం ఆయన మానసిక స్థితిని తెలుపుతోందన్నారు.

19 నుంచి సీపీఎం జాతీయ నేతల ప్రచారం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం సీపీఎం పార్టీ జాతీయ నాయకత్వం ఈనెల 19 నుంచి రంగంలోకి దిగనుంది. దాదాపు వారం రోజుల పాటు వరుసగా పర్యటనలు చేస్తూ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్, సుభాషిణి అలీ, విజయరాఘవన్, బీవీ రాఘవులు వరుసగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఈనెల 25న పాలేరులో, 26న మిర్యాలగూడ, 27న భువనగిరి నియోజకవర్గాల్లో పలు బహిరంగ సభలు, రోడ్‌షోల్లో పాల్గొనున్నారు. మాణిక్ సర్కార్ ఈనెల 24న ఖమ్మం, ముదిగొండ, 25న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాజేడు, భద్రాచలం, 26న పాలేరు నియోజకవర్గం కూసుమంచి సభల్లో, రోడ్‌షోల్లో పాల్గొంటారు. బృందాకారత్ ఈనెల 25న వైరా నియోజకవర్గంలో రోడ్‌షో, మధిర నియోజకవర్గం బోనకల్‌లో సభ, 26న ఇబ్రహీంపట్నం సభ, 27న భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం, చర్ల, 28న కోదాడ, హుజూర్‌నగర్‌లలో రోడ్‌షోల్లో పాల్గొంటారు. సుభాషిణి అలీ ఈనెల 24న జనగాం, హైదరాబాద్‌లోని ముషీరాబాద్ సభల్లో పాల్గొంటారు. విజయ రాఘవన్ ఈనెల 20న భద్రాచలం నియోజకవర్గంలోని వెంకటాపురం సభలో పాల్గొంటారు. బీవీ రాఘవులు ఈనెల 19న పటాన్‌చెరు నియోజకవర్గం సభలో పాల్గొంటారు.

నోటిఫికేషన్ వచ్చినందున జోక్యం చేసుకోలేం

- ఓటర్ జాబితా నుంచి 'యశస్విని' పేరు తొలగింపుపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే వచ్చినందున పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్విని ఓటు తొలగింపు అంశంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఒకవేళ ఎన్నికల్లో ఆమె విజయం సాధిస్తే...ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 82, సెక్షన్ 83, సెక్షన్ 100 మేరకు గెలుపును సవాల్ చేస్తూ పిటిషనర్ ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సలహా ఇచ్చింది. ఓటు తొలగించాలంటూ దాఖలైన పిటిషన్‌లో వాదనలను ముగిస్తున్నట్లు స్పష్టం చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితా నుంచి యశస్విని ఓటు తొలగించాలంటూ డిండికి చెందిన కంపల్లి దేవ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆమె అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తోందని పేర్కొన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపించారు. ఒకసారి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఓటర్ల జాబితాలో మార్పు, చేర్పులకు అవకాశం లేదని ఎన్నికల కమిషన్ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. పై విధంగా పేర్కొంది.



బుధవారం ఎల్లారెడ్డిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



బుధవారం మెదక్ జిల్లాలో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు

ఆ ఓటే కాటేస్తది!

కాంగ్రెస్‌ను నమ్మి అధికారమిస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తది

బోధన్, నిజామాబాద్ అర్బన్, ఎల్లారెడ్డి, సంగారెడ్డి ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/ సాక్షి, కామారెడ్డి/ సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఉన్న తెలంగాణను తీసుకెళ్లి ఆంధ్రాలో కలిపి 55 ఏళ్లు గోసపెట్టిన కాంగ్రెస్ పార్టీ మళ్లీ వస్తోందని, నమ్మి మోసపోతే గోస పడతామని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. రాజకీయం అంటే సినిమా మ్యాట్నీ షో కాదని, ఎవరో చెప్పారని కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆ ఓటే కాటేస్తుందని హెచ్చరించారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే దళారులు రాజ్యమేలుతారన్నారు. ఓటు వేసే ముందు ఎవరు ఏం చేశారో ఆలోచన చేయాలని, తెలంగాణ రాకముందు ఎలా ఉండేది, ఇప్పుడెలా ఉన్నదీ గమనించాలని కోరారు. అభ్యర్థులు, వాళ్ల వెనుక ఉన్న పార్టీల చరిత్రను చూసి నిర్ణయం తీసుకోవాలని, దుర్మార్గపు కాంగ్రెస్‌ను మట్టి కరిపించాలని పిలుపునిచ్చారు. బుధవారం నిజామాబాద్ జిల్లా బోధన్, నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి, మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం. చరిత్ర మీ కళ్ల ముందే ఉంది. పార్టీ మీముందే పుట్టింది. మీ ముందే పెరిగింది. అదే కాంగ్రెస్ ఉన్న తెలంగాణను ఊడగొట్టింది. 55 ఏళ్లు గోస పెట్టింది. సాగునీరు, తాగునీరు, కరెంట్ లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. రైతుల ఆత్మహత్యలతో గందరగోళ పరిస్థితులు ఉండేవి. అలాంటి కాంగ్రెస్ పార్టీ కొత్త రూపంతో వస్తోంది. సంపద పెంచకుండా సర్వనాశనం చేసి మళ్లీ వస్తోంది. దానికి ఓటేసి మోసపోతే గోసపడతాం. దుర్మార్గపు కాంగ్రెస్‌ను మట్టి కరిపించాలి. రాజకీయం అంటే సినిమా మ్యాట్నీ షోకాదు.. ఎవరో చెప్పారని ఓటేస్తే ఆ ఓటే కాటేస్తది.

కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే!

వచ్చే పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వమే వస్తుంది. రాష్ట్రంలో ఎంపీ సీట్లన్నీ గెలిస్తే ఢిల్లీలో తడాఖా చూపించొచ్చు. పాలనా సంస్కరణల్లో భాగంగా తెలంగాణలో 33 జిల్లాలు ఏర్పాటు చేసుకున్నాం. నవోదయ విద్యాలయాల కోసం ప్రధాని మోదీకి అనేకసార్లు లేఖలు రాశాం. కానీ ఇప్పటికీ ఒక్కటి కూడా ఇవ్వలేదు. దేశవ్యాప్తంగా మోదీ ప్రభుత్వం 157 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఇస్తే తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదు. వివిధ పథకాల ద్వారా తెలంగాణకు రూ.25వేల కోట్లు రావాల్సి ఉన్నా ఇవ్వకుండా అడ్డుపుల్లలు వేస్తోంది. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోంది.

పోరాటాలతోనే రాష్ట్రం వచ్చింది

యాభై ఐదేళ్లు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ పాలనలో ఎంతో గోసపడ్డాం. మనను తీసుకుపోయి ఆంధ్రలో కలిపి బాధపెట్టారు. తెలంగాణ రాకముందు రైతుల ఆకలి చావులు, నేతన్న ఆత్మహత్యలు, బతుకుదెరువు కోసం వలసలతో పల్లెల పరిస్థితి దారుణంగా ఉండేది. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతున్న బీఆర్ఎస్ (టీఆర్ఎస్)ను చీల్చేందుకూ కాంగ్రెస్ ప్రయత్నించింది. అయినా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలతో గత్యంతరం లేని పరిస్థితుల్లో తెలంగాణ ఇచ్చింది. గత పదేళ్లుగా రాష్ట్రం ప్రశాంతంగా ఉంది. ఎలాంటి మతకలహాలు లేవు. నిజాం హయాంలో కట్టిన నిజాంసాగర్ ప్రాజెక్టు కాంగ్రెస్ హయాంలో ఏవిధంగా తయారైందో ప్రజలకు తెలుసు. మా ప్రభుత్వం వచ్చాక నిజాంసాగర్‌ను పునరుద్ధరించాం. దీనికి కాళేశ్వరం నీటిని అందించేందుకు లింక్ ఏర్పాటు చేశాం.

బీడీ కార్మికులందరికీ పింఛన్

రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇస్తున్నం. ఇంటింటికీ నల్లా నీళ్లు ఇచ్చుకున్నం. చెరువులను బాగు చేసుకున్నం. తలసరి ఆదాయంలో నంబర్ వన్‌గా నిలిచినం. రైతుబంధును రూ.10 వేల నుంచి ఏడాదికి కొంత పెంచుకుంటూ రూ.16 వేలు చేసుకుందాం. బీడీ టేకేదార్లకు, బీడీ కార్మికులకు ఉన్న 2014 ఏడాది కటాఫ్‌ను తొలగించి పీఎఫ్ ఉన్న ప్రతిఒక్కరికీ పింఛన్ అందిస్తాం. వారితోపాటు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కిడ్నీ బాధితుల పింఛన్లు రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచుకుందాం..''అని కేసీఆర్ పేర్కొన్నారు.

ముదిరాజ్‌లకు మంచి రాజకీయ ప్రాతినిధ్యం

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్




సమావేశంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్

సాక్షి, హైదరాబాద్: రాబోయే రోజుల్లో ముదిరాజ్ సామాజికవర్గానికి రాజ్యసభ మొదలుకుని స్థానిక సంస్థల వరకు అన్ని స్థాయిల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఇచ్చిన భరోసాను తాము పూర్తి స్థాయిలో విశ్వసిస్తున్నట్లు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్ వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు ముదిరాజ్ సామాజికవర్గం కష్టపడాలని పిలుపునిచ్చారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో ముదిరాజ్ సామాజికవర్గం నేతలు కాసాని జ్ఞానేశ్వర్, మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్, టీఎన్‌జీఓ యూనియన్ మాజీ అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్, మందుల వరలక్ష్మి, బిత్తిరి సత్తి (రవికుమార్) తదితరులతో సమావేశమయ్యారు. అనంతరం ప్రకాశ్ ముదిరాజ్ మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ దిశానిర్దేశానికి అనుగుణంగా మత్స్య సహకార సంఘాల సొసైటీలు 2 వేల నుంచి 6 వేలకు పెరిగాయని తెలిపారు. వెయ్యి కోట్ల రూపాయలతో ఐఎఫ్‌డీసీ పథకాన్ని చేపట్టి మత్స్యకారులకు 75 శాతం సబ్సిడీ అందించారన్నారు. గ్రామ పంచాయతీ ఆధీనంలోని చెరువులను మత్స్యశాఖకు బదిలీ చేయడం, ప్రమాద బీమాను రూ.లక్ష నుంచి రూ.6 లక్షలకు పెంచడం, మత్స్య సహకార సంఘాల్లో 18 సంవత్సరాలు నిండిన ముదిరాజ్ యువతకు సభ్యత్వం కల్పించడం వంటి నిర్ణయాలను సీఎం కేసీఆర్ తీసుకున్నారన్నారు. వనపర్తి, సూర్యాపేట, గద్వాల, అచ్చంపేటలో త్వరలో ముదిరాజ్ ఆత్మగౌరవ భవనాలు పూర్తవుతాయన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లెబోయిన అశోక్, గుండ్ల పల్లి శ్రీను, ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు రాధిక, యూత్ విభాగం కార్యదర్శి అల్లుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ వైరే మంట పెట్టింది!

- బజార్‌ఘాట్ అగ్నిప్రమాదంపై స్పష్టత
- ఉదయం 8.45 గంటలకు షార్ట్ సర్క్యూట్
- ఆర్పడానికి ప్రయత్నించిన వాచ్‌మెన్ దంపతులు
- రసాయనాలు ఉండటంతో మంటలు



సాక్షి, హైదరాబాద్: వాటర్ మోటార్ వైరులో ఏర్పడిన షార్ట్‌సర్క్యూట్ కారణంగానే బజార్‌ఘాట్‌లోని బాలాజీ రెసిడెన్సీలో అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఉదంతం చోటు చేసుకున్న భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్‌ను విశ్లేషించిన నేపథ్యంలో ఈ అంచనాకు వచ్చారు. సోమ వారం జరిగిన ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది మృతిచెందిన విషయం విదితమే. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమని మొదట్లోనే భావించినా... ఎప్పుడు? ఎక్కడ నుంచి జరిగిందనేది తాజాగా క్లూస్ టీమ్ అధికారులు గుర్తించారు.

కేసింగ్ దెబ్బతిని వైర్లు బయటకు...

ఈ అపార్ట్‌మెంట్‌ను జీ+4 విధానంలో నిర్మించారు. మధ్యలో లిఫ్ట్, మెట్లు ఉండగా... వీటికి కుడి వైపున నాలుగు, ఎడమ వైపున నాలుగు చొప్పున ఫ్లాట్స్ ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో వాచ్‌మెన్ గదితో పాటు యజమాని రమేష్ జైశ్వాల్‌కు సంబంధించిన అక్రమ గోదాములు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో కుడి వైపు వాచ్‌మెన్ రూమ్ పక్కన పాలిమర్ షీట్లు నిల్వ ఉంచగా.. ఎడమ వైపు రసాయనాల డబ్బాలు ఉంచారు. దీనికి సమీపంలోనే కొన్ని కార్టన్ బాక్సుల్నీ నిల్వ చేశారు. వీటి వెనుక ఉన్న గోడకు స్టార్టర్ నుంచి మీటర్ వరకు వెళ్లిన వైరు కేసింగ్‌తో ఉంది. కార్టన్ బాక్సుల్ని పదేపదే కదిపిన కారణంగా కేసింగ్ దెబ్బతినడంతో వైర్లు బయటకు వచ్చి ఉంటాయని, ఇవి రాపిడికి గురికావడంతో పైన ఉండే పొర దెబ్బతిని లోహపు వైరు బయటకు వచ్చి ఉంటుందని క్లూస్ టీమ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

మోటార్ ఆన్ చేసిన కొన్ని నిమిషాలకే...

అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ భార్య సోమవారం ఉదయం 8.15 గంటలకు మోటార్ ఆన్ చేశారు. దాదాపు అర్ధగంట తర్వాత 8.45 నిమిషాల ప్రాంతంలో సీసీ కెమెరాలు పని చేయడం మానేశాయి. దీన్ని బట్టి అప్పుడే షార్ట్ సర్క్యూట్ అయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వాచ్‌మెన్ దంపతులను ప్రశ్నించిన పోలీసులు మరికొన్ని వివరాలు సేకరించారు. షార్ట్‌సర్క్యూట్ ప్రభావంతో వచ్చిన నిప్పురవ్వల కారణంగా కార్టన్ బాక్సులకు నిప్పు అంటుకుంది. గమనించిన వాచ్‌మెన్ దంపతులు నీళ్లతో ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ లోపే ఆ బాక్సుల్లో ఉన్న మెటీరియల్ అంటుకుని మంటలు విస్తరించడం మొదలయ్యాయి. వాచ్‌మెన్ కాలికి గాయం కావడంతో వేగంగా స్పందించలేకపోయాడు. దాంతో మంటలు రసాయనాలకు అంటుకోవడంతో ఊహించని నష్టం జరిగిపోయింది. ఉస్మానియా ఆస్పత్రిలోని బర్న్స్ వార్డులో చికిత్స పొందుతున్న మరో బాధితుడు తల్హా (17) పరిస్థితి ఇప్పటికీ విషమంగానే ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

తీవ్రం కానున్న వాయుగుండం

- విశాఖకు 420 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం
- రేపటికల్లా ఒడిశా తీరానికి చేరుకునే అవకాశం
- నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారింది. ఇది బుధవారం రాత్రి విశాఖపట్నానికి ఆగ్నేయంగా 420 కిలోమీటర్లు, ఒడిశాలోని పారాదీప్‌కు దక్షిణ ఆగ్నేయంగా 550 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం ఉత్తరదిశగా కదులుతూ గురువారం ఉదయానికి తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. అనంతరం ఇది దిశ మార్చుకుని ఉత్తర ఈశాన్యదిశగా వాయవ్య బంగాళాఖాతం వైపు పయనిస్తూ గురువారం ఉదయానికి ఒడిశా తీరానికి, 18వ తేదీ ఉదయానికి పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకుంటుందని భారత వాతావరణశాఖ (ఐఎండీ) వివరించింది. మరోవైపు ఉత్తర శ్రీలంక పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం, అక్కడినుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నాయి. వీటి ఫలితంగా రెండురోజులు కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో సముద్రం అలజడిగా ఉన్నందున మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.



తంగళ్లపల్లి రోడ్ షోకు హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

'హంగ్' ప్రసక్తే లేదు..!

- పూర్తి మెజారిటీతో మూడోసారి అధికారంలోకి వస్తాం
- గతంలో మహా కూటమి కట్టినా కాంగ్రెస్‌కు అధికారం దక్కలేదు
- కర్ణాటక మోడల్ అట్టర్ ఫ్లాప్
- నెత్తీ కత్తీ లేని బీజేపీ హామీలకు విలువ లేదు
- తెలంగాణ వ్యతిరేక శక్తులు, వ్యక్తులతో రేవంత్ అంటకాగుతున్నారు
- మీట్ ది ప్రెస్‌లో మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) పూర్తి మెజారిటీ సాధించి మూడోసారి కచ్చితంగా అధికారంలోకి వస్తుందని వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఇందులో ఎలాంటి సందిగ్ధత లేదని, ఎటువంటి అనుమానాలు అక్కరలేదని వ్యాఖ్యానించారు. ఎవరిని ఎన్నుకోవాలో క్షేత్ర స్థాయిలో ప్రజలకు పూర్తి అవగాహన ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో 'హంగ్'కు అవకాశం లేదన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీకి సంపూర్ణ ఆధిక్యత లభించదనేది కాంగ్రెస్ ప్రచారం మాత్రమేనని ఆయన కొట్టి పారేశారు. హైదరాబాద్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే- ఐజేయూ) ఆధ్వర్యంలో జరిగిన 'మీట్ ది ప్రెస్'లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

కాంగ్రెస్‌ది అంతా గోబెల్స్ ప్రచారం

'గతంలో ప్రత్యక్షంగా మహాకూటమి పేరిట బీఆర్ఎస్ గొంతు నులమాలని చూసినా విజ్ఞులైన ఓటర్లు కేసీఆర్‌కు మద్దతు పలికారు. తెలంగాణ వ్యతిరేక శక్తులు, వ్యక్తులతో అంటకాగుతున్న వ్యక్తి రేవంత్. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ రాహుల్ గాంధీ జాబ్ క్యాలెండర్ విడుదల చేశారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా కనీసం నోటిఫికేషన్లు కూడా ఇవ్వని కాంగ్రెస్ ఇక్కడ ఉద్యోగాల కల్పన విషయంలో గోబెల్స్ ప్రచారం చేస్తోంది. మా మేనిఫెస్టోను కాపీ కొట్టి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అంటోంది. మేనిఫెస్టో హామీల అమలులో కాంగ్రెస్‌ది ఎగవేసిన చరిత్ర అయితే బీఆర్ఎస్‌ది నెరవేర్చిన చరిత్ర'

అందరినీ సంతృప్తిపరచలేము

''వరుసగా ఎన్నికయ్యే ఎమ్మెల్యేలు అందరినీ సంతృప్తి పరచలేరు. నాణేనికి రెండువైపులా అన్నట్లు సిట్టింగ్ ఎమ్మెల్యేలపై పాజిటివ్, నెగెటివ్ రెండూ ఉంటాయి. మేనిఫెస్టోను అమలు చేయగలిగే వారికే మెజారిటీ ఓట్లు పడతాయి. కేసీఆర్‌కు సరితూగే నాయకులు రాష్ట్రంలో లేరు. ఓటమి ఎరుగని నాయకుడు కేసీఆర్ మీద పోటీ చేయడం ద్వారా రేవంత్, ఈటల పెద్దవాళ్లు కావాలనుకుంటున్నారు. బీజేపీ గుజరాత్, కాంగ్రెస్ కర్ణాటక మోడల్ అంటున్నా తెలంగాణ మోడల్‌కు ఏదీ సాటిరాదు. కర్ణాటక మోడల్ అట్టర్ ఫెయిల్. నెత్తీ కత్తీ లేని బీజేపీ ఇచ్చే హామీలకు విలువ లేదు. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ మాతో పనిచేయడం లేదు. కాంగ్రెస్ చెప్తున్నంతగా క్షేత్ర స్థాయిలో ఆ పార్టీకి కేడర్ బలం లేదు. అల్లర్లు సృష్టించి ప్రభుత్వాన్ని బదనాం చేసి ప్రయోజనం పొందడమే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోంది.''

సోషల్ మీడియాలో నాపై విష ప్రచారం

తెలంగాణ ఉద్యమంలో రెండు వందలకు పైగా కేసులు ఎదుర్కొని జైలుకు వెళ్లిన నాపై విమర్శించేందుకు ఏమీ లేకనే సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ కోసం మంత్రి, ఎమ్మెల్యే పదవులను తృణప్రాయంగా వదిలేశా. తెలంగాణ ప్రజలపై రైఫిల్ ఎక్కు పెట్టిన రేవంత్‌కు విమర్శించే హక్కు లేదు. ఎన్నో బ్యారేజీలు, రిజర్వాయర్లు, టన్నెళ్లు, కాలువల సముదాయం కాళేశ్వరంపై విమర్శలు కోడిగుడ్డు మీద ఈకలు పీకడం లాంటిదే. రాబోయే రోజుల్లో ప్రాంతీయ పార్టీల కూటమి దేశంలో గణనీయ పాత్ర పోషిస్తుంది.

మళ్లీ అవకాశం వస్తే ఆరోగ్య శాఖ మంత్రిగానే..

'తెలంగాణలో గంగా జమునా తహజీబ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతాం. రాబోయే రోజుల్లో విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేస్తాం. హైదరాబాద్‌లో మౌలిక వసతుల మీద ఫోకస్ పెంచుతాం. కరోనా, పెద్దనోట్ల రద్దు మూలంగా ఉద్యోగుల వేతనాల చెల్లింపులో కొంత ఆలస్యం జరిగినా చెల్లింపులు ఆగలేదు. మాకు ఏ పార్టీతోనూ అవగాహన లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారుతారు. నేను కేసీఆర్ ఆధ్వర్యంలో పనిచేసే కార్యకర్తను. పార్టీ అప్పగించే బాధ్యతను నెరవేర్చే వ్యక్తిని మాత్రమే. ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేయడం కత్తిమీద సాము అయినా ప్రజల ప్రాణాలు కాపాడుతున్నాం అనే సంతృప్తి ఉంటుంది. అందుకే మళ్లీ అవకాశం వస్తే ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేయాలనుకుంటా.

అసైన్డ్ భూములకు హక్కులిస్తాం

- వాటిని అమ్ముకోవచ్చు, బ్యాంకుల్లో కుదువ పెట్టుకోవచ్చు: కేటీఆర్
- దరిద్రానికి నేస్తం.. కాంగ్రెస్ హస్తమని విమర్శ
- వారిని నమ్ముకుంటే నష్టపోతామని వ్యాఖ్య
- ఆగం కాకుండా ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి
- వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో రోడ్‌షోలు

సిరిసిల్ల: బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే దళితులు, గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు ఇస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు హామీ ఇచ్చారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు వస్తే.. వాటిని అమ్ముకోవచ్చని, పిల్లలకు ఇచ్చుకోవచ్చని, బ్యాంకుల్లో కుదువపెట్టుకోవచ్చని చెప్పారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట, వేములవాడ, తంగళ్లపల్లి మండల కేంద్రాల్లో ఆయన రోడ్‌షోలు నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు. ''దరిద్రానికి నేస్తం కాంగ్రెస్ హస్తం. వారిని నమ్ముకుంటే నష్టపోయేది తెలంగాణ సమాజమే. గ్యారంటీ లేని కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇస్తుంది. రేవంత్‌రెడ్డి ఎప్పుడు జైలుకు పోతాడో ఆయనకే తెలియదు. 24 గంటలు కరెంట్ ఇచ్చే కేసీఆర్ కావాలా.. మూడు గంటల కరెంట్ అంటున్న కాంగ్రెస్ కావాలా తేల్చుకోవాలి. ఎన్నికలప్పుడు ఆగం కావొద్దు. ఆలోచించి ఓటేయాలి''అని కేటీఆర్ కోరారు.

ఆరున్నరేళ్ల పాలనలో ఎంతో చేశాం..

రాష్ట్రాన్ని కేసీఆర్ దేశానికే ఆదర్శవంతంగా చేశారని కేటీఆర్ చెప్పారు. తమ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రెండేళ్లు కరోనాతో, మరో ఏడాది సమయం లోక్‌సభ, ఇతర ఎన్నికల కోడ్‌తో వృథా అయిందన్నారు. పక్కాగా పాలన సాగినది ఆరున్నరేళ్లేనని, ఇంత తక్కువ సమయంలోనే రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశామని చెప్పారు. బీఆర్ఎస్ మళ్లీ గెలిస్తే.. రేషన్‌కార్డులు ఇస్తామని, పెన్షన్లు పెంపు, 93 లక్షల కుటుంబాలకు బీమా, రేషన్‌కార్డులపై సన్నబియ్యం వంటివి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతుబంధును రూ.16 వేలకు పెంచుతామని, వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.400కే అందిస్తామని ప్రకటించారు. సిరిసిల్ల ప్రాంతంలో 370 ఎకరాల్లో ఆక్వా హబ్ వస్తుందని, దీంతో ఉద్యోగాలు వస్తాయని చెప్పారు.

బాధ్యతలు పెరిగాయి

''ప్రతి ఊరికి, ప్రతి ఇంటికి రావాలని ప్రతి ఒక్కరిని కలవాలని నాకు ఉంటుంది. కానీ బాధ్యతలు పెరిగాయి. మంత్రిగా, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్రమంతటా తిరగాల్సి వస్తుంది. మీరే చూస్తున్నారు. నేను రోజూ ఎన్ని ప్రాంతాల్లో, ఎన్ని సభల్లో పాల్గొంటున్నానో. మిమ్మల్ని కలవలేకపోతున్నందుకు బాధగా ఉంది..''అని తంగళ్లపల్లి రోడ్‌షోలో కేటీఆర్ పేర్కొన్నారు. మీ ఆశీర్వాదంతో గెలిచాక ఎలాంటి తలవంపులు తేలేదని, సిరిసిల్ల ఎమ్మెల్యేగా గర్వపడేలా పనిచేశానని చెప్పారు. ఈ రోడ్‌షోలలో వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చెల్మెడ లక్ష్మీనర్సింహరావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

18న కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో?

నామినేషన్ల ప్రక్రియ కీలక దశలో ఉండటంతోనే వాయిదా



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ఈనెల 18వ తేదీన విడుదల కానుంది. వాస్తవానికి ఈనెల 14 లేదా 15వ తేదీల్లో మేనిఫెస్టోను విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ నామినేషన్ల ప్రక్రియ కీలక దశలో ఉండటం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి ఠాక్రే తదితరులు బిజీగా ఉండటంతో ఈ కార్యక్రమం వాయిదా పడింది. బుధవారం నాటితో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. ఈనెల 17న రాహుల్‌గాంధీ కూడా తెలంగాణకు రానున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ పర్యటన ఏర్పాట్లపై చర్చించేందుకు అందుబాటులో ఉండనున్న టీపీసీసీ అధ్యక్షుడు, పార్టీ ఇన్‌చార్జితో గురువారం చర్చించి మేనిఫెస్టోకు అనుమతి తీసుకుంటామని, ఈనెల 18న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేతుల మీదుగా విడుదల చేస్తామని గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి. అయితే, రాహుల్‌గాంధీ ఈనెల 17న తెలంగాణకు వస్తుండటంతో ఆయన చేతుల మీదుగా కూడా మేనిఫెస్టో విడుదల చేయించే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది.

ఆ పోలీసులపై చర్య తీసుకోండి

ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ నేతలు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, కొడంగల్ డివిజన్లకు చెందిన అసిస్టెంట్ కమిషనర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో పాటు అచ్చంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ముస్లిం డిక్లరేషన్‌ను వక్రీకరిస్తూ.. డిక్లరేషన్ అమలుకు అవసరమైతే దేవాలయ భూములను వేలం వేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటించినట్టు మార్ఫింగ్ చేసిన వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేస్తున్నారని మరో ఫిర్యాదు అందజేశారు. ఇందుకు కారణమైన బీజేపీ, బీఆర్‌ఎస్‌లను నియంత్రించాలని నిరంజన్ కోరారు.

పీసీసీ ఉపాధ్యక్షుడు అనిల్ రాజీనామా

ఒకట్రెండు రోజుల్లో బీఆర్‌ఎస్‌లోకి..



పటాన్‌చెరు: పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆయన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రామచంద్రాపురం పరిధిలోని అశోక్ నగర్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. నర్సాపూర్ టికెట్‌ను ఆయన ఆశించగా అధిష్టానం.. ఆవుల రాజిరెడ్డికి కేటాయించింది. దీంతో అసంతృప్తికి లోనైన అనిల్ స్థానిక నేతలతో కలిసి పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అధిష్టానం బుజ్జగించగా కలిసి పని చేస్తామని ప్రకటించి.. అంతలోనే పార్టీకి గుడ్ బై చెప్పారు. అనిల్‌కుమార్ ఒకటి, రెండు రోజుల్లో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు.

నలుగురు టీపీసీసీ అధికార ప్రతినిధుల నియామకం

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధికార ప్రతినిధులుగా మరో నలుగురు నియమితులయ్యారు. ప్రొఫెసర్ అల్దాసు జానయ్య, చీటి ఉమేశ్‌రావులను సీనియర్ అధికార ప్రతినిధులుగా, ఠాకూర్ బాలాజీ సింగ్, కాకర్ల అశోక్‌లను అధికార ప్రతినిధులుగా నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

రేపటి నుంచి వీహెచ్ బస్సు యాత్ర

అంబర్‌పేట నుంచి ఇబ్రహీంపట్నం వరకు..



సాక్షి, హైదరాబాద్: మాజీ ఎంపీ వి.హనుమంతరావు శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్త బస్సు యాత్రకు సిద్ధమవుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ 'ఇందిరమ్మ విజయరథం 'పేరుతో ఏర్పాటు చేసిన బస్సులో ఆయన రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈనెల 17న ఉదయం 11 గంటలకు అంబర్‌పేట, ఉప్పల్ నియోజకవర్గాల పరిధిలో ప్రారంభం కానున్న ఈ యాత్ర మేడ్చల్, భువనగిరి, ఆలేరు, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, వరంగల్ ఈస్ట్, వర్ధన్నపేట, పాలకుర్తి, పాలేరు, ఖమ్మం, మధిర, వైరా, కొత్తగూడెం, భద్రాచలం, సూర్యాపేట, నకిరేకల్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో జరగనుంది. ఈనెల 25వ తేదీ రాత్రికి వీహెచ్ బస్సు యాత్ర ముగిసేలా టీపీసీసీ షెడ్యూల్ రూపొందించింది.

మేడిగడ్డను ముంచిన మామా అల్లుళ్లు

- రీడిజైనింగ్ పేరిట కోట్లు దోచుకున్నరు: రేవంత్‌రెడ్డి
- పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు... బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక కూటమి
- కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను తెస్తాం... నిర్మల్, బోథ్, జనగామ సభల్లో ప్రసంగం



బుధవారం జనగామలో జరిగిన కాంగ్రెస్ సభకు హాజరైన జనం

సాక్షి, ఆదిలాబాద్/నిర్మల్/జనగామ: 'సాగునీటి శాఖ మంత్రులుగా ఐదేళ్లు మామ ఉన్నడు.. మరో ఐదేళ్లు అల్లుడున్నడు. మామా అల్లుళ్ల చేతిలో చిక్కి ప్రాణహిత–చేవెళ్ల అన్యాయానికి గురైంది. ఉమ్మడి ఆదిలాబాద్ మళ్లీ ఎడారైంది. మనకు నీళ్లు రాకపోవడానికి, నిర్మల్‌లో చెరువులు కబ్జాలు కావడానికి ఈ కేసీఆర్ సర్కారు కారణం కాదా.. కేసీఆర్ అవినీతికి మేడిగడ్డ బలైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బోథ్ నియోజకవర్గంలో కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తాం..'అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. బుధవారం నిర్మల్, బోథ్, జనగామలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు.

వైఎస్సార్ హయాంలో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో తుమ్మిడిహట్టి దగ్గర ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి, ఈ ప్రాంతంలో 1.62 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే ప్రయత్నం చేశామని రేవంత్‌రెడ్డి అన్నారు. దాదాపు రూ.12వేల కోట్లు ఖర్చు చేశామని, కేసీఆర్ అధికారంలోకి వచ్చాక తుమ్మిడిహట్టిని మార్చి, కాళేశ్వరం పేరుతో మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టారని విమర్శించారు. రూ. 38 వేల కోట్లతో కట్టాల్సిన ప్రాజెక్టును రీడిజైనింగ్ పేరిట అంచనాలు పెంచి రూ.1.51 లక్షల కోట్లకు తీసుకెళ్లారని ఆరోపించారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఆయన తమ్ముడు కలిసి కబ్జాలు చేశారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక కూటమిగా వ్యవహరిస్తున్నాయని, సీపీఐ, జనసమితితో కలిసి కాంగ్రెస్ పోటీ చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొడంగల్ ఎలా అభివృద్ధి చేస్తానో అదే స్థాయిలో నిర్మల్‌నూ అభివృద్ధి చేస్తామన్నారు.

గడీల రాజ్యాన్ని కూల్చకుంటే మళ్లీ నిజాం పాలన

'సబ్బండ వర్గాల పోరాట ఫలితంగా సిద్ధించిన తెలంగాణలోని పరిపాలన భవన్ అయిన ప్రగతి భవన్‌లోకి ప్రజల ఎంట్రీ లేనప్పుడు ఆ ప్రగతి భవన్‌ను బాంబులతో పేల్చినా తప్పులేదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన గద్దరన్న ప్రగతి భవన్‌కు వెళ్తే గేటువద్ద నిలిపేశారని చెప్పారు. రాష్ట్రం కోసం పాటుపడిన ప్రొఫెసర్ కోదండరాం, ప్రజా ప్రతినిధులు, కామ్రేడ్లు, విద్యార్థులు, నిరుద్యోగులు, సామాన్య ప్రజలకు స్థానంలేని దొర గడి (ప్రగతి భవన్)లోకి ఆంధ్ర పెట్టుబడి దారులకు ఎర్ర తివాచీతో స్వాగతం పలుకుతున్నారన్నారు. గడీల రాజ్యాన్ని కూల్చకుంటే మరోసారి నిజాం పాలన చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

కామారెడ్డి తీర్పుతో దేశ రాజకీయాల్లో కీలకమార్పులు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి ప్రజలు ఇచ్చే తీర్పుతో దేశ రాజకీయ చరిత్రలో కీలక మార్పులు జరుగుతాయని, తీర్పు కోసం తెలంగాణ ప్రజలతోపాటు 140 కోట్ల మంది దేశ ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. కామారెడ్డిలో పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో రేవంత్ మాట్లాడుతూ... తెలంగాణకు పట్టిన కల్వకుంట్ల కుటుంబ చీడను వదిలించుకునే అవకాశం కామారెడ్డి ప్రజలకు వచ్చిందన్నారు. రాష్ట్రంలో కరెంటు 24 గంటలు ఇస్తున్నట్లు రుజువు చేస్తే తాను రెండు చోట్లా పోటీ నుంచి తప్పుకుంటానని, లేదంటే సీఎం ముక్కునేలకు రాయాలన్నారు. నాడు కేసీఆర్‌కు కారులో డీజిల్ పోసే పరిస్థితి లేదని, ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. గజ్వేల్‌లో రూ.వెయ్యి కోట్లతో కేసీఆర్ ఫామ్‌హౌస్ నిర్మించుకుంటే, తనయుడు కేటీఆర్ రూ.2వేల కోట్లతో జన్వాడ, పంజగుట్టలో విలాసవంతమైన భవనాలను నిర్మించుకుని పేదల గూడును విస్మరించారని మండిపడ్డారు. అలాగే స్లిప్పర్ల మీద తిరిగిన హరీశ్‌రావుకు ఆస్తులు ఎట్ల వచ్చాయో చెప్పాలని డిమాండ్‌చేశారు. కవితకు బెంజి కార్లు, పెద్ద పెద్ద భవంతులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ గెలుపును అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ ఒకదానికొకటి సహకరించుకుంటున్నాయని పేర్కొన్నారు. మైనారిటీ నాయకుడు షబ్బీర్‌ను ఓడించేందుకు కేసీఆర్ కామారెడ్డికి వచ్చాడన్నారు. అందుకే కేసీఆర్‌ను బొంద పెట్టాలని తాను పోటీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. తనను ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తిగా చిత్రీకరించేందుకు కేసీఆర్ మామ, ఒవైసీ అల్లుళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు.

వలంటీర్ వ్యవస్థను తెస్తాం

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వలంటీర్ వ్యవస్థను తెస్తామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ప్రజలకు అందిస్తామన్నారు. ఏ బూత్‌లో ఎక్కువ ఓట్లు వస్తాయో ఆ బూత్ వాళ్లతో కలసి భోజనం చేస్తానని చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు యూసుఫ్ అలీ, ఈరవత్రి అనిల్, వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు రాహుల్ సుడిగాలి పర్యటన
ఐదు నియోజకవర్గాల్లో ప్రచారం

- పినపాక, నర్సంపేట, వరంగల్ ఈస్ట్, వెస్ట్, రాజేంద్రనగర్‌లలో
- రోడ్‌షో, పాదయాత్రలు, కార్నర్ మీటింగ్‌లలో ప్రసంగాలు...
- ప్రస్తుతానికి ఒక్క రోజు షెడ్యూల్ మాత్రమే



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈనెల 17న తెలంగాణలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు మొత్తం ఐదు నియోజకవర్గాల్లో ఆయన రోడ్‌షోలు, పాదయాత్రలు చేపట్టనున్నారు. కార్నర్ మీటింగ్‌లలో ప్రసంగించనున్నారు. పినపాక, నర్సంపేట, వరంగల్ ఈస్ట్, వెస్ట్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో ఆయన ప్రచారం చేయనున్నట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి ఈనెల 17 నుంచి వరుసగా ఐదారు రోజుల పాటు రాహుల్ తెలంగాణలో పర్యటిస్తారని అనుకున్నప్పటికీ, ప్రస్తుతానికి శుక్రవారం ఒక్కరోజు షెడ్యూల్ మాత్రమే ఖరారైంది.

రాహుల్ పర్యటన ఇలా...

ఈనెల 17న ఉదయం 9:30 గంటల సమయంలో ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రానున్న రాహుల్‌గాంధీ హెలికాప్టర్‌లో ఉదయం 11 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక చేరుకుంటారు. అక్కడ 12 గంటల వరకు రోడ్‌షో నిర్వహించి కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నర్సంపేటకు చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు అక్కడ ఎన్నికల ప్రచారం నిర్వహించి రోడ్డు మార్గంలో వరంగల్ ఈస్ట్ నియోజకవర్గానికి చేరుకుంటారు. అక్కడ నుంచి పాదయాత్ర ద్వారా వెస్ట్ నియోజకవర్గానికి చేరుకుని అక్కడ కార్నర్‌మీటింగ్‌లో ప్రసంగిస్తారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో సాయంత్రం 6:30 గంటలకు రాజేంద్రనగర్‌కు వస్తారు. అక్కడ సభలో పాల్గొన్న అనంతరం ఢిల్లీ వెళ్లనున్నట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

78 సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి..

ఉచిత కరెంట్‌పై కేసీఆర్‌వి అభూత కల్పనలు: పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని, 72 నుంచి 78 సీట్లతో తాము అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అంతర్గతంగా చేయించుకున్న సర్వేల్లో కాంగ్రెస్ గెలుస్తుందని తేలడంతో పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఉచిత విద్యుత్ పథకాన్ని సీఎం కేసీఆర్ కనుగొన్నట్టు చెబుతూ, తమ పార్టీ నాయకులు మాట్లాడని వాటిని మాట్లాడినట్లుగా వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు సీట్ల కోసం, డబ్బు కోసం కర్ణాటక చుట్టూ తిరుగుతున్నారని మంత్రి హరీశ్‌రావు చెబుతున్న విషయంలో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా, బీఆర్‌ఎస్ మాదిరి తాము డబ్బును కాకుండా ప్రజలను నమ్ముకున్నామని పొంగులేటి తెలిపారు. ఆ పార్టీ నేతలు చికెన్ బిర్యానీ, తాము పచ్చడి మెతుకులు పెట్టినా.. ప్రజలు కాంగ్రెస్ పక్షానే తీర్పు ఇవ్వడానికి సిద్ధమయ్యారన్నారు. కాగా, ఈనెల 17న ఉదయం 10 గంటలకు పినపాక నియోజకవర్గంలోని మణుగూరులో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ రోడ్‌షోతో పాటు కార్నర్ మీటింగ్ ఉంటుందని, త్వరలో ప్రియాంకా గాంధీ కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి రాని సీఎం అవసరమా?

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



ఎర్రుపాలెంలో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం: రాష్ట్ర సచివాలయానికి రాని, ప్రగతిభవన్‌ను వీడని కేసీఆర్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా అవసరమా? అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉండి తెలంగాణలో చేసిన అభివృద్ధి ఏమిటో బీఆర్ఎస్ శ్వేతపత్రం విడుదల చేయాలని భట్టి డిమాండ్ చేశారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని, బీఆర్‌ఎస్ పాలకుల దోపిడీ సొమ్మును తాము అధికారంలోకి రాగానే కక్కిస్తామని అన్నారు. కేసీఆర్ మాదిరి తాను ఫాం హౌస్‌లో పడుకోలేదని, ప్రతిపక్ష నేతగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించానని భట్టి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఇన్నాళ్లు అమలు చేయాలనే స్పృహ కేసీఆర్‌కు ఎందుకు లేదన్నారు. సంపద కలిగిన రాష్ట్రమైనందునే ఆరు గ్యారంటీలను హామీలుగా ప్రకటించామని తెలిపారు. కాగా, తెలంగాణ అభివృద్ధికి అడ్డుగా ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు భట్టి పిలుపునిచ్చారు.

అయితే ఓకే!



పటేల్ రమేశ్‌రెడ్డి నివాసం వద్ద మల్లు రవిని అడ్డుకుంటున్న కార్యకర్తలు

▶ మొదటి పేజీ తరువాయి

అధికారంలోకి వస్తే ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యత ఇస్తామని, వీలుంటే పార్లమెంటుకు పోటీ చేసే అవకాశం కల్పిస్తామని ఇచ్చిన హామీల మేరకు కీలక నేతలు వెనక్కు తగ్గారు. పటేల్ రమేశ్‌రెడ్డి, జంగారాఘవరెడ్డి, కాసుల బాలరాజు, సౌదాగర్ గంగారాం, నెహ్రూ నాయక్ తమ నామినేషన్లను వెనక్కు తీసుకుని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. కాగా, మొత్తం 24 స్థానాల్లో పార్టీ రెబెల్స్ బరిలో నిలిచారని, అందులో 20 మందికి పైగా నామినేషన్లు ఉపసంహరించుకున్నారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. కొన్ని చోట్ల మాత్రం చోటామోటా నేతలు బరిలో నిలిచినా, వారితో పార్టీ అభ్యర్థులకు పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని ఆ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాగా, ఆదిలాబాద్ నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ పార్టీకి రెబల్ బెడద తప్పలేదు. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి కాంగ్రెస్ రెబల్‌గా బరిలో నిలిచారు.

పటేల్ ఇంటికి రోహిత్, మల్లు రవి

సూర్యాపేటలో పార్టీ అభ్యర్థిత్వం దక్కకపోవడంతో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పక్షాన నామినేషన్ దాఖలు చేసిన కీలక నేత పటేల్ రమేశ్‌రెడ్డిని ఎట్టకేలకు కాంగ్రెస్ అధిష్టానం ఒప్పించగలిగింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కు తగ్గేది లేదంటూ పటేల్ పట్టుపట్టడంతో ఏఐసీసీ పక్షాన రోహిత్‌చౌదరి, టీపీసీసీ పక్షాన మల్లురవిలు బుధవారం సూర్యాపేటకు వెళ్లారు. వీరిని చూడగానే గో బ్యాక్ అంటూ రమేశ్‌రెడ్డి వర్గీయులు నినాదాలు చేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఓ దశలో మల్లు రవిపై పలువురు కార్యకర్తలు దాడికి యత్నించారు. ఈ సమయంలో కాసేపు ఉద్రిక్తత నెలకొనగా.. ఆందోళనల నడుమ రోహిత్‌చౌదరి, మల్లు రవిలు పటేల్ ఇంట్లోకి వెళ్లారు. వీరిని చూసిన రమేశ్‌రెడ్డి బోరున విలపించారు. ఆయనతో పాటు తల్లిదండ్రులతో మాట్లాడి ఎట్టకేలకు పోటీ నుంచి తప్పుకునేలా ఒప్పించగలిగారు. అక్కడి నుంచే ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. నల్లగొండ ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇస్తామన్న కేసీవీ హామీ మేరకు పటేల్ వెనక్కు తగ్గినట్టు తెలిసింది. కాగా సూర్యాపేట ఆర్వో కార్యాలయానికి ఏఐసీసీ దూతలతో కలిసి పటేల్ వెళ్తుండగా కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసుల సాయంతో వెళ్లి రమేష్‌రెడ్డి నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు. మొత్తం మీద మెజార్టీ స్థానాల్లో రెబెల్స్‌ను బరి నుంచి తప్పించడంలో సఫలీకృతం కావడంతో టీపీసీసీ నాయకత్వం కూడా ప్రస్తుతానికి ఊపిరి పీల్చుకుంది.

కాంగ్రెస్‌కు ఆర్పీఐ మద్దతు

ప్రకటించిన ఆర్పీఐ తెలంగాణ అధ్యక్షుడు మహేశ్‌బాబు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపింది. ఈ మేరకు బుధవారం గాంధీభవన్‌లో ఆర్పీఐ తెలంగాణ అధ్యక్షుడు మహేశ్‌బాబు, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ ప్రకటించారు. అనంతరం కాంగ్రెస్ నేతలతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, టీపీసీసీ ఎన్‌ఆర్ఐ సెల్ చైర్మన్ వినోద్‌కుమార్.. ఆర్పీఐ నేతలు బాలకృష్ణ, దుర్గాప్రసాద్‌లతో కలిసి మహేశ్‌బాబు మాట్లాడారు. తెలంగాణలో మార్పు రావాలని ప్రజలు కోరుకుంటున్నందునే తాము కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు నమ్ముతున్నారన్నారు. ఉద్యోగాల కల్పన, భూసంస్కరణలు, పారిశ్రామిక వృద్ధి, ఇళ్ల నిర్మాణం, భూపంపిణీ తదితర కార్యక్రమాలన్నీ కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు ప్రజలకు ఉపయోగపడతాయన్న నమ్మకంతోనే మద్దతు ప్రకటిస్తున్నామని వెల్లడించారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఈసారి ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారు. తమకు మద్దతు తెలిపినందుకు ఆర్పీఐకి కృతజ్ఞతలు తెలిపారు.

ఖమ్మంలో కాంగ్రెస్‌కు టీడీపీ మద్దతు

ఆత్మీయ సమావేశాలకు తుమ్మల, భట్టి హాజరు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు టీడీపీ మద్దతు ప్రకటించింది. ఖమ్మం, మధిర నియోజకవర్గాల్లో బుధవారం ఆ పార్టీ ఆత్మీయ సమావేశాలు నిర్వహించిన నాయకులు బహిరంగంగానే కాంగ్రెస్ అభ్యర్థులు తుమ్మల నాగేశ్వరరావు, మల్లు భట్టి విక్రమార్కకు మద్దతు తెలిపారు. మిగతా నియోజకవర్గాల్లో కూడా కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేందుకు టీడీపీ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు కానున్నాయి. కాగా, టీడీపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఖమ్మం నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ తనకు ఎన్టీఆర్ రాజకీయ జన్మనిచ్చిన దేవుడని, చిన్న వయసులోనే ఎన్నో అవకాశాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇక మధిర మండలం దెందుకూరులో టీడీపీ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి భట్టి హాజరై తనకు మద్దతిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్ పాలనలో యువత భవిష్యత్తు నాశనం

- కాంగ్రెస్ పార్టీ ధ్వజం
- మద్యానికి, డ్రగ్స్‌కు బానిసలను చేశారు... 10 అంశాలతో యూత్ చార్జిషీట్ విడుదల చేసిన కాంగ్రెస్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పాలనలో యువత ఉజ్వల భవిష్యత్తు నాశనమవుతోందని కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. సీఎం కేసీఆర్ అసమర్థ పాలనలో యువకులు మద్యానికి బానిసలవుతున్నారని, విద్యారంగానికి కేటాయింపులు తగ్గించి, సకాలంలో ఉద్యోగాలు భర్తీ చేయక, ఉద్యోగ పరీక్షల నిర్వహణ కూడా సరిగా చేయలేకపోవడంతో రాష్ట్ర యువత నిర్వీర్యం అయిపోతోందని ఆ పార్టీ అభిప్రాయపడింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ బుధవారం పది అంశాలతో కూడిన యూత్ చార్జిషీట్‌ను విడుదల చేసింది.

యూత్ చార్జిషీట్‌లోని అంశాలివే..

- దేశంలోనే విద్యారంగానికి తెలంగాణలో కేటాయింపులు తక్కువ. 2014–15లో రాష్ట్ర బడ్జెట్‌లో 10.98 శాతం నిధులు విద్యకు కేటాయించగా, 2023–24లో 7.6 శాతానికి తగ్గించారు.
- కేజీ టు పీజీ విద్యను 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. కానీ ఈ తొమ్మిదేళ్లలో ఒక్క కొత్త తరగతి గదిని కూడా నిర్మించలేదు. ఒక్క గంభీరావుపేటలో మాత్రమే కేజీ టు పీజీ క్యాంపస్‌ను నిర్మించారు.
- సీఎస్‌ఆర్ నిధులతో ఒక్క తరగతి గదినయినా కట్టించాలని కార్పొరేట్ కంపెనీలను అడుక్కోవాల్సిన పరిస్థితి ఉంది.
- ప్రతి ఇంటికీ ఉద్యోగం అని కేసీఆర్ అబద్ధాలు చెప్పారు. కేవలం 60 శాతం ఉద్యోగులతో ఈ 60 శాతం సర్కార్ నడుస్తోంది.
- ఉద్యోగ పరీక్షలు రాసే లక్షలాది మంది యువత విశ్వాసాన్ని టీఎస్‌పీఎస్సీ కోల్పోయింది.
- పదో తరగతి నుంచి టీఎస్‌పీఎస్సీ పరీక్షల వరకు నిర్వహణ వైఫల్యంతో 2014–21 మధ్య కాలంలో తెలంగాణలో 3,600 మందికి పైగా యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారు.
- జాబ్ కేలండర్ లేకపోవడంతో ఒకే సమయంలో వివిధ పరీక్షలు నిర్వహించి నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారు.
- రూ.4,592 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలుండటంతో వేలాది మంది విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థలు సర్టిఫికెట్లు, టీసీలు ఇవ్వడం లేదు.
- యూనివర్సిటీల్లో 2/3వ వంతు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రైవేటు యూనివర్సిటీలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ వర్సిటీలను నాశనం చేస్తున్నారు.
- కేసీఆర్ అసమర్థ పాలనతో యువత మద్యానికి, డ్రగ్స్‌కు, జూదానికి బానిసలవుతున్నారు. వారి భవిష్యత్తు నాశనమవుతోంది.

మైనంపల్లిపై లోకాయుక్తలో ఫిర్యాదు

ఆస్తులపై విచారణకు వినతి

సాక్షి, హైదరాబాద్: మల్కాజిగిరి ఎమ్మెల్యే, ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి హనుమంతరావు అధికార దుర్వినియోగానికి పాల్పడి రూ.కోట్ల అవినీతి సొమ్ము కూడబెట్టారని, విజిలెన్స్ లేదా ఇతర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని కోరుతూ న్యాయవాది ఇమ్మనేని రామారావు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. మైనంపల్లి 2009లో దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌కు.. 2017లో పేర్కొన్న అఫిడవిట్‌కు ఆస్తులు విపరీతంగా పెరిగిపోయాయని వివరించారు. విదేశీ కార్లు సహా ఖరీదైన విలాస వస్తువులు ఆర్జించారని, రూ.2 లక్షలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించిన మైనంపల్లికి ఇంత భారీగా డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో దర్యాప్తు చేయాలని కోరారు. మైనంపల్లి హనుమంత్‌రావుతో పాటు మైనంపల్లి వాణి, మైనంపల్లి రోహిత్‌పై లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఇదే అంశంపై ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. రామారావు ఫిర్యాదు మేరకు మైనంపల్లి ప్రమాణ పత్రాలపై వివరణ కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అధికారిక మెమో జారీ చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ఆధారాలను నిర్ధారించి నివేదిక సమర్పించాలని రిటర్నింగ్ అధికారిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు.

కేసీఆర్‌పై ఈసీ చర్యలు తీసుకునేలా ఆదేశించండి

- హైకోర్టులో కాంగ్రెస్ పిటిషన్
- నేడు విచారణ జరిగే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ప్రజా ఆశీర్వాద సభ పేరుతో బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు.. ప్రజలను రెచ్చగొట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారని, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ఆయనపై చర్యలు తీసుకునేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని కాంగ్రెస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. నిర్వాచన్ సదన్‌లోని ఈసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సీఈవో, సీఎం కేసీఆర్‌లను ఇందులో ప్రతివాదులుగా పేర్కొన్నారు. కేసీఆర్ గత నెల 30న బాన్సువాడ ప్రసంగంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారని పిటిషన్‌లో వెల్లడించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 3న తాము రాత పూర్వక వినతిపత్రం సమర్పించినా ఈసీ నుంచి ఎలాంటి స్పందన లేదని పిటిషన్‌లో వివరించారు. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని, ఈసీ విడుదల చేసిన ఎన్నికల కోడ్‌కు, ఇతర సూచనలకు కేసీఆర్ వ్యాఖ్యలు విరుద్ధంగా ఉన్నాయని, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951ను ఉల్లంఘించారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల తర్వాత కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు ఎక్కువయ్యాయని, ఈ నేపథ్యంలో చట్టప్రకారం కేసీఆర్‌పై చర్యలు తీసుకునేలా ఈసీకి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపే అవకాశం ఉందని సమాచారం.

ఎన్నికల సమస్యా.. ఫిర్యాదు చేయండి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికలవేళ అభ్యర్థులు వారి ఏజెంట్లు, సాధారణ ప్రజలు ఎలాంటి సమస్యలు, ఫిర్యాదులున్నా స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్డీవో) కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చని సాధారణ ఎన్నికల పరిశీలకుడు చంద్రకాంత్ దాంగే పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం నుంచి ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి 11.30 వరకు గంటపాటు తనకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఈనెల 29వ తేదీ వరకు ఎన్నికల విషయంలో ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఫోన్ ద్వారా కూడా ప్రజలు తమ సమస్యలను తెలుపవచ్చని సూచించారు. ఫోన్ నెంబర్లు 88792 31333/78421 74999 సమస్యలు, ఫిర్యాదులను తెలుపొచ్చని సూచించారు.



సాధించుకునే శక్తి ఉన్నదాని కోసం ఎప్పుడూ భిక్ష అడగకు.
– మిగెల్ డె సెర్వాంటిజ్

సాక్షి
గురువారం, 16 నవంబర్ 2023

ఆదేశాలేనా? ఆచరణ లేదా?

ఆదేశాలిచ్చినా ఆచరణలో పెట్టకపోతే పరిస్థితులు ఇలాగే ఉంటాయి. వాయు కాలుష్యంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న రాజధాని ఢిల్లీలోనే కాక, దేశవ్యాప్తంగా నిర్ణీత నిషేధిత రసాయనాలున్న టపాసులను నిషేధిస్తున్నట్టు సుప్రీమ్ కోర్టు గత వారం ఆదేశాలిచ్చింది. కానీ, జరిగింది మాత్రం వేరు. ఇష్టారాజ్యంగా టపాసులు కాల్చడం కొనసాగింది. ఎప్పటిలానే దట్టమైన పొగలో ఢిల్లీ కూరుకుపోయింది. దీపావళి వేళ ఒక్క ఢిల్లీలోనే కాక దేశవ్యాప్తంగా వాయు, శబ్ద కాలుష్యాలు నియంత్రణ కాకపోగా మరింత పెరిగాయి. ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా సహా 7 నగరాల్లో కాలుష్యస్థాయి ఘనపు మీటర్‌కు 500 మైక్రోగ్రాముల స్థాయిని దాటేసినట్టు గంటల వారీగా చేసిన విశ్లేషణలో వెల్లడైంది. హానికారకమైన నిర్ణీత టపాసులు కాల్చడంపై నిషేధం అమలులో ప్రభుత్వాల వైఫల్యాన్ని ప్రతిబింబిస్తోంది.

ఢిల్లీ, గురుగ్రామ్, చండీగఢ్, కోల్‌కతా, ముంబయ్, తదితర నగరాల్లో నిషేధిత టపాసులు సైతం నిల్వచేశారు, అమ్మారు, బాహాటంగా వాటిని కాల్చారు. కోర్టు ఆదేశాలు సైతం గాలికి పోవడం విషాదమే. అయితే, ప్రజల్లో చైతన్యం తీసుకురాకుండా, వారిని మానసికంగా సంసిద్ధం చేయకుండా, ప్రభుత్వాల ఆచరణలో చిత్తశుద్ధి లేకుండా... ఎవరెన్ని ఆదేశాలు జారీ చేసినా ప్రయోజనం ఉండదని మరోసారి రుజువైంది. దీపావళి ముగిసి మూణ్ణాళ్ళయినా ఢిల్లీలో వాయు నాణ్యత ఇప్పటికీ ప్రమాదకర స్థాయిలోనే ఉందని వార్త. నిజానికి, దేశ రాజధానిలో టపాసులపై నిషేధం పెట్టడం ఇదేమీ తొలిసారి కాదు. వాటి అమ్మకాన్ని దేశ రాజధానిలో నిషేధించాల్సిందిగా 2018 అక్టోబర్‌లో సైతం సుప్రీమ్ కోర్ట్ అప్పటి ఢిల్లీ ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. 'పర్యావరణ హిత' (గ్రీన్) టపాసులు, తక్కువ ఉద్గారాలు వెలువరించే 'మెరుగైన' టపాసులకు మినహాయింపు నిచ్చింది. అప్పుడూ ఆ మాట ఆదేశాలకే పరిమితమైంది తప్ప ఆచరణకు నోచుకోలేదు.

అప్పట్లో కొద్దిరోజులకే... తక్కువ కాలుష్యం కలిగించే టపాసులను అభివృద్ధి చేసినట్టు 'కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్' ప్రకటించింది. సాంప్రదాయిక టపాసుల కన్నా ఇవి చౌక అనీ చెప్పింది. వాటి అతీగతీ తెలీదు. అంతకన్నా ఘోరమేంటంటే, చైనా నుంచి దిగుమతి చేసుకున్న టపాసులు 'మేడిన్ ఇండియా' అంటూ నకిలీ ముద్రతో మార్కెట్‌లో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వాటిని ఆపే ప్రయత్నాలు సమర్థంగా జరగడం లేదు. అలాగే, ఇటీవల రెండు గంటలే టపాసులు కాల్చడానికి అనుమతిస్తున్నట్టు ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. ఆ ఆదేశాలూ ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. వెరసి, కాలుష్య నియంత్రణపై మాటలే తప్ప చేతలు కనిపించని వైనం సహజంగానే అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి తెర తీస్తోంది. టపాసుల నిషేధంపై ఢిల్లీ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ విమర్శిస్తోంది. బీజేపీ నేతాగణం, బీజేపీ పాలిత రాష్ట్రాలే ఆచారాల పేరు చెప్పి టపాసులు కాల్చేలా ప్రజల్ని కావాలని రెచ్చగొడుతున్నాయని 'ఆప్' ఆరోపిస్తోంది.

పరస్పర నిందారోపణలు పక్కనపెడితే, కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు. దేశ రాజధానిలో కాలుష్య నియంత్రణ చర్యలు ఫలితమివ్వకపోవడానికి... ఢిల్లీకీ, పొరుగు రాష్ట్రాలకూ మధ్య సమన్వయ లోపం ఓ ప్రధాన కారణం. ఇక, ఢిల్లీలోని 'ఆప్' ప్రభుత్వ వైఫల్యాలు సరేసరి. పండుగ వచ్చే ముందు ప్రతిసారీ ప్రభుత్వాలు ప్రజలకు విజ్ఞప్తి చేయడం, మార్గదర్శకాలు జారీ చేయడం షరా మామూలే. అవన్నీ వట్టి కంటి తుడుపు చర్యలే అవుతున్నాయి. ఏటా ఈ సీజన్‌లో ఢిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పంట వ్యర్థాల దహనంలోనూ ఇదే జరుగుతోంది. చట్టాలు చేసినా సరే పంజాబ్, హర్యానా సహా పలు ఉత్తరాది రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనం ఆగింది లేదు. ఒక్క పంజాబ్‌లోనే సెప్టెంబర్ 15 నుంచి ఇప్పటికి 28 వేలకు పైగా దహనాల ఘటనలు జరిగినట్టు లెక్క. ఫలితంగా హర్యానా లాంటి చోట్ల వాయు నాణ్యతా సూచి 'అల్ప', 'అత్యల్ప' స్థాయుల్లోనే కొనసాగుతోంది. అనారోగ్యాన్ని మరింత పెంచే ఈ కాలుష్య విషాన్ని తట్టుకోలేక కాంగ్రెస్ నేత సోనియా లాంటి వారు నిరుడు గోవా, ఈసారి జైపూర్‌లకు తరలిపోయారంటే అర్థం చేసుకోవచ్చు.

ఇవన్నీ పర్యావరణ పరిరక్షణ పట్ల మన చిత్తశుద్ధి లేమికి ప్రతీకలు. పంట వ్యర్థాలు, దీపావళి టపాసుల విషయంలోనే కాదు... వినాయక చవితి, విజయదశమి వేళ దేవతా విగ్రహాల నిమజ్జనంలోనూ ఇదే తంతు. హైదరాబాద్ లాంటి చోట్ల హుస్సేన్‌సాగర్‌లో మట్టి విగ్రహాలే నిమజ్జనం చేయాలని ఏటేటా కోర్టు ఆదేశాలిస్తున్నాయి. ప్రభుత్వాలు సరేనని తలూపుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్నది మాత్రం వేరు. కాలుష్యకారక విగ్రహాలతో ఒకటికి మూడు రోజులు సచివాలయం సాక్షిగా నిమజ్జనాలు నడుస్తుంటాయి. సంప్రదాయాల్ని పాటించాల్సిందే. కానీ, పెరిగిన కాలుష్య ప్రమాదం దృష్ట్యా వాటిని పర్యావరణ అనుకూలంగా మార్చుకోవడం ముఖ్యం. తాగే నీరు, పీల్చే గాలిని ప్రాణాంతకంగా మార్చుకొమ్మని ఏ ధర్మమూ బోధించదు. అది గ్రహించి, మారాల్సింది మనమే!

సమాజంలో మార్పు రాత్రికి రాత్రి వస్తుందనుకోలేం. టపాసుల సంరంభాన్నీ, విగ్రహాల ఆర్భాటాన్నీ తగ్గించుకొమ్మని ప్రజలను కోరే ముందు ప్రభుత్వాలు చిత్తశుద్ధి కనబరచాలి. ఆదేశాలన్నీ అప్పటికప్పుడు తీసుకుంటున్న అత్యవసర చర్యలుగా కనిపిస్తే లాభం లేదు. పాఠాల్లో భాగంగా టీచర్ల ద్వారా పిల్లలకు అవగాహన పెంచాలి. నివాసగృహాల అసోసియేషన్లను పర్యావరణహిత చర్యల్లో భాగం చేయాలి. పర్యావరణం, ప్రజారోగ్యం అందరి బాధ్యత గనక కేంద్రం, రాష్ట్రాలు ఒక దానిపై మరొకటి నెపం మోపడం సరికాదు. ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ప్రతిపక్షాలూ సహకరించడమే దీనికి సరైన పరిష్కార మార్గం. మునిసిపాలిటీ, అసెంబ్లీ నుంచి పార్లమెంట్ వరకు అందరూ కలసికట్టుగా నడవాలి. ఊపిరాడని దేశ రాజధానిలో ముందుగా ఆ అడుగులు పడాలి.

మానవాళికి హమాస్ అపచారం

అభిప్రాయం



యువల్ నోవా హరారి

ఇజ్రాయెల్ గతాన్ని చూపి హమాస్ నేరాలను సమర్థించటం ఎంతమాత్రమూ సాధ్యం కాదు. రెండు తప్పులు ఒక ఒప్పుగా మారవు. దురాక్రమణతో దశాబ్దాలుగా లక్షలాదిమంది పాలస్తీనియన్లను చెరబట్టడం, ఇటీవలి సంవత్సరాల్లో శాంతి కోసం చిత్తశుద్ధితో జరిగిన ప్రయత్నాలను వమ్ము చేయటం విషయంలో ఇజ్రాయెల్‌ను కచ్చితంగా విమర్శించాల్సిందే. అయితే హమాస్ దుశ్చర్యలు శాంతిప్రక్రియ పునఃప్రారంభం కోసం చేసినవి కాదు. ఆ దారుణాలు దురాక్రమణను అంతం చేసేవి కూడా కాదు. దానికి విరుద్ధంగా హమాస్ ప్రారంభించిన యుద్ధం లక్షలాదిమంది పాలస్తీనా పౌరుల ఎడతెగని వ్యథకు కారణమైంది.

అవీవ్ కుట్జ్ నా బాల్య స్నేహితుడికి చాలా సన్నిహిత మిత్రుడు. ఇజ్రాయెల్‌లో కఫార్ అజా ప్రాంతంలో భార్య లివ్‌నాత్, ముగ్గురు పిల్లలతో అవీవ్ చాలా కాలం నుంచి నివసిస్తున్నాడు. తమ కిబుట్జ్ (కిబుట్జ్ అంటే హిబ్రూ భాషలో పెద్ద వ్యవసాయ క్షేత్రం. స్వచ్ఛందంగా, పోటీరహితంగా పనిచేయడానికి ముందుకొచ్చే వ్యక్తుల సమూహం అక్కడ నివసిస్తుంది)పై హమాస్ జరిపే రాకెట్లు, మోర్టార్ల దాడులు చూస్తూనేవున్నా ఏదో ఒక నాటికి ప్రశాంతత ఏర్పడక పోతుందా అన్న ఆశతో కుట్జ్ కుటుంబం అక్కడే వుంటోంది. యుద్ధ క్షేత్రంలో కాస్తయినా శాంతిని వెదుక్కోవాలనే సంకల్పంతో యేటా పతంగుల పండుగ నిర్వహించటం కుట్జ్ కుటుంబానికి అలవాటు. ఆ ఉత్సవంలో రంగురంగుల గాలిపటాలు, అందులో కొన్నింటిపై శాంతి సందేశాలు– అన్నిటినీ గాజా సరిహద్దు ముళ్ల కంచెకు సమీపంలోనే ఎగరేస్తారు. 'మేం ప్రశాంతంగా జీవించాలని కోరుకుంటున్నాం తప్ప ఘర్షణను కాదని చెప్పటమే ఈ ఉత్సవ సారాంశం' అని గతంలో జరిగిన పతంగుల పండుగలో పాల్గొన్న లివ్‌నాత్ సోదరి చెప్పారు. ఈసారి పతంగుల పండుగ అక్టోబర్ 7న జరపాలని నిర్ణయించారు. కానీ ఆ ఉత్సవ ప్రారంభానికి కొన్ని గంటల ముందు హమాస్ ఉగ్రవాదులు కఫార్ అజాపై విరుచుకుపడ్డారు. దాన్ని చెరబట్టారు. కుట్జ్ అయిదుగురు కుటుంబ సభ్యులనూ హత మార్చారు.

ఇటువంటి ఉదంతాలు మనసును కలచివేస్తాయి. మనుషులు ఎందుకీ దారుణాలకు పాల్పడతారు? దీనిద్వారా హమాస్ సాధించదల్చుకున్నది ఏమిటి? ఒక ప్రాంతాన్ని స్వాధీనంలోకి తెచ్చుకోవటం సంప్రదాయ సంగ్రామం లక్ష్యంగా ఉంటుంది. హమాస్ ఉగ్రవాదం దీనికి భిన్నం. భయోత్పాతాన్ని వ్యాపింపజేయటం, లక్షలమంది ఇజ్రాయెలీ, పాలస్తీనా పౌరుల్లోనూ, ప్రపంచ ప్రజానీకంలోనూ విద్వేష బీజాలు నాటడం దాని మానసిక యుద్ధతంత్ర ఆంతర్యం.

పీఎల్ఓ వంటి ఇతర పాలస్తీనా సంస్థలకు హమాస్ భిన్నమైనది. మొత్తం పాలస్తీనా పౌరులందరితో దాన్ని సమం చేయకూడదు. హమాస్ తన పుట్టుక నుంచీ కఠినంగా వ్యవహరిస్తోంది. ఇజ్రాయెల్ ఉనికిని, మనుగడ సాగించేందుకు దానికిగల హక్కును గుర్తించ నిరాకరిస్తోంది. ఇజ్రాయెల్, పాలస్తీనా, ఇతర అరబ్బు దేశాల పౌరుల మధ్య శాంతి సాధనకు ఏర్పడే ప్రతి అవకాశాన్నీ తన శక్తికొద్దీ ధ్వంసం చేస్తోంది. ప్రస్తుత హింసా పరంపరకు నేపథ్యం ఇజ్రాయెల్‌కూ, గల్ఫ్ దేశాలకూ మధ్య కుదురుతున్న శాంతి ఒప్పందాలు. ఇజ్రాయెల్, సౌదీ అరేబియాల మధ్య సైతం శాంతి ఒప్పందం చిగురించబోతున్నది. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్యా సాధారణ సంబంధాలు ఏర్పర్చడం మాత్రమే కాదు, ఇజ్రాయెల్ దురాక్రమణలో బతుకులు వెళ్లదీస్తున్న లక్షలాదిమంది పాలస్తీనా వాసులకు ఇబ్బందుల నుంచి ఉపశమనం లభించటానికి తోడ్పడుతుంది. ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య శాంతి ప్రక్రియ పునఃప్రారంభం కావటానికి దోహదం చేస్తుంది. శాంతి స్థాపన అవకాశాల కన్నా హమాస్‌ను భయపెట్టగలిగేది మరేదీ వుండదు. అందుకే అది అక్టోబర్ దాడులకు తెగబడింది. కేవలం ఆ కారణంతోనే కుట్జ్ కుటుంబ సభ్యులనూ, మరో వేయిమందికి పైగా ఇజ్రాయెలీ పౌరులనూ అత్యంత పాశవికంగా హతమార్చింది. హమాస్ చర్య దాని సంపూర్ణ అర్థంలో అక్షరాలా మానవాళికి వ్యతిరేకంగా చేసిన నేరమే. మానవత్వంలో మనకుండే విశ్వాసాన్ని ధ్వంసం చేయటమే.



అక్టోబర్ 7న హమాస్ హతమార్చిన అవీవ్ కుట్జ్ కుటుంబం

ఇజ్రాయెల్ గతాన్ని చూపి హమాస్ నేరాలను సమర్థించటం ఎంత మాత్రమూ సాధ్యంకాదు. రెండు తప్పులు ఒక ఒప్పుగా మారవు. దురాక్రమణతో దశాబ్దాలుగా లక్షలాదిమంది పాలస్తీనియన్లను చెర బట్టడం, ఇటీవలి సంవత్సరాల్లో శాంతికోసం చిత్తశుద్ధితో జరిగిన ప్రయత్నాలను వమ్ము చేయటం విషయంలో ఇజ్రాయెల్‌ను కచ్చితంగా విమర్శించాల్సిందే. అయితే కుట్జ్ కుటుంబ సభ్యుల హత్య, ఇతర దుశ్చర్యలు శాంతిప్రక్రియ పునఃప్రారంభం కోసం చేసినవి కాదు. ఆ దారుణాలు దురాక్రమణను అంతం చేసేవి కూడా కాదు. దానికి విరుద్ధంగా హమాస్ ప్రారంభించిన యుద్ధం లక్షలాదిమంది పాలస్తీనా పౌరుల ఎడతెగని వ్యథకు కారణమైంది.

హమాస్‌పై సాగిస్తున్న యుద్ధంలో తన ప్రాంతాన్నీ, పౌరులనూ పరిరక్షించుకోవటం మాత్రమే కాదు... తన మానవీయతను కాపాడుకోవటం కూడా ఇజ్రాయెల్ కర్తవ్యమే. తమ స్వస్థలంలో శాంతి సౌభాగ్యాలు అనుభవించే హక్కు పాలస్తీనా పౌరులకుంది. దాంతోపాటు ఘర్షణల మధ్య కూడా వారి మౌలిక మానవ హక్కులను అన్ని పక్షాలూ గుర్తించి తీరాలి. ఇది ఒక్క ఇజ్రాయెల్‌కు మాత్రమే కాదు... గాజా స్ట్రిప్‌తో సరిహద్దు వుండి, దాన్ని పాక్షికంగా మూసివేసిన ఈజిప్టుకు కూడా వర్తిస్తుంది. ఇక హమాస్ విషయానికొస్తే మానవాళి మొత్తం ఆ సంస్థనూ, దాని మద్దతుదార్లనూ వెలివేయాలి.

గాజా యుద్ధ ఉద్దేశాలేమిటో విస్పష్టంగా ఉండాలి. హమాస్‌ను నిరాయుధీకరించాలి. గాజా స్ట్రిప్‌ను నిస్సైనికీకరించాలి. అలాగైతేనే పాలస్తీనా పౌరులు గౌరవ మర్యాదలతో మనుగడ సాగిస్తారు. వారితోపాటు ఇజ్రాయెల్ పౌరులు కూడా నిర్భయంగా జీవనం కొనసాగిస్తారు. ఈ లక్ష్యాలు సాధించేంతవరకూ మన మానవీయతనుకాపాడుకోవటం ఎంతో కష్టంతో కూడుకున్న పని. తీరని వేదన అనుభవిస్తున్న పాలస్తీనియన్లకు సహానుభూతి ప్రకటించటం మానసికంగా అశక్తతలో, అచేతనలో కూరుకుపోయిన చాలామంది ఇజ్రాయెలీ పౌరులకు కష్టమే. మనసులు స్వీయ విషాదంతో నిండి పోయిన వర్తమానంలో కనీసం వేరేవారి వ్యథను గుర్తించటానికి కూడా అందులో చోటు మిగలదు. ఎన్ని కష్టాల్లోనైనా అలాంటి చోటును నిలుపుకోగలిగిన కుట్జ్ కుటుంబం, వారిలాంటి అనేకులు ఇవాళ మృత్యు ఒడికి చేరారు. లేదా తీవ్ర మనోవ్యాకులత లోనికి జారుకున్నారు. అటు పాలస్తీనా పౌరులదీ ఇదే పరిస్థితి. వారు సైతం చెప్పలేనంత వ్యథను అనుభవిస్తున్నారు. మా బాధలను గమనించే స్థితిలో లేరు.

కానీ ఈ వేదనాభరిత స్థితికి దూరంగావున్న ఇతరులంతా వాస్తవాలను పాక్షిక దృష్టితో చూసే మందబుద్ధిని వదుల్చుకుని బాధాసర్పద్రష్టులందరికీ సహానుభూతి ప్రకటించటానికి కృషి చేయాలి. శాంతి స్థాపనకు చోటుండేలా సహాయపడటం వెలుపలి వారి కర్తవ్యం. ఆ బాధ్యతను మీకు అప్పగిస్తున్నాం. ఎందుకంటే ఆ విషయంలో మేం అశక్తులమయ్యాం. మా కోసం మీరు ఆ మంచి పని చేయండి. ఏదో ఒకరోజు ఈ కష్టాలన్నీ కడతేరినప్పుడు, ఈ గాయాలు మానినప్పుడు ఇజ్రాయెలీ పౌరులూ, పాలస్తీనా పౌరులూ ఆ చోటులో సురక్షితంగా మనుగడ సాగిస్తారు.

యువల్ నోవా హరారి ఇజ్రాయెల్ పౌరుడు. చరిత్రకారుడు, తత్వవేత్త. 'సేపియన్స్', 'హోమో డియస్', 'అన్‌స్టాపబుల్ అజ్' తదితర పుస్తకాల రచయిత.
('టైమ్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చివరి లేఖ



నా స్నేహితులకు ఒక గమనిక: మీరు దీన్ని చదువుతున్నట్టయితే, నేను వెళ్లిపోయాను. నన్ను క్షమించాలి, ఇది అర్థంలేనిదని మనిద్దరికీ తెలుసు. కారణం, అండాశయ క్యాన్సర్ నాలుగో దశ. నా సంపూర్ణ హృదయంతో ప్రతి ఒక్కరినీ ప్రేమించాను, అలాగే నేనూ అంతే లోతుగా ప్రేమను అందుకున్నానని నాకు తెలుసు. (నవంబర్ 12న న్యూయార్క్‌లో కేసీ మరణించారు.)

– కేసీ మెకింటైర్, ప్రచురణకర్త

అతిథి దేవో భవ



మా హనీమూన్ కోసం ఒబెరాయ్ వైల్డ్‌ఫ్లవర్ హాల్ (సిమ్లా)లో ఉన్నాం. సిమ్లా–కాల్కా టాయ్ ట్రెయిన్‌కు టికెట్లు బుక్ చేయమని అడిగాం. 14 మంది ప్రయాణీకులు లేకుండా రైలు నడవదని రైల్వే వాళ్లు చెప్పారు. హోటల్ కాసేపు ఆలోచించి, మొత్తం 14 టికెట్లు మా కోసం కొన్నది! (నవంబర్ 14న మరణించిన ఒబెరాయ్ హోటళ్ల సారథి 'బికీ' ఒబెరాయ్‌కి నివాళిగా.)

– అవతారం, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇవి పళ్లా?



జామపళ్లు హ్యాండ్‌బాల్ పరిమాణంలో రుచిలేకుండా వస్తున్నాయి. టెన్నిస్ బంతుల్లా ఉండే బదరీఫలాలు తింటే గొంతు పోతుంది. యాపిళ్లు కొంచెం కొరికి, కొద్ది సెకన్లు గాలికి ఉంచినా, ఎర్రగా మారిపోతున్నాయి. గత ఇరవై ఏళ్లలో పళ్ల రుచే పోయింది. ఇక, పుచ్చకాయలు వేసవిలో మాత్రమే ఆస్వాదించే వాళ్లం. ఇప్పుడు ఏడాదంతా దొరుకుతున్నాయి. కోల్డ్ స్టోరేజీ పళ్లు ఆరోగ్యం మీద ప్రభావం చూపుతున్నాయి. ప్రతి ఇంట్లో సీజన్‌లో దొరికే పళ్లేమిటో ఒక చార్ట్ ఉండాలి.

– అజయ్ సహ్రా, వ్యాఖ్యాత

ఎగతాళి చేస్తారా?



కాలా పానీ (అండమాన్) జైల్లో వీర్ సావర్కర్ అనుభవించిన అమానవీయ హింసను ఏ కాంగ్రెస్ నాయకుడు కూడా చవిచూడలేదు. సావర్కర్‌ను ఎగతాళి చేసేవాళ్లు జవహర్ లాల్ నెహ్రూ విడుదల కోసం ఆయన తండ్రి వైస్రాయ్‌ను బతిమిలాడిన నాభా జైలు (పంజాబ్) ఘటనను గుర్తుంచుకోవాలి.

– విక్రమ్ సంపత్, హిస్టారియన్

ఇన్ బాక్స్

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా?

వార్తలు, వర్తమాన రాజకీయాలపై అనుకూలంగా, ప్రతికూలంగా స్పందించే పత్రికా రంగం, రాజ్యాంగంలోని 19(1) (ఏ)లో పొందుపరచబడిన వాక్ స్వాతంత్ర్య భావ వ్యక్తీకరణ హక్కును పరిరక్షించుకొనే న్యాయ పోరాటాలు నేటికీ ఎదుర్కొంటూనే ఉంది. 2012లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ జస్టిస్ మార్కండేయ ఖట్జూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను ఒకే గొడుగు కిందకు తేవాలని తలచారు. అందుకు వీలుగా ప్రెస్ కౌన్సిల్ చట్టం మార్చాలని సూచించారు. పాత్రికేయ స్వేచ్ఛకు భ్రుతిమించి సంకెళ్ళు వేసే చట్టాలూ, చర్యలపై సుప్రీంకోర్టు కొరడా ఝళిపిస్తూనే ఉంది. తెల్లదొరల కాలం నాటి కాలం చెల్లిన రాజద్రోహం అధికరణలు, పరువు నష్టం పేరిట శిక్షార్హ నేరాలుగా ఏటికేడాది పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా స్వేచ్ఛ, భావప్రకటనా స్వాతంత్ర్యాన్ని కబళించే రాజకీయ కుయుక్తులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారతదేశ స్థానం దిగజారిపోతోంది.

1952లో ప్రెస్ కమిషన్ ఆవిర్భవించింది. ప్రస్తుతం జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. 'జర్నలిజం ఏకైక లక్ష్యం సేవాధర్మం. శక్తిమంతమైన ప్రెస్ తనను తాను నియంత్రించుకోవాలి. ఆత్మ నియంత్రణతో అదుపు చేసుకోవడమే ప్రయోజనకరం' అన్నారు తన జీవిత కాలం కలం ఆయుధంగా పోరాడిన జాతిపిత గాంధీజీ.

– జయసూర్య, సీనియర్ జర్నలిస్ట్
(నేడు జాతీయ ప్రెస్ దినోత్సవం)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్:
editpage@sakshi.com

సమాధానం ఇవ్వగలిగే ప్రశ్నలు

కామెంట్



కరణ్ థాపర్

బహుశా నేనిది పొట్టకూటి కోసం చేస్తున్నాను కాబట్టి, ఒక విషయాన్ని లేదా పరిస్థితిని అర్థం చేసుకోవడానికి అత్యుత్తమ మార్గం దాని గురించి ప్రశ్నలు అడగటం అని నమ్ముతాను. దీనివల్ల మనకున్న అనుమానాలు తొలగిపోవడమే కాదు... ఇంకా ముఖ్యంగా అస్పష్టతలను తొలగించుకునేందుకూ, మీరు పరిగణనలోకి తీసుకుంటున్న అంశాల్లో ఇమిడి ఉన్న వైరుధ్యాలను గుర్తించేందుకూ పనికొస్తుంది. ఇవేవీ తక్షణం మీ కంటికి కనిపించక పోవచ్చు. ఇంకో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే... ప్రశ్నించడం మీరు నేరుగా ఆలోచించేందుకు అవకాశం కల్పిస్తుంది. భావోద్వేగాలు, సహజ జ్ఞానాలతో కాకుండా, తార్కికంగా విషయాన్ని అర్థం చేసుకునే వీలు ఏర్పడుతుంది.

కాబట్టి, ఇప్పుడు ఇజ్రాయెల్–హమాస్ యుద్ధానికి సంబంధించిన ప్రశ్నలు కొన్ని మీతో పంచుకుంటాను. ఐదు వారాలుగా వరదలా మీదకొచ్చి పడుతున్న సమాచారం, హృదయ విదారకమైన దృశ్యాల నుంచి మీకు ఒక అవగాహన ఏర్పడేందుకు ఇవి ఉపయోగపడవచ్చు.

మొట్టమొదటి ప్రశ్న. యుద్ధం మొదలైన నెల తర్వాత, ఇప్పటివరకూ ఏం సాధించామని ఇజ్రాయెల్ నమ్ముతోంది? 11,000కు పైగా పాలస్తీనా పౌరులను మట్టుబెట్టింది. 27,000 మంది గాయాల పాలయ్యారు. గాజాలో చాలాభాగం నేల మట్టమై, ఇటుకల దిబ్బగా మిగిలిపోయింది. అయినా హమాస్ ఎంతమాత్రమూ ఓడిపోలేదు. ప్రతిరాత్రీ అది ఇజ్రాయెల్ పైకి రాకెట్లు ప్రయోగిస్తూనే ఉంది. 'లక్షల మంది ఇజ్రాయెలీలు బాంబు షెల్టర్లలోకి పరుగులు పెట్టేలా చేస్తోంది' అని ఇజ్రాయెలీ ఆర్మీ స్వయంగా ట్వీట్ చేస్తోంది. మరి ఇజ్రాయెల్ ఏం సాధించానని నమ్ముతోంది.

రెండో ప్రశ్న. హమాస్‌ను 'తుడిచిపెట్టడం' తమ లక్ష్యమని ఇజ్రాయెల్ చెబుతోంది. కానీ ఎంత మూల్యానికి? ఇంకెన్ని ప్రాణాలు పోతే, లేదా ఆస్తులు ధ్వంసమైతే ఇజ్రాయెల్ ప్రతీకారేచ్ఛ, శిక్షించాలన్న కాంక్ష తృప్తి చెందుతుంది? లేదా హమాస్‌ను తుడిచిపెట్టేంతవరకూ అమాయక పౌరుల మారణకాండ జరగడానికీ, గాజాను ధ్వంసం చేయడానికీ సిద్ధమైందా? తాము చేస్తున్న పనులన్నీ సరైనవే అని ఇజ్రాయెల్ భావించవచ్చుగాక! నిజంగానే ఈ చర్యలు సమర్థనీయమా?

మూడో ప్రశ్న... హమాస్ అన్నది ఓ సైద్ధాంతిక ఆలోచనా? లేక సంస్థనా? ఈ ప్రశ్న యథాలాపంగా వేసుకునేది కాదు. విషయాన్ని తుదికంటా శోధించేందుకు అవకాశమున్నది. ఓ సంస్థను మట్టుబెట్టవచ్చునేమో కానీ... సిద్ధాంతానికి అంతం పలికేదెలా? పైగా ఎంత అణచివేయాలని చూస్తే... ఆ ఆలోచన అంత పదును తేలుతుంది, శక్తిమంతమవుతుంది.

నాలుగవ ప్రశ్న... హమాస్ స్థావరాలు ఉన్నాయి కాబట్టే



ఆసుపత్రులు, పాఠశాలలు, అంబులెన్సులు లక్ష్యాలుగా చేసుకుని దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ చెబుతోంది. కానీ చూపుతున్న సాక్ష్యాలను హమాస్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతోంది. ఒకట్రెండు సందర్భాల్లో... అల్‌జజీరా వంటి టెలివిజన్ ఛానెళ్లు సైతం ఇజ్రాయెల్ చూపిన సాక్ష్యాలను సవాలు చేశాయి. వివాద పరిష్కారం కోసం ఐక్యరాజ్య సమితి ఒక స్వతంత్ర విచారణను చేపట్టాలని హమాస్ సూచించింది. ఒకరినొకరు నమ్మడానికి సిద్ధంగా లేని ఈ పరిస్థితుల్లో ఈ సూచన సహేతుకమైనది కాదా?

ఐదవ ప్రశ్న... ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కాల్పుల విరమణకు ససేమిరా అంటున్నారు. కానీ, రోజుకు నాలుగు గంటలపాటు ఉండే 'వ్యూహాత్మక చిన్న విరామాల'కు మాత్రం అంగీకరించారు. దీనివెనుక ఉన్న నైతిక తర్కం ఏమిటి? ఇరవై నాలుగు గంటలూ వరుసగా బాంబులు కురిపిస్తూ... మధ్యలో భోజన విరామం ప్రకటించినట్టుగా లేదూ ఈ ప్రతిపాదన? వధించడానికి ముందు దూడలకు కొవ్వు పెరిగేలా చేయడం లాంటిదే ఇది.

ఆరవది. ఇజ్రాయెల్‌కు తనను తాను రక్షించుకునే హక్కు ఉందని పాశ్చాత్య దేశాలు నొక్కి వక్కాణించడం ఇంకా మానలేదు. అవును, ఆ హక్కు ఉంది. హమాస్ చేసింది అనాగరికం, క్రూరం, తీవ్రంగా ఖండనీయం, ఎంతమాత్రమూ క్షమార్హం కానిదే. అయితే ఆత్మరక్షణ హక్కు అంటే విచక్షణారహితంగా పౌరులను చంపే హక్కును కలిగి వుంటుందా?

ఇక్కడ ఇంకో విషయం ఉంది. ఇజ్రాయెల్ 56 ఏళ్లుగా పాలస్తీనాకు చెందిన ప్రాంతాలపై అక్రమంగా కబ్జా పెట్టిందన్న విషయం మరవొద్దు. ఈ సమయంలో సెటిల్‌మెంట్లు ఏర్పాటు చేస్తూ పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించింది. పద్ధతి, పాడు లేకుండా, విచారణ ప్రస్తావనే లేకుండా వేలమంది పాలస్తీనీయుల్ని అరెస్ట్ చేసింది. హింసించింది, చంపేసింది. గిడోన్ లెవీ, అవీ ష్లామ్ వంటి ఇజ్రాయెలీలే ఈ చర్యలను జాతి వివక్షగా అభివర్ణించారు. అటువంటప్పుడు అలాంటి ఆక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనియన్లకు ఆత్మ రక్షణ హక్కు ఉండదా?


ఏడవది, ప్రస్తుత యుద్ధం ఒక ముగింపునకు వచ్చిన తరువాత ఏం చేయాలన్న విషయంపై ఇజ్రాయెల్‌కు ఏమైనా ఆలోచన ఉందా? హమాస్ నాశనమై పోయిన తరువాత దాని స్థానాన్ని ఆక్రమించేదెవరు? ఫతా, పాలస్తీనా అధికార వర్గం ఈ పనిచేసే స్థితిలో లేవు. ఇజ్రాయెల్ ఇప్పటికే వీరిపై ఉన్న విశ్వాసాన్ని సమూలంగా దెబ్బతీసింది. అటువంటప్పుడు హమాస్ స్థానాన్ని ఆక్రమించేదెవరు? వాళ్లు ఎవరైనా పాలస్తీనా రక్షణ బాధ్యతలను ఇజ్రాయెల్ శాశ్వతంగా తలకెత్తుకుంటుందని చెబుతున్న ప్రధాని నెతన్యాహూ మాటలను నమ్ముతారా? ఆయన ఈ అంశంపై పట్టుబడితే గాజా నేలపై ఇజ్రాయెలీ మిలటరీ బూట్లు నిత్యం కాపుకాస్తూ ఉండవా? ఇదే నిజమైతే సమస్య పరిష్కారమైందెక్కడ? మళ్లీ మొదటికి వచ్చినట్లే అవుతుంది కదా?

ఇంకా ఇతర ప్రశ్నలు ఉన్నాయనడంలో సందేహం లేదు. ఇదేమీ సమగ్రమైన జాబితా కాదు. కానీ, నా వరకూ ఈ ప్రశ్నలు కీలకమైన అంశాలను లేవనెత్తుతున్నాయి. విషయాన్ని అర్థం చేసుకునేందుకు ఉపయోగపడ్డాయి. ముఖ్యంగా నాకు తెలియనివాటిని తెలిసేలా చేశాయి. నేనేం చేస్తున్నానో విశదం చేసుకోవడానికి ఇదొక మార్గం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ఏది ధర్మం?

లోకంలో ధర్మం గురించి పలువురు పలు విధాలుగా అర్థం చెప్పటం, వ్యాఖ్యానించటం జరుగుతోంది. మనం ఏ కర్మ చేస్తే పూజ్యులైనవారు, మహాత్ములు హర్షించి ఆమోదం తెలుపుతారో ఆ కర్మ ధర్మమనీ; మనం ఏ కర్మ చేస్తే వారు ఆమోదం తెలుపక నిరసిస్తారో అది అధర్మమనీ చెప్పారు. పుణ్య కర్మ ధర్మం, పాప కర్మ అధర్మం అన్నారు. ఏ కర్మ చేస్తే పుణ్యం? ఏ కర్మ చేస్తే పాపం? అంటే, పరోపకారాయ పుణ్యాయ, పాపాయ పరపీడనం అన్నారు. శాశ్వతంగా శ్రేయస్సు కలిగించేది ధర్మమనీ, తాత్కాలికంగా ప్రియాన్ని కలిగించేది అధర్మమనీ చెప్పారు.



జ్యోతిర్మయం

సమాజంలో ఎక్కువమంది దేనిని అంగీకరిస్తారో, దానిని ధర్మమని నిర్ణయించటం యుక్తిసహంగా ఉంటుందని కొందరంటారు. కాలానుగుణంగా ధర్మం మారాలని మరి కొందరంటారు. యుగం మారినప్పుడు ధర్మ శాస్త్రం మారటం అందుకు ప్రాతిపదికగా వీరు చూపుతారు.

ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలలో ధర్మం మొదటిది. ధర్మం వల్ల చిత్తశుద్ధిని పొందాలి. ధర్మం వల్ల పొందిన ధనాన్ని, దైవ కార్యానికి, సమాజ శ్రేయస్సుకు వినియోగించాలి. ధర్మ లబ్ధమైన కామం వల్ల జనించిన సుఖాన్ని జీవితంలో అనుభవించాలి. అటు తరువాత మోక్షానికి ప్రయత్నించాలి. ఈ విధమైన జీవితయాత్ర నడిపిన వారు ఉత్తమ మార్గాన్ని అనుసరించినవారు అవుతారు. జీవితంలో అర్థాన్నీ, కామాన్నీ విడిచి పెట్టమని ఏ శాస్త్రమూ చెప్పదు. జీవితంలో ధర్మానికి వ్యతిరేకం కాని అర్థ సంపాదన, కామం ఉండాలి. ధర్మార్థ కామముల ద్వారా మోక్షాన్ని సంపాదించాలి.

ధర్మాన్ని ఆచరించనిదే ఎవరూ, ఏనాడూ సుఖం అనుభవించటం జరగదు. అధర్మపరుడు సుఖిస్తున్నట్టు కనపడినా అది పైపైనే, తాత్కాలికమే! ధర్మం ఆచరించే వారిని అందరూ గౌరవిస్తారు. ధర్మం ఆచరించే వారిని గౌరవించినట్టుగా, కేవలం డబ్బున్న వాణ్ణీ, కాముకుణ్ణీ లోకం గౌరవించదు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.తదియ ప.12.54 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** మూల రా.3.27 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.11.51 నుండి 1.25 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.37 వరకు, తదుపరి ప.2.22 నుండి 3.07 వరకు, **అమృత ఘడియలు:** రా.9.10 నుండి 10.44 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.08, **సూర్యాస్తమయం:** 5.21.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు

- సీఈవోకు బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ వినతి



సాక్షి, హైదరాబాద్: అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్‌కు గోషామహల్ బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. 2018 ఎన్నికల్లో గోషామహల్‌లోని చాలా పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. పోలింగ్ కేంద్రంలో ప్రత్యేకంగా ఒక మహిళా పోలీసు అధికారిని నియమించి.. మాస్క్‌తో వచ్చే మహిళలను గుర్తించాలని కోరారు. ముస్లిం, హిందూ, ఇతరులెవరైనా సరే వారిని గుర్తించాకే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. గోషామహల్‌లో కొందరు పోలీసు అధికారులు బీజేపీ కార్యకర్తలను వేధిస్తున్నారని, వారిని తక్షణమే బదిలీ చేయాలని సీఈవోను రాజాసింగ్ కోరారు.

తెలంగాణలోనూ బీసీ కులగణన చేపట్టాలి



కవాడిగూడ (హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్‌లో బీసీ కులగణన చేపట్టడం అభినందనీయమని, తెలంగాణలో కూడా బీసీ కులగణన చేపడతామని ప్రధాన పార్టీలు ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం దోమలగూడలోని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యాలయంలో బీ సీ సంఘాల సమావేశంలో జాజుల మాట్లా డా రు. తమిళనాడులో బీసీ కులాల లెక్కలు ఉండటం వల్ల ఆ రాష్ట్రంలో బీసీలు జనాభా దామాషా ప్రకారం 69 శాతం రిజర్వేషన్లు పొందుతున్నారని తెలిపారు. ఏపీ ప్రభుత్వం ప్రారంభించిన సమగ్ర కులగణనతో బీసీలకు భవిష్యత్‌లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు హక్కుగా అందుతాయన్నారు. బీసీ కులాల లెక్కలు చేపట్టకపోతే మరో ఆరు నెలల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు, ఎమ్మెల్యే సీట్లలో బీసీలకు అన్యాయం జరిగినట్లుగా స్థానిక సంస్థల్లో కూడా అన్యాయం జరుగుతుందని జాజుల ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ, బీసీ జనసైన్యం అధ్యక్షుడు సింగం నగేశ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్, బీసీ నేతలు భాస్కర్, మధు తదితరులు పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చని పార్టీలకు బుద్ధి చెప్పండి'



కాకతీయ యూనివర్సిటీవద్ద మాట్లాడుతున్న ఆకునూరి మురళి

కేయూ క్యాంపస్: గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని, వాటిని తీర్చకుండా కొత్త హామీలతో తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్న ఈ పార్టీలకు సబ్బండ వర్గాల ప్రజలు తమ ఓటు హక్కుతో తగిన బుద్ధి చెప్పాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ జిల్లా కేంద్రంలో 'జాగో తెలంగాణ ఓటరు' చైతన్య బస్సు యాత్ర మడికొండ, కాజీపేట, అదాలత్ సెంటర్, కాకతీయ యూనివర్సిటీ, హనుమకొండ చౌరస్తా సెంటర్లలో కొనసాగింది. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ, దేశంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపే హామీలను ఇచ్చి, గద్దెనెక్కిన తర్వాత వాటిని తుంగలో తొక్కి తెలంగాణ ప్రజలను వంచించారని మండిపడ్డారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక విద్యార్థులు, యువకుల బతుకులు భారంగా మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాస్వామిక వేదిక కన్వీనర్ వినాయక రెడ్డి, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజాషా పాల్గొన్నారు.

రాష్ట్రంలో 2,944 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మొత్తం ఓటర్ల జాబితాలో ఎన్ఆర్ఐలు 2,944 మంది ఉన్నారు. వీరంతా తెలంగాణ రాష్ట్రంలో ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. వీరిలో పురుషులు 2,380 ఉంటే...మహిళలు 563 ఉన్నారు. మిగిలిన ఒక్కరూ ట్రాన్స్‌జెండర్‌గా నమోదయ్యారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3.26,18,205 ఓటర్లు ఉండగా..అందులో పురుషులు 1,62,98,418, మహిళలు 1,63,01,705, ట్రాన్స్‌జెండర్స్ 2,676 ఉన్నారు. కాగా, సర్వీస్ ఓటర్లు మొత్తం 15,406 మంది ఉన్నారు. ఇక 18–19 మధ్య వయస్సు ఓటర్లు 9,99,667 ఉండగా, 80 సంవత్సరాల పైబడిన ఓటర్లు 4,40,371 మంది ఉన్నారు.

గజ్వేల్, కామారెడ్డిలో బీజేపీదే గెలుపు

- కేసీఆర్, కేటీఆర్ ఈ ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయం
- ముఖ్యమంత్రిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది
- అన్ని వర్గాలకు సీట్లిచ్చి గౌరవించింది బీజేపీ మాత్రమే
- తెలంగాణలో బీజేపీకి అధికారం ఖాయం... మీడియా సమావేశంలో జి.కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పోటీ చేస్తున్న గజ్వేల్, కామారెడ్డిలో ఆయన ఓడిపోతారని, ఆ రెండు స్థానాల్లోనూ బీజేపీ విజయం సాధిస్తుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఈసారి ఎన్నికల్లో తండ్రీకొడుకులిద్దరూ ఓడిపోవడం ఖాయమని తెలిపారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గజ్వేల్‌లో ఓటమి భయంతోనే కేసీఆర్ రెండుచోట్ల పోటీ చేస్తున్నారని చెప్పారు. ఈటల బరిలో ఉంటున్నాడని తెలిసినప్పటి నుంచి కేసీఆర్‌కు నిద్ర పట్టడం లేదని, కామారెడ్డిలోనూ వెంకటరమణారెడ్డి చేతిలో ఓడిపోతారన్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 111 స్థానాల్లో, జనసేన 8 స్థానాల్లో పోటీలో ఉందని తెలిపారు. బీజేపీ తరఫున నామినేషన్ వేసిన రెబల్స్ దాదాపు ఉపసంహరించుకున్నారని చెప్పారు. బీజేపీ నుంచి 36 మంది, జనసేన నుంచి ముగ్గురు బీసీ అభ్యర్థులు పోటీలో ఉన్నారని, కాంగ్రెస్ 22 మంది బీసీలకు మాత్రమే టికెట్లు ఇచ్చిందని, బీఆర్ఎస్ 23 మంది బీసీలకు టికెట్ ఇచ్చిందని చెప్పారు. రెండు జనరల్ స్థానాలను కూడా దళితులకే ఇచ్చామన్నారు. బీజేపీ 14 మంది మహిళలకు టికెట్లు ఇవ్వగా, బీఆర్ఎస్ 8 మంది మహిళలకే టికెట్ కేటాయించిందన్నారు.

17న రాష్ట్రానికి అమిత్‌షా...

ఈ అసెంబ్లీ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్‌కు సంబంధించిన ఎన్నికలని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటేస్తే నష్టమే తప్ప ఎలాంటి మార్పూ రాదని, కుటుంబ, అవినీతి పాలనలో ఈ రెండు పార్టీలూ మునిగిపోయాయన్నారు. రాష్ట్రంలో బీజేపీకి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని, కొందరు దొంగ కంపెనీల పేరిట తప్పుడు సర్వేలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 17న రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణకు వస్తున్నారని, 18న నాలుగు జిల్లాల్లో సభలు ఉంటాయని, వరంగల్, నల్లగొండ, రాజేంద్రనగర్ అసెంబ్లీల వారీగా బీసీ సంఘాలతో సదస్సు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణ ప్రజలకు బానిస బతుకు మాత్రమే మిగిలిందని, అందుకే గజ్వేల్, కామారెడ్డిలో కేసీఆర్‌కు వ్యతిరేకంగా చాలా మంది నామినేషన్లు వేశారన్నారు. నెలరోజుల్లో పదవి దిగిపోయే కేసీఆర్ ఇప్పుడు మెడికల్ కాలేజీల గురించి మాట్లాడుతున్నారని, సరైన సమయంలో భూములు చూపకుంటే అందుకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఎన్నికల తర్వాత టెక్స్‌టైల్ పార్క్, సైన్స్ సిటీ, కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. పాతబస్తీలో నిరుపేద ముస్లింల భూములు లాక్కుని షాదీఖానాలు ఏర్పాటు చేస్తున్నారని, బీజేపీ వారికి రక్షణగా ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ అఖిలేశ్ యాదవ్, శరద్ పవార్, నితీశ్ కుమార్, కేజ్రీవాల్, కుమారస్వామి తదితర ప్రాంతీయ పార్టీల నేతలను కలిశారని, వారికి ప్రత్యేక విమానాలు పంపించి మరీ దావత్ ఇచ్చారని, వారిలో ఒక్కరైనా ఇప్పుడు మద్దతిచ్చారా అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి రాగానే మతపరమైన రిజర్వేషన్లు రద్దు చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ కూడా ప్రచారం చేస్తారని చెప్పారు.

కాంగ్రెసోళ్లు అమ్ముడు పోరనే గ్యారంటీ ఇస్తారా?

- ఆ విషయంపై మాట్లాడిన తర్వాతే ఓట్లడగాలి
- బీఆర్ఎస్, కాంగ్రెస్ గెలిస్తే సీఎం పదవి కోసం కుమ్ములాటలు
- బీజేపీ వస్తేనే సుస్థిర ప్రభుత్వం: బండి సంజయ్



రోడ్‌షోలో మాట్లాడుతున్న బండి సంజయ్. పక్కన పార్టీ అభ్యర్థి అరుణతార

నిజాంసాగర్(జుక్కల్): ''కాంగ్రెసోళ్లు ఆరు గ్యారంటీ హామీల గురించి మాట్లాడుతుంటే నవ్వొస్తోంది.. ఆ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు అమ్ముడుపోరనే గ్యారంటీ ఇవ్వగలరా ? ఎందుకంటే ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా కేసీఆర్‌కు అమ్ముడు పోయినోళ్లు.. ఈ సారి పోరనే గ్యారంటీ ఏముంది? ముందు ఈ విషయంపై మాట్లాడిన తర్వాతే ఆరు గ్యారంటీల గురించి చెప్పి ప్రజలను ఓట్లు అడగాలి''అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కాంగ్రెస్ నేతలపై విమర్శలు సంధించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు గెలిస్తే సీఎం పదవి కోసం కుమ్ములాటలతో మళ్లీ ఎన్నికలు రావడం తథ్యమన్నారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుందలో బీజేపీ అభ్యర్థి అరుణాతారతో కలిసి సంజయ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో కేటీఆర్ సీఎం అయితే హరీశ్, కవిత, సంతోష్‌రావులు ప్రభుత్వాన్ని కూల్చేస్తారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ పార్టీలో అందరూ సీఎంలేనని, సీఎం పదవి కోసం ఒకరినొకరు కొట్టుకుంటూ సర్కార్‌ను కూల్చేస్తారని విమర్శించారు. బీజేపీ వస్తేనే సుస్థిర ప్రభుత్వం సాధ్యమనీ, మాది క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, ఎన్నికైన ఎమ్మెల్యేలు, జాతీయ నాయకత్వం కలిసి ముఖ్యమంత్రి ఎవరనేది నిర్ణయిస్తారన్నారని చెప్పారు.

ఒవైసీకి కేసీఆర్ మామ అయితడ?

ఒవైసీకి కేసీఆర్ మామ అయితడ..? మామను గెలిపించాలని చెబుతున్నడు. ఎవరు మామ ? ఎవడికి మామ? పొరపాటున బీఆర్ఎస్‌ను గెలిపిస్తే ఎంఐఎంకు తాకట్టుపెడతారని బండి ధ్వజమెత్తారు. బిహార్‌లో 12 శాతం ఓట్లున్న వర్గంతో ఎంఐఎం పార్టీ 5 సీట్లు గెలుచుకుంది. మరి తెలంగాణలో 80 శాతం ఓట్లున్న వారంతా ఏకమైతే బీజేపీని అధికారంలోకి తీసుకురాలేరా? అని ప్రశ్నించారు.

సీఎం అంటే ఉన్న పోస్టు ఊడిపోతది

ప్రచారంలో భాగంగా బీజేపీ యువకులు, కార్యకర్తలు ద్విచక్రవాహనాల ర్యాలీతో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కాబోయే సీఎం బండి సంజయ్ అంటూ పదే, పదే నినాదాలు చేయగా, మీరు సీఎం, సీఎం అంటే నా ఉన్న పోస్టు కూడా ఊడిపోతదని దయచేసి సీఎం అనకండని సంజయ్ సూచించారు.

బీజేపీకి రాములమ్మ రాం రాం..!

- కాంగ్రెస్‌లో చేరిక?



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర బీజేపీకి మరో షాక్ తగిలింది. జాతీయ కార్యవర్గ సభ్యురాలు, మాజీ ఎంపీ విజయశాంతి పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం ఈ మేరకు తన రాజీనామా లేఖను కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి పంపించారు. ఇప్పటికే పలువురు నేతలు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. కొంతకాలంగా ఆమె పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అయితే ఈనెల 7న ఎల్బీ స్టేడియంలో జరిగిన బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభలో ప్రధాని మోదీ పాల్గొన్న సందర్భంగా... బేగంపేట ఎయిర్‌పోర్టులో మోదీకి ఆమె స్వాగతం పలికిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె పార్టీని వీడతారా లేదా అన్న దానిపై కొంత చర్చ జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వంపై బీజేపీ గట్టిగా పోరాడటం లేదన్న భావనతో పాటు, కేసీఆర్ సర్కారు అవినీతి, అక్రమాలు, ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితపై కేంద్రం కఠినంగా వ్యవహరించడం లేదనే అభిప్రాయంతో ఉన్న ఆమె చివరకు పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్టు సన్నిహితుల సమాచారం. ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరిక దాదాపుగా ఖరారు అయినట్టు తెలుస్తోంది.

బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటే...

- అందువల్లే కవితను అరెస్టు చేయలేదు
- ఏఐసీసీ అధికారి ప్రతినిధి మహమ్మద్ ఆరోపణ

మణికొండ: ఢిల్లీలో జరిగిన లిక్కర్ కేసులో పలు పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారని, బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ కవితను మాత్రం ఎందుకు అరెస్టు చేయడంలేదని ఏఐసీసీ అధికార ప్రతినిధి శ్యామ మహమ్మద్ ప్రశ్నించారు. రాజేంద్రనగర్ పార్టీ పరిశీలకురాలిగా ఉన్న ఆమె బుధవారం మణికొండలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు పొత్తులో ఉన్నందునే కవిత అరెస్టు జరగలేదన్నారు. పార్లమెంట్, రాజ్యసభలలో అనేక బిల్లులకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగినా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదన్నారు. ఆ ప్రాజెక్టును నిర్మించిన కాంట్రాక్టర్‌కు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్ద ఎత్తున వాటాలు ఇచ్చినందునే మిన్నకున్నాయన్నారు. మూడు పార్టీల కూటమిని ప్రజలు అర్థం చేసుకుని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాలన్నారు.

ఇంజిన్‌లో ఇరుక్కుని 10 కి.మీ. వెళ్లిన మృతదేహం

- రైలు ఢీకొని ఇద్దరు యువకుల మృతి
- మంచిర్యాల జిల్లాలో రైల్వేగేటు దాటే ప్రయత్నంలో ప్రమాదం



భుక్యా సురేశ్



కుంభాల చందు

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఓ యువకుడి మృతదేహం రైలు ఇంజిన్‌కు చిక్కుకోవడంతో సుమారు పది కిలోమీటర్ల దూరంలోని మంచిర్యాల రైల్వేస్టేషన్ వరకు వెళ్లింది. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. రామకృష్ణాపూర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన భుక్యా సురేశ్ (30), కుంభాల చందు (40) మంచిర్యాల నుంచి ఆర్‌కేపీకి వస్తున్నారు. క్యాతనపల్లి వద్ద రైల్వేగేటు పడటంతో గేటు కింద నుంచి ద్విచక్రవాహనం తోసుకుంటూ ఇవతలికి దాటేందుకు యత్నించారు. ఇదే సమయంలో మందమర్రి నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న ఓ ఎక్స్‌ప్రెస్ రైలు వేగంగా దూసుకొచ్చి ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు ప్రాణాలు విడిచారు. సురేశ్ మృతదేహం రైల్వే గేటు వద్దే పడిపోగా.. చందు మృతదేహం రైలు ఇంజిన్‌లో ఇరుక్కుని మంచిర్యాల స్టేషన్ వరకు వెళ్లింది. సురేశ్ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా, చందు పెయింటర్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరూ వివాహితులే. ఇద్దరూ ఒకేరోజు మృత్యువాతపడటంతో ఆ రెండు కుటుంబాలు దుఃఖసాగరంలో మునిగిపోయాయి.

ఎన్నికల బరిలో మిగిలింది 2,290 మంది

- నామినేషన్లను ఉపసంహరించుకున్న 608 మంది అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో బరిలో నిలిచిన అభ్యర్థుల సంఖ్య తేలింది. 119 నియోజకవర్గాల్లో 2290 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. నామినేషన్ల పరిశీలన తరువాత 2,898 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, ఏకంగా 608 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

రెబల్స్, స్వతంత్రులు ఉపసంహరణ

రాష్ట్ర వ్యాప్తంగా ఈసారి ఎన్నికల్లో భారీ ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలన తరువాత 606 నామినేషన్లను తిరస్కరించడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల సంఖ్య 2,898గా తేలింది. ఇందులో వివిధ పార్టీలకు చెందిన రెబల్స్‌తో పాటు గుర్తింపు లేని రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు ఉన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల నుంచి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు తమపై అసంతృప్తితో రెబెల్స్‌గా బరిలో నిలిచిన వారిని బుజ్జగించి, నామినేషన్లను ఉపసంహరించుకునేలా చేయడంలో విజయం సాధించారు. అదే సమయంలో భారీ సంఖ్యలో స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించేలా స్థానిక నాయకులు చేసిన ప్రయత్నాలూ ఫలించాయి. దీంతో నామినేషన్ల పరిశీలన తరువాత 2898 మంది రంగంలో ఉంటే... ఉపసంహరణ తరువాత ఆ సంఖ్య 2290కి తగ్గింది.

ఆ ఏడు స్థానాల్లో అదనపు బ్యాలెట్ యూనిట్లు

- సీఎం పోటీ చేస్తున్న గజ్వేల్‌లో 44, కామారెడ్డిలో 39 మంది అభ్యర్థుల పోటీ
- మరో 5 చోట్ల కూడా బరిలో ఎక్కువమంది
- ఒకబ్యాలెట్ యూనిట్‌లో గరిష్ఠంగా 16 మంది అభ్యర్థులకే చోటు

సాక్షి, హైదరాబాద్, సాక్షి, సిద్దిపేట/గజ్వేల్: సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న రెండు నియోజకవర్గాలతో పాటు మరో అయిదు సెగ్మెంట్లలో అభ్యర్థులు లెక్కకి మించి ఉండటంతో అదనపు బ్యాలెట్ యూనిట్లను అమర్చి పోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి శాసనసభ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తుండగా, బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత గజ్వేల్ నుంచి 44 మంది, కామారెడ్డి నుంచి 39 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. దీంతో ఈ రెండు శాసనసభ నియోజకవర్గాల్లో పోలింగ్ రోజు వినియోగించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)కు మూడు చొప్పున బ్యాలెట్ యూనిట్లను అమర్చి పోలింగ్ నిర్వహించనున్నారు.

ఈవీఎంలకు మూడు బ్యాలెట్ యూనిట్లు

ఒక ఈవీఎంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ అనే మూడు ప్రధాన విభాగాలుంటాయి. ఒక బ్యాలెట్ యూనిట్‌పై నోటాతో సహా 16 మంది అభ్యర్థుల పేర్లు, ఎన్నికల గుర్తు, ఫోటో ఉంటాయి. నియోజకవర్గంలో 16 మందికి మించి అభ్యర్థులు పోటీ చేస్తే ఒకటికి మించి బ్యాలెట్ యూనిట్లను వాడాల్సి ఉంటుంది. నోటాతో కలిపి అభ్యర్థుల సంఖ్య 17 నుంచి 32లోపు ఉంటే రెండు బ్యాలెట్ యూనిట్లు, 33 నుంచి 48లోపు ఉంటే మూడు బ్యాలెట్ యూనిట్లను వినియోగించక తప్పదు. దీంతో గజ్వేల్, కామారెడ్డిలో వినియోగించనున్న ఈవీఎంలకు మూడు చొప్పున బ్యాలెట్ యూనిట్లను అమర్చి పోలింగ్ నిర్వహించనున్నారు.



కంట్రోల్ యూనిట్ | వీవీ ప్యాట్ | బ్యాలెట్ యూనిట్

'ఎం3'రకం ఈవీఎంల వినియోగం

2013 నుంచి అందుబాటులోకి వచ్చిన 'ఎం3'రకం ఈవీఎంలను రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో వినియోగిస్తున్నారు. ఒక కంట్రోల్ యూనిట్‌కు వీవీ ప్యాట్‌తో పాటు గరిష్ఠంగా 24 బ్యాలెట్ యూనిట్లను అనుసంధానం చేసి ఒక ఈవీఎంను తయారు చేయవచ్చు. దీంతో ఒకే ఈవీఎం ఆధారంగా గరిష్ఠంగా 384 అభ్యర్థులకు పోలింగ్ నిర్వహించవచ్చు. 384 మందికి లోపు అభ్యర్థులు పోటీ చేస్తే ఒకే కంట్రోల్ యూనిట్‌కు అవసరమైన సంఖ్యలో బ్యాలెట్ యూనిట్లను అమర్చనున్నారు. అయితే, అభ్యర్థుల సంఖ్య 384కు మించితే రెండో కంట్రోల్ యూనిట్‌ను వినియోగించక తప్పదు. 2006 నుంచి 2013 వరకు జరిగిన ఎన్నికల్లో 'ఎం2'రకం ఈవీఎంలను ఎన్నికల సంఘం వినియోగించింది. ఆ తర్వాత నుంచి జరుగుతున్న ఎన్నికల్లో 'ఎం3'రకం ఈవీఎంలను వాడుతోంది. ఒక ఈవీఎం గరిష్ఠంగా 2వేల ఓట్లను నమోదు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉండనుంది. సాధారణంగా 1500 ఓట్లకు మించి ఒక పోలింగ్ కేంద్రానికి ఓట్లను కేటాయించరు.

ఓటర్లు కన్‌ఫ్యూజ్ అవుతారేమోనని పార్టీల ఆందోళన

సోమవారంతో ముగిసిన నామినేషన్ల పరిశీలన అనంతరం గజ్వేల్‌లో 114 మంది బరిలో ఉండగా, బుధవారం 70 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కామారెడ్డిలో నామినేషన్ల పరిశీలన అనంతరం 58 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, 19 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. చివరకు గజ్వేల్ నుంచి మొత్తం 44 మంది, కామారెడ్డి నుంచి మొత్తం 39 మంది పోటీ చేస్తుండగా, రెండు చోట్లలో కూడా మూడు బ్యాలెట్ యూనిట్లతో పోలింగ్ నిర్వహించనుండడంతో ఓటర్లు కొంత గందరగోళానికి గురయ్యే ప్రమాదముందని రాజకీయ పార్టీలు ఆందోళనకు గురి అవుతున్నాయి.

మరో 5 చోట్ల సైతం...

ఎల్బీనగర్‌లో 38 మంది, శేరిలింగంపల్లిలో 33 మంది అభ్యర్థులు బరిలో మిగలడంతో అక్కడ సైతం 3 బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నారు. ఇబ్రహీంపట్నంలో 28 మంది, మహేశ్వరంలో 27 మంది, రాజేంద్రనగర్‌లో 25 మంది అభ్యర్థులు మిగలడంతో ఈ చోట్లలో రెండు బ్యాలెట్ యూనిట్లతో పోలింగ్ జరపనున్నారు.

'దీపావళి' బతుకమ్మ



హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామంలో దీపావళి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ దీపావళి బతుకమ్మ ఏంటా అనుకుంటున్నారా! గ్రామంలోని నేతకాని కులస్తులు దీపావళి తర్వాత బతుకమ్మ పండుగను నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. యువతులు, మహిళలు ఆటపాటలతో బతుకమ్మ ఆడి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

తెలుగు సాహితీ పురస్కారాలు ప్రదానం

నాంపల్లి (హైదరాబాద్): తెలుగు సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం–2021 సభ బుధవారం తెలుగు వర్సిటీలోని డాక్టర్ నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల పేరిట 10 మంది సాహిత్య ప్రముఖులకు నగదు పారితోషికంతో పాటుగా ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు అల్లం నారాయణ హాజరై ప్రసంగించారు. ప్రపంచానికి రచయితలు చాలా అవసరమని, సమాజంలోని మానవాళికి ధైర్యాన్ని, గమనాన్ని, గమ్యాన్ని నిర్దేశించే విధంగా రచయితలు తమ రచనలు చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ...ప్రతి ఏటా అందజేస్తున్న విశిష్ట, ప్రతిభ, కీర్తి పురస్కారాలకు భిన్నంగా సాహితీ పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

పురస్కార గ్రహీతలు వీరే....

శ్రీ గిరిజా కళ్యాణం (పద్యకవిత)	డాక్టర్ మాడుగుల అనిల్‌కుమార్
ఇన్‌బాక్స్(వచన కవిత)	తండ హరీశ్ గౌడ్
పాపిష్టి డబ్బు (బాల సాహిత్యం)	మాచిరాజు కామేశ్వరరావు
ఎడారిపూలు (కథ/కథానిక)	అల్లాడి శ్రీనివాస్
బహుళ(నవల)	అట్టాడ అప్పల్నాయుడు
తెలుగు నవల–ప్రయోగ వైవిధ్యం (సాహిత్య విమర్శ)	కె.పి.అశోక్ కుమార్
తురేబాజ్‌ఖాన్(నాటకం)	ఎస్.డి.వి.అజీజ్
లిప్తకాలపు స్వప్నం(అనువాదం)	స్వర్ణ కిలారి
కరోనా అలియాస్ లాక్‌డౌన్ 360(వచనం)	కోడం పవన్ కుమార్
గణిక (రచయిత్రి ఉత్తమ గ్రంథం)	విజయ భండారు

ప్రాణం తీసిన రోడ్డు పంచాయితీ

- మనస్తాపంతో మహిళ ఆత్మహత్య
- రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్దలో ఘటన



లక్ష్మమ్మ

షాద్‌నగర్ రూరల్: గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పంచాయితీ ఓ మహిళ ప్రాణం తీసింది. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని తొమ్మిదో వార్డులో వార్డు సభ్యుడు తబ్రేజ్ సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాడు. రోడ్డు వేసేందుకు స్థలం వదలాలని చెప్పడంతో వార్డు పరిధిలోని లక్ష్మమ్మ (54) కుటుంబ సభ్యులకు, వార్డు సభ్యుడికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ సిరిగిద్ద లలిత నచ్చజెప్పినా వార్డు సభ్యుడు వినిపించుకోలేదు. ఎవరొచ్చి చెప్పినా వినేది లేదని, సీసీ రోడ్డు వేసి తీరుతామని, ఏం చేస్తారో చేసుకోమని తెగేసి చెప్పాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన లక్ష్మమ్మ మంగళవారం రాత్రి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే లక్ష్మమ్మ మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. కాగా, మహిళ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న ఏసీపీ రంగస్వామి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి గ్రామాన్ని సందర్శించి మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. వార్డు సభ్యుడు తబ్రేజ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ దేవకి తెలిపారు.

అందరికీ మెరుగైన వైద్య సేవలందాలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

సాక్షి, హైదరాబాద్: కేన్సర్ వంటి మహమ్మారి రోగాలకు ఉత్తమమైన చికిత్సను అందించడంతో పాటు ఈ రోగాలపైన అవగాహన కల్పించడానికి డాక్టర్లు వారాంతాల్లో గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించాల్సిన అవసరం ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. డాక్టర్లు చెప్పే మాటలను ప్రజలు విశ్వసిస్తారని, సామాజిక మార్పులో డాక్టర్లు–యాక్టర్లది కీలక పాత్రని ఆయన చెప్పారు. నగరంలోని హోటల్ దస్పల్లా వేదికగా ప్రముఖ రోబోటిక్ కేన్సర్ సర్జన్ డాక్టర్ చినబాబు సుంకవల్లి రచించిన 'లివ్ ఫర్ ఎ లెగసీ' పుస్తకాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేన్సర్ ప్రాణాంతక వ్యాధి కాదని, ముందుగానే గుర్తిస్తే నివారించవచ్చన్నారు. వయసులో తనకన్నా పెద్దదైన సహోదరి రొమ్ము కేన్సర్ బారిన పడిందని, సరైన సమయంలో చికిత్స తీసుకున్నందున కేన్సర్‌ను జయించిందని గుర్తు చేసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అన్ని వర్గాల వారికి అందాలనేది డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయమని వెంకయ్యనాయుడు గుర్తు చేశారు. కార్పొరేట్ వైద్యం కూడా అందరికీ అనువైన ధరల్లో లభించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కార్పొరేట్ ఆస్పత్రుల బ్రాంచ్‌లు ప్రారంభించాలన్నారు. ఈతరం యువత రోజువారీ వ్యాయామం, యోగాపైన, సమతుల ఆహారం తీసుకోవడంపైన దృష్టి సారించాలన్నారు. ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఇప్పటికీ తాను సిబ్బందితో కలిసి బ్యాడ్మింటన్ ఆడతానని పేర్కొన్నారు. డాక్టర్ చినబాబు వంటి ఇతర వైద్యులు కూడా తమ అనుభవాలతో మంచి పుస్తకాలను రచించాలని సూచించారు. దేశంలో కేన్సర్‌ను జయించడానికి, సమూలంగా నిర్మూలించడానికి మనమందరం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరముందని డాక్టర్ చినబాబు తెలిపారు.

Andhra Pradesh State FiberNet Limited | APSFL

Proposals are invited from interested LCOs/MSOs for Empanelment of Cable operators for providing services through APSFL Network. Details of the RfPs and corrigenda may be downloaded from APSFL website https://apsfl.in/notifications.php
DIPR RO.No.2480 PP/CL/ADV T/1/1/2021-22 Dt.15/11/2023

ANDHRA PRADESH CENTRAL POWER DISTRIBUTION CORPORATION LIMITED
Dr.Y.S.R VIDYUT SOUDHA, CORPORATE OFFICE, ITI COLLEGE ROAD, VIJAYAWADA-520 008
Short Tender Notice No: CGM/PROJ/VJA/APTIDCO/SIP –14 to 17/2023-24
Bids through **apeprocurement.gov.in** are invited from eligible bidders for **"Electrification of 18 Nos layouts in erstwhile Districts of Krishna, Guntur & Prakasam in APCPDCL under APTIDCO under semi turnkey basis"** The Tender information will be made available in AP E-procurement Portal from **17.11.2023, 12:00 Hrs**, Last date for Bid submission online is **28.11.2023, 16:00 Hrs.**
Chief General Manager/ Projects
APCPDCL::VIJAYAWADA
E-mail: cgmproj.cpdcl@apcpdcl.in

PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY
Administrative Office: Rajendranagar, Hyderabad-30, Telangana State, India
NOTIFICATION FOR ADMISSION INTO PG and Ph.D COURSES UNDER ICAR 30% QUOTA FOR THE ACADEMIC YEAR-2023-24
Advt.No.4239-(1)/PG/2023 Date:15-11-2023
ONLINE applications are invited from eligible candidates for admission into PG and PhD courses under ICAR 30% quota for the academic year 2023-24 as approved by competent authority of ICAR. The online counselling brochure and other details are available on University website: **www.pjtsau.edu.in**
M. VENKATA RAMANA, REGISTRAR
DIPR RO No.B319-PP/CL/Advt/1/2023-24, Dt:15.11.2023

క్లుప్తంగా...

అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఓటర్లకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీకి ఓటు వేయాలని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. రెండు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచార పర్వం ముగుస్తున్న నేపథ్యంలో బుధవారం 'ఎక్స్'లో ఆయన ఈ మేరకు పోస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ వారసత్వ, ప్రతికూల రాజకీయాలతో జనం విసుగెత్తిపోయారని వెల్లడించారు. బీజేపీని గెలిపిస్తే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. జనం ఆకాంక్షలను నెరవేర్చడం తమ బాధ్యత అని వివరించారు. కాంగ్రెస్ ఇస్తున్న డొల్ల హామీలు నమ్మొద్దని, సుపరిపాలన అందించే బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. తమ పార్టీ పట్ల జనం అచంచల విశ్వాసం చూపుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ వల్లనే ప్రగతి సాధ్యమని వారు నమ్ముతున్నారని వివరించారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్ల కలిగే మేలు ఏమిటో మధ్యప్రదేశ్ ప్రజలు ఇప్పటికే గుర్తించారని తెలిపారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఛత్తీస్‌గఢ్ ప్రజలకు సూచించారు. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను తిరస్కరించి, బీజేపీని గెలిపిస్తారన్న నమ్మకం తనకు సంపూర్ణంగా ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ఆప్తమిత్రులకు గోల్డెన్ పాస్‌పోర్టా?: రాహుల్

న్యూఢిల్లీ: పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ అన్న వినోద్ అదానీ సహా 66 భారతీయులు సైప్రస్ వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం 'గోల్డెన్ పాస్‌పోర్ట్' మంజూరు చేసినట్లు వస్తున్న వార్తలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. 'అమృత్‌కాల్‌లో ఆప్తమిత్రులైన ఆ సోదరులిద్దరూ దేశం విడిచి ఎందుకు వెళ్లారు? గోల్డెన్ పాస్‌పోర్టు అంటే ప్రజాధనాన్ని దోచుకుని, డొల్ల కంపెనీలు పెట్టుకుని, విదేశాల్లో జల్సా చేసేందుకు బంగారంలాంటి అవకాశం'అని బుధవారం రాహుల్ గాంధీ 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు. రాహుల్ ఆరోపణలపై బీజేపీ దీటుగా స్పందించింది. సైప్రస్ ఇన్వెస్టిమెంట్ ప్రోగ్రామ్ లేదా గోల్డెన్ పాస్‌పోర్ట్ పథకాన్ని 2007లో కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందని గుర్తు చేసింది. పన్ను ఎగవేతదారులకు లాభించేలా సైప్రస్‌తో ఒప్పందం కూడా కుదుర్చుకుందని తెలిపింది. బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాక, ఈ విధానంపై నియంత్రణలు తీసుకువచ్చామని పేర్కొంది.

ఎన్నికల వేళ భారీగా సొత్తు సీజ్: సీబీడీటీ

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మిజోరంలలో లెక్కల్లో చూపించని నగదు భారీగా పట్టుబడుతున్నట్లు ఆదాయ పన్ను విభాగం సీబీడీటీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్)తెలిపింది. ఆయా రాష్ట్రాల్లో 2019లో జరిగిన లోక్‌సభ లేదా అసెంబ్లీ ఎన్నికల సమయంలో కంటే చాలా ఎక్కువగా ఉన్నట్లు సీబీడీటీ చైర్మన్ నితిన్ గుప్తా బుధవారం తెలిపారు. సోదా, నిఘా చర్యలను ఎన్నికల కమిషన్ సమన్వయంతో చేపడుతున్నామని వివరించారు. అసెంబ్లీ ఎన్నికలున్న రాజస్తాన్‌లో పట్టుబడిన అక్రమ నగదు, మద్యం, డ్రగ్స్, బంగారం, వెండి తదితరాల మొత్తం విలువ మూడింతలయిందన్నారు. 2021లో సీజ్ చేసిన మొత్తం సొత్తు విలువ రూ.322 కోట్లు కాగా, 2022లో అది రూ.322 కోట్లకు, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.1,021 కోట్లకు పెరిగిందని గుప్తా పేర్కొన్నారు.

రాజస్తాన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మృతి

జైపూర్: రాజస్తాన్‌లోని కరన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి అయిన గుర్మీత్ సింగ్ కూనార్(75) మృతి చెందారు. అనారోగ్యం పాలైన కూనార్‌ను ఈ నెల 12న ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన బుధవారం చనిపోయారని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. ఈ నెల 25న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కరన్‌పూర్‌లో ఆయన పోటీ చేస్తున్నారు. కూనార్ మృతితో కరన్‌పూర్ స్థానానికి ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల తేదీని తర్వాత ప్రకటిస్తామంది.

బైడెన్‌తో జిన్‌పింగ్ భేటీ

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో చైనా అధినేత షీ జిన్‌పింగ్ సమావేశానికి రంగం సిద్ధమైంది. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటిన ఈ భేటీ జరుగనుంది. ఇటీవలి కాలంలో అమెరికా–చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో ఇరువురు నాయకుల సమావేశం అవుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. సంబంధాలను పునరుద్ధరించుకొనే దిశగా వారిద్దరూ చర్చలు జరుపునున్నట్లు తెలుస్తోంది. ఆసియా–పసిఫిక్ ఆర్థిక సహకార మండలి(ఏపీఈసీ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు జిన్‌పింగ్ మంగళవారం అమెరికా చేరుకున్నారు. ఆయన అమెరికాకు రావడం ఆరేళ్ల తర్వాత ఇదే మొదటిసారి.

కర్ణాటక బీజేపీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయేంద్ర

బెంగళూరు: కర్ణాటక బీజేపీ అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన బీవై విజయేంద్ర బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ సీఎంలు బీఎస్ యడియూరప్ప, బస్వరాజ్ బొమ్మై, డీవీ సదానంద గౌడ, పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యారు. మాజీ సీఎం యడియూరప్ప కుమారుడే విజయేంద్ర.

రణరంగం అల్–షిఫా

గాజా ఆసుపత్రిలోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ సైన్యం

అణువణువూ సోదాలు • నిర్బంధంలోకి అనుమానితులు



బుధవారం గాజాలోని అల్–షిఫా ఆస్పత్రిలోకి దూసుకొస్తున్న సాయుధ ఇజ్రాయెల్ సైనికులు

ఖాన్ యూనిస్: గాజాలో నెల రోజులకుపైగా హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం సాగిస్తున్న యుద్ధం కీలక దశకు చేరుకుంది. గాజాలో అతిపెద్దదైన అల్–షిఫా ఆసుపత్రిలోకి బుధవారం ఉదయం ఇజ్రాయెల్ సేనలు ప్రవేశించాయి. హమాస్ కమాండ్ సెంటర్ ఇక్కడే భూగర్భంలో ఉందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఆసుపత్రి కింది భాగంలో సొరంగాల్లో హమాస్ నాయకులు మాటు వేశారని చెబుతోంది. మిలిటెంట్లపై కచ్చితమైన, లక్షిత ఆపరేషన్ ప్రారంభించామని ప్రకటించింది. అల్–షిఫా హాస్పిటల్ ఇప్పుడు రణభూమిగా మారిపోయింది. ఇజ్రాయెల్ సైనికులు ప్రతి గదినీ అణువణువూ గాలిస్తున్నారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్నంగా ప్రశ్నిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. అన్ని డిపార్టుమెంట్లలో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు, సైనిక వాహనాలు సైతం అల్–షిఫా ఆసుపత్రి ప్రాంగణంలో మోహరించాయి. అల్–షిఫా హాస్పిటల్‌లో ఇజ్రాయెల్ సైనికులు దారుణంగా ప్రవర్తిస్తున్నారని ప్రత్యక్ష సాక్షులు, ఆసుపత్రి సిబ్బంది చెప్పారు. పురుషులను నగ్నంగా మార్చి, కళ్లకు గంతలు కట్టి నిర్బంధిస్తున్నారని తెలిపారు. తరచుగా తుపాకీ మోతలు వినిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ వార్డుల్లో 180కి పైగా మృతదేహాలు పడి ఉన్నాయని, బయటకు తరలించేవారు లేక కుళ్లిపోతున్నాయని పేర్కొన్నారు. ఇక్కడ పరిస్థితి భయానకంగా ఉందన్నారు. 16 నుంచి 40 ఏళ్ల లోపు పురుషులంతా ఆసుపత్రి గదుల నుంచి బయటకు వెళ్లాలని, బయట అందరూ ఒకేచోటుకు చేరుకోవాలని లౌడ్‌స్పీకర్‌లో అరబిక్ భాషలో ఇజ్రాయెల్ సైనికులు హెచ్చరికలు జారీ చేశారని ఓ ప్రత్యక్ష సాక్షి చెప్పారు. పురుషులను బట్టలు విప్పించి ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. 200 మందిని దూరంగా తీసుకెళ్లారని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని మొత్తం ఇజ్రాయెల్ సైనికులు అదుపులోకి తీసుకున్నారని, ఇతర భవనాలతో కాంటాక్ట్ లేకుండాపోయిందని ప్రధాన భవనంలోని డాక్టర్లు చెప్పారు.

ఇజ్రాయెల్ వాదనకు అమెరికా మద్దతు

అల్–షిఫా హాస్పిటల్ కింద సొరంగాల్లో హమాస్ కమాండ్ సెంటర్ ఉందన్న ఇజ్రాయెల్ వాదనకు అమెరికా మద్దతు పలికింది. కమాండ్ సెంటర్‌ను తమ నిఘా వర్గాలు గుర్తించాయని వెల్లడించింది. అయితే, ఇజ్రాయెల్, అమెరికా ప్రకటనలను హమాస్ తీవ్రంగా ఖండించింది.

ఐరాస సెక్రెటరీ జనరల్ ఆందోళన

అల్–షిఫా ఆసుపత్రిలో ఇజ్రాయెల్ సేనల తనిఖీలను ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటేరస్ ఖండించారు. ఇజ్రాయెల్ చర్య ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు బుధవారం కూడా కొనసాగాయి. ఈ దాడుల్లో కనీసం 14 మంది మరణించినట్లు తెలిసింది.

అల్–షిఫా ఎందుకంత ముఖ్యం?

అల్–షిఫా అంటే స్వస్థత కేంద్రం అని అర్థం. గాజాలోనే అతిపెద్దదైన ఈ ఆసుపత్రిని 1946లో అప్పటి బ్రిటిష్ పాలనలో విశాలమైన ప్రాంగణంలో నిర్మించారు. దీన్ని గాజా గుండెచప్పుడు, ఆరోగ్య ప్రదాయినిగా పరిగణిస్తుంటారు. వైద్య సేవల విషయంలో ఇదొ వెన్నుముక లాంటిది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణలు తలెత్తినప్పుడల్లా అల్–షిఫా హాస్పిటల్‌పై దాడులు జరగడం పరిపాటిగా మారింది. 2008–2009లోనూ ఒక్కడ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. 2014లో జరిగిన ఇజ్రాయెల్–హమాస్ యుద్ధ సమయంలో అల్–షిఫా హాస్పిటల్‌లో 9 రోజులపాటు వైద్య సేవలు నిలిచిపోయాయి. హమాస్ మిలిటెంట్లు ఈ ఆసుపత్రిని ప్రధాన స్థావరంగా మార్చుకున్నారని ఇజ్రాయెల్ గత కొన్ని దశాబ్దాలుగా ఆరోపిస్తోంది.

సెకన్‌కు 150 సినిమాలు

చైనాలో ప్రపంచంలోనే అత్యంత వేగవంత నెట్‌వర్క్ ఆవిష్కరణ

బీజింగ్: ప్రపంచంలోనే అతి వేగవంతమైన ఇంటర్నెట్ నెట్‌వర్క్‌కు చైనా వేదికగా నిలిచింది. ఈ నెట్‌వర్క్‌లో 150 అత్యంత నాణ్యమైన చిత్రాలను ఒకేఒక్క సెకన్‌లో ట్రాన్స్‌మిట్ చేసేయొచ్చు. ఈ నెట్‌వర్క్‌లో సెకనుకు 1.2 టెరాబైట్స్ వేగంతో డేటా ట్రాన్స్‌మిట్ అవుతుంది. కొత్త నెట్‌వర్క్ ఏర్పాటు వివరాలను సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న ప్రధాన ఇంటర్నెట్ రూట్స్ కంటే కూడా ఈ అధునాతన నెట్‌వర్క్ ఏకంగా 10 రెట్లు వేగంగా డేటా బదిలీ పనులను పూర్తిచేయగలదని పేర్కొంది. టిసింగ్‌హువా విశ్వవిద్యాలయం, చైనా మొబైల్, హువాయీ, సెర్నెట్.కామ్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధిచేశాయి. ప్రత్యేకమైన ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల సాయంతో ఈ నెట్‌వర్క్‌ను మూడువేల కి.మీ.ల మేర ఏర్పాటు చేశారు. బీజింగ్, వూహాన్, గ్వాంగ్జూ నగరాలను కలుపుతూ ఏర్పాటుచేశారు. ప్రస్తుతం అంతటా వినియోగంలో ఉన్న ప్రధాన నెట్‌వర్క్‌లు సెకన్‌కు 100 గిగాబైట్ల డేటాను ట్రాన్స్‌మిట్ చేస్తున్నాయి. అయితే నూతన నెట్‌వర్క్ సెకన్‌కు 1.2 టెరా బైట్ల వేగంతో డేటాను బదిలీ చేయగలదు. అమెరికాలో ఇటీవల ప్రారంభించిన ఐదో తరం ఇంటర్నెట్–2లో అత్యధికంగా సెకన్‌కు 400 గిగాబైట్ల వేగంతో డేటా ట్రాన్స్‌మిట్ అవుతోంది. చైనా ఎడ్యుకేషన్, రీసెర్చ్ నెట్‌వర్క్, చైనా ఫ్యూచర్ ఇంటర్నెట్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(ఎఫ్ఐటీఐ)లో భాగంగానే ఈ ప్రాజెక్టును మొదలెట్టారు. దీనిని జూలైలో యాక్టివేట్ చేయగా నవంబర్ 13వ తేదీన లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెట్‌వర్క్ అన్ని రకాల పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ''150 హైడెఫినేషన్ చిత్రాలకు సమానమైన డేటాను కేవలం ఒక్క సెకన్‌లో ఈ నెట్‌వర్క్ సాయంతో బదిలీచేయవచ్చు'' అని హువావే టెక్నాలజీస్ వైస్ ప్రెసిడెంట్ వాంగ్ వివరించారు. ''ఈ సూపర్ ఫాస్ట్ లైన్ కేవలం వాణిజ్య కార్యకలాపాలకే కాదు భవిష్యత్తులో మరింత వేగవంతమైన ఇంటర్నెట్ సేవల కల్పనకు ఎంతగానో దోహదపడుతుంది'' అని చైనీస్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఎఫ్ఐటీఐ ప్రాజెక్ట్ లీడర్ వూ జియాంగ్‌పింగ్ చెప్పారు.

దర్భంగా ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు



న్యూఢిల్లీ: న్యూఢిల్లీ–దర్భంగా స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగాయి. బుధవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో యూపీలోని ఇటావా సమీపంలో జరిగిన ఈ ఘటనతో ఒక బోగీ పూర్తిగా, మరో రెండు బోగీలు పాక్షికంగా కాలిపోగా, నాలుగో కోచ్‌లో దట్టమైన పొగ వ్యాపించింది. ఎనిమిది మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు కాగా, ఆయా బోగీల్లో ప్రయాణికులు తమ వస్తువులను కోల్పోయారని అధికారులు తెలిపారు. ప్రమాదం బారిన పడిన నాలుగు బోగీలను వదిలేసి రైలు రాత్రి 8.18 గంటల సమయంలో ఇటావా నుంచి కాన్పూర్‌కు బయలుదేరిందన్నారు.

రోదసీలో టూల్‌బ్యాగ్ చక్కర్లు

న్యూయార్క్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) బయటివైపు మరమ్మతుల కోసం తీసుకెళ్లిన టూల్‌బ్యాగ్ ఒకటి కనిపించకుండా పోయింది. అది ఎక్కడ పడిపోయిందా అని అంతటా వెతికితే అది అంతరిక్షంలో చక్కర్లు కొడుతోందని తేలింది. అది తిరుగుతూ తిరుగుతూ ఎక్కడ మళ్లీ అంతరిక్ష కేంద్రాన్నే ఢీకొడుతుందనే భయం మధ్యే అసలు విషయాన్ని బయటిపెట్టింది అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ(నాసా). నవంబర్ ఒకటో తేదీన జరిగిన ఈ ఘటనను తాజాగా బహిర్గతంచేసింది.

అసలేం జరిగిందంటే?

ఆరోజు వ్యోమగాములు మేజర్ జాస్మిన్ మోగ్‌బెలీ, లోరల్ ఓహారాలు ఐఎస్ఎస్ బయటివైపు ఉన్న హ్యాండ్లింగ్ బార్ ఫిక్చర్, బేరింగ్‌లను తొలగించి కొత్తవి అమర్చేందుకు స్పేస్‌వాక్ చేశారు. బయటే వారు ఆరు గంటల 42 నిమిషాలసేపు గడిపారు. తర్వాత స్పేస్‌స్టేషన్‌లోకొచ్చి మిగతా పనుల్లో పడిపోయారు. ''వెంట తీసుకెళ్లిన వస్తువుల జాబితాను సరిచూసుకోగా ఈ బ్యాగ్ మిస్సయింది. టూల్ బ్యాగ్ దొరకలేదు. స్పేస్‌వాక్ చేసిన ప్రతిసారీ ఆ బ్యాగ్‌తో పనిపడదు. అందుకే దానిని తిరిగి వెంట తేవడం వాళ్లు మర్చిపోయారు. అంతరిక్షంలో ఆ బ్యాగ్ పథమార్గాన్ని బట్టిచూస్తే అది ఒకవేళ అంతరిక్ష కేంద్రాన్ని ఢీకొన్నా ఐఎస్ఎస్‌కు పెద్దగా ముప్పు వాటిల్లకపోవచ్చు'' అని నాసా ఒక ప్రకటనలో పేర్కొంది. అంతరిక్షంలో చక్కర్లు కొడుతూ ఒక వెలుగులా కనిపించే టూల్‌బ్యాగ్ జాడను ఎర్త్‌స్కై అనే వెబ్‌సైట్ కనిపెట్టింది. ' టూల్‌బ్యాగ్ భూమికి ఏకంగా 400 కిలోమీటర్ల ఎత్తులో తిరుగుతోంది. మేఘాలు లేకుండా ఆకాశం స్వచ్ఛంగా, నిర్మలంగా ఉన్నపుడు బైనాక్యులర్ సాయంతో నేరుగా మనం దానిని చూడొచ్చు. ఐఎస్ఎస్ చుట్టుపక్కల చక్కర్లు కొడుతూ కనబడుతుంది. అయితే ఇది అలా కొన్ని నెలలపాటు తిరిగాక సవ్యమైన మార్గాన్ని కోల్పోయి విచ్ఛిన్నమవుతుంది'' అని వెబ్‌సైట్ విశ్లేషించింది. ఆ టూల్‌బ్యాగ్‌లో ఏమేం వస్తువులు ఉన్నాయనే వివరాలను నాసా బహిర్గతంచేయలేదు. టూల్‌బ్యాగ్‌లాగా పాత కృత్రిమ ఉపగ్రహాల సూక్ష్మ శకలాలు వేలాదిగా అంతరిక్షంలో తిరుగుతూ నూతన శాటిలైట్లకు ముప్పుగా పరిణమించాయని యురోపియన్ స్పేస్ ఏజెన్సీ సెప్టెంబర్ నెలలో ఆందోళన వ్యక్తంచేసింది. ఇలాంటి 35,000 శిథిలాల ముక్కలు అక్కడి పాత శాటిలైట్ల కక్ష్యల్లో తిరుగుతున్నాయి.

గిరిజనుల రుణం తీర్చుకుంటా..

- జార్ఖండ్‌లో 'జన జాతీయ గౌరవ్ దివస్'లో ప్రధాని మోదీ ఉద్ఘాటన
- పౌరులపై వివక్షను తొలగించినప్పుడే అసలైన ప్రజాస్వామ్యం
- అర్హులందరికీ పథకాలు అందినప్పుడే సామాజిక న్యాయం జరిగినట్లు
- 'పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్' ప్రారంభం
- రూ.24 వేల కోట్లతో గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు



ఉలీహతులో బిర్సా ముండా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ

కుంతీ: సమాజంలో అణగారిన వర్గమైన గిరిజనులకు న్యాయం చేకూర్చడానికి తమ ప్రభుత్వం 'మిషన్ మోడ్'లో పని చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. గిరిపుత్రులకు తాను రుణపడి ఉన్నానని, ఆ రుణ తీర్చుకుంటానని తెలిపారు. గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా జార్ఖండ్‌లోని కుంతీ జిల్లాలో బుధవారం నిర్వహించిన 'జన జాతీయ గౌరవ్ దివస్'లో మోదీ పాల్గొన్నారు. బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని గిరిజనుల సంక్షేమం కోసం రూ.24,000 వేల కోట్లతో అమలు చేసే 'పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్'ను ప్రారంభించారు. పలు ఇతర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కుంతీలోని ఫుట్‌బాల్ మైదానంలో బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. దేశ అభివృద్ధికి మహిళలు, రైతులు, యువత, మధ్య తరగతి–పేదలు అనే నాలుగు వర్గాలను బలోపేతం చేయడం చాలా కీలకమని ఉద్ఘాటించారు. బిర్సా ముండా జన్మించిన గడ్డకు గిరిజనుల రుణం తీర్చుకోవడానికి వచ్చానని అన్నారు. పౌరులపై అన్ని రకాల వివక్షను తొలగించినప్పుడే అసలైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని చెప్పారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందినప్పుడే సామాజిక న్యాయం జరిగినట్లు భావించాలని స్పష్టం చేశారు.

ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నా..

అడవులు, మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధికి దూరంగా నివసిస్తున్న గిరిజనుల కోసం 'పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్'ను ప్రారంభించినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ పథకం కింద ఆయా ప్రాంతాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు వివరించారు. రోడ్లు, టెలికాం వ్యవస్థ, విద్యుత్, గృహనిర్మాణం, సురక్షిత తాగు నీరు, పారిశుధ్య వసతులు, విద్యా, వైద్యం, జీవనోపాధి పథకాలు ఏర్పాటు చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా 22,000 గ్రామాల్లో అభివృద్ధికి దూరంగా నివసిస్తున్న 75 గిరిజన జాతులను ప్రభుత్వం గుర్తించిందని పేర్కొన్నారు. గిరిపుత్రుల బాగు కోసం గత ప్రభుత్వాలు చేసిందేమీ లేదని విమర్శించారు. వారి అభివృద్ధే ధ్యేయంగా 'పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్'ను ప్రారంభిస్తున్నామని అన్నారు. ఈ పథకం కింద రూ.24,000 కోట్లు ఖర్చు చేయబోతున్నామని ప్రకటించారు.

బిర్సా ముండాకు నివాళులు..

కుంతీ జిల్లాలోని ఉలీహతులో ప్రముఖ గిరిజన స్వాతంత్య్ర సమరయోధుడు బిర్సా ముండా జన్మస్థలాన్ని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం సందర్శించారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. బిర్సా ముండా జన్మించి నేలపై మట్టిని తీసుకొని మోదీ తిలకంగా ధరించారు. ఆయన పోరాటాలు, త్యాగాలను స్మరించుకున్నారు. ఉలీహతులో స్థానికులు మోదీకి సాదర స్వాగ తం పలికారు. ఈ సందర్భంగా సంప్రదాయ సంగీతానికి అనుగుణంగా గిరిజనులతో కలిసి మోదీ నృత్యం చేశారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం

కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి ఉద్దేశించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల కింద లబ్ధి పొందనివారికి ఆయా పథకాల గురించి ఈ యాత్ర ద్వారా వివరిస్తారు. దేశవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వచ్చే ఏడాది జనవరి 25 వరకూ ఈ యాత్ర కొనసాగుతుంది.

పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి 15 విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 8 కోట్ల మందికిపైగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.18,000 కోట్ల నిధులను ఆన్‌లైన్ ద్వారా జమ చేశారు. ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో పీఎం–కిసాన్ సమ్మాన్ నిధిని ప్రధాని మోదీ విడుదల చేయడంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

కురు వృద్ధ కమ్యూనిస్ట్ నేత ఎన్.శంకరయ్య కన్నుమూత



న్యూఢిల్లీ: కురు వృద్ధ కమ్యూనిస్ట్ నేత, స్వాతంత్య్ర సమర యోధుడు ఎన్.శంకరయ్య కన్నుమూశారు. 101 ఏళ్ల వయస్సున్న ఆయన కొంతకాలంగా వయోసంబంధ రుగ్మతలతో బాధపడుతున్నారు. చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. 1922 జూలై 15న జన్మించిన శంకరయ్య విద్యార్థి దశలోనే స్వాతంత్య్ర సమరంలోకి దూకారు. తమిళనాడులోని మదురై అమెరికన్ కాలేజీలో విద్యార్థిగా ఉన్న శంకరయ్య డిగ్రీ ఫైలియర్ పరీక్షలకు కొద్దిరోజుల ముందే అరెస్టయ్యారు. స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్న శంకరయ్య మొత్తమ్మీద ఎనిమిదేళ్లపాటు జైలు జీవితం గడిపారు. 1940లో కమ్యూనిస్ట్ పార్టీలో చేరిన ఆయన..అవిభాజ్య తమిళనాడులో పార్టీలో పలు కీలక బాధ్యతలు చేపట్టారు. సీపీఐని వీడి, సీపీఎంను ఏర్పాటు చేసిన 32 మంది జాతీయ కౌన్సిల్ సభ్యుల్లో శంకరయ్య ఒకరు. తమిళనాడు సీపీఎం కార్యదర్శిగా 1995– 2002 మధ్య కాలంలో పనిచేశారు. 1967, 1977, 1980ల్లో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రైతు ఉద్యమాల నాయకత్వం వహించారు. సీపీఎం రైతు విభాగం ఆల్ ఇండియా కిసాన్ సభకు ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగాను బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్.శంకరయ్య మృతి పట్ల సీపీఎం పొలిట్ బ్యూరో సంతాపం ప్రకటించింది.

కశ్మీర్‌లో ఘోర ప్రమాదం

- బస్సు లోయలో పడి.. 38 మంది మృత్యువాత
- మరో 20 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలు
- దోడా జిల్లాలో ఘటన
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మోదీ

దోడా: జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. బస్సు అదుపు తప్పి లోయలోకి పడిపోవడంతో అందులోని 38 మంది ప్రయాణికులు దుర్మరణం పాలయ్యారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. కిష్త్వార్ నుంచి బుధవారం ఉదయం 58 మంది ప్రయాణికులతో జమ్మూకు బయలుదేరిన బస్సు బటోటె–కిష్త్వార్ జాతీయ రహదారిపై అస్సార్ సమీపంలో రోడ్డు పక్కనున్న 300 అడుగుల లోతైన లోయలో పడిపోయింది. ప్రమాద తీవ్రతకు ప్రయాణికుల మృతదేహాలు కొన్ని ఛిద్రమయ్యాయి. బస్సు నామరూపాలు లేకుండా నుజ్జయింది. బస్సులో కొన్ని మృతదేహాలు ఇరుక్కుపోయాయి. బస్ భాగాలను కోసి, మృతదేహాలను బయటకు తీయాల్సి వచ్చింది. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. ఘటనాస్థలిలో రక్షణ, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని మృతదేహాలను వెలికి తీసి, సంబంధీకులకు అప్పగించారు. క్షతగాత్రుల్లో నలుగురిని హెలికాప్టర్‌లో జమ్మూలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. బస్సులో పరిమితికి మించి ప్రయాణికులున్నారని, యూటర్న్ తీసుకునేటప్పుడు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో పల్టీ కొట్టి రెయిలింగ్ మీదుగా లోయలోకి పడిపోయినట్లు అధికారులు భావిస్తున్నారు. ఘోర ప్రమాదంపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున అందజేస్తామని ప్రధాని 'ఎక్స్'లో ప్రకటించారు. అయితే, రోడ్డు సరిగ్గా లేకనే బస్సు ప్రమాదం జరిగిందని స్థానికులు అన్నారు. రోడ్డు మరమ్మతుల కోసమంటూ తామంతా కలిసి రూ.6 లక్షలు పోగేసి ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. గతంలోనూ ఈ మార్గంలో కనీసం 10 ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు.

నెమ్మదించిన రెస్క్యూ ఆపరేషన్

- శిథిలాలు పడటంతో సహాయక చర్యలకు ఆటంకం
- ఆగర్ మెషీన్‌తో ముందుకు సాగని పనులు
- డ్రిల్లింగ్ వేగవంతానికి మరో భారీ యంత్రం

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని ఛార్‌ధామ్ మార్గంలో సొరంగం కుప్పకూలి నాలుగు రోజులుగా లోపల చిక్కుబడిపోయిన 40 మంది కార్మికులను రక్షించే పనులను అధికారులు వేగవంతం చేశారు. ఇందుకోసం మరో భారీ యంత్రాన్ని తెప్పించారు. మూడు విడిభాగాలుగా యుద్ధవిమానాల్లో తరలించిన ఈ యంత్రాన్ని అసెంబుల్ చేసి, మరికొద్ది గంటల్లో డ్రిల్లింగ్ ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. కుప్పకూలిన టన్నెల్ శిథిలాల గుండా ఆగర్ మెషీన్ సాయంతో వెడల్పాటి స్టీల్ పైపులను లోపలికి పంపే పనులు అధికారులు మంగళవారం ప్రారంభించిన విషయం తెలిసిందే. 800, 900 మిల్లీమీటర్ల వ్యాసమున్న స్టీలు పైపులను ఒకదాని తర్వాత ఒకటి లోపలికి పంపించి వాటి గుండా కార్మికులను వెలుపలికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అయితే, రాత్రి వేళ డ్రిల్లింగ్ పనులు జరుగుతున్న సమయంలో మరోసారి టన్నెల్ శిథిలాలు విరిగిపడటంతో ఇద్దరు సిబ్బంది గాయపడ్డారు. ఈ ఘటనతో పనులకు అంతరాయం ఏర్పడింది.

రంగంలోకి అమెరికన్ ఆగర్

అధికారులు హుటాహుటిన భారీ అమెరికన్ ఆగర్ డ్రిల్లింగ్ మిషన్ భాగాలను భారత వాయుసేన విమానాల ద్వారా 30 కిలోమీటర్ల దగ్గర్లోని చిన్యాలిసార్‌కు తెప్పించారు. అక్కడి నుంచి ఘటనాస్థలికి రోడ్డు మార్గంలో తీసుకువస్తున్నామని ఎస్పీ అర్పణ్ తెలిపారు. వీటిని అసెంబ్లింగ్ చేసి, పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సొరంగం లోపల చిక్కుకున్న వారిని కాపాడేందుకు థాయ్‌లాండ్, నార్వే నిపుణుల సలహాలను తీసుకుంటున్నట్లు నేషనల్ హైవేస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్(ఎన్‌హెచ్ఐడి) డైరెక్టర్ అన్షు మాలిక్ తెలిపారు. 2018లో థాయ్‌లాండ్‌లోని ఓ గుహలో చిక్కుకుపోయిన ఫుట్‌బాల్ జట్టు జూనియర్ ఆటగాళ్లను అక్కడి సంస్థ నిపుణులు వారం పాటు శ్రమించి సురక్షితంగా తీసుకువచ్చిన విషయం తెలిసిందే.



భారత వాయుసేన విమానంలో డ్రిల్లింగ్ యంత్రాన్ని తీసుకొస్తున్న దృశ్యం

జంగ్ తెలంగాణ



లీడర్‌కు కేడర్'

వారిని కాపాడుకోవడమే అసలు టాస్క్

- నామినేషన్లు ముగిసినా కొనసాగుతున్న వలసలు
- స్థానిక సంస్థల ప్రతినిధులకు భారీగా గిరాకీ
- క్షేత్రస్థాయిలో పరిస్థితిని చక్కదిద్దుకునేందుకు తంటాలు
- మండలాల వారీగా ఇన్‌చార్జ్‌ల పేరిట సొంత సైన్యం
- పోలింగ్ బూత్‌ల వారీగా మద్యం, నగదు డంప్
- బంధువులు, స్నేహితులకు పోల్ మేనేజ్‌మెంట్ బాధ్యతలు

కల్వల మల్లికార్జున్ రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల హడావుడి మొదలైన నాటి నుంచి రాజకీయ వలసలు అన్ని పార్టీల్లోనూ నిత్యకృత్యంగా మారాయి. దిగ్గజ నేతలు మొదలుకొని క్షేత్రస్థాయి కార్యకర్త వరకు పార్టీని వీడటం అన్ని పార్టీల్లోనూ రివాజుగా మారింది. టికెట్ల కేటాయింపుపర్వం అన్ని రాజకీయ పక్షాల్లోనూ ప్రకంపనలు సృష్టించగా, భంగపడిన ఆశావహులు సొంత పార్టీని వీడి ప్రత్యర్థి పార్టీలోకి చేరిపోయారు. తమ టికెట్ ఎగురేసుకు వెళ్లిన అభ్యర్థులను ఓడిస్తామంటూ శపథం చేస్తూ ఎదుటి పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఇక టికెట్ దక్కించుకున్న నేతలు ఎదుటి శిబిరాలపై కన్నేసి క్షేత్రస్థాయి కేడర్‌ను లాక్కునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా తాయిలాలు ఎర వేస్తూ తమవైపు లాక్కునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఇక మరోవైపు ఉన్న సొంతకేడర్‌ను కాపాడుకునేందుకూ తంటాలు పడుతున్నారు. స్థానికంగా జనంలో కాస్త పలుకుబడి ఉన్న నేతలకు సైతం పార్టీ మారాల్సిందిగా వివిధ పక్షాల నుంచి ఒత్తిడి వస్తుండటంతో ఎటూ తేల్చుకోలేని కిందిస్థాయి నేతలు కొందరు ఫోన్లు బంద్ పెట్టుకొని అందుబాటులో లేకుండా పోతున్న సందర్భాలు కూడా ఉంటున్నాయి.

స్థానిక సంస్థల ప్రతినిధులకు గిరాకీ...

ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థిపై పైచేయి సాధించేందుకు క్షేత్రస్థాయి కేడర్ చేరికలపై అన్ని పార్టీలు దృష్టి కేంద్రీకరించాయి. వలసలను ప్రోత్సహించే క్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన వార్డు మెంబర్లు మొదలు ఉప సర్పంచ్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్లు, చైర్మన్లు, స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధులకు గిరాకీ ఏర్పడింది. పార్టీ నిర్ణయానికి కంకణబద్ధులైన స్థానిక సంస్థల ప్రతినిధులు కొందరు ఎమ్మెల్యే అభ్యర్థులతో తమకు ఉన్న అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకుని పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నారు. మరికొందరు స్థానిక సంస్థల ప్రతినిధులు మాత్రం సొంత పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులతోనూ బేరసారాలు సాగిస్తున్నారు. వలసలను అరికట్టే క్రమంలో పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే అభ్యర్థులు ఇప్పటికే అడ్వాన్సు రూపంలో కొంత మేర చెల్లింపులు పూర్తి చేశారు. అయినా సంతృప్తి చెందని కొందరు క్షేత్ర స్థాయి నేతలు, కేడర్ ఎదుటి పార్టీ అభ్యర్థులతో మంతనాలు జరుపుతుండటం సొంత పార్టీ అభ్యర్థులకు తలనొప్పులు తెచ్చి పెడుతోంది. కొందరు కిందిస్థాయి నాయకులు అడ్వాన్సులు పుచ్చుకుని కూడా పార్టీలు మారుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో కొత్త కేడర్ కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ప్రచారం, పోల్ మేనేజ్‌మెంట్‌లో కింది స్థాయిలో వీరిదే ప్రధాన పాత్ర కావడంతో తమకు విధేయతతో పనిచేసే కేడర్ కోసం నేతలు వెతుకులాట ముమ్మరం చేస్తున్నారు.

సొంత సైన్యం మోహరింపు

క్షేత్రస్థాయిలో కేడర్ పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఎమ్మెల్యే అభ్యర్థులు తమ సొంత సైన్యాన్ని మండలాల వారీగా మోహరింపజేశారు. ఓవైపు పార్టీ నేతలకు మండలాలు, కీలక గ్రామాల వారీగా బాధ్యతలు అప్పగిస్తూనే తమ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు పర్యవేక్షణ బాధ్యత అప్పగిస్తున్నారు. బీఆర్‌ఎస్ లాంటి పార్టీలు కీలక నియోజకవర్గాల్లో ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులను ఇన్‌చార్జ్‌లుగా నియమించాయి. వారు తమ అనుచరగణంతో కేటాయించిన మండలాల్లో మకాం వేసి కేడర్ సమన్వయం, ప్రచారం, పోల్ మేనేజ్‌మెంట్ తదితరాల్లో అభ్యర్థులకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. పోల్ మేనేజ్‌మెంట్‌లో అత్యంత కీలకమైన డబ్బు, మద్యం పంపిణీ బాధ్యతలను అభ్యర్థులు తమ సొంత సైన్యానికే అప్పగిస్తున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో తమకు నమ్మకస్తులైన వారి ఇళ్లు, ఇతర ప్రదేశాల్లో మద్యం డంప్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నగదు తరలింపులో ఉన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే కీలక స్థావరాలకు చేర్చినట్లు సమాచారం. అయితే కొన్ని చోట్ల పార్టీ ఇన్‌చార్జ్‌లు, అభ్యర్థుల నడుమ కూడా సమన్వయ లోపం తలెత్తుతోంది.

ఎంత 'ఓటు' ప్రేమయో..!

గాసిప్ టైమ్

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే. ఈ విషయం పోటీ చేసే రాజకీయ నాయకులకు బాగా తెలుసు. ఎన్నికలకు ముందు వరకు ఎవరూ గుర్తు లేనట్టు నటించే నేతలకు.. ఇప్పుడు అవసరార్థం ప్రతీ వ్యక్తి గుర్తొస్తున్నారు. గుంపులో గోవింద మాదిరిగా కాకుండా కనిపించిన ప్రతి వ్యక్తిని ఓటు అడుగుతున్నారు. వ్యక్తులే కాదు.. ఇప్పుడు కుల సంఘాలు, యువజన సంఘాలంటే వల్లమాలిన అభిమానం కురిపిస్తున్నారు. వాళ్ల దగ్గరకు చేరుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక మహిళా సంఘాలైతే మరీను.. రాజకీయ నేతలు ఉదయం అంతా ప్రచారంలో బిజీగా ఉన్నట్లు కనిపిస్తున్నా.. రాత్రి వేళల్లో లేదా తమకు ముఖ్య అనుచరులకు ఈ బాధ్యతను అప్పగిస్తున్నారట. వలస ఓటర్లపైనా ప్రత్యేక దృష్టి పెట్టారట. ఏకంగా వలస ఓటర్ల కోసం స్థానిక నేతలతో వాకబు చేస్తూ.. వారిని పోలింగ్ రప్పించేందుకు పడరాని పాట్లు పడుతున్నారట.

రాజకీయ అవగాహన ఉండాలి.. ఓటేయాలి

భాగస్వామి పట్ల మహిళల అభిప్రాయం
డేటింగ్ యాప్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాజకీయాల పట్ల ఆధునికులు నిర్లిప్తంగా ఉంటారనే అభిప్రాయం తప్పని ఓ అధ్యయనం నిరూపించింది. తమ భాగస్వామి తప్పనిసరిగా రాజకీయ–సామాజిక అవగాహన కలిగి ఉండాలని ఆధునికులు, ముఖ్యంగా మహిళలు భావిస్తున్నారు. అంతేకాదు వారు తప్పకుండా ఓటు వేయాలని కూడా ఆశిస్తున్నారు. మహిళలకు సంబంధించిన తొలి డేటింగ్ యాప్ బంబుల్ తాజాగా విడుదల చేసిన వార్షిక డేటింగ్ ట్రెండ్స్ 2024 నివేదికలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. 25వేల మందికి పైగా పాల్గొన్న ఈ అధ్యయనంలో రాజకీయాలు, సామాజిక అంశాలపై సాధారణ అవగాహనకు భిన్నమైన ఆలోచనలు వెల్లడి కావ డం విశేషం. అధ్యయనంలో పాల్గొన్న ప్రతీ నలుగురిలో ఒకరు తమ భాగస్వామి రాజకీయాలు, సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనాలని కోరుకుంటున్నారు. ఇది తమ భాగస్వామిని మరింత ఆకర్షణీయంగా మారుస్తుందని భావిస్తున్నారు. అదీగాక, 41% మంది తమ భాగస్వామి ఓటు వేయడం కూడా తమకు ముఖ్యమన్నారు. తమకు భిన్నమైన రాజకీయ దృక్కోణాలు ఉన్న వారి దగ్గర మహిళలు తక్కువ ఓపెన్‌గా ఉంటారని కూడా అధ్యయనం వెల్లడించింది. డేటింగ్ చేస్తున్న ప్రతీ ముగ్గురిలో ఒకరు (33%) సామాజిక సమస్యలపై నిరాసక్తతతో ఉంటే భాగస్వామికి దూరం జరుగుతున్నారు. భాగస్వామితో కలిసి ఉండాలని కోరుకునేందుకు మానవ హక్కుల సమస్యలు ముఖ్య కారణమని 64% మంది, భాగస్వామికి విలువల పట్ల మక్కువ ఉండాలని 38% మంది మహిళలు చెప్పారు.

కోతులు పడితేనే.. ఓట్లేస్తాం



ఫ్లెక్సీ పెట్టి వినూత్న నిరసన

కురవి: 'మా గ్రామంలో కోతుల బెడద లేకుండా చేస్తేనే ఓట్లు వేస్తాం' అని మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం తాళ్లసంకీస గ్రామస్తులు ఊళ్లో బుధవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. 'ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు తాళ్లసంకీస గ్రామప్రజల మనవి ఏమనగా.. మా గ్రామంలో పంట పొలాలను కోతులు నాశనం చేస్తున్నవి. కావున కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపే అభ్యర్థులకే మేము, మా గ్రామం మొత్తం ఓట్లు వేయగలము' అని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఏ మేరకు స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

గల్ఫ్ గళం వినిపించాలని..

ఫార్వర్డ్ బ్లాక్ బీఫాం ద్వారా ఐదుగురు..
మరొకరు స్వతంత్ర అభ్యర్థిగా

మోర్తాడ్(బాల్కొండ): అసెంబ్లీ వేదికగా గల్ఫ్ గళం వినిపించేందుకు ఈ ఎన్నికలే తమకు రాచమార్గం అని గల్ఫ్ జేఏసీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. గల్ఫ్ ప్రవాసుల కోటాలో ప్రధాన రాజకీయ పార్టీల టికెట్లు కోరగా, ఏ పార్టీ కూడా తమకు మద్దతు ఇవ్వలేదని, అందుకే ప్రత్యామ్నాయ మార్గం ఎంపిక చేసుకున్నామని జేఏసీ ప్రతినిధులు వెల్లడించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున ఐదుగురు, మరొకరు స్వతంత్రంగా ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆరు నియోజకవర్గాల్లో నామినేషన్లు దాఖలు చేశారు.

కోరుట్ల	చెన్నమనేని శ్రీనివాస్‌రావు, జేఏసీ కీలకనేత
వేములవాడ	గుగ్గిల్ల రవిగౌడ్, జేఏసీ చైర్మన్
నిర్మల్	స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసిమిత్ర కార్మిక సంఘం అధ్యక్షుడు
ధర్మపురి	బూత్కూరి కాంత, గల్ఫ్ జేఏసీ కార్యదర్శి
ఆర్మూర్	బూస రాకేశ్ యాదవ్, గల్ఫ్ నేత
సిరిసిల్ల	కృష్ణ దొనికెన, జేఏసీ నేత (స్వతంత్ర అభ్యర్థిగా)

గన్స్ & కార్స్

సాక్షి, హైదరాబాద్: సొంతకారు కూడా లేని సీఎం కేసీఆర్, మంత్రులు మల్లారెడ్డి, సబిత, ఎమ్మెల్యేదానం నాగేందర్ వంటి వారు ఒకవైపు... లగ్జరీ కార్లు, అత్యాధునిక ఆయుధాలున్న హరీశ్‌రావు, రేవంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అక్బరుద్దీన్, శ్రీలతారెడ్డి వంటి అభ్యర్థులు మరోవైపు. ఆత్మరక్షణ కోసమో, ఫ్యాషనో, వారసత్వమో కారణమేదైనా పలువురు రాజకీయ నాయకుల వద్ద అత్యాధునిక ఆయుధాలున్నాయి. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌కు .22 పిస్టల్ వారసత్వంగా రాగా.. యాకుత్‌పుర బరిలో ఉన్న జాఫర్ అమెరికా కంపెనీ నుంచి తుపాకులు కొనుగోలు చేశారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి అజారుద్దీన్ ల్యాండ్ రోవర్ డిస్కవరీ స్పోర్ట్స్ కారులో చక్కర్లు కొడుతుండగా.. హుజూర్‌నగర్ బరిలో ఉన్న శ్రీలతారెడ్డికి 1.38 కోట్ల ఖరీదైన ఐదు లగ్జరీ కార్లున్నాయి. ఆదిలాబాద్ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి టెక్సాస్ నుంచి టెస్లా, ల్యాండ్ రోవర్ కార్లు దిగుమతి చేసుకున్నారు. వీరంతా ఆయా వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్లలో పొందుపరిచారు.

విదేశాల నుంచి గన్స్ దిగుమతి..

యాకుత్‌పుర నుంచి పోటీ చేస్తున్న జాఫర్ హుస్సేన్‌మిరాజ్ అమెరికాకు చెందిన ప్రముఖ ఆయుధాల తయారీ సంస్థ స్మిత్, వెస్సన్ బ్రాండ్ తుపాకులు కొనుగోలు చేశారు. రూ.2 లక్షలు ఖరీదైన 32 బోర్ రివాల్వర్, .32 పిస్టల్ రాప్టర్ ఈయన వద్ద ఉన్నాయి. రూ.19.50 లక్షల విలువైన ఆడి క్యూ3 కార్ కూడా ఉంది. మలక్‌పేట అభ్యర్థి అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల వద్ద రూ.లక్ష విలువ చేసే పిస్టల్, రూ.50 వేలు విలువైన 12 బోర్ గన్‌లు ఉన్నాయి. బలాలకు రూ.26.69 లక్షలు ఖరీదైన ఇన్నోవా, అర్బన్ క్రూయిజర్ వాహనాలున్నాయి. బలాలకు షహనాజ్ సుల్తానా, తాహేరా ఫర్హా, సనా సుమేరా ముగ్గురు భార్యలు ఉన్నారు. వీరి పేర్ల మీద రూ.59 లక్షలు విలువ చేసే హోండా బీఆర్‌వీ, టొయోటా ఫార్చ్యూనర్ కార్లున్నాయి.

హరీశ్ వర్సెస్ రేవంత్..

రాజకీయ క్షేత్రంలోనే కాదు ఆయుధాల విషయంలోనూ హరీశ్‌రావు, రేవంత్‌రెడ్డి పోటీ పడుతున్నారు. ఆర్థిక మంత్రి తన్నీరు హరీశరావుకు రూ.1.30 లక్షలు విలువ చేసే .32 ఎన్‌పీ బోర్ పిస్టల్ ఉండగా.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వద్ద రూ.2 లక్షలు విలువ చేసే పిస్టల్, రూ.50 వేలు విలువైన రైఫిల్ ఉన్నాయి. రేవంత్ పేరు మీద సెకండ్ హ్యాండ్ మెర్సిడెస్ బెంజ్‌తో పాటు హోండా సిటీ కార్లు కూడా ఉన్నాయి.

మన నేతల వద్ద విదేశీ వాహనాలు, తుపాకులు

- అక్బరుద్దీన్‌కు వారసత్వంగా వచ్చిన .22 పిస్టల్
- వేట కోసం స్ప్రింగ్‌ఫీల్డ్ రైఫిల్, 12 బోర్ డీబీబీఎల్ గన్ కూడా
- హరీశ్‌రావు వద్ద .32 ఎన్‌పీ బోర్ రివాల్వర్
- శ్రీనివాస్‌గౌడ్ వద్ద ఎస్‌బీబీఎల్ గన్
- పిస్టల్, రైఫిల్స్ రేవంత్‌రెడ్డి సొంతం
- డిస్కవరీ స్పోర్ట్స్ కారులో చక్కర్లు కొట్టే అజార్

ఎస్‌బీబీఎల్ పంప్ యాక్షన్ గన్

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వద్ద రూ.లక్ష విలువ చేసే రివాల్వర్, రూ.60 వేలు విలువ చేసే 12 బోర్ సింగిల్ బ్యారెల్ బ్రీచ్ లోడింగ్ (ఎస్‌బీబీఎల్) పంప్ యాక్షన్ గన్ ఉంది. ఆయన భార్య శారద పేరు మీద వోల్వో ఎక్స్‌సీ 90 కారు ఉంది. 2017లో కొనుగోలు చేసిన ఈ కారు విలువ రూ.71.82 లక్షలు. ఉప్పల్ అభ్యర్థి లక్ష్మారెడ్డి వద్ద రూ.1.50 లక్షలు విలువ చేసే రివాల్వర్‌తోపాటు రూ.70.82 లక్షల ఖరీదైన బీఎండబ్ల్యూ 530డీ స్పోర్ట్ లగ్జరీ కారు, రూ.34.92 లక్షల ఖరీదైన ఫార్చ్యూనర్ ఉన్నాయి.

సలావుద్దీన్ ఒవైసీ నుంచి..

గతంలో హత్యాయత్నం నుంచి త్రుటిలో తప్పించుకున్న ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ వద్ద వారసత్వంగా వచ్చిన ఆయుధాలు, కార్లున్నాయి. ప్రధానంగా కుటుంబ సెంటిమెంట్‌గా భావించే .22 పిస్టల్ ఉంది. దీని విలువ రూ.20 వేలు. దీంతో పాటు వేట కోసం వినియోగించే 30–06 స్ప్రింగ్ ఫీల్డ్ రైఫిల్ ఉంది. దీన్ని 1996లో రూ.20 వేలతో కొనుగోలు చేశారు. 2016లో రూ.11,450తో కొనుగోలు చేసిన 12 బోర్ డబుల్ బ్యారెల్ బ్రీచ్ లోడింగ్ (డీబీబీఎల్) గన్ కూడా ఉంది. తండ్రి సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ నుంచి బహుమతిగా వచ్చిన జీపు కారు కూడా ఉంది. దీంతో పాటు 2007లో జిప్సీ కారు, 2005లో రూ.2 లక్షలతో కొనుగోలు చేసిన డ్యుకాటీ 900 ఎస్‌ఎస్ మోటార్ సైకిల్స్ కూడా అక్బరుద్దీన్ పేరు మీద ఉన్నాయి. ఈయన భార్య సాబీనా ఫర్జానా పేరు మీద మహీంద్రా స్కార్పియో వీఎల్‌ఎక్స్ వాహనం ఉంది. దీని విలువ రూ.12.95 లక్షలు.

స్పోర్ట్స్ కారులో అజార్, టెస్లాలో శ్రీలత

మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ వద్ద రూ.71.89 లక్షలు ఖరీదైన ల్యాండ్ రోవర్ డిస్కవరీ స్పోర్ట్స్, రూ.28 లక్షలు విలువైన హోండా సీఆర్‌–వీ కార్లున్నాయి. హుజూర్‌నగర్ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి, ఆమె కుటుంబ సభ్యులకు రూ.1.38 కోట్ల విలువ చేసే ఐదు లగ్జరీ కార్లున్నాయి. రూ.62.63 లక్షల విలువ చేసే టెస్లా కారుతో సహా రూ.29.15 లక్షల హ్యుందాయ్ టక్సన్, రూ.36 లక్షల ఖరీదైన ఇన్నోవా క్రిస్టా, వెంటోతో పాటు రూ.11 లక్షల విలువైన మారుతీ బాలెనో కార్లున్నాయి. ఆదిలాబాద్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి వద్ద 2021 మోడల్ టెస్లా కారు ఉంది. దీని విలువ రూ.51.75 లక్షలు. రూ.18.16 లక్షల విలువైన 2016 మోడల్ ల్యాండ్ రోవర్ వాహనం కూడా ఉంది. వీటిని అమెరికా నుంచి దిగుమతి చేసుకున్నారు.



సాక్షి

సాక్షి, హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంపై రాజకీయ పార్టీలు స్పందించాలని ఎన్‌జీఓ 'నారి' నిర్వాహకులు అంజు అరోరా, దివ్య రాజేశ్వరి కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు తగిన పారిశుధ్య సదుపాయాలు కల్పించాలంటూ ఆన్‌లైన్ పిటిషన్ల ఉద్యమం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే..

స్కూళ్లలో కనీస సౌకర్యాలపై రాజకీయ పార్టీలు మాట్లాడాలి

- బాలికలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు
- పార్టీలు స్పందించి మేనిఫెస్టోల్లో పెట్టాలి
- ఎన్‌జీఓ 'నారి' డిమాండ్... ఆన్‌లైన్‌లో పిటిషన్ల ఉద్యమం


అంజు అరోరా


దివ్య రాజేశ్వరి

ఆడపిల్లలకు కనీస సౌకర్యాల లేమి

'బహిష్టు సమయంలో, ఆడపిల్లలకు అవసరమైన మౌలిక వసతులు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. టాయిలెట్లలో పనిచేయని ఫ్లష్‌లు, నీటి కొరత, ఉపయోగించిన ప్యాడ్‌లను పారవేసే సౌకర్యాలు లేకపోవడంతో పాఠశాలలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. దీంతో బాలికలు ప్రతి నెలా పాఠశాలలు మానేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

తెలంగాణలోనే తక్కువ...

గత ఏడాది రాజ్యసభలో సమర్పించిన ఒక నివేదిక ప్రకారం దేశంలోనే తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే అతి తక్కువ మరుగుదొడ్లు ఉన్నాయని వెల్లడించింది. మహిళలకు అవసరమైన పబ్లిక్ టాయిలెట్లు, నీటి సౌకర్యం లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ ఏడాది జూలైలో తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కానీ ఇప్పటికీ పాఠశాలల్లో పరిస్థితి అలాగే ఉంది. 30,023 పాఠశాలల్లో, 2,124 పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవు. తద్వారా పారిశుద్ధ్య సౌకర్యాలు లేని పాఠశాలలు అత్యధికంగా ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే ఇప్పటికీ 150 పాఠశాలలకు సరైన మరుగుదొడ్లు లేవు.

చెప్పాలి...చేయాలి

ప్రభుత్వం ఇటీవల 'మన ఊరు- మన బడి' వంటి కొన్ని కార్యక్రమాలు చేపట్టినా, పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుబాటులోకి రాలేదు. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల తరుణంలో రాజకీయ నాయకులు తమ మేనిఫెస్టోల్లో ఈ అంశానికి ప్రాధాన్యం కల్పించాలి. పాఠశాలల్లో ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన దిశగా వాగ్దానాలు, ఎజెండాలు ఉండాలి.

ఓట్.. ఆల్‌ఔట్..

సరికొండ చలపతి
సారాంశం

ముందుగా నాయకుల హామీలపై.. రెండు మాటలు సరదాగా..

అసలే చలికాలం.. ఆపై ఎన్నికలు.. ఇంకేం గొర్రెల నాయకుడు దండోరా వేయించాడు. మా పాలనలో అన్ని గొర్రెలకు ఉచితంగా కోటు పంపిణీ చేస్తానని. అన్ని గొర్రెలు ఖుషీగా పండుగ చేసుకున్నాయి. ఇలాంటి నాయకుడు దొరకడం తమ అదృష్టమని పాలాభిషేకాలూ గత్రాలూ చేశాయి. అందులో కాసింత అమాయకంగా, అప్పుడప్పుడే లోకాన్ని చూస్తున్న గొర్రెకు రాకూడని డౌట్ వచ్చింది..అడగకూడని ప్రశ్న ఆ నాయకుడిని అడిగింది. 'మేం ఇంతమందిమి ఉన్నాం కదా.. అందరికీ అంత ఉన్ని ఎక్కడనుంచి తెస్తారూ '.. అని. '' ఇంకెక్కడనుంచి గొర్రెల నుంచే తీస్తాం కదా..'' నాయకుడి సమాధానం.

....

మగదోమ - నీకోసం సింహాన్ని వేటాడి తేనా డియర్

ఆడదోమ - వద్దులే ముందు పడుకో

మగదోమ - పోనీ ఐరావతాన్ని కుట్టి నీకు బ్లడ్ బాత్ చేయించనా

ఆడదోమ- వద్దు..వద్దు ముందు నిద్రపో, నాకూ నిద్ర వస్తోంది

మగదోమ - పోనీ ఇంకా ఏదైనా....

ఆడదోమ- అసలే ఓట్ల టైమ్.. రాజకీయ నాయకులను కుట్టి వచ్చావా ఏంటి... నోరుమూసుకుని పడుకోకపోతే ఆల్ ఔట్ పెట్టి బయటకు పోతా..

ఇదో సైకాలజీ..

ఇలాంటి జోకులు, కథలు ఎన్నికల టైమ్‌లో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంటాయి. ఇదంతా రాజకీయ నాయకులపై. ఎన్నికలపై, పోలింగ్‌పై వారి అభిప్రాయాన్ని ప్రతిఫలిస్తుంటాయి. చాలామంది ఓటర్లు ఎన్నికల పట్ల నిరాసక్తంగా, పోలింగ్‌కు దూరంగా ఉంటుంటారు. వీలుంటే పోలింగ్ తేదీని హాలిడేగా కూడా పరిగణిస్తుంటారు. పొలిటీషియన్లపై , ఎన్నికలపై మంచి అభిప్రాయం క్రమక్రమంగా కనుమరుగవుతోందని పై జోకులు చెబుతూనే ఉంటాయి. ఇలాంటి కథల వెనుక, ఓటు పట్ల నిరాసక్తత వెనుక సైకాలజీ కూడా ఉందట..అమెరికాలోని స్టోనీ బ్రూక్, మిన్నెసోటా యూనివర్సిటీల పొలిటికల్ సైన్స్-ఎలక్షన్ సైకాలజీ ప్రొఫెసర్లు అధ్యయనం చేసి ఇలా చెబుతున్నారు..

నిరాసక్త జీవులు..

- జీవితంలో కష్టానష్టాలు ఎదుర్కొని ప్రభుత్వం నుంచి, ప్రజాప్రతినిధుల నుంచి సాయం దక్కనివారు ఓటేసేందుకు విముఖతతో ఉంటారు. తమకు లాభం లేదనుకున్నప్పుడు ఎన్నికల్లో ఎవరు గెలిస్తే ఏమిటన్న అభిప్రాయం వారిది.
- తోటివారిని పెద్దగా నమ్మనివారు, ప్రభుత్వ అధికారులు అవినీతికి పాల్పడతారనే అభిప్రాయంతో ఉన్నవారు కూడా ఓటింగ్‌కు దూరంగా ఉంటారట.
- పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ నచ్చకపోవడంతోనూ ఓటు వేయకుండా ఉండేవారూ ఎక్కువే. తమకు నచ్చిన అభ్యర్థి ఉన్నప్పుడే ఓటు వేయాలనిపిస్తుందని కొందరు ఓటర్లు ఓ సర్వేలో వెల్లడించారు.
- అభ్యర్థుల్లో ఎవరూ మంచివారు లేరని.. చెడ్డవారిలో ఎక్కువ, తక్కువ అంటూ ఎవరూ ఉండరనే అభిప్రాయంతో ఓటేయడం లేదని చెప్పినవారూ ఎందరో.
- కొందరైతే నిత్యం రాజకీయ వార్తలను చూస్తుంటారు. పార్టీలు, అభ్యర్థులపై చర్చలూ చేస్తారు. కానీ ఎన్నికల వ్యవస్థ రిగ్గింగ్‌కు గురైందనే, ఎవరు గెలుస్తారో ముందే తెలిపోయినట్టేననే భావనతో ఓటు వేయరు.
- గెలిచినవారు హామీలు నిలబెట్టుకోకపోవడం, డబ్బులున్నవారే గెలుస్తుండటం వంటివి కూడా జనం ఓటింగ్‌పై అనాసక్తికి కారణాలు
- 'రాజకీయాలతో, నేతలతో మనకేం పని, నా పనేదో నాకుంది..' అనుకునేవారు ఓటేసేందుకు వెళ్లరు. ముఖ్యంగా యువతలో ఇలాంటి భావన కనిపిస్తుందని.. కెరీర్, చదువు, ఇతర వ్యాపకాల్లో మునిగి ఉండటంతో వారు నిత్యవార్తలకు, రాజకీయాలకు దూరంగా ఉంటుండటమే దీనికి కారణమని అధ్యయనం పేర్కొంది.

రాజకీయ జీవులు..

రాజకీయాలపై ఆసక్తి ఉన్నవారు, రాజకీయాలు-ఎన్నికలు తమ నిత్యజీవితంపై ప్రభావం చూపుతాయన్న అవగాహన ఉన్నవారు కచ్చితంగా ఓటు వేస్తారని.. కొత్త అంశాలు, సంగతులపై ఆసక్తి ఉండేవారు ఓటు వేసే అవకాశాలు ఎక్కువని, దీనికి భిన్నంగా ఉండేవారు దూరంగా ఉంటారని తేల్చింది.

నిస్వార్థజీవులు..

ఎప్పుడో అరుదుగా తప్ప మామూలుగా అయితే ఒక ఓటు పడకపోతే, లేక అటూ ఇటూ అయితే వచ్చే తేడా ఏమీ ఉండదనే భావనలో కొందరు ఉండగా, గంటల తరబడి క్యూలో నిలుచుని మరీ ఓటు వేసేవారు కొందరు. మనుషుల్లో ఉండే నిస్వార్థమైన తత్వమే ఇలా ఓటు వేయడానికి కారణమని న్యూయార్క్ యూనివర్సిటీ సైకాలజీ శాస్త్రవేత్తలు చెప్తున్నారు.



భారతీయుల బాధ..

- మేం ప్రభుత్వంపై, పథకాలపై ఆధారపడటం లేదనే భావనతో ఎగువ మధ్యతరగతి, ధనిక వర్గాలు ఓటు వేయడానికి దూరంగా ఉంటున్నాయి. తమకు ఏమైనా అవసరమైతే డబ్బుతోనో, పలుకుబడితోనో చేసుకోగలమనేది వారి భావన.
- సొంత ప్రాంతాలను వదిలి వలస వెళ్లినవారు.. కొత్త ప్రాంతాల్లో నేతలు, అభ్యర్థులపై ఆసక్తి లేకుండా ఉండటం, వారాంతాల్లో పోలింగ్ వల్ల ఓటేయడం కంటే వినోదంపై దృష్టిపెట్టడం వల్ల కూడా ఓటింగ్ శాతం తగ్గుతోంది.
- భూస్వాములో, నేర చరిత్ర ఉన్నవారో, రాజకీయాలు తెలియని ప్రముఖులో ఎన్నికల బరిలోకి దిగినచోట మధ్యతరగతి, యువత వారి పట్ల ఏహ్యాభావంతో ఓటేయడం లేదు. వేరేవారికి వేసినా గెలవరని భావిస్తున్నారు.
- రోతగా మారిన రాజకీయాలకు, నేతల అవినీతికి నిరసన అంటూ కొందరు ఓటు వేయకుండా ఉంటున్నారు.
- ఓటు ప్రాధాన్యత చాటి చెప్తూ సెలబ్రిటీలతో ఎన్నికల సంఘం చేస్తున్న ప్రచారం పెద్దగా ఫలితం ఇవ్వడం లేదని.. యువత పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా చేయడం లేదని పరిశీలకులు చెప్తున్నారు.

అమెరికాలోనూ అంతే..

పెద్ద ప్రజాస్వామ్య దేశం అమెరికాలో జనం ఓటేయడంలో బద్ధకస్తులే. అక్కడ పేదలు, యువత, విదేశాల నుంచి వచ్చి స్థిరపడినవారు పెద్దగా ఓటేసేందుకు ముందుకు రావడం లేదని అధ్యయనాల్లో తేలింది.

తెలంగాణ 'కరెంటా'భరణం.. కేసీఆర్!



సినీ సంగీత ప్రపంచంలో శంకరాభరణం శంకరశాస్త్రి ఎంతటి మహనీయుడో..ఉద్యమ ప్రపంచంలో అంతటి గౌరవనీయుడు కేసీఆర్. సంగీత సాధనలో శంకరశాస్త్రి గొప్ప అయితే..తెలంగాణ సాధనలో కేసీఆర్ గొప్ప. తెలంగాణలో 24 గంటలు నిర్విరామ కరెంట్ అనేది నిర్వివాదంగా చెప్పుకోవాల్సిన విషయం.

కేసీఆర్ ఎప్పుడూ తన పల్లె పలుకుబడులూ, ప్రజా నానుడులూ, సామెతలతో విషయాన్ని విపులంగా మారుమూల పల్లె ముసలమ్మకైనా అర్థమయ్యేలా చెప్పగలడు. కానీ శంకరశాస్త్రి అభిమానుల్లాంటి శిష్ట క్లాసికల్ జనానికి అర్థమయ్యేలా చెప్పాలన్నది కొందరు బీఆర్‌ఎస్ కార్యకర్తల సంకల్పం. అందుకే 'కరెంట్' అనే కాన్సెప్టుతో కొన్ని సంగతులు అర్బన్ ఆడియెన్స్‌కు అర్థమయ్యేలా చెప్పాలని రాసుకున్న కొన్ని సీన్స్ ఇవి...

కేసీఆర్ హుందాగా తన గుర్తునూ..ప్రచార నినాదాన్ని ఇలా రూపొందించుకుంటాడు. ఆ సంగీత ప్రపంచపు పెద్దమనిషిలాగే..ఈయన నినాదగానం ఇలా ఉంటుంది...

''ఓ 'కారు' చిహ్నమ్ము
సంధానమా పార్టీయే..
బీఆర్‌ఎస్ పార్టీనే..మన బీఆర్‌ఎస్ పార్టీయే'' అంటూ క్లాసికల్ క్లాస్ ఆడియెన్స్‌క్కూడా నాటుకునేలా చెబుతాడు.

'కరెంటు మూడుగంటల పాటు చాలు'..అంటూ ఓ కాంగ్రెసు వ్యక్తి చేసిన వ్యాఖ్యానం కేసీఆర్‌ను ఎంతో బాధపెడుతుంది. అప్పుడాయన ఇలా ఉద్బోధ చేస్తాడు.

''చూడండి కాంగ్రెస్సు వారూ...

తొట్టిలో ఉన్న బుడుతడు తన హాయి నిద్ర కోసం 24 గంటల కరెంటడుగుతాడు.

పేషెంటయిన ఓ పెద్దాయన తన ఆక్సిజన్ కాన్సంట్రేటర్ కోసం ఇంకో రకంగా కరెంటడుగుతాడు.

చేనుకు నీళ్లు పెట్టాలనుకున్న బక్క రైతు రాత్రి పురుగూ, పుట్రా ముట్టకుండా పవిత్రమైన కరెంటును పట్టపగలే అడుగుతాడు.

కేంద్రంలోని కొందరు పెద్దలు కరెంటుకు మీటర్లు పెట్టాలంటారు.

ఇలా..ఒక్కొక్కరి కరెంటుకు ఒక్కొక్క నిర్దిష్టమైన పర్పసుంటుందీ..ప్రయోజనముంటుంది.

అందరికీ అవసరమైన ఈ కరెంటును మూడుగంటలు చాలంటూ

మిడిమిడిజ్ఞానంతో ముక్కలుగా విరిచేసి రాష్ట్రాన్ని అంధకారం చేయకు కాంగ్రెస్సూ!

తాదాత్మం చెందిన నీటిప్రవాహపు లోతుల్లోంచి పెల్లుబికిన పవిత్ర హైడల్ కరెంటులాంటి విద్యుత్ గురించి ఇలాంటి అపభ్రంశపు మాటలు మాట్లాడకు దాసూ!!'' అంటూ హితబోధ చేస్తాడు కేసీఆర్.

''సార్.. మీరు చెప్పినదంతా అర్థమైందిగానీ..'పవిత్రమైన కరెంటు' ఏమిటి సార్?'' అడిగాడో రాజకీయశిష్యుడు. అంతే..ఆయనలో మనసు మూలలనిండా నిండిపోయున్న పల్లెపదాల పదకోశ భండాగారాల్లోంచి... 'అటజనిగాంచె'నంటూ, 'కాటుక కంటినీరం'టూ..అప్పుడప్పుడు మాత్రమే వెలువడే పండితవాక్కులు మరోసారి వెలువడ్డాయి ఇలా...

''చూడండి కార్యకర్తలూ..'పృథ్వ్యాపస్తేజోవాయురాకాశః' అనే ఆ పవిత్ర పంచభూతాల్లో ఒకటైన నీటి నుంచీ..ఈ నీరు టర్బనాంతర్గత భ్రమణకల్లోల్లాల్లోంచి, ఆ జలజీవన స్రవంతిలోంచి..ఈ జనజీవన స్రవంతిలోకొచ్చే ఈ కరెంటు పవిత్రమైనది కాకుండా ఎలా ఉంటుంది నాయనా'' అంటూనే...

''ఈ కరెంటు సప్లైని ఓ కాపుగాయడానికి ఓట్లు అందించే ఓటరులందరికీ శత సహస్ర వందనాలు. ఇలాంటి ఓటరులంతా ఓటేసినంత కాలం ఈ కరెంటుధార సప్లై అసిధారావ్రతంలా ఇలా అనంతంగా సాగిపోతూనే ఉంటుంది'' అంటూ ఉండగానే...

''అయ్యో... మేమా వ్యాఖ్య చేయనేలేదు. ఇదంతా మీడియా వక్రీకరణ. మేమూ కట్టుబడి ఉన్నాం ఐదుగంటల కరెంటుకు'' అంటూ 'కరెంటు'షాక్‌కొట్టినట్లుగా గగ్గోలుపెడుతూ నష్టనివారణ చర్యలకు పూనుకున్నారు కాంగ్రెస్ వారు.

షుగర్ & పెప్పర్
..:: యాసీన్

అక్కడ తొలిసారి పోలింగ్ బూత్

జైపూర్: రాజస్తాన్‌లో ఈ నెల 25న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో షేర్‌గావ్ గ్రామ ఓటర్లు తొలిసారిగా తమ ఊళ్లోనే ఓటు హక్కు వినియోగించుకోనున్నారు! ఇది సిరోహి జిల్లా అబు-పింద్వారా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉంది. సముద్ర మట్టానికి 4,921 అడుగుల ఎత్తులో ఉండే ఈ ఊరు చేరాలంటే పోలింగ్ సిబ్బంది అనేకానేక విన్యాసాలు చేయాల్సిందే. అటవీ గార్డుల సాయంతో దట్టమైన అటవీ ప్రాంతం గుండా 18 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాలి. ఇంతా చేస్తే ఈ ఊళ్లో మొత్తం ఓటర్లు 117 మందే! ఓటేసేందుకు వీరు ఇప్పటిదాకా మరో మారుమూల గ్రామమైన ఉత్రాజ్‌కు వెళ్లేవారు. బార్మేర్ జిల్లాలో ఉన్న బర్మేర్ కా పార్ గ్రామంలోనూ ఈ దఫా తొలిసారి పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ఓటర్లు 35 మందే.





రైతులు, మహిళలకే పెద్దపీట

- బీజేపీ, కాంగ్రెస్ మేనిఫెస్టోల్లో వారికే ప్రాధాన్యం
- ఆసక్తికరంగా మధ్యప్రదేశ్ ఎన్నికల సమరం

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధాన ప్రత్యర్థులు బీజేపీ, కాంగ్రెస్ రెండూ రైతులు, మహిళలకే ప్రాధాన్యమిచ్చాయి. కాంగ్రెస్ అక్టోబర్ 17న, బీజేపీ తాజాగా 10వ తేదీన మేనిఫెస్టో విడుదల చేశాయి. రెండింట్లోనూ పలు అంశాలు ఒకేలా ఉండటం విశేషం...

రైతులకు ఇలా

బీజేపీ:
- మద్దతు ధరను క్వింటాలుకు గోధుమకు రూ.2, 700, వరికి రూ.3,100కు పెంచుతామని ప్రకటించింది.
- అంతేగాక ఒక్కో రైతుకు రూ.12,000 ఆర్థికసాయంకూడా అందిస్తామంది.

కాంగ్రెస్:
- గోధుమకు రూ.2,600, వరికి రూ.2,500 మద్దతు ధర ప్రకటించింది.
- పంట రుణాలు మాఫీ చేస్తామని పేర్కొంది.

మహిళలకు ఇలా...

బీజేపీ:
- మహిళా సాధికారతపై బాగా దృష్టి పెట్టింది. లాడ్లీ బెహనా యోజన కింద ప్రతి పేద మహిళకు నెలకు రూ.1,250 ఇస్తోంది.
- వారికి రూ.450కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించింది.
- పేద కుటుంబాల బాలికలకు పీజీ దాకా ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చింది.
- లాడ్లీ లక్ష్మి పథకం కింద ప్రయోజనాలను లక్షన్నర నుంచి 2 లక్షల రూపాయలకు పెంచుతామంది.

కాంగ్రెస్:
- నారీ శక్తి సమ్మాన్ పేరిట ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఇస్తామని ప్రకటించింది.
- రూ.500కు వంట గ్యాస్ అందిస్తామని పేర్కొంది.
- లాడ్లీ లక్ష్మి పథకానికి పోటీగా మేరీ బేటీ లాడ్లీ పథకం కింద రూ.2.51 లక్షల మేరకు అందేలా చూస్తామని ప్రకటించింది.

ఇంకెన్నో...

బీజేపీ:
- ప్రధాని మోదీ హామీల పేరిట మరో 10 ప్రధాన హామీలిచ్చింది.
- పేద కుటుంబాలకు ఉచిత రేషన్. సబ్సిడీ ధరలపై తృణధాన్యాలు, ఆవాలు, వంట నూనె, చక్కెర
- ఐఐటీల మాదిరిగానే ప్రతి డివిజన్లోనూ మధ్యప్రదేశ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల ఏర్పాటు.
- ఎయిమ్స్ మాదిరిగా డివిజన్‌కు ఒక మధ్యప్రదేశ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్.

అయితే వీటన్నింటినీ పచ్చి అబద్ధాలుగా కాంగ్రెస్ అభివర్ణించింది. కేవలం ఎన్నికల్లో గట్టెక్కేందుకు ఇస్తున్న మోసపూరిత వాగ్దానాలంటూ దుయ్యబట్టింది. గతంలో ఛత్తీస్‌గఢ్‌లో వరికి మద్దతు ధర పెంచుతామని చెప్పి మాట తప్పిన చరిత్ర బీజేపీదంటూ ఎద్దేవా చేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

మధ్యప్రదేశ్‌లో మురిసేదెవరో!


- 20 ఏళ్లుగా బీజేపీకి కంచుకోట
- ఒక్క 2018లో కాంగ్రెస్ పైచేయి
- ఈసారీ ఇరు పార్టీల హోరాహోరీ పోరు
- ముగిసిన ప్రచారం, నేడే పోలింగ్

మధ్యప్రదేశ్. బీజేపీకి కంచుకోట వంటి రాష్ట్రం. మధ్యలో ఓ 15 నెలలు మినహాయిస్తే గత 18 ఏళ్లుగా అక్కడ బీజేపీదే అధికారం. అదే ఈసారి కొంప ముంచవచ్చని ఆ పార్టీ భయపడుతోంది. అందుకే ముందుజాగ్రత్తగా సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదు. తద్వారా వ్యతిరేక ఓటు కాస్తయినా తగ్గుతుందన్నది బీజేపీ ఆశ. ఇక కాంగ్రెస్ గత 20 ఏళ్లలో బీజేపీ కంటే ఎక్కువ అసెంబ్లీ స్థానాలు సాధించింది 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనే. ఏకైక పెద్ద పార్టీగా అధికారం చేపట్టినా అది 15 నెలల ముచ్చటగానే మిగిలింది. ఈ నేపథ్యంలో ఈసారి ఎలాగైనా పూర్తి మెజారిటీతో అధికారాన్ని ఒడిసిపట్టాలని కాంగ్రెస్ గట్టిగా పోరాడుతోంది. బీజేపీ కూడా అధికారాన్ని నిలుపుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఆ క్రమంలో సీఎం శివరాజ్ అనేకానేక సంక్షేమ పథకాలు ప్రకటించారు. మరెన్నో హామీలు గుప్పించారు. ప్రచారంలో ఇరు పార్టీలూ హోరాహోరిగా తలపడ్డాయి. చివరికి ప్రచార పర్వం ముగిసింది. ఇక అందరి దృష్టీ శుక్రవారం జరగనున్న కీలక పోలింగ్‌పైనే నెలకొంది. ఈ నేపథ్యంలో గత మూడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను గమనిస్తే.

– సాక్షి, నేషనల్ డెస్క్


విశేషాలు...

మధ్యప్రదేశ్‌లో	
మొత్తం ఓటర్లు	5.5 కోట్లు
పురుష ఓటర్లు	2.88 కోట్లు
మహిళా ఓటర్లు	2.72 కోట్లు



2008


ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 143 అసెంబ్లీ స్థానాలతో అధికారాన్ని నిలబెట్టుకుంది. శివరాజ్ సింగ్ చౌహాన్ వరుసగా రెండోసారి సీఎం అయ్యారు. 2005లో తొలిసారి ముఖ్యమంత్రి అయిన ఆయన ఈ విజయంతో రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నాయకునిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. బీజేపీకి 37.64 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 32.39 శాతమే వచ్చాయి. ఆ పార్టీ 71 స్థానాల్లో నెగ్గింది. ఇక బీఎస్పీ 8.27 శాతం ఓట్లతో 7 స్థానాలు తన ఖాతాలో వేసుకుంది. మరోసారి ఓటమి పాలైనా, 2003 అసెంబ్లీ ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలు సాధించిన సంతృప్తి కాంగ్రెస్‌కు మిగిలింది. 2003లో ఆ పార్టీకి కేవలం 38 స్థానాలే రాగా బీజేపీ ఏకంగా 173 సీట్లు నెగ్గింది.




పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
బీజేపీ	143	9,493,641	37.6
కాంగ్రెస్	71	8,170,318	32.4
ఇతరులు	8	4,795,730	19.0
బీఎస్పీ	7	2,262,119	9.0
ఎస్పీ	1	501,324	2.0

2013

ఈసారి బీజేపీ ఏకంగా 44.88 శాతం ఓట్లు సాధించింది. కాంగ్రెస్ కేవలం 36.38 శాతానికి పరిమితమైంది. బీఎస్పీకి 6.29 శాతం వచ్చాయి. బీజేపీ 165 సీట్లతో సత్తా చాటగా కాంగ్రెస్ కేవలం 58 స్థానాలకు పరిమితమై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. శివరాజ్‌సింగ్ చౌహాన్ మూడోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. అయితే అంతటి బీజేపీ హవాలోనూ 30 మంది మంత్రుల్లో ఏకంగా ఏడుగురు ఓటమి చవిచూడటం విశేషం! బీఎస్పీ 4 అసెంబ్లీ స్థానాలు సాధించి ఉనికి చాటుకుంది. అనంతరం 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా మధ్యప్రదేశ్‌లో బీజేపీ హవాయే నడిచింది. 29 స్థానాలకు గాను బీజేపీ ఏకంగా 27 నెగ్గగా కాంగ్రెస్ రెండింటికి పరిమితమైంది.



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
బీజేపీ	165	15,191,335	44.9
కాంగ్రెస్	58	12,315,253	36.4
బీఎస్పీ	4	2,128,333	6.3
ఇతరులు	3	3,812,730	11.3
ఎస్పీ	0	404,853	1.2



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	114	15,595,696	40.9
బీజేపీ	109	15,643,623	41.0
ఇతరులు	4	4,490,542	11.8
బీఎస్పీ	2	1,911,642	5.0
ఎస్పీ	1	496,025	1.3

2018

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 114 స్థానాలతో అతి పెద్ద ఏకైక పార్టీగా నిలిచింది. బీజేపీకి 109 సీట్లొచ్చాయి. అయితే ఈ ఎన్నికల్లో ఒక గమ్మత్తు చోటుచేసుకుంది. కాంగ్రెస్‌కు 40.89 శాతం ఓట్లు రాగా బీజేపీకి అంతకంటే కాస్త ఎక్కువగా 41.02 శాతం వచ్చాయి! బీఎస్పీ 5.01 శాతం ఓట్లు సాధించింది. ఒక సమాజ్‌వాదీ ఎమ్మెల్యే, ఇద్దరు బీఎస్పీ, నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో 15 ఏళ్ల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కమల్‌నాథ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ దాదాపుగా క్లీన్‌స్వీప్ చేసింది. 29 స్థానాలకు గాను ఏకంగా 28 సీట్లు నెగ్గింది. కాంగ్రెస్ కేవలం ఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. అదే ఊపులో మరుసటి ఏడాదే కాంగ్రెస్‌కు బీజేపీ గట్టి షాకిచ్చింది. 2020 మార్చిలో ప్రపంచమంతా కరోనా లాక్‌డౌన్ గుప్పెట్లోకి వెళ్లేందుకు కాస్త ముందు ఏకంగా 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు! అసంతృప్త నేత జ్యోతిరాదిత్య సింధియా సారథ్యంలో వారంతా బీజేపీ గూటికి చేరారు. దాంతో కమల్‌నాథ్ సర్కారు 15 నెలల్లోపే కుప్పకూలింది. బీజేపీ అధికారంలోకి రావడం శివరాజ్‌సింగ్ చౌహాన్ మరోసారి సీఎం కావడం చకచకా జరిగిపోయాయి. అనంతరం జరిగిన ఉప ఎన్నికల ఫలితాల అనంతరం అసెంబ్లీలో బీజేపీ బలం 128కి పెరిగితే కాంగ్రెస్ బలం 98 మంది ఎమ్మెల్యేలకు పరిమితమైంది.

సాక్షి
కరీంనగర్

గురువారం । 16 । నవంబర్ । 2023



ఉనికి కోల్పోయిన కామ్రేడ్లు
పేదల పక్షాన సాయుధ పోరాటం చేసిన చరిత్ర కమ్యూనిస్టులది. గతంలో పలు సందర్భాల్లో అసెంబ్లీలో ఎర్రజెండా బలం చూపగా.. ప్రస్తుతం ఆ ప్రభావం కనిపించడం లేదు. 10లో▸



రూ.1.24 లక్షలు పట్టివేత
కరీంనగర్‌క్రైం: నగరంలోని తెలంగాణ చౌక్‌లో చేపట్టిన తనిఖీల్లో ఇల్లంతకుంట మండలం సో మారంపేటకు చెందిన వెంకటాచారి నుంచి రూ.1.24లక్షలు పోలీసులు సీజ్ చేశారు.

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై, జిల్లాలో కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

క్వింటాల్ పత్తి రూ.6,950



వేలం పాడుతున్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట పత్తి మార్కెట్లో బుధవారం క్వింటాల్ పత్తిధర రూ.6,950 పలికింది. మార్కెట్‌కు 65 వాహనాల్లో 635 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.6,700, కనిష్ట ధర రూ.6,000 పలికింది. గన్నీసంచుల్లో 30 మంది 60 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తెచ్చారు. గరిష్ట ధర రూ.6,500, మోడల్ ధర రూ.6,200, కనిష్ట ధర రూ.5,800కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. సీసీఐ ఆరుగురు రైతుల నుంచి 53.85 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,950, కనిష్ట ధర రూ.6,714 పలికింది.

ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా భద్రత



ఫ్లాగ్‌మార్చ్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ

కొత్తపల్లి(కరీంనగర్): ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాట్లు చేపడుతున్నట్లు కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు తెలిపారు. కొత్తపల్లిలో బుధవారం కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్‌ను జెండాఊపి ప్రారంభించారు. 70మంది పోలీసులతో కొత్తపల్లిలో మూడు కిలోమీటర్లు ఈ కవాతు కొనసాగింది. ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ఉల్లంఘించే వారికి కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు కేంద్ర సాయుధ బలగాలు జిల్లా అధికారులతో కలిసి పని చేస్తాయన్నారు. కరీంనగర్ రూరల్, చొప్పదండి ఇన్‌స్పెక్టర్లు ప్రదీప్, రవీందర్, కొత్తపల్లి ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీటీడీ ఆలయ నిర్మాణానికి టెండర్లు ఆమోదం

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని పద్మనగర్‌లో టీటీడీ నిర్మించనున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి టెండర్లు ఖరారు చేస్తూ టీటీడీ పాలక మండలి సభ్యులు ఆమోదం తెలిపారు. తిరుమలలో నిర్వహించిన పాలక మండలి సమావేశంలో టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి, దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. కరీంనగర్‌లో నిర్మించనున్న ఆలయం కోసం రూ.15.54 కోట్లతో టెండర్లు ఖరారు చేశారు. ఈ సందర్భంగా జిల్లావాసులు హర్షం చేశారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

విద్యానగర్(కరీంనగర్): నేతకాని కులస్తులు ఓటు బ్యాంకుగానే నిలిచిపోతున్నారని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం మారుతి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 15 లక్షల మంది వరకు ఉన్న నేతకాని కులస్తులు ఏళ్లుగా అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో వారికి ఎలాంటి ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మగౌరవ భవనం కోసం 5 ఎకరాల స్థలం కేటాయించాలని, భవన నిర్మాణానికి నిధులివ్వాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు గొల్లపల్లి కృష్ణ, గోదారి కొమురయ్య, బండారి లక్ష్మణ్, ఆంజనేయులు, మహేందర్, వెంకటేశ్, మధుసూదన్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

బరిలో 216 మంది

నామినేషన్ ఉపసంహరించుకున్న 57 మంది • అంతటా త్రిముఖం



- స్వతంత్రులు, చిన్న పార్టీలకు గుర్తుల కేటాయింపు
- తప్పుకున్న ఉమ, కటకం, నల్ల, నాగి

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నామినేషన్ల స్క్రూటినీ పూర్తయింది. 12 నియోజకవర్గాల్లో మొత్తం 216 మంది పోటీలో ఉండగా.. 57 మంది తమ నామినేషన్ ఉపసంహరించుకున్నారు. జాతీయ, స్థానిక పార్టీల నుంచి పలువురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లతోపాటు ఈసారి బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ లాంటి పార్టీల నుంచి బరిలో ఉండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రతీ నియోజకవర్గంలో కనీసం మూడు పార్టీలు బరిలో ఉన్నాయి. గతంలో బీజేపీకి సరైన అభ్యర్థులు దొరకని పరిస్థితి. ఈసారి మాత్రం దాదాపు అన్నిచోట్ల బలమైన కేండిడేట్లు ఉన్నారు. మూడు బలమైన పార్టీలు ఉండటంతో త్రిముఖ పోరు తప్పేలా లేదు. మరో వైపు ఆర్వోలు ఇండిపెండెంట్లు, చిన్న పార్టీలకు డ్రా సిస్టమ్ ద్వారా గుర్తులను కేటాయించారు. దీంతో స్వతంత్రులందరూ తమకు కేటాయించిన గుర్తుతో ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రధాన పార్టీలన్నీ అగ్రనేతలతో భారీ బహిరంగ సభలకు, కార్నర్ మీటింగులకు అనుమతులు తీసుకున్నాయి.

నియోజకవర్గాల వారీగా సమాచారం

నియోజకవర్గం	బరిలో	విత్‌డ్రా
కరీంనగర్	27	04
హుజూరాబాద్	22	11
చొప్పదండి	14	03
మానకొండూరు	10	03
సిరిసిల్ల	21	02
వేములవాడ	16	04
పెద్దపల్లి	17	08
మంథని	21	03
రామగుండం	23	03
జగిత్యాల	15	04
కోరుట్ల	15	05
ధర్మపురి	15	03
మొత్తం	216	57

తప్పుకున్న వారిలో బంధువులే అధికం

నామినేషన్ ఉపసంహరించుకున్న వారిలో అధికంగా ప్రధాన పార్టీలకు చెందిన డమ్మీ కేండిడేట్లు, అక్కడక్కడా అసంతృప్తులు ఉండటం గమనార్హం. స్వచ్ఛందంగా తప్పుకున్న వారిలో మంత్రి కమలాకర్ సతీమణి గంగుల రజిత, ఆది శ్రీనివాస్ భార్య వనజ ఉన్నారు. ఇక బీఫాం ఇవ్వకపోవడంతో తిరస్కరణకు గురైన వారిలో మంథని నుంచి పుట్ట మధు సతీమణి శైలజ, చల్లా నారాయణ రెడ్డి సతీమణి సుజాత, పెద్దపల్లి నుంచి దాసరి మనోహర్‌రెడ్డి కోడలు మమతారెడ్డి, కరీంనగర్ నుంచి పురమళ్ల శ్రీను సతీమణి లలిత, మానకొండూరులో కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి అనురాధ, కోరుట్లలో కె.సంజయ్ తండ్రి విద్యాసాగర్‌రావు ఉన్నారు. చొప్పదండిలో కాంగ్రెస్ రెబల్ నాగి శేఖర్, పెద్దపల్లి బీఆర్‌ఎస్ రెబెల్ నల్ల మనోహర్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నారు. సిరిసిల్ల నుంచి స్వతంత్ర అభ్యర్థి కటకం మృత్యుంజయం, వేములవాడ నుంచి బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డ తుల ఉమ పోటీ నుంచి వైదొలిగారు.

ఏడుచోట్ల డబుల్ ఈవీఎంలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం ఏడుచోట్ల డబుల్ ఈవీఎంలు వచ్చే అవకాశాలున్నాయి. సాధారణంగా ఒక ఈవీఎంలో గరిష్టంగా 16 గుర్తులు (నోటాతో కలిపి) కేటాయించే వీలుంది. ఒకవేళ అభ్యర్థులు 15 మంది దాటితే.. రెండో ఈవీఎం వినియోగం అనివార్యమవుతుంది. చొప్పదండి, మానకొండూరు, జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో సింగిల్ ఈవీఎం వినియోగించనున్నారు. ఇందులో చొప్పదండి, మానకొండూరు, ధర్మపురి ఎస్సీ నియోజకవర్గాలు. ఇక మిగిలిన కరీంనగర్, హుజూరాబాద్, రామగుండం, మంథని, పెద్దపల్లి, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య 15 మందికి మించి ఉండటంతో ఇక్కడ రెండో ఈవీఎం తప్పనిసరి.

అర్హులకు ఇంటినుంచే ఓటింగ్



మాట్లాడుతున్న పమేలా సత్పతి

- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు సదుపాయం కల్పిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి అన్నారు. ఈ నెల 30న పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటుహక్కును వినియోగించుకోలేని అర్హులైన దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం భారత ఎన్నికల సంఘం ఇంటి నుంచే ఓటింగ్ సదుపాయాన్ని కల్పించిందని వివరించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు పోలింగ్ రోజున కల్పించాల్సిన వసతులపై బీఎల్‌వోలకు దిశానిర్దేశం చేశారు. 80సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు, 40శాతం కన్నా ఎక్కువ వైకల్యం ఉన్నవారికి ఇంటినుంచే తమ ఓటుహక్కును వినియోగించుకునేలా హోం ఓటింగ్ సదుపాయాన్ని కల్పించడం జరిగిందని, బీఎల్‌వోల ద్వారా 12డీ ఫారంలను నోడల్ అధికారులు నియోజకవర్గం వారిగా స్వీకరించడానికి నియమించడం జరిగిందని తెలిపారు. ఇతర వృద్ధులు, దివ్యాంగుల ఓటింగ్ కోసం ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించడంతో పాటు పోలింగ్‌కేంద్రంలో ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీడబ్ల్యూవో సరస్వతి, అడిషనల్ డీఆర్‌డీవో సంధ్యారాణి, సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు, పెన్షన్ సంఘం అధ్యక్షుడు మోసం అంజయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి



హుజూరాబాద్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

- విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి
- సీపీ అభిషేక్ మహంతి

హుజూరాబాద్/శంకరపట్నం: నామినేషన్ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని సీపీ అభిషేక్ మహంతి సిబ్బందికి సూచించారు. బుధవారం హుజూరాబాద్, శంకరపట్నం పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాతనేరస్తులు, రౌడీ షీటర్లు, సమస్యాత్మక ప్రాంతాలపై ఆరా తీశారు. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకోనున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోడల్ కోడ్ ఉల్లంఘనలపై దృష్టి పెట్టాలని, గుర్తిస్తే వెంటనే కేసులు నమోదు చేయాలని అన్నారు. అనుమతి లేని సమావేశాలు, విందు కార్యక్రమాలు, అక్రమ పంపిణీలను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలు చేసిన లేదా అల్లర్లు సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, ఓటర్లను ప్రభావితం చేసే వారిపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. హుజూరాబాద్ ఏసీపీ జీవనరెడ్డి, హుజూరాబాద్ సీఐ బొల్లం రమేశ్, శంకరపట్నం ఎస్సై లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సెల్ఫీ పాయింట్

చొప్పదండి: పట్టణంలోని రిటర్నింగ్ కార్యాలయంలో ఓట్ ఫర్ ష్యూర్ సెల్ఫీ పాయింట్‌ను అదనపు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ప్రఫుల్ దేశాయ్ బుధవారం ప్రారంభించారు. ప్రజలు తమ ఓటు హక్కు తప్పనిసరిగా ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో రిటర్నింగ్ కార్యాలయంలో ఓట్ ఫర్ ష్యూర్ సెల్ఫీని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఓటర్లు కార్యాలయ ఆవరణలో సెల్ఫీ తీసుకొనేలా అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.



సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న ప్రఫుల్ దేశాయ్

డబ్బులు పంచొద్దని మోకాళ్లపై నడక

కరీంనగర్ అర్బన్: ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేస్తున్నారని నిరసిస్తూ స్వతంత్ర అభ్యర్థి వినూత్న నిరసన తెలిపారు. బుధవారం కరీంనగర్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి బెల్లపు కరుణాకర్ పద్మనగర్ నుంచి కలెక్టరేట్ వరకు వరకు మోకాళ్లపై నడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా జరగాలని, ఓటర్లు డబ్బులు తీసుకోవద్దని కోరారు. పార్టీ కండువాలు కప్పుకునేందుకు, వెంట తిరిగేందుకు డబ్బులు ఇవ్వడం పార్టీలకు తగదని కోరారు.



ప్రచారానికి 12 రోజులే!

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం
- అన్ని గ్రామాలను చుట్టేందుకు నేతల ఏర్పాట్లు
- చోటామోటా నాయకుల చేరికలపై నజర్
- కరీంనగర్ జిల్లాలో 73 మంది అభ్యర్థులు



కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. బరిలో ఉన్న అభ్యర్థులు ఇక ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాలను చుట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ చోటామోటా నాయకులను తమ పార్టీల్లో చేర్చుకునే పనిలో పడ్డారు. అసమ్మతి నాయకులను కలుపుకొని ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గాల్లో పెద్ద నేతలను కలుస్తూ ప్రచారానికి ఆహ్వానిస్తున్నారు. ఐదు నుంచి పది వరకు ప్రచార రథాలకు అనుమతి తీసుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా ప్రచారం కొనసాగిస్తున్నారు. తమ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల వాట్సాప్ గ్రూప్‌లలో సందడి చేస్తున్నారు.

28న ముగియనున్న ప్రచార గడువు

కరీంనగర్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 73 మంది అభ్యర్థులు అసెంబ్లీ బరిలో నిలిచారు. కరీంనగర్‌లో 27 మంది, చొప్పదండిలో 14 మంది, మానకొండూరులో 10 మంది, హుజూరాబాద్‌లో 22 మంది పోటీలో ఉన్నారు. వీరికి అధికారులు గుర్తులను కేటాయించి, బ్యాలెట్ నమూనాను కార్యాలయాల వద్ద ప్రదర్శించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియడంతో అభ్యర్థులకు ప్రచార గడువు ఇంకా 12 రోజులే ఉంది. ఈ నెల 28న 5 గంటలకు ప్రచారం ముగించాల్సి ఉంటుంది. 30న పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 3న ఓట్లు లెక్కించనున్నారు.

అగ్రనేతలను రప్పించేందుకు సన్నాహాలు

కరీంనగర్ జిల్లాలో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు తమ అగ్రనేతలను రప్పించి, బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టికెట్లు దక్కనివారు, పార్టీల్లో అసంతృప్తులు, కొన్నిచోట్ల సీనియర్ నేతలు ప్రచారానికి దూరంగా ఉండటంతో వారిపై దృష్టిసారించారు. ప్రచారంలో పాల్గొనేలా వారందరినీ మచ్చిక చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. నియోజకవర్గం పరిధిలో ఇందుకోసం సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. అభ్యర్థులు నిత్యం మూడు నుంచి నాలుగు గ్రామాలు తిరిగేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. ఉన్న కొద్ది సమయంలో అన్ని గ్రామాలను తిరగడం కష్టం. ఈ నేపథ్యంలో సీనియర్ నేతలు, కుటుంబసభ్యులు, బంధువులతోనూ ప్రచారం చేయిస్తున్నారు. ఇందుకోసం ప్రతీ మండల పరిధిలో కమిటీలు వేశారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డులు, డివిజన్లలోనే ఉండి, పనిచేసేలా సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు. వాహనాలు, ప్రచార సామగ్రిని అందుబాటులో ఉంచుతూ ఇల్లిల్లు తిరగాలని కోరుతున్నారు.

నువ్వు యాడికెళ్తే.. ఆడికొస్తా!

ఓవైపు పోలింగ్ గడువు దగ్గర పడుతోంది.. మరోవైపు చలికాలం.. ఈ రెండూ అభ్యర్థులను ఇబ్బంది పెడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ప్రస్తుతం వరికోతలు జోరుగా సాగుతున్నాయి. చాలామంది ఆ పనుల్లోనే నిమగ్నమయ్యారు. మరికొందరు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో ఇంటి వద్ద ఎవరూ ఉండటం లేదు. దీంతో అభ్యర్థులు వారు పని చేస్తున్న చోటుకే వెళ్లి, ఓటు అభ్యర్థిస్తున్నారు. మిగతా చోట్ల ఉదయం 6 గంటలకే ప్రారంభించి, రాత్రి పొద్దుపోయేదాకా ప్రచారం చేస్తున్నారు. రాత్రి వేళల్లో రహస్య మంతనాలు సాగిస్తూ ఎన్నికల వ్యూహాలు రచిస్తున్నారు. గ్రామాల నుంచి ఉపాధి అవకాశాల కోసం హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలు సేకరిస్తూ పోలింగ్ సమయానికి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- పెరిగిన కేంద్రాలు.. మారిన సంఖ్య
- సందేహాలు తీర్చేందుకు సహాయకులు
- సంస్కరణలతో ఆదర్శంగా కేంద్రాలు

పోలింగ్ కేంద్రం.. తగ్గిన దూరం

కరీంనగర్ అర్బన్: పోలింగ్ కేంద్రాల్లో సంస్కరణలు చేపట్టారు. ఓటర్లకు చిరునామాగా, సందేహాల నివృత్తికి వేదికగా మలిచారు. ఎన్నికల సంఘం పెరిగిన ఓటర్ల సంఖ్య క్రమంలో పోలింగ్ కేంద్రాలను పెంచగా తాజాగా పోలింగ్ కేంద్రాల్లో గోడరాతల్లో మార్పులు చేపట్టింది. కరీంనగర్ నియోజకవర్గంలో 44, హుజూరాబాద్‌లో 26, చొప్పదండి 66, మానకొండూరులో 60 కేంద్రాలను పెంచగా మొత్తం 176 కేంద్రాలను పెంచారు. ఇక పోలింగ్ కేంద్రాల సంఖ్య మారింది. ఒకప్పుడు ఉన్న కేంద్రం సంఖ్య ఇప్పుడు లేదు. గతంలో కలెక్టర్ ఓటు వేసే 118 పోలింగ్ కేంద్రం సంఖ్య నేడు 148గా మారింది. దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాల సంఖ్యలు మారాయి.

తప్పనున్న నిరీక్షణ

ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య పరిమితిని విధించగా తదనుగుణంగా కేంద్రాలను పెంచారు. పట్టణాల్లో 1400, పల్లెల్లో 1200 వరకు ఓటర్లను పరిగణలోకి తీసుకుని కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 1338 పోలింగ్ కేంద్రాలుండగా 10,59,215 మంది ఓటర్లున్నారు. ఈ క్రమంలో 2018 ఎన్నికల నుంచి కరీంనగర్ నియోజకవర్గంలో 60వేలకు పైగా ఓటర్ల సంఖ్య పెరగగా మానకొండూరులో అత్యల్పంగా 19వేల మంది ఓటర్లు పెరిగారు. ఈ నేపథ్యంలో ఓటింగ్ కోసం ఎక్కువ సేపు నిరీక్షించాల్సిన అవసరముండదన్నది సుస్పష్టం. తదనుగుణ అవసరమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలవుతోంది. ఇప్పటికే కేంద్రాల గుర్తింపు పూర్తికాగా, వాటిల్లో వసతులను ఏర్పాటు చేస్తున్నారు. దివ్యాంగులను దృష్టిలో ఉంచుకొని ర్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్తు, తాగునీటి సౌకర్యం, ర్యాంప్, శౌచాలయం వంటి వసతులను కల్పిస్తున్నారు.

కేంద్రాల్లో పూర్తి సమాచారం

ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్‌స్థాయి అధికారి(బీఎల్వో)ని నియమించారు. ఓటరు జాబితా రూపకల్పన చేయడంలో కీలక పాత్ర పోషించారు. కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు చేశారు. పోలింగ్ ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండనున్నారు. ఆయా కేంద్రాల్లో పోలింగ్ కేంద్రం నంబర్ మినహా ఇతర వివరాలేవీ ఉండేవి కాదు. దీంతో ఎన్నికల సంఘం బీఎల్వోల వివరాలు, పోలింగ్ కేంద్రం నంబరు, నియోజకవర్గం సంఖ్య బీఎల్వో, సూపర్వైజర్, పేరు, ఫోన్ నంబర్ల వివరాలను అందుబాటులో ఉంచారు. ఓటర్లకు ఏవైనా సందేహాలుంటే సంబంధిత నంబర్లకు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

సౌకర్యాల కల్పన

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించేలా దృష్టిపెట్టారు. గతంలో మన ఊరు.. మన బడి ద్వారా ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించగా పలుచోట్ల మరమ్మతులు చేశారు. ఇక దివ్యాంగులకు వీల్‌చైర్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో 2,38,80మంది దివ్యాంగులు, 19,594 మంది వృద్ధులు ఉన్నారు. 1338 పోలింగ్ కేంద్రాలకు 398 ప్రాంతాల్లో వీటిని సమకూరుస్తారు.



పోలింగ్ కేంద్రంలో గోడ రాతల్లో యంత్రాంగం

నియోజకవర్గాల వారీగా కేంద్రాల పెంపు తీరిలా

నియోజకవర్గం	2018	2023
కరీంనగర్	346	390
చొప్పదండి	261	327
మానకొండూరు	256	316
హుజూరాబాద్	279	305

నియోజకవర్గాల వారీగా గత, ప్రస్తుత ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	2018	2023
కరీంనగర్	2,87,082	3,55,054
చొప్పదండి	2,12,389	2,32,990
మానకొండూరు	2,02,504	2,21,613
హుజూరాబాద్	2,09,333	2,49,558

క్లుప్తంగా

ఫుట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక



అభినందిస్తున్న చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టుకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. గోదావరిఖనిలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–14 బాలికల విభాగం పోటీల్లో పాఠశాలకు చెందిన బి.సహస్ర, ఎస్.నిసితాల్(ఎనిమిదో తరగతి), అండర్–14 బాలుర విభాగంలో కె.రిషిరెడ్డి(ఏడోతరగతి), పి.శ్రీయాన్ష్, డి.శ్రేయాస్‌రాజ్(ఎనిమిదో తరగతి)లు ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. వారు ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికవడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి, జాతీయ జట్టుకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో తనిఖీలు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని పలు లాడ్జీల్లో సీఐ రమేశ్ ఆదేశాల మేరకు పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. గదుల్లో అద్దెకు దిగినవారి బ్యాగులు చెక్ చేశారు. లాడ్జీల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల నియమావళిలో భాగంగా అద్దెకు దిగేవారి వివరాలు నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానితులు, అపరిచితులు వస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎస్‌ఐలు శ్రీధర్, రాజేశ్, ఏఎస్‌ఐలు రాధాకిషన్, వెంకటేశ్వర్లు, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

హార్వెస్టర్‌కు నిప్పు?



పాలకుర్తి(రామగుండం): పుట్నూర్ గ్రామంలోని రైతు నార సత్తయ్యకు చెందిన హార్వెస్టర్‌ను దుండగులు దహనం చేశారు. సత్తయ్య గ్రామశివారులోని తన పొలంలో మంగళవారం రాత్రి వరకూ వరికోశాడు. యంత్రాన్ని పొలంలోనే ఉంచి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా హార్వెస్టర్ ముందుభాగం పూర్తిగా కాలిపోయి ఉంది. రాత్రివేళ దుండగులు ఈదుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈవిషయంపై బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈఘటనలో దాదాపు రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు సత్తయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

OLD AGE HOME

■ హరే కృష్ణ హోంకేర్, వంట/ఇంటి పనిచేయుటకు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. Ph: 9640358899/ 9640158899 H-793651]

WANTED

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [M-1221912]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

ఉనికి కోల్పోయిన కామ్రేడ్స్

- కమ్యూనిస్టులకు ఉమ్మడి జిల్లా ఆయువుపట్టు
- 'అనభేరి, బద్దం' వంటి మహామహుల పురిటి గడ్డ
- 1952 నుంచి పలువురు చట్టసభలకు..
- సాయుధ పోరాటం, ప్రజల పక్షాన గొంతు వినిపించిన చరిత్ర
- నేడు అర్థబలం, అంగబలం లేక చతికిల పడిన వైనం
- తొలిసారి ఇక్కడి నుంచి పోటీకి దూరం



వెంకట్‌రెడ్డి



రాజేశ్వర్‌రావు (ఫైల్)



అనభేరి (ఫైల్)



ఎల్లారెడ్డి (ఫైల్)



చిన్నమల్లయ్య (ఫైల్)



సీపీఐ శ్రేణుల ర్యాలీ (ఫైల్)

కరీంనగర్: నిజాం నిరంకుశ, రాచరిక పాలన, రజాకార్లు, దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేసిన చరిత్ర సీపీఐది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు ఆ పార్టీని ఎంతగానో ఆదరించారు. 1952లో జరిగిన సాధారణ ఎన్నికల నుంచి పలుమార్లు ఎర్రజెండాను చట్టసభలకు పంపారు. ఆ నేతలు కూడా ప్రజల పక్షాన తమ గొంతు వినిపించారు. ఉమ్మడి జిల్లా మొదటి నుంచి కమ్యూనిస్టులకు ఆయువుపట్టుగా నిలిచింది. నిజాం నవాబు రాచరిక పాలన అంతం కోసం పోరాడి, తొలి ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన అనభేరి ప్రభాకర్‌రావు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సేనాని బద్దం ఎల్లారెడ్డిలతోపాటు ఎందరో అగ్రగణ్యులను అందించిన కరీంనగర్ వామపక్ష పోరాటాలకు పుట్టినిల్లయింది. అనభేరి ప్రభాకర్‌రావు సీపీఐ జిల్లా తొలి కార్యదర్శి కావడం గమనార్హం. అమృతలాల్ శుక్లా, చెన్నమనేని రాజేశ్వర్‌రావు, దేశిని చిన్నమల్లయ్యలు జిల్లా కార్యదర్శులుగా వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా సారథ్యం వహించి, ప్రస్తుతం జాతీయ నాయకుడిగా ఉన్న చాడ వెంకట్‌రెడ్డి సైతం జిల్లాకు చెందినవారే. అలాగే, 1952లో కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావును ఓడించిన బద్దం ఎల్లారెడ్డి సీపీఐ నాయకుడే.

ఏడు నియోజకవర్గాల్లో గెలుపు..

తొలినాళ్లలో కరీంనగర్‌తోపాటు అప్పటి నుస్తులాపూర్, ఇందుర్తి, బుగ్గారం, చొప్పదండి, మేడారం, నేరెళ్ల అసెంబ్లీ స్థానాల్లో సీపీఐ, పీడీఎఫ్ అభ్యర్థులుగా చీటి వెంకటరామారావు, బద్దం ఎల్లారెడ్డి, చెన్నమనేని రాజేశ్వర్‌రావు, బి.మల్లారెడ్డి, అమృతలాల్‌శుక్లా, దేశిని చిన్నమల్లయ్యలు విజయం సాధించారు. అలాగే, ఉమ్మడి శాసనసభలో చెన్నమనేని రాజేశ్వర్‌రావు, చాడ వెంకట్‌రెడ్డిలు సీపీఐ శాసనసభాపక్ష నేతలుగా వ్యవహరించారు. ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరగగా, ఇందుర్తిలో 8 సార్లు, సిరిసిల్లలో 6 సార్లు సీపీఐ అభ్యర్థులు గెలవడం గమనార్హం. అలాగే, 1952 నుంచి రెండు దశాబ్దాలపాటు కమ్యూనిస్టులు అసెంబ్లీతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్కడక్కడ విజయం సాధిస్తూ గెలుపోటములను ప్రభావితం చేసేలా ఉండేవారు.

2009 నుంచి ఒక్క ఎమ్మెల్యే లేరు

జిల్లాలో ఘన చరిత్ర గల సీపీఐ మారుతున్న సమీకరణాలను ఆకళింపు చేసుకోలేక ప్రజలకు దూరమవుతోంది. ఉమ్మడి జిల్లాలో 2009 నుంచి ఒక్క ఎమ్మెల్యే అభ్యర్థి కూడా లేకపోవడం ఆ పార్టీ ఎంత బలహీనంగా ఉందో చెబుతోంది. సిరిసిల్ల, ఇందుర్తి ఏరియాల్లో ఇప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అంతో ఇంతో పట్టు సాధిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో యువతను పార్టీలోకి ఆకర్షించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. దీనికితోడు 1994 నుంచి జరుగుతున్న అంతర్గత పోరు పార్టీకి తీరని నష్టం కలిగిస్తుందన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఒక్క హుస్నాబాద్ నియోజకవర్గంలోనే చెప్పుకోదగ్గ స్థాయిలో క్యాడర్ ఉంది. ఈసారి ఎన్నికల్లో సీట్ల ఒప్పందంలో భాగంగా దాన్ని కాంగ్రెస్‌కు కేటాయించడంతో కార్యకర్తలు నిరాశకు లోనయ్యారు. 2018 ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసిన చాడ వెంకట్‌రెడ్డికి 48 వేల ఓట్లు వచ్చాయి. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణం పటిష్టంగా లేకపోవడం, ప్రస్తుత రాజకీయాలకు అనుగుణంగా ఎన్నికల్లో తలపడే అర్థబలం, అంగబలం లేక ఉనికి కోల్పోయామని కామ్రేడ్స్ అంగీకరిస్తున్నారు. దీంతో గతమెంతో ఘనమని చెప్పుకుంటూ తృప్తి చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రచారం కన్నా చేరికలకే ప్రాధాన్యం

- బలం ఉన్న నాయకులపై ప్రధాన పార్టీల అభ్యర్థుల దృష్టి
- నిత్యం జంపింగ్‌లతో ప్రజల్లో అయోమయం
- ఉమ్మడి జిల్లాలో పరిస్థితి

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం కన్నా తమ పార్టీలో చేరికలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. బలమైన ద్వితీయ శ్రేణి నాయకులపై దృష్టి పెడుతూ వారిని చేర్చుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాలకు చెందిన అనేక మంది నిత్యం ఒక పార్టీ నుంచి మరో పార్టీకి మారుతున్నారు. అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేపడుతూ గ్రామాల్లో ఎవరెవరు ముఖ్య నాయకులు, కార్యకర్తలున్నారో ఆరా తీస్తున్నారు. అలాగే, వివిధ పార్టీల్లో ఉన్న అసంతృప్తులను సైతం తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ముఖ్య నాయకులకు బాధ్యతలు

అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతుండగా ఆయా పార్టీల్లోని ముఖ్య నాయకులకు చేరికల బాధ్యతలు అప్పగిస్తున్నారు. వారు ఏ నాయకుడిని పార్టీలో చేర్చుకుంటే లాభం జరుగుతుందో అంచనా వేస్తూ చాలామందిని ఆహ్వానిస్తున్నారు. ఫలితంగా ప్రధాన పార్టీలో నిత్యం జంపింగ్‌లతో ప్రజల్లో అయోమయం నెలకొంది. ఎవరు ఏ పార్టీలో చేరుతున్నారో తెలియడం లేదని అంటున్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడం, మరో 12 రోజులు మాత్రమే ప్రచార గడువు ఉండటంతో ఉమ్మడి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో చేరికలు ఊపందుకున్నాయి. పలు పార్టీల ముఖ్య నాయకులు రాత్రంతా గ్రామాల్లో, పట్టణాల్లోనే గడుపుతూ పలువురిని అభ్యర్థుల ఇంటికి తీసుకెళ్లి, మాట్లాడిస్తున్నారు. చర్చలు సఫలమైతే కండువాలు కప్పేస్తున్నారు.

ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలే..



సమావేశమైన అధికారులు

మంథని: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ప్రచార ఖర్చు రూ.40 లక్షలు మించరాదని ఎన్నికల పరిశీలకుడు సీఎస్ శ్రీధర, వ్యయ పరిశీలకుడు సునీల్ శ్రీ వాత్సవ సూచించారు. బుధవారం మంథని ఎమ్మెల్యే అభ్యర్థులు, ప్రతినిధులు, తహసీల్దార్లతో పట్టణంలో సమావేశమయ్యారు. అభ్యర్థుల ఖర్చు వివరాలను ఈనెల 20, 24, 28 తేదీల్లో వ్యయ పరిశీలకులకు సమర్పించాలన్నారు. ప్రచారం వాహనం అనుమతి తీసుకోవాలని, కేటాయించిన సమయంలోనే ప్రచారం చేయాలని చెప్పారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సహాయ వ్యయ పరిశీలకుడు శ్రీనివాస్, రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్, ఏసీపీ మల్లారెడ్డి, తహసీల్దార్ రాజయ్య, మీడియా సెల్ నోడల్ అధికారి రవీందర్, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ సంతోష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ.. తప్పిన ప్రమాదం



ముత్తారం(మంథని): కాసార్లగడ్డ బస్టాండ్‌లో బుధవారం ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఓడెడ్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఓడెడ్‌కు వైపు వస్తున్న లారీ అదుపు తప్పి ఢీకొనడంతో బస్సు అద్దాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కాసార్లగడ్డ – అడవిశ్రీరాంపూర్ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి, మంథని–ఓడెడ్ ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా ఇరుకుగా ఉండడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. రోడ్డును ఆక్రమించిన దుకాణాదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పోలీస్ అధికారిపై దాడి కేసులో ఒకరికి జైలు

సిరిసిల్లక్రైం: పోలీస్ అధికారిపై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించిన వివరాల ప్రకారం 2013 జూలై 28న సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌లో తబ్లిక్ జమాత్, సున్నీ జమాత్‌కు చెందిన ముస్లింలు రెండుగా విడిపోయి గొడవ చేసుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న అప్పటి సీఐ ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి వెళ్లి ఆపేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో సిరిసిల్లకు చెందిన మహ్మద్ తాజ్ సీఐపైకి రాయి విసరడంతో చేతికి గాయమైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దాడికి కారణమైన తాజ్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పును వెల్లడిస్తూ మహ్మద్ తాజ్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధించారు. శాంతిభద్రతల రక్షణలో అనునిత్యం పని చేసే పోలీస్ అధికారులు, సిబ్బందిపై దాడులకు దిగిన, విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు.

చోరీ కేసులో ఇద్దరికి..

ఆలయాల్లో దొంగతనం చేసిన కేసులో ఇరువురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే 2023 జూన్ 29న రగుడు ఎల్లమ్మ ఆలయం, సిరిసిల్ల విశ్వనాథ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చోరీ చేశారని ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి మైలారం ఆశారాములు, బాల నర్సింహులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి బీసీ నాయక్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా ఎస్సై లావుడ్య శ్రీకాంత్, కానిస్టేబుల్ నరేశ్‌లు సాక్ష్యాలు ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు ఆశారాములు, నర్సింహులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి..

గోదావరిఖని(రామగుండం): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి ఐదురోజుల జైలు శిక్ష విధించినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ టి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులు డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడగా బుధవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ ఎదుట పోలీసులు హాజరుపర్చారు. దీంతో ఇద్దరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య



కల్యాణ్ (ఫైల్)

మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. కోంద్ర కల్యాణ్(25) కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం అతని భార్య పని నిమిత్తం కరీంనగర్ వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కల్యాణ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అర్ధరాత్రి 28 క్వింటాళ్ల మక్కలు చోరీ

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండల కేంద్రంలో 28 క్వింటాళ్ల మక్కలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు రైతులు రెబ్బాటి చిన్న రాజన్న, చిట్యాల చిన్నొల్ల రాములు బుధవారం తెలిపారు. ఇబ్రహీంపట్నం నుంచి గోధూర్ వెళ్లే రోడ్డుపై మక్కలు ఆరబోసి, విక్రయించామన్నారు. కొనుగోలుదారుడు వాటిని రోడ్డు పక్కనే నిల్వ ఉంచగా దొంగలు మంగళవారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఫుట్‌బాల్ లీగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న వైస్‌ఎంపీపీ లక్ష్మి

రామగుండం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ లీగ్ పోటీలను అంతర్గాం మండల కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. ఎనిమిది మండలాల నుంచి జట్లు హాజరయ్యాయి. అంతర్గాం వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి పోటీలు ప్రారంభించారు. తొలిరోజు గోదావరిఖని–యైటింక్లయిన్‌కాలనీ, అంతర్గాం–కరీంనగర్, గోదావరిఖని–హుజూరాబాద్ జట్లు తలపడ్డాయి. గురువారం పోటీలు ముగుస్తాయని ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రతినిధులు డబ్ల్యూ.గణపతి, కోల సంతోష్‌గౌడ్, వెంకట్రావు, వెంకటేశ్, నరేశ్‌కుమార్, అంగోతు శ్రీనివాస్, ప్రవీణ్, రాము, శివకుమార్, శ్రీనివాస్, గాంధీ, ఇ.రవికుమార్ తదితరులున్నారు.

అంబులెన్స్‌లో సాధారణ ప్రసవం



అంబులెన్స్‌లో డెలివరీ చేసిన సిబ్బంది

ధర్మపురి: పురిటి నొప్పులతో బాధ పడుతున్న ఓ గర్భిణికి 108 సిబ్బంది అంబులెన్స్‌లోనే నార్మల్ డెలివరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురికి చెందిన స్వప్నకు మంగళవారం అర్ధరాత్రి పురిటినొప్పులు మొదలయ్యాయి. కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేయగా అంబులెన్స్ వచ్చింది. ఆమెను జగిత్యాల తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో సిబ్బంది అనిల్‌కుమార్, ఖయ్యూంలు అంబులెన్స్‌లోనే స్వప్నకు సాధారణ ప్రసవం చేశారు. ఆమె ఆడబిడ్డకు జన్మనివ్వగా తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

మద్యం పట్టివేత



మద్యం బాటిళ్లు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

జమ్మికుంట(హుజూరాబాద్): అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణంలోని వైన్స్‌ల నుంచి వీణవంక మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన తాళ్లపెల్లి స్వామి, రాపర్తి రవి బుధవారం అక్రమంగా మద్యం తరలిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.26,730 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్‌ఐలు కబీర్‌దాస్, రమాదేవి, హెడ్‌కానిస్టేబుల్ ఐలయ్య, కానిస్టేబుళ్లు మహేశ్, పద్మావతి, శైలజ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వేగురుపల్లి గ్రామంలో..

మానకొండూర్: మండలంలోని వేగురుపల్లికి చెందిన మాజీ సర్పంచి ముద్దసాని శ్రీధర్ రెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని ఎన్నికల అధికారులు, పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఆయన ఇంట్లో తనిఖీలు చేయగా 16 మద్యం బాటిళ్లు దొరికినట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని, శ్రీధర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పుస్తెలతాడు చోరీకి యత్నించిన కేసులో..

- నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ధర్మపురి: ఓ వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడు చోరీకి యత్నించిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ రమణామూర్తి తెలిపారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. ధర్మపురికి చెందిన వ్యక్తి కొన్నేళ్లుగా ఎల్‌ఐసీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 10న ధర్మపురికే చెందిన ఒజ్జల నర్సమ్మ అనే వృద్ధురాలు పిండి గిర్ని వద్దకు వెళ్తుండగా బైక్‌పై వచ్చి, ఆమె మెడలోని పుస్తెలతాడును లాగడంతో తెగి, కిందపడింది. బాధితురాలు కేకలు వేయడంతో వదిలేసి, పారిపోయాడు. నర్సమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు 4 బృందాలుగా ఏర్పడి, నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం వాహనాల తనిఖీ చేస్తుండగా ధర్మపురి దుర్గమ్మ కాలనీ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు కృషి చేసిన వివిధ మండలాల ఎస్‌ఐలను, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రూ.లక్ష సీజ్

కథలాపూర్(వేములవాడ): కలిగోట శివారు చెక్‌పోస్టు వద్ద బుధవారం రూ.లక్ష పట్టుకున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. దూలూర్‌కు చెందిన గంగారెడ్డి కారును తనిఖీ చేశామన్నారు. అందులో నగదు దొరకడంతో నిబంధనల ప్రకారం సీజ్ చేసి, ఉన్నతాధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

ఆనందం.. అంతలోనే విషాదం

- బయల్దేరిన ఐదు నిమిషాల్లోనే..
- కారు బోల్తాపడి ఇద్దరు మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- కూతురును కళాశాలలో దింపేందుకు వెళ్తుండగా ఘటన
- హబ్సీపూర్, రాజారం గ్రామాల్లో విషాదం



సంఘటన స్థలంలో నుజ్జునుజ్జయిన కారు



మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు



మహేశ్ మృతదేహం



భాస్కర్ మృతదేహం

జగిత్యాల క్రైం: కూతురును కళాశాలలో దింపేందుకు ఓ వ్యక్తి తన బంధువులతో కలిసి కారులో ఆనందంగా బయల్దేరాడు.. కానీ, ఐదు నిమిషాల్లోనే ఆ వాహనం బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో హబ్సీపూర్, రాజారం గ్రామాల్లో విషాదం నెలకొంది. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ కథనం ప్రకారం.. ధర్మపురి మండలంలోని రాజారం గ్రామానికి చెందిన దేవరకొండ భాస్కర్(35) బుధవారం ఉదయం తన అత్తగారి గ్రామమైన హబ్సీపూర్‌కు కారులో వచ్చాడు. తన పెద్ద కూతురు అక్షరను కరీంనగర్‌లోని కళాశాలలో దింపేందుకు మామ, హబ్సీపూర్‌కు చెందిన ఇమ్మడి నందయ్య, బావమరిది శ్రీకాంత్, నందయ్య తమ్ముడి కొడుకు మహేశ్‌లతో కలిసి కారులో బయల్దేరాడు. కానీ, దురదృష్టవశాత్తు అది పొలాస శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై అదుపుతప్పి, బోల్తాపడింది. ఈ ఘటనలో భాస్కర్, మహేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. నందయ్య, అక్షర, కారు నడుపుతున్న శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సదాకర్ సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు భాస్కర్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, భాస్కర్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు, మహేశ్‌కు భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఇరు కుటుంబాల సభ్యులు ఘటనాస్థలికి చేరుకొని, కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఎమ్మెల్సీ పరామర్శ..

రోడ్డు ప్రమాదంలో దేవరకొండ భాస్కర్, ఇమ్మడి మహేశ్‌లు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

రెండో స్థానం కోసమే వారి పోటీ

- ధర్మాన్ని, కరీంనగర్ ప్రజలనే నమ్ముకున్నా
- గంగుల ఓటుకు రూ.10 వేలు, లక్ష సెల్‌ఫోన్లను నమ్ముకున్నడు
- బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్


హాజరైన జనం

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు రెండో స్థానం కోసమే పోటీ పడుతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బీజేపీ గెలుపు ఎప్పుడో ఖాయమైందన్నారు. సాలు గంగుల.. ఇక సెలవు గంగుల.. బైబై గంగుల అంటూ యువకులతో కలిసి నినదించారు. ఎన్నికల్లో భాగంగా బుధవారం కరీంనగర్ బీజేపీ కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ తరువాత కరీంనగర్‌లోని రాంనగర్, సీతారాంపూర్, ఆరెపల్లిలో బండి సంజయ్ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో గంగుల కమలాకర్ లక్ష సెల్‌ఫోన్లను, ఓటుకు రూ.10 వేలను నమ్ముకున్నడు.. నేను ధర్మాన్ని, కరీంనగర్ ప్రజలను నమ్ముకున్న.. ప్రజలే అంతిమ నిర్ణేతలు.. తగిన తీర్పు ఇవ్వబోతున్నారని అన్నారు. ఓట్లు, సీట్ల కోసం పేర్లు, కుల గోత్రాలు మార్చుకునే నీచమైన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్సేనని విమర్శించారు. రాహుల్ గాంధీ అసలు పేరు రౌల్ విన్సీ.. రాజకీయాల్లోకి వచ్చి రాహుల్ గాంధీగా మారారు.. కల్వకుంట్ల అజయ్‌రావు.. కల్వకుంట్ల తారక రామారావుగా మారారు.. ఇప్పుడు కరీంనగర్‌లో గంగుల కమలాకర్ ఎంఐఎం ఓట్ల కోసం దారుస్సలాం పోయి టోపీ పెట్టుకొని కరీంనగర్ కమ్రుద్దీన్‌గా మారారంటూ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. 50 లక్షల మంది నిరుద్యోగులు, 40 లక్షల మంది రైతులతో పాటు మహిళలు, విద్యార్థులు సహా సబ్బండ వర్గాల సమస్యలపై యుద్ధం చేసిన.. రెండుసార్లు జైలుకు పోయిన.. లాఠీ దెబ్బలు తిన్న.. కేసీఆర్ నాపై 74 కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నడు.. అయినా వెనకడుగు లేదు.. పోరాడుతూనే ఉంటా.. కేసీఆర్ ఇంటికో ఉద్యోగమిస్తామని మోసం చేసిండు.. 50 లక్షల నిరుద్యోగులు ఏళ్ల తరబడి కోచింగ్‌కే పరిమితమై తినడానికి తిండి లేక ఇబ్బంది పడుతున్నరు.. నేను ప్రజా సమస్యలపైనే పోరాడిన తప్ప.. దొంగ దందాలు, భూకబ్జాలు చేయలేదు.. నా కుటుంబం కోసం కొట్లాడలేదు.. కానీ ఇక్కడ బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రజల కోసం ఏం చేశారు? భూకబ్జాలు, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నరు.. నేను కరీంనగర్ అభివృద్ధికి ఏం చేశానో? ఎన్ని కేంద్ర నిధులు తెచ్చానో బహిరంగంగా చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరితే ముఖం చాటేసినోళ్లు బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు చెబుతున్నా.. కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధులన్నీ కేంద్రానివే.. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం రూ.150 కోట్ల నిధులు నేను తీసుకొస్తే.. తానే చేసినట్లు కొబ్బరికాయ కొట్టి ఫోజులిచ్చిన మోసగాడు గంగుల కమలాకర్.. కేంద్రం నుంచి ఆ నిధులన్నీ నేనే తెచ్చినట్లు ఆధారాలతో సహా నిరూపిస్తా.. అంతే కాదు.. కరీంనగర్ అభివృద్ధికి నేను ఎన్ని నిధులు తెచ్చానో లెక్కాపత్రంతో వస్తా.. దమ్ముంటే కేసీఆర్‌ను బహిరంగ సభకు రమ్మను.. నేను తప్పు చేసినట్లు రుజువు చేస్తే ఎన్నికల్లో పోటీ చేయకుండా విరమించుకుంటా అంటూ సవాల్ విసిరారు. ఇప్పుడు ఆంధ్రా, తెలంగాణ సెంటిమెంట్ రెచ్చగొట్టాలని చూస్తున్నడు.. బీఆర్ఎస్ ఓడిపోతే ఆంధ్రోళ్ల పెత్తనం వస్తదట.. నేనడుగుతున్న.. ఇప్పుడు ఆంధ్రా ఎక్కడిది? నీకు అవసరముంటే తెలంగాణ అంటవ్.. అవసరం తీరాక కరివేపాకులా తీసిపారేస్తవ్.. అసలు టీఆర్ఎస్ పేరును తీసేసి బీఆర్ఎస్‌గా పెట్టుకున్న మీకు తెలంగాణ పేరెత్తే అర్హత కూడా లేదన్నారు. నేనడుగుతున్నా.. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణ నీళ్లను ఆంధ్రాకు దోచిపెట్టింది కేసీఆర్ కదా? రాయలసీమకు పోయి చేపల పులుసు తిని తెలంగాణ సొమ్ముతో రాయలసీమను రత్నాల సీమగా మారుస్తానన్నడు.. అప్పుడెందుకు కేసీఆర్‌ను నిలదీయలేదు కమలాకర్ అని ప్రశ్నించారు. తెలంగాణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2లక్షల 40వేల ఇళ్లు మంజూరు చేస్తే.. కేసీఆర్ పేదలకు ఒక్క ఇల్లయినా ఇచ్చారా? ఇవ్వకపోతే గంగుల కమలాకర్ కేసీఆర్‌ను ఎందుకు అడగలేదు? ఆ ఇళ్లన్నీ పేదలకు కట్టిస్తే.. నేను ప్రధానితో మాట్లాడి తెలంగాణకు మరో 5 లక్షల ఇళ్లు మంజూరు చేయించుకొస్తా.. సహకరించాలని చెబితే కేసీఆర్ కిమ్మనలేదు.. కేసీఆర్ 100 గదులతో ప్రగతి భవన్ కట్టుకొని హాయిగా తాగుతున్నవ్. మరి పేదలు ఏం పాపం చేశారు.. వాళ్లకు ఇళ్లు ఎందుకివ్వలేదని మండిపడ్డారు. ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ ముస్లిం మత గురువులను నమ్ముకుంది.. బీఆర్ఎస్ పార్టీ ఎంఐఎం పార్టీని పట్టుకుంది.. వాళ్ల మత గురువులు వచ్చి గల్లీల్లో ప్రచారం చేస్తున్నరు.. రెండు పార్టీలు సిగ్గు లేకుండా 12 శాతం ఓట్ల కోసం పని చేస్తున్నయ్.. హిందూ మత పెద్దలు, సాధుసంతులు, అర్చక సమాజం ఆలోచించాలి.. మీరు కూడా బయటకు రండి.. హిందూ సమాజ సంఘటిత శక్తిని ఏకం చేయండి.. లేకుంటే రెండు పార్టీలు హిందూ సమాజాన్ని చులకనగా చూసే ప్రమాదముంది.. బొట్టు పెట్టుకొని, కంకణం కట్టుకునే పరిస్థితి కూడా ఉండదని మండిపడ్డారు. ఓటర్లు ఆలోచించి పువ్వు గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీతారాంపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

కాంగ్రెస్, బీజేపీని నమ్మొద్దు

- అభివృద్ధి, సంక్షేమం మా ఎజెండా
- పదేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి
- బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్


హాజరైన జనం

కరీంనగర్: పుట్టిన బిడ్డ తల్లి ఒడిలో ఉంటే ఎంత భద్రంగా ఉంటుందో.. అలాగే కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ చేతిలో ఉంటేనే మన భవిష్యత్ బాగుంటుందని, కాంగ్రెస్, బీజేపీల మాయమాటలను నమ్మొద్దని బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 6, 7, 30 డివిజన్ల పరిధిలోని యజ్ఞవరహాస్వామి టెంపుల్, మారుతినగర్ చౌరస్తా, హౌసింగ్ బోర్డ్ కాలనీల్లో గంగుల కమలాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ఇప్పుడు అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమం ఇంతకు రెట్టింపుతో అమలు కావాలంటే కేసీఆర్ గెలవాలి.. కేసీఆర్ గెలవాలంటే కారు గుర్తుకు ఓటేయాలని సూచించారు. మూడోసారి అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్ సిలిండర్, కేసీఆర్ ఆరోగ్య బీమా, సౌభాగ్యలక్ష్మి పేరుతో అర్హులైన మహిళలకు నెలకు రూ.3 వేలు అందివ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న అనేక సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి, రైతుబంధు ఎత్తేస్తాం అంటున్నారు.. 24 గంటల కరెంట్‌కు బదులు 3 గంటల కరెంట్ ఇస్తామని నేతలు అంటున్నారు.. ఈ మూడు ఎత్తేస్తే రైతాంగం తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌తోనే తెలంగాణ భవిత భద్రంగా ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని, అబద్ధాలు ఆడటం వారి నైజమని, రానున్న రోజుల్లో ఆ రెండు పార్టీల అభ్యర్థులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, కార్పొరేటర్లు కోల మాలతి–సంపత్ రెడ్డి, నేతికుంట యాదయ్య, ఆకుల పద్మ ప్రకాష్, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ నేతికుంట హరీష్, నాయకులు గోలి రవి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

పూసాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో రజక సంఘం నాయకులు, కార్పొరేటర్ కొండపల్లి సరిత సతీష్ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గంగుల కమలాకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గంగుల మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు.

నామినేషన్ల ఉపసంహరణ

కరీంనగర్ అభివృద్ధి కేవలం మంత్రి గంగుల కమలాకర్‌తోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో గంగుల గెలుపు కోసం తాము పని చేస్తామని ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు బుధవారం నామినేషన్లు ఉపసంహరించుకొని గంగులకు మద్దతు పలికారు. స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసిన కంది అశోక్‌రెడ్డి, కొట్టే రమేశ్, ఎండీ షుక్రొద్దీన్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మంత్రి గంగులను గెలిపించుకునేందుకే నామినేషన్లను ఉపసంహరించుకున్నామని వెల్లడించారు.

టిప్పర్ అసోసియేషన్ సభ్యుల మద్దతు

శివశక్తి టిప్పర్ అసోసియేషన్ సభ్యులు మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా తీర్మాన పత్రాన్ని అందజేశారు. మంత్రి గంగుల మాట్లాడుతూ.. కరీంనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిపరచడం జరిగిందని, 70సంవత్సరాలుగా జరగని అభివృద్ధి కేసీఆర్ పాలనలో పది సంవత్సరాలుగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. శివశక్తి టిప్పర్ అసోసియేషన్ సలహాదారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్, అధ్యక్షుడు చందు, ప్రధాన కార్యదర్శి అభిలాష్ ఆధ్వర్యంలో గంగులకు పూర్తి మద్దతు ప్రకటించారు. నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పొన్నం అనిల్, నాయకులు నందెల్లి మహిపాల్, వాసాల రమేశ్, జమీలొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


యజ్ఞవరాహాస్వామి ఆలయం వద్ద ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

అభివృద్ధి చూసే చేరిక

సీఎం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని చూసి యువత పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్‌లోని మంత్రి గంగుల కమలాకర్ నివాసం వద్ద బుధవారం కమాన్‌పూర్ గ్రామానికి చెందిన 40 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. మేయర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్ నాయకుడు గంగుల హరిహరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు బీఆర్ఎస్‌కే వేయాలి

కొత్తపల్లి: మంత్రి గంగుల కమలాకర్‌కు ఓటెయ్యావా దయచేసి అంటూ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల గడప పట్టుకొని విజ్ఞప్తి చేశారు. 10, 11 వార్డుల్లో బీఆర్ఎస్‌నే గెలిపించాలని కోరారు. కౌన్సిలర్లు సత్యనారాయణరెడ్డి, గండు రాంబాబు, నాయకులు ఆంజనేయులు, ఎస్.సత్యనారాయణ, విజయ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మండల పరిషత్తు సమావేశం వాయిదా

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ టి.లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశానికి ఎన్నికల నిర్వహణలో అధికారులు, ప్రచారంలో ప్రజాప్రతినిధులుండడంతో గైర్హాజరయ్యారు. సమావేశం నిర్వహణకు అవసరమైన ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు ప్రకటించారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ విద్యానగర్ ఫీడర్ పరిధిలోని విద్యానగర్, మామిడితోట, విజయదుర్గకాలనీ, సురక్ష టవర్ ప్రాంతాల్లో సరఫరా నిలిపేస్తున్నట్లు టౌన్2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్: 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్–14 ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఈనెల 13న హైటెంక్లయిన్ కాలనీలో నిర్వహించారు. నగరానికి చెందిన జాన్సన్, కోరా విద్యార్థులు సాయి శరణ్య, శ్రీహిత, శ్రీజ పాల్గొని మొదటి బహుమతి కైవసం చేసుకున్నారు. చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగళ సంతోష్‌రెడ్డి అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా పాల్గొని శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. పీఈటీ దుర్గరాజు, విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల యజమాన్యం అభినందించింది.

జోరుగా మట్టి దందా..!

- ఎన్నికల విధుల్లో అధికారులు.. గుట్టను తోడేస్తున్న అక్రమార్కులు
- గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వైనం


కమాన్‌పూర్‌లో ట్రాక్టర్‌లో మట్టిని నింపుతున్న జేసీబీ

కొత్తపల్లి(కరీంనగర్): గుట్టలను అక్రమార్కులు తోడేస్తున్నారు. కమాన్‌పూర్ శివారులోని గుట్టలను అక్రమంగా తవ్వుతూ గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తూ మట్టి దందాను జోరుగా సాగిస్తున్నారు. అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా.. అక్రమార్కులు మట్టి రవాణాపై దృష్టి సారించారు. కమాన్‌పూర్ గ్రామ శివారు 116 సర్వే నెంబర్‌లోని గట్టు మల్లన్న గుట్టను తవ్వుతూ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా కొంతమంది దళారులు ప్రకృతి సంపదను కొల్లగొడుతూ యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. రూ.లక్షలు విలువ చేసే మట్టిని అక్రమంగా తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కమాన్‌పూర్‌లోని గట్టు మల్లన్న గుట్టను మంగళవారం జేసీబీతో తోడుతూ ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణాకు ఒడిగట్టారు. ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులపై అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చట్ట ప్రకారం చర్యలు



ప్రభుత్వ అనుమతి లేకుండా గుట్టల నుంచి అక్రమ తవ్వకాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండడంతో అక్రమ రవాణాపై దృష్టి సారించలేకపోయాం. పర్యవేక్షించాలని ఆర్ఐని ఆదేశించా.
– రాజేశ్, తహసీల్దార్, కొత్తపల్లి

అందుబాటులో గన్నీ సంచులు


తాహెర్‌కొండాపూర్ కేంద్రంలో గన్నీ సంచులు

- ప్రతి కేంద్రానికి 10వేలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ సహకార సంఘం ఆధ్వర్యంలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్, చెర్లభూత్కూర్, తాహెర్‌కొండాపూర్, బొమ్మకల్, దుబ్బపల్లి, జూబ్లీనగర్, నగునూరు, తీగలగుట్టపల్లి, ఆరెపల్లి, కమాన్‌పూర్, ఎలగందల్, నాగులమల్యాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈనెల 4నుంచి కొన్ని కేంద్రాల్లో ధాన్యం తూకం వేసి రైసుమిల్లులకు తరలించగా.. మంగళవారం నుంచి మిగతా కేంద్రాల్లో కాంటా పెడుతున్నారు. ఆయా కేంద్రాలకు అవసరమైన గన్నీ సంచులను పంపించారు. ఒక్కో కేంద్రానికి 10వేల సంచులను అందుబాటులో ఉంచినట్లు సంఘం సీఈవో రమేశ్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నట్లు వివరించారు.

ఫిషరీష్ అధ్యయనంతో భవిష్యత్తు

కరీంనగర్ సిటీ: ఫిషరీష్ అధ్యయనంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుంటుందని ఎస్ఆర్ఆర్ కళాశాల జంతుశాస్త్ర విభాగం అధ్యాపకుడు పర్లపల్లి రాజు తెలిపారు. స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల స్వతంత్ర ప్రతిపత్తిలో జంతుశాస్త్ర విభాగంలోని ఫిషరీస్ విద్యార్థులు కళాశాలలో గల నర్సరీ పాండులో చెన్నాస్ట్రేటర్స్ చేప పిల్లలను అధ్యాపకులతో కలిసి వదిలిపెట్టారు. ఆక్వా కల్చర్, ఆక్వా ఎక్స్పోర్ట్, ఓషోగ్రఫీ మెరిన్ బయో టెక్నాలజీ రంగాల్లో ఫిషరీస్ విద్యార్థులకు బాగుంటుందని తెలిపారు. పీజీ ఆ తరువాత పరిశోధన వైపు ముందుకెళ్లాలని సూచించారు. డాక్టర్ కె.సురేందర్‌రెడ్డి, జీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి.మహేశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.సురేష్‌కుమార్, అధ్యాపకులు సుమలత, సమత, రవళి పాల్గొన్నారు.


ఫిషరీష్ గురించి వివరిస్తున్న రాజు

హోంగార్డుకు సన్మానం


సన్మానిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్‌లోని హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ బి.సమ్మిరెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. కమిషనరేట్ కేంద్రంలో సీపీ అభిషేక్ మహంతి కార్యాలయంలో సమ్మిరెడ్డికి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.5వేల చెక్కును అందజేశారు. విధుల్లో అంకితభావంతో 24 సంవత్సరాలు పోలీస్ శాఖకు సేవలందించి విరమణ పొందినందుకు సీపీ అభినందించారు.



రెట్టల నుంచి విముక్తి..!

నగరపాలక సంస్థ కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహానికి పక్షుల రెట్టల నుంచి ఎట్టకేలకు విముక్తి లభించింది. కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహంపై భారీ వృక్షం ఉండడంతో.. ప్రతిరోజు పక్షులు రెట్టలు వేయడంతో విగ్రహం అపరిశుభ్రంగా మారుతోంది. కొంతమంది ఈ విషయాన్ని బల్దియా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నగరపాలక సంస్థ అధికారులు విగ్రహానికి పైకప్పు నిర్మించారు.

– కరీంనగర్ కార్పొరేషన్



చెత్త బండి.. రోడ్డు ఊడ్చేనండి..!

నగరపాలక సంస్థ ప్రతిరోజు డివిజన్లలోని వీధుల్లో పొడి, తడి చెత్తను వేరు చేస్తూ సంచుల్లో నింపి ట్రాలీల్లో తరలిస్తున్న సంగతి తెలిసిందే. కానీ ఇక్కడ కనిపిస్తున్న ఓ ట్రాలీ మంకమ్మతోటలోని ప్రధాన రహదారి నుంచి చెత్తను సేకరించి రోడ్డును సంచులతో ఊడుస్తుందా అనేలా వెళ్తోంది. దీంతో అక్కడక్కడ చెత్త కింద పడడంతో దుర్వాసన వస్తోందని పలువురు వాపోతున్నారు. చెత్తను ట్రాలీకి సరిపడేలా నింపి.. అవసరమైతే మరోసారి వెళ్లాలని సూచిస్తున్నారు.

– సప్తగిరికాలనీ(కరీంనగర్)

మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న చంద్రశేఖర్

కరీంనగర్ సిటీ: కరీంనగర్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయోకెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడు ఎ.చంద్రశేఖర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా యూనివర్సిటీకి బయోకెమిస్ట్రీ చెందిన ప్రొఫెసర్ కరుణ రూపాల అధికారి పర్యవేక్షణలో స్టడీస్ ఆన్ రీ కాంబినేట్ హ్యూమన్ టీం 23, మైటోకాండ్రియాల్ ప్రోటీన్ ఇంపోర్ట్ రిజెక్టర్ ఫంక్షన్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయన సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీలక్ష్మి, అధ్యాపకుల బృందం అభినందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా: 9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899

పాడిరైతులపై 'సంగం డెయిరీ' దాడి

కర్రలు, రాడ్లు, రాళ్ల దాడిలో 15 మంది ఏలూరు జిల్లా రైతులకు గాయాలు

చేబ్రోలు: ఒప్పందం ప్రకారం తమకు ఇవ్వాల్సిన బోనస్ డబ్బులు ఇవ్వడంలేదనే విషయాన్ని సంగం డెయిరీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని వచ్చిన రైతులపై డెయిరీ కిరాయి సిబ్బంది దాడిచేశారు. కర్రలు, రాడ్లు, రాళ్లతో రైతుల మీద ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. రైతులు వాహనాలు దిగుతుండగానే డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర అనుచరులు బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని సంగం డెయిరీ వద్ద బుధవారం జరిగిన ఈ దాడిలో ఏలూరు జిల్లాకు చెందిన 15 మంది రైతులు గాయపడ్డారు. వీరిలో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం వేములపల్లి, రంగపాలెం గ్రామాల్లో ద్వారకామాయి డెయిరీ పాయింట్‌తో సంగం డెయిరీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం పాడి రైతులకు రూ.50 లక్షల వరకు బోనస్ చెల్లించాల్సి ఉంది. ఈ మిల్క్ సెంటర్ నిర్వాహకులైన వేములపల్లి సర్పంచి ముసులూరి రాము, నర్సనపాలెం సర్పంచి కూరపాటి వెంకటేశ్వరరావు తమ పరిధిలో పాలు సేకరించి సంగం డెయిరీకి సరఫరా చేశారు. ఒప్పందంలో భాగంగా 14% బోనస్ ఇస్తామన్న డెయిరీ అధికారులు తరువాత మాట మార్చి నాలుగు శాతం మాత్రమే ఇస్తామనడంతో వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై అక్కడ పోలీసు స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు కూడా చేశారు. గుడ్ ఫార్మర్స్‌గా గుర్తించి న్యాయం చేస్తామని మిల్క్ సెంటర్ నిర్వాహకులకు, రైతులకు వేములపల్లిలో సంగం డెయిరీ జీఎం కొల్లి ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆ హామీని కూడా నెరవేర్చలేదు. బోనస్ గురించి అడిగితే బోనస్ ఇవ్వడానికి పాలకవర్గం తీర్మానం చేయాల్సి ఉందని, 4% కన్నా ఎక్కువ ఇవ్వడం కుదరదని చెప్పారు. ఈ సమస్యను సంగం డెయిరీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని అక్కడి రైతులు నిర్ణయించారు. దీనిపై వేములపల్లి, రంగపాలెం గ్రామ సర్పంచులతోపాటు సుమారు 30 మంది రైతులు బుధవారం ఆరు వాహనాల్లో సంగం డెయిరీకి వచ్చారు. రైతులకు న్యాయం చేయాలనే నినాదంతో కూడిన ప్లకార్డుల్ని వాహనాల్లో తీసుకొచ్చారు. రైతుల రాకను పసిగట్టిన సంగం డెయిరీ సిబ్బంది, గూండాలు యాజమాన్యం ఆదేశాలతో దౌర్జన్యానికి దిగారు. వందమంది కర్రలు, రాడ్లు, రాళ్లతో రైతులపై దాడిచేశారు. రైతులు కారు దిగతుండగానే మీదపడి కొట్టారు. భయాందోళనలతో పరారవుతున్న రైతులను వెంటపడి మరీ కొట్టి గాయపరిచారు. ఐదుకార్లను ధ్వంసం చేశారు. ఈ దాడిలో 15 మంది రైతులు గాయపడ్డారు.


మాచర్లలో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

ప్రజలతోనే మా పొత్తు

నెరవేర్చిన హామీలే నా ధైర్యం, జనమే నా నమ్మకం

వరికపూడిశెల ఎత్తిపోతలకు శంకుస్థాపనలో సీఎం వైఎస్ జగన్



సాక్షి ప్రతినిధి, గుంటూరు: వచ్చే ఎన్నికల్లో తమ పొత్తు ప్రజలతోనే ఉంటుందని, పేద ప్రజల కోసమే తమ పార్టీ ఉందని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నెరవేర్చిన హామీలు, ప్రజలే తన ధైర్యం, నమ్మకం అని స్పష్టం చేశారు. నేను విన్నాను, నేను ఉన్నాను అని పునరుద్ఘాటించారు. వైఎస్సార్‌కు, వైఎస్ జగన్‌కు తెలిసిందల్లా ప్రజల్లో నడవడం, ప్రజల గుండెల్లో ఉండటమేనన్నారు. పల్నాడు, ప్రకాశం జిల్లాల ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ.. వైఎస్సార్ పల్నాడు కరువు నివారణ పథకం కింద రూ.340.26 కోట్ల వ్యయంతో చేపడుతున్న వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి కీలకమైన అటవీ, పర్యావరణ అనుమతులు సాధించి బుధవారం ఆయన మాచర్లలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గంలో పక్కనే నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ.. సాగు, తాగునీటి ఎద్దడి దశాబ్దాలుగా మన కళ్లెదుటనే కనిపిస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకున్న పరిస్థితులు లేవన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందలేదన్న మాదిరిగా.. సముద్రంలో ప్రయాణిస్తున్న వారికి గుక్కెడు మంచి నీరు దొరకలేదన్న చందంగా ఇన్ని దశాబ్దాల పాటు కృష్ణమ్మ ఒడ్డున ఉన్న ఈ ప్రాంతానికి నది నీరు దక్కలేదని చెప్పారు. ఈ పరిస్థితిలో పల్నాటి ప్రాంత రూపురేఖలు మార్చేలా ఈ రోజు రూ.340 కోట్లతో వరికపూడిశెల ఎత్తిపోతల ద్వారా కృష్ణమ్మ నీరు అందిస్తామని గర్వంగా చెబుతున్నానన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మోసాల మాటలు నమ్మగలమా?

- గత చంద్రబాబు పాలనలో మనం మోసాలు, వెన్నుపోట్లు, అబద్ధాల చరిత్ర చూశాం. ఈ పెద్ద మనిషి 14 ఏళ్లు సీఎంగా పని చేసినప్పటికీ కనీసం ఒక మంచి పని చేశానని చెప్పి ఓటు అడగలేదు. అందుకే మళ్లీ మోసం చేసేందుకు, ప్రజల్ని వెన్నుపోటు పొడిచేందుకు వెనుకాడడు. ఇంటింటికి కేజీ బంగారం, బెంజ్ కారిస్తాను.. ఓటు వేయండి అని చంద్రబాబు అడుగుతాడు. 34 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నా కుప్పం నియోజకవర్గానికి నీరిచ్చిన చరిత్ర లేదు. ఇలాంటి వ్యక్తి మన మాచర్లకు, పల్నాడుకు మరో ప్రాంతానికి నీరు ఇస్తానని చెబితే నమ్మగలమా? కన్నతల్లికి అన్నం పెట్టని వాడు పిన్నమ్మకు మాత్రం బంగారు గాజులు కొనిస్తానని ఒకడు అన్నాడట. ఈ పెద్దమనిషిని చూస్తుంటే ఆ మాటలు గుర్తుకొస్తాయి. చివరికి కుప్పానికి నీళ్లు కావాలన్నా.. కుప్పానికి రెవెన్యూ డివిజన్ కావాలన్నా చేసేది మీ బిడ్డే.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- ఒకాయన ఎప్పుడూ మంచానికే పరిమితమై ఉంటాడట. లేస్తే మనిషిని కాదంటాడట. కానీ మంచంలోంచి లేవడు. చంద్రబాబు పరిస్థితి కూడా ఇంతే. తాను చేసిన మంచి ఏమిటనేది ఎప్పుడూ చెప్పడు. ఆయన 2000 సంవత్సరంలో ఉంటే 2047 గురించి చెబుతాడు. ఇప్పుడేం చేస్తావంటే చెప్పడు. 50 ఏళ్ల విజన్ అంటాడు. 50 ఏళ్ల తర్వా ఏం జరగబోతోందని చెబుతాడట. ఎందుకంటే 50 ఏళ్ల తర్వాత ఎవడుంటాడో? ఎవడు పోతాడో? ప్రజల చెవుల్లో క్యాలీఫ్లవర్ పెట్టడం ఈజీ కదా అని ఆలోచిస్తాడు. ఇలాంటి బాబు మాటలు నమ్మగలమా?

వెన్ను పోటు వీరుడు

- సొంత కూతురును ఇచ్చిన మామనే వెన్నుపోటు పొడిచిన వాడు, రాష్ట్రంలోని కోటీ 50 లక్షల కుటుంబాలకు వెన్నుపోటు పొడవకుండా ఉంటాడా? ఎస్సీ కులాల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అన్నారు. బీసీల తోకలు కత్తిరిస్తానని అహంకారంతో మాట్లాడాడు. ముస్లింలకు, ఎస్టీలకు కనీసం మంత్రి పదవి ఇవ్వని ఈ పెద్దమనిషి.. సమాజంలో ఏ వర్గానికైనా నా ఏనాడైనా న్యాయం చేశాడా? ఇలాంటి ఆయన నేను మారాను అంటే మనం నమ్మగలమా?
- గతంలో ఎన్నికలప్పుడు ప్రతి ఇంటికీ ఓ ఉద్యోగం, ఉద్యోగం ఇవ్వకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి అన్నాడు. జాబు రావాలంటే బాబు రావాలి అని ఊదరగొట్టి మోసం చేశాడు. మన ప్రభుత్వం వచ్చేదాక గవర్నమెంట్ ఉద్యోగాలు 4 లక్షలు ఉంటే మరో 2 లక్షల 7 వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత మన ప్రభుత్వానిది.

బాబు – దత్త పుత్రుడి మోసం

- తన బినామీ భూముల ధర బాగా పెరగాలన్న దుర్బుద్ధితో ఈ పెద్దమనిషి అమరావతిని ఒక రాజధానిగా భ్రమ కల్పించాడు. మూడు ప్రాంతాలకు ఏనాడైనా సమన్యాయం చేశాడా? తన హయాంలో పేదలకు కనీసం సెంటు భూమి కూడా ఇచ్చిన పాపాన పోలేదు. మనం 31 లక్షల ఇంటి స్థలాలను నా అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుంటే కోర్టులకు వెళ్లి ఆపేందుకు కేసులు వేశారు.
- 2014లో ఇదే దత్తపుత్రుడు చంద్రబాబుతో కలిసే పోటీ చేశాడు. కలిసే మేనిఫెస్టో రిలీజ్ చేశాడు. ఆ మేనిఫెస్టోకు నాదీ పూచీ అన్నాడు. వీళ్లద్దరూ అయితే సరిపోరని వీరికి తోడు మోదీ గారి పేరు కూడా తెచ్చుకున్నారు. దారుణంగా ప్రజలను మోసం చేశారు. ఇది గత చరిత్ర. మేమంతా కలిసికట్టుగా మేనిఫెస్టోలో 5 హామీలు చెబితే... నేను దత్తపుత్రుడు కలిశాము కాబట్టి మరో 6 హామీలు ఇస్తున్నామని చెబుతారు. ఇవాళ వీళ్లు మాట్లాడుతున్న మాటలు చూస్తే నిజంగా వీళ్లు మనుషులేనా అనిపిస్తుంది.

బీ'టెక్కు' టమార విద్యలు!

- జూదం, క్రికెట్ బెట్టింగ్‌లలో సిద్ధహస్తుడు
- దౌర్జన్యాలకూ వెనుకాడని నైజం
- బీటెక్ రవిపై నమోదైన కేసులే ఇందుకు నిదర్శనాలు

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల టీడీపీ నేత బీటెక్ రవి దౌర్జన్యాలు, క్రికెట్ బెట్టింగ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా పేరుగాంచాడు. వివాదాస్పద వ్యవహారాలకు కేంద్ర బిందువయ్యాడు. ఇద్దరి మధ్య నెలకొన్న ప్రైవేటు వ్యవహారాల్లోనైనా తనదైన శైలిలో దౌర్జన్యాలకు పాల్పడటం పరిపాటైంది. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపైనా అలాంటి ధోరణినే ప్రదర్శిస్తున్నాడు. వైఎస్సార్ జిల్లాలో నమోదైన కేసులే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇలాంటి ఓ పెండింగ్ కేసులో బీటెక్ రవిని మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి.. కోర్టు ఆదేశాల మేరకు కడప సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు పంపారు. బీటెక్ రవి ఈజీ మనీ సాధించడంలో సిద్ధహస్తుడు. ఈ క్రమంలోనే జూదం, క్రికెట్ బెట్టింగ్‌లు నిత్యకృత్యమయ్యాయి. బెట్టింగ్‌లో చిక్కుకుని యువత ఆత్మహత్యలు చేసుకుంటుండటంతో వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ వీటి నివారణకు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న పోరుమామిళ్లలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతూ సురేష్‌కుమార్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు పోలీసులకు పట్టుబడ్డారు. ఆ మేరకు క్రైమ్ నంబర్ 307/2023 ద్వారా కేసు నమోదైంది. ఇందులో లోతుగా దర్యాప్తు చేస్తే మొత్తం 41 మంది పాత్రధారులు, సూత్రధారుల ప్రమేయం ఉన్న ట్టు తేలింది. అందులో టీడీపీ నేత బీటెక్ రవి ఏ– 17గా ఉండటం విశేషం. ఈ క్రమంలో కోర్టులో పీటీ వారెంట్ వేసి, క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంపై బీటెక్ రవిని విచారించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ప్రైవేటు వ్యవహారంలో సైతం..

పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం నాగులగట్టుపల్లెలో గోవిందు రామయ్యకు చెందిన భూమిని రమణ, సుబ్బయ్యలు కొని.. వెంచర్ వేశారు. స్థానిక టీడీపీ నేత మహేశ్వరరెడ్డికి వారితో వివాదం ఏర్పడితే.. ఏప్రిల్ 30న బీటెక్ రవి మందీమార్బలంతో వాహనాలతో వెళ్లి రమణ, సుబ్బయ్యలపై దౌర్జన్యం చేసి, వెంచర్‌ను సైతం ట్రాక్టర్లతో దున్నేశారు. అప్పట్లో క్రైమ్ నంబర్ 40/2023 ద్వారా కేసు నమోదైంది. ఇలాంటి పరిస్థితి పోలీసు ఆఫీసర్‌కూ ఎదురైంది. ఈ ఏడాది జనవరి 26న కడప ఎయిర్‌పోర్టుకు టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వస్తున్న నేపథ్యంలో అక్కడికి బీటెక్ రవి తన అనుచరులతో కలిసి వెళ్లాడు. మూకుమ్మడిగా ఎయిర్‌పోర్టులోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ దివాకర్ అడ్డుకునే యత్నం చేశారు. బీటెక్ రవి.. అతడిని తోసేయడంతో కింద పడిపోయారు. కాలు ఫ్యాక్చర్ అయ్యింది. ఈ కేసులో బీటెక్ రవి ప్రధాన నిందితుడు. ఇలాంటివి ఆయన జీవితంలో సర్వసాధారణమని చెబుతున్నారు. కాగా బీటెక్ రవిపై 9 కేసులు వివిధ దశల్లో ఉన్నాయి.

చంద్రబాబు ప్రోద్బలంతోనే స్కిల్ కుంభకోణం

ముందే రూ.330 కోట్లు విడుదల చేసేశారు

- అతనికి బెయిల్ ఇస్తే దర్యాప్తుపై తీవ్ర ప్రభావం
- హైకోర్టుకు నివేదించిన ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి సీమెన్స్ సంస్థ తాను వెచ్చించాల్సిన 90 శాతం నిధులను ఖర్చుచేయకముందే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ.330 కోట్లను విడుదల చేసేసిందని, దీని వెనుక కుట్ర, ముందస్తు వ్యూహాలు ఉన్నాయని సీఐడీ తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఇలా చేయడం ద్వారా రూ.214 కోట్లను పలు షెల్ కంపెనీల ద్వారా దారిమళ్లించారని తెలిపారు. నిధుల మళ్లింపును ఫోరెన్సిక్ ఆడిట్ సైతం ధ్రువీకరించిందని చెప్పారు. ఈ కుంభకోణం గత ప్రభుత్వ హయాంలోనే బయటపడిందని, దీనిపై ఏసీబీ విచారణ కూడా జరిగిందని తెలిపారు. అయితే ఈ కుంభకోణంలో అప్పటి ప్రభుత్వ పెద్దల పాత్ర ఉండటంతో అది బయటకు రాకుండా తొక్కిపెట్టారని వివరించారు. 2018లో జరిగిన కుంభకోణంపై సీఐడీ చేస్తున్న దర్యాప్తును రాజకీయ ప్రేరేపితమని, రాజకీయ కక్షసాధింపు అని చెప్పడం దారుణమన్నారు. ఈ కుంభకోణం వెనుక అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారని చెప్పారు. ఇందుకు నోట్‌ఫైళ్లే సాక్ష్యమన్నారు. చంద్రబాబు ప్రోద్బలంతోనే రూ.330 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఈ విషయంలో ఆర్థికశాఖ అభ్యంతరాలను సైతం చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. టీడీపీ అధినేతగా, మాజీ ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు ఎంతో పలుకుబడి ఉందని, అందువల్ల ఈ కేసులో ఆయనకు బెయిల్ ఇస్తే దర్యాప్తునకు తీవ్ర విఘాతం కలుగుతుందని చెప్పారు. పైపెచ్చు దర్యాప్తు కీలకదశలో ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. చంద్రబాబు తన ప్రధాన బెయిల్ పిటిషన్‌లో ఇప్పటివరకు వాదనలు వినిపించలేదన్నారు. వాదనలు వినిపించినట్లు ఆయన న్యాయవాదులు చెబుతున్న నేపథ్యంలో ఆ వివరాలను రికార్డ్ చేయాలని సుధాకర్ రెడ్డి కోర్టును కోరారు. చంద్రబాబు న్యాయవాదులు కేవలం మధ్యంతర బెయిల్‌పై మాత్రమే వాదనలు వినిపించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కోర్టు సమయం ముగియడంతో తదుపరి వాదనల నిమిత్తం విచారణ గురువారానికి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ మల్లికార్జునరావు విచారించారు.

ప్రచార అనుమతి లెక్కల్లో తేడాలు

- రశీదులో కొట్టివేతలు
- మున్సిపల్ అధికారుల తీరుపై అనుమానాలు


రిజిష్టర్‌లో రూ.10 వేలుగా నమోదు చేసిన వైనం



రశీదులో కొట్టివేసిన వైనం

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలకు అనుమతి ఇవ్వడానికి బెల్లంపల్లి మున్సిపల్ అధికారులు చిత్రవిచిత్రంగా వ్యవహరిస్తున్నారు. అభ్యర్థుల నుంచి వసూలు చేస్తున్న నగదు లెక్కలను తారుమారు చేస్తున్నారు. రికార్డుల్లో పొంతన లేకుండా నమోదు చేయడం విస్మయం కలిగిస్తోంది. ఈ వ్యవహారంలో మున్సిపల్ అధికారులు ఉద్దేశపూర్వకంగా అక్రమాలకు పాల్పడ్డారా? అనే అనుమానాలు పురప్రజల్లో కలుగుతున్నాయి. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు మున్సిపాలిటీలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, జెండాలు, పార్టీ కటౌట్లు ఇతరత్రా ప్రచార కార్యక్రమాల నిర్వహణకు బల్దియా నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సదరు అభ్యర్థుల నుంచి నిర్దేశించిన ప్రకారంగా మున్సిపల్ అధికారులు రుసుము వసూలు చేస్తారు. కానీ ఓ రాజకీయ పార్టీకి అందించిన రశీదులో ఓ తీరుగా, మున్సిపల్ అంతర్గత రిజిష్టర్, రశీదులో మరోతీరుగా బిల్లుల లెక్క నమోదు చేశారు. దీని వెనుక అక్రమాలు ఏమైనా చోటు చేసుకున్నాయా? అనే సందేహాలు పురప్రజల్లో కలుగుతున్నాయి.

ఏం జరిగిందంటే..

బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య ఈ నెల 10న కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాల కోసం రూ.15 వేల రుసుము చెల్లించి మున్సిపల్ నుంచి అనుమతి తీసుకున్నారు. సదరు దరఖాస్తు దారునికి డబ్బులు చెల్లించిన ప్రకారమే రశీదును అందించినట్లు తెలుస్తోంది. కానీ మున్సిపల్ అంతర్గత రికార్డుల్లో మాత్రం రూ.10 వేలుగా నమోదు చేశారు. సాక్షాత్తూ మున్సిపల్ కమిషనర్ రూ.15 వేలు ఉన్న చోట కొట్టి వేసి రూ.10 వేలుగా మార్పుచేసి సంతకం చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో మున్సిపల్ అధికారులు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారా? లేక బాధ్యతలను ఉల్లంఘించారా? అనే నిగ్గు తేలాల్సి ఉంది.

సర్వీసు ఓటర్లు 587 మంది

- జిల్లాలో 564 మంది పురుషులు, 23 మంది మహిళలు
- ప్రాక్సీ ఓటింగ్‌కు అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం

కరీంనగర్ జిల్లాలో ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	సర్వీసు ఓటర్లు	పురుషులు	మహిళలు
కరీంనగర్	3,55,054	102	90	12
చొప్పదండి	2,32,990	193	190	03
మానకొండూరు	2,21,613	128	126	02
హుజూరాబాద్	2,49,558	164	158	06

కరీంనగర్‌రూరల్: దేశ రక్షణకు నిరంతరం సేవలందించేది సైనికులు. కంటిమీద కునుకు లేకుండా రాత్రివేళల్లో విధులు నిర్వహిస్తారు. అలాంటివారు ప్రజాస్వామ్య పటిష్టతకు కారణమైన ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఓటరుగా నమోదైన సైనికులకు ప్రాక్సీ విధానంలో ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. కరీంనగర్ జిల్లాలో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ తదితర రక్షణ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులను సర్వీసు ఓటర్లుగా గుర్తించారు. జిల్లాలో మొత్తం 587 మంది ఉండగా వీరిలో పురుషులు 564 మంది, మహిళలు 23 మంది. చొప్పదండి నియోజకవర్గంలో అత్యధికంగా 193 మంది, కరీంనగర్‌లో తక్కువగా 102 మంది ఉన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి..

ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో పని చేస్తున్న సీఆర్‌పీఎఫ్, ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌లోని ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ప్రాక్సీ విధానం తీసుకువచ్చింది. దీనివల్ల వీళ్లందరూ తాము పని చేస్తున్న ప్రాంతం నుంచి ఓటు వినియోగించుకునే అవకాశం కలిగింది. ప్రతిపాదించిన వ్యక్తులు వారి తరఫున ఓటేస్తారు. అయితే ముందుగా ప్రాక్సీ ఓటు కోసం సంబంధిత రిటర్నింగ్ అధికారికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పేరు, చిరునామా, నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం, ఓటు వేసేందుకు ప్రతిపాదిస్తున్న వ్యక్తి పేరు, ఓటరు గుర్తింపు కార్డు తదిత ర వివరాలను నమోదు చేయాలి. ప్రాక్సీ ఓట్ల సమాచారాన్ని రిటర్నింగ్ అధికారి సంబంధిత పోలింగ్ కేంద్ర సిబ్బందికి అందిస్తారు. ప్రాక్సీ ఓటేసేవాళ్లు అదే పోలింగ్ కేంద్రానికి చెందినవారై ఉండాలి. ఓటేసిన వ్యక్తి కుడి చేతి చూపుడు వేలికి సిబ్బంది సిరా చుక్కా అంటిస్తారు.

సూచించిన వ్యక్తులకే..

కరీంనగర్ జిల్లాలోని సైనికులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించాం. వారు ప్రాక్సీ విధానంలో ఓటేసేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు పంపించే ఏర్పాట్లు చేశాం. సంబంధిత రిటర్నింగ్ అధికారికి ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు ఆధారంగా ఉద్యోగులు సూచించిన వ్యక్తులకు ఓటేసే అవకాశం కల్పిస్తాం. – నవీన్, తహసీల్దార్, సహాయక ఎన్నికల అధికారి, కరీంనగర్ నియోజకవర్గం

మంచిర్యాలకు సీసీఎఫ్ కార్యాలయం తరలింపు

- సీసీఎఫ్‌గా శాంతారామ్ నియామకం
- గత నెల 31న బాధ్యతలు స్వీకరణ


మంచిర్యాలలోని సీసీఎఫ్ కార్యాలయం

మంచిర్యాలక్రైం: బెల్లంపల్లిలో కొనసాగుతున్న సీసీఎఫ్ (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) కార్యాలయాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రానికి తరలించడంతో సిబ్బందిలో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతన జోనల్ విధానం అమలుకు ముందు సీసీఎఫ్ కార్యాలయం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్‌లో ఉండేది. జోనల్ విధానం అమలైన తర్వాత నిర్మల్ నుంచి మంచిర్యాలలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కానీ ఇక్కడ వసతులు సరిగాలేవని అప్పటి సీసీఎఫ్ అధికారి వినోద్‌కుమార్ బెల్లంపల్లిలోని అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసి అక్కడి నుంచే విధులు నిర్వర్తించారు. ఆయన పదవీకాలం పూర్తి కావడంతో ఆస్థానంలో కాళేశ్వరం జోన్ కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ సర్కిల్‌కు ఈ ఏడాది అక్టోబర్ 30న సీసీఎఫ్‌గా శాంతారామ్‌ను నియమించారు. ఈ మేరకు 31న బెల్లంపల్లిలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. 16 రోజుల పాటు అక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహించారు. ఈనెల 15న బుధవారం కార్యాలయాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణకు జిల్లాలోని అటవీశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తామన్నారు. జిల్లా అటవీశాఖ కార్యాలయాన్ని ఎఫ్‌డీవో కార్యాలయానికి తరలించనున్నట్లు తెలిపారు.

తెలుగు బుక్‌ఆఫ్ రికార్డులో చోటు


ప్రశంసపత్రం అందుకుంటున్న భావన రోహిణి

మంచిర్యాలఅర్బన్: స్థానిక హరినామ స్మరణ బృందగానం హరిసుందర నందగానం నిర్వహించిన బృందవనం టీం లీడర్ భావన రోహిణి గంగాధర్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. బుధవారం రాత్రి హైటెక్‌సిటీలోని హరిహర క్షేత్రంలో 11 సార్లు, 11 మంది సంగీత విద్వాంసులతో, 111 మంది గాయకులతో 111 నిమిషాల పాటు హరినామ స్మరణ, హరిసుందర గానం చేసినందుకు సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సతీష్, కౌన్సిలర్ చైతన్య సత్యపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో హైటెక్ సిటీ కాలనీ సభ్యులు హన్మంతరావు, ముడుపు రాంప్రకాశ్, బోడ రాజమౌళి, పురేళ్ల పోచమల్లు, రవి, గురుస్వామి క్రిష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని ఆర్యభట్ట ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉమ్మడి జిల్లా అండర్ –14, 17 విభాగం బాలబాలికల జోనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సీహెచ్ కాంతారావు ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు సంబంధిత వయస్సు ధ్రువీకరణ పత్రంతో పాటు 4సెట్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు తప్పకుండా వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. అర్హత కల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు పోటీల ఆర్గనైజర్ రాష్ట్రపాల్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 7702035200 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కామారెడ్డిలో వార్ వన్‌సైడే..


విలేకరులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

- రేవంత్ గెలుపు ఖాయమవడంతో తోకముడిచిన కేసీఆర్
- బీఆర్‌ఎస్ అవినీతి కారణంగా జీతాలు చెల్లించలేని స్థితి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: కామారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గెలుపు ఖాయమవడంతో సీఎం కేసీఆర్ తోకముడిచి.. గజ్వేల్‌కే పరిమితమయ్యారని, అక్కడా ఆయనకు భంగపాటు తప్పదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డ కుంగిపోవడంతో నీరంతా సముద్రం పాలైందన్నారు. ఒక్క లిఫ్టుతో పూర్తి కావాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టును కమీషన్ల యావతో మరో రెండు లిఫ్టులు ఏర్పాటు చేశారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ అవినీతితో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొందన్నారు. బిశ్వాల్ కమిటీ నివేదిక మేరకు 2022మార్చి నాటికే రాష్ట్రంలో లక్షా 91వేల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, ఇంటికో నిరుద్యోగి ఉన్నారని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 317జీవోతో ఉద్యోగ భద్రత కరువైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 317జీవోను సవరించి, ఉమ్మడి పది జిల్లాల ప్రాతిపదికన జోన్ల వ్యవస్థ ఏర్పాటు చేసి, స్థానికత ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు చేపడతామన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రాబోయే ఐదేళ్లలో 6లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. సంక్షేమంతోపాటు శాశ్వత ప్రయోజనం ఒనగూర్చే లక్ష్యం నెరవేరలేదని, ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో 1989 ఫలితాలు పునరావృతం కాబోతున్నాయని, అత్యధిక సీట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందన్నారు. బండ శంకర్, గాజంగి నందయ్య, కల్లెపెల్లి దుర్గయ్య, ధర రమేష్, జున్ను రాజేందర్, ముంజాల రఘువీర్, లైశెట్టి విజయ్, చాంద్ పాషా ఉన్నారు.

ఉమ్మడి జిల్లా ఓటర్లు 29,38,429 మంది

- అత్యధికంగా కరీంనగర్, అత్యల్పంగా సిరిసిల్లలో
- అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలే అధికం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఓటర్ల సంఖ్య మరింత పెరిగింది. గత నెల అక్టోబర్ నాలుగో తేదీన ఓటర్ల తుది జాబితాను అధికారులు విడుదల చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కొరకు చివరి అవకాశం కల్పించారు. గత నెల 31 వరకు దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు పరిశీలన అనంతరం అర్హులకు ఓటు హక్కు కల్పించి తుది జాబితా బుధవారం విడుదల చేశారు. దీని ప్రకారం ఉమ్మడి జిల్లాలో 29,38,429 ఓటర్లు ఉండగా, అత్యధికంగా కరీంనగర్, అత్యల్పంగా సిరిసిల్ల జిల్లాలో ఓటర్లు ఉన్నారు. మొత్తంగా అన్ని నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు.

జిల్లాల వారీగా ఓటర్ల వివరాలు

జగిత్యాల	: 6,99,427
పెద్దపల్లి	: 7,12,359
కరీంనగర్	: 10,59,802
సిరిసిల్ల	: 4,66,836
మొత్తం	: 29,38,429





వరల్డ్ రికార్డ్

ఎవరెస్ట్ జంప్

41 ఏళ్ల భారతీయ మహిళా స్కై డైవర్ శీతల్ మహాజన్ ఎవరెస్ట్ ఎదుట పక్షిలా ఎగిరారు. హెలికాప్టర్‌లో ఎవరెస్ట్ ఒడిలో 21,500 అడుగుల ఎత్తు నుంచి దూకి ఊపిరి బిగపట్టి చూసే జంప్‌ను పూర్తి చేసి ప్రపంచ రికార్డు సాధించారు. నవంబర్ 13న ఆమె ఈ ఘనత సాధించారు. ఆ సాహసం వెనుక కథనం.

‘స్కై డైవింగ్ చేసి కాళ్లూ చేతులూ విరిగితే నిన్ను ఎవడు పెళ్లి చేసుకుంటాడు’ అని ఇంటివాళ్ల చేత చివాట్లు తిన్న అమ్మాయి రికార్డుల మీద రికార్డులు సాధిస్తూ ఇంటివారినే కాదు ప్రపంచాన్ని కూడా నివ్వెర పరుస్తూనే ఉంది.

41 ఏళ్ల శీతల్ మహాజన్ ఎవరెస్ట్ చెంత సముద్ర మట్టానికి 21,500 అడుగుల ఎత్తున హెలికాప్టర్‌లో నుంచి జంప్ చేసి 17,444 అడుగుల ఎత్తు మీదున్న కాలాపత్థర్ అనే చోట సేఫ్‌గా ల్యాండ్ అయ్యింది. ఊపిరి బిగ పట్టి చూడాల్సిన సాహసం ఇది. గడ్డ కట్టే చలిలో, ఆక్సిజన్ అందని ఎత్తు నుంచి, ఎవరెస్ట్ సానువుల వంటి ప్రమాదకరమైన చోట ఒక మహిళ ఇలా జంప్ చేయడం ప్రపంచ రికార్డు. ఇప్పటివరకూ ప్రపంచంలో ఏ మహిళా ఇంత ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేయకపోవడం మరో రికార్డు. ఫ్రాన్స్‌కు చెందిన దిగ్గజ స్కై డైవర్ పాల్ హెన్రీ ఇందుకు గైడ్‌గా వ్యవహరిస్తే నీతా అంబానీ, అనంత్ అంబానీ తదితరులు స్పాన్సరర్స్‌గా వ్యవహరించారు.



స్త్రీలు ఎందుకు చేయలేరు?

శీతల్ మహాజన్‌ది పూణె. తండ్రి కమలాకర్ మహాజన్ టాటా మోటార్స్‌లో ఇంజినీర్‌గా చేసేవాడు. ఇంటర్ చదువుతూ ఉండగా ‘నీ చదువుతో నువ్వు హ్యాపీగా ఉన్నావా?’ అని తండ్రి అడిగిన ప్రశ్న ఆమెలో సంచలనం రేపింది. ‘సైన్స్ చదవాలనుకుని చేరాను. కాని ఇలా చదవడం కాకుండా ఇంకేదో చేయాలి. ఎవరూ చేయనిది చేయాలి. అదే నాకు సంతోషాన్ని ఇస్తుందని గ్రహించాను’ అంటుంది శీతల్. ఆ తర్వాత ఆమె గూగుల్ చేయడం మొదలెట్టింది– భారతీయ స్త్రీలు ఎక్కువగా లేని రంగంలో ఏదైనా సాధించాలని. అలా తారసపడినదే స్కై డైవింగ్. ‘అప్పటికి మన దేశంలో స్కై డైవింగ్‌లో రేచల్ థామస్ వంటి ఒకరిద్దరు తప్ప ఎక్కువ మంది స్త్రీలు లేరు. నేనెందుకు చేయకూడదు అనుకున్నాను. 22 ఏళ్ల వయసులో నార్త్‌పోల్‌లో మొదటి స్కై డైవింగ్ చేశాను. ఈ ఘనత సాధించిన మొదటి భారతీయ స్త్రీని నేనే’ అంటుంది రేచల్.

15 లక్షల ఖర్చుతో

2004లో శీతల్ తండ్రి జీతం 18 వేలు. కాని ఆ సంవత్సరం శీతల్ నార్త్‌పోల్‌లో స్కై డైవింగ్ చేయాలని నిశ్చయించుకున్నప్పుడు అందుకు అయ్యే ఖర్చు 15 లక్షలు. దాని కంటే ముందు ‘నువ్వు ఆడపిల్లవు. ఇలాంటి వాటికి పనికిరావు’ అన్నారు అంతా. ‘నన్ను ఆ మాటలే ఛాలెంజ్ చేశాయి’ అంటుంది శీతల్. అప్పటివరకూ శీతల్ విమానం కూడా ఎక్కలేదు. పారాచూట్ జంప్ అసలే తెలియదు. ఏ ట్రైనింగ్ లేదు. అయినా సరే స్పాన్సర్లను వెతికి నార్త్‌పోల్‌కు వెళ్లింది. అయితే అక్కడి ఇన్‌స్ట్రక్టర్లు ఆమెను వెనక్కు వెళ్లమన్నారు. ‘ఇంతకుముందు ఒక మహిళ ఇలాగే నార్త్‌పోల్‌కు వచ్చి జంప్ చేయబోయి మరణించింది. అందుకని వారు అంగీకరించలేదు. నేను పట్టువదలక వారంపాటు అక్కడే ఉండి మళ్లీ సంప్రదించాను. ఈసారి అంగీకరించారు’ అంది శీతల్. 2004 ఏప్రిల్ 18న నార్త్‌పోల్‌లో మైనస్ 37 డిగ్రీల ఉష్ణోగ్రతలో తన మొదటి జంప్ చేసింది. అలా లోకానికి సాహసిగా పరిచయమైంది.

ఎన్నో రికార్డులు

ఆ తర్వాతి నుంచి శీతల్ స్కై డైవింగ్‌లో రికార్డులు సాధిస్తూనే ఉంది. ఆ వెంటనే ఆమె అంటార్కిటికాలో స్కై డైవింగ్ చేసింది. ఇప్పుడు ఎవరెస్ట్ శిఖరం ఎదుట స్కై డైవింగ్ చేయడంతో భూమ్మీద ఉన్న రెండు ధ్రువాలతో పాటు మూడో ధ్రువం వంటి ఎవరెస్ట్ దగ్గర కూడా జంప్ చేసిన ఏకైక మహిళగా రికార్డు స్థాపించింది. అంతేకాదు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన వైభవ్ రాణెను హాట్ ఎయిర్ బెలూన్‌లో 5,800 అడుగుల ఎత్తులో వివాహం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. శీతల్‌కు కవల అబ్బాయిలు. ‘పెళ్లయ్యి పిల్లలు పుట్టాక మహిళ జీవితం కెరీర్ పరంగా అంతమైనట్టేనని అందరూ అనుకుంటారు. నేను కూడా ఆగిపోతానని కొందరు ఆశపడ్డారు. నేను ఆ తరహా కాదు. పిల్లల్ని తల్లిదండ్రులు కలిసి పెంచాలి. తల్లి మాత్రమే కాదు. నేను నా పిల్లల్ని పెంచుతాను... అలాగే నా కెరీర్‌ని కూడా కొనసాగిస్తాను. నిజానికి పెళ్లయ్యాకే అమెరికా వెళ్లి స్కై డైవింగ్‌లో ఉత్తమ శ్రేణి ట్రైనింగ్ తీసుకున్నాను’ అంటుందామె. ఇప్పుడు పూణెలో స్కై డైవింగ్ అకాడెమీ తెరిచి స్కై డైవింగ్‌లో శిక్షణ ఇస్తోంది.

బయటకు రండి

స్త్రీలు నాలుగ్గోడల నుంచి బయటకు వచ్చి లోకాన్ని చూడాలి... తమలోని సామర్థ్యాలను తెలుసుకుని వాటిని సానబట్టుకోవాలి... విజయం సాధించాలి... భారతీయ స్త్రీలు సాధించలేనిది లేదు... వారికి కావాల్సింది అవకాశమే అంటున్న శీతల్ కచ్చితంగా ఒక గొప్ప స్ఫూర్తి.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వచ్చిన తరువాత చాలా ప్రాంతాల మధ్య దూరం తగ్గిపోయింది. కానీ టికెట్ ఖరీదు కాస్త ఎక్కువగా ఉండడంతో కొంతమంది దాని దరిదాపుల్లోకి కూడా వెళ్లడం లేదు. ఇలా వందేభారత్‌కు దూరంగా ఉన్న గ్రామానికి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను తీసుకొచ్చి అబ్బుర పరుస్తోంది పూర్ణిమా ముర్ము. అవును మీరు కరెక్ట్‌గానే చదివారు. మారుమూల గ్రామానికి వందే భారత్‌ను తీసుకొచ్చి అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది పూర్ణిమ.

వందే సృజన!



జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు పక్కనే ఉన్న ఓ గ్రామం పేరు జొండరాగోడ. ఈ గ్రామానికి చెందిన విద్యార్థే పూర్ణిమా ముర్ము. గిరిజనులు ఎక్కువ ఉండే ఈప్రాంతంలో దీపావళి సమయంలోనే సోహ్రాయ్ పండుగను ఎంతో వేడుకగా జరుపుకుంటారు. దీపావళి రెండో రోజున జరుపుకునే ఈ పండక్కి గిరిజనులంతా... తమ మట్టి ఇళ్లను శుభ్రం చేసి, రకరకాల సాంప్రదాయ డిజైన్లతో పెయింట్ వేస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పూర్ణిమ తన ఇంటిని వందే భారత్ చిత్రంతో నింపేసింది.



మట్టింటికి ముచ్చటగా..

గ్రామంలో ఎంతో సంతోషంగా ఆర్భాటంగా జరుపుకునే పండగను మరింత బాగా జరుపుకోవాలన్న ఉద్దేశ్యంతో హైస్పీడ్ ట్రైన్‌తో ఇంటిని అలంకరించాలనుకుంది పూర్ణిమ. గ్రామవాసులు సహజసిద్ధ పదార్థాలతో తయారు చేసే రంగుల నుంచి.. తెలుపు, నీలం, నల్లరంగులు తీసుకుని ఇంటి గోడపైన వందేభారత్ రైలు బొమ్మను చక్కగా చిత్రించింది. రైలు బొమ్మ ఆకర్షణీయంగా ఉండడంతో గ్రామస్థులు పూర్ణిమ ఇంటిని చూసేందుకు ఎగబడుతున్నారు.

‘‘గ్రామంలోని చాలామందికి ‘వందేభారత్ రైలు’ ఎలా ఉంటుందో తెలియదు. దీని గురించి వినడమేగాని చూసింది లేదు. అందుకే అందరికీ వందేభారత్‌ను పరిచయం చేయాలన్న ఉద్దేశ్యంతో రైలు బొమ్మను చిత్రించాను. నిజానికి నేను కూడా ఇప్పటిదాకా వందేభారత్ చూసింది లేదు. ఫోన్‌లో వందే భారత్ బొమ్మను చూసి గీశాను. అచ్చం వందే భారత్‌ను పోలి ఉండడంతో నా పెయింటింగ్ గురించి తెలిసిన వారంతా చూడడానికి వస్తున్నారు. రైలు పెయింటింగ్ వేసిన తరువాత ఇంట్లో ఉన్నట్టుగా గాక, ట్రైన్‌లో ఉన్నట్టు ఉంది’’ అని సంతోషంగా చెబుతోంది పూర్ణిమ.

వేడుకల్లో వందేభారత్ రైలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పెయింటింగ్‌ను చూసిన గ్రామస్థులంతా.. ‘‘మేమయితే ఇంతవరకు ఈ రైలు ఎక్కలేదు. కనీసం ఇలాగైనా చూడగలుగుతున్నాం. వందే భారత్‌ను పూర్ణిమ చక్కగా వేసింది’’ అని మెచ్చుకుంటున్నారు. పిల్లలైతే కొత్త రైలు తమ ఊరు వచ్చిందని తెగ సంబరపడిపోతున్నారు.

సినిమా



సూపర్ స్టార్ కృష్ణ ప్రథమ వర్ధంతి హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హీరో మహేశ్ బాబు, నమ్రత, వీకే నరేష్, సుధీర్ బాబు, మంజుల, అశోక్ గల్లాతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొని, కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

శైలు పాత్ర సవాల్‌గా అనిపించింది

- పాయల్ రాజ్‌పుత్



‘‘‘మంగళవారం’ సినిమాలో నేను చేసిన శైలు పాత్ర సవాల్‌గా అనిపించింది.. అందులో నటించడం చాలా కష్టమైంది. ఎందుకంటే.. శైలు పాత్రకి, నిజ జీవితంలో నాకు 10శాతం కూడా సంబంధం లేదు. ఈ చిత్రంలో చాలా భావోద్వేగాలున్నాయి. చాలా సున్నితమైన అంశాన్ని చర్చించాం. అజయ్ భూపతిగారిపై నమ్మకంతో ఆయన చెప్పినట్లు చేశా. సినిమా చూశాక శైలు పాత్రపై ప్రేక్షకుల్లో సానుభూతి వస్తుంది’’ అని హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ అన్నారు. అజయ్ భూపతి దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా నటించిన చిత్రం ‘మంగళవారం’. ఎం.సురేష్ వర్మ, స్వాతి రెడ్డి గునుపాటి నిర్మించిన ఈ చిత్రం రేపు(శుక్రవారం) విడుదలఅవుతోంది. ఈ సందర్భంగా పాయల్ రాజ్‌పుత్ మీడియాతో మాట్లాడుతూ...

- ‘ఆర్‌ఎక్స్ 100’ సినిమా తర్వాత నాకు సరైన హిట్ రాలేదు. ఆ చిత్రంతో నాకు సూపర్ హిట్ ఇచ్చిన అజయ్ సర్‌కి ఫోన్ చేసి, ‘సార్... నాకు మరో సినిమా అవకాశం ఇవ్వండి.. నా కెరీర్‌కి హెల్ప్ అవుతుంది’ అంటూ వెంటపడేదాన్ని. ‘చిన్న చిన్న పాత్ర కాకుండా మంచిది వస్తే తప్పకుండా ఫోన్ చేస్తా’ అని చెప్పారాయన. ‘మంగళవారం’ చిత్రానికి ఆడిషన్స్ చేసి, నేను సరిపోతానని ఎంచుకున్నారాయన. ఈ మూవీ తెలుగులో నాకు టర్నింగ్ పాయింట్, కమ్ బ్యాక్ అవుతుందని ఆశిస్తున్నా.
- అజయ్‌గారు శైలు పాత్ర గురించి చెప్పినప్పుడు నిజమేనా? అని అడిగా. నేను ఇంటెన్స్, డార్క్ రోల్స్ చేశాను కానీ ఇటువంటి సినిమా, క్యారెక్టర్ చేయలేదు. శైలు పాత్ర హెయిర్ స్టైల్, మేకప్ కోసం ప్రతి రోజూ రెండు గంటలు పట్టేది. అవుటాఫ్ బాక్స్ సినిమా చేశాం. ఇండియాలో ఈ టైపు పాత్ర, కథతో ఎవరూ ఇప్పటి వరకూ సినిమా చేయలేదు. ఈ సినిమాని ఎక్కడా రాజీ పడకుండా తీసిన సురేష్ వర్మ, స్వాతి రెడ్డిగార్లకు థ్యాంక్స్.

థ్రిల్లింగ్ దూత



నాగచైతన్య నటించిన తొలి వెబ్ సిరీస్ ‘దూత’. ఎనిమిది ఎపిసోడ్ల సూపర్ నేచురల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ వెబ్ సిరీస్‌కు విక్రమ్ కె.కుమార్ దర్శకత్వం వహించారు. పార్వతి, ప్రియా భవానీ శంకర్, ప్రాచీ దేశాయ్ కీలక పాత్రల్లో నటించారు. ఇందులో సక్సెస్‌ఫుల్ జర్నలిస్ట్ సాగర్ పాత్రలో నటించారు నాగచైతన్య. శరత్ మరార్ నిర్మించిన ఈ వెబ్ సిరీస్ డిసెంబరు 1 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ‘‘అనూహ్యమైన కథ, కథనాలతో ‘దూత’ సిరీస్ వీక్షకులను మెప్పిస్తుంది’’ అన్నారు శరత్ మరార్, ప్రైమ్ వీడియో ప్రముఖ ప్రతినిధి అపర్ణ పురోహిత్. ఈ వెబ్ సిరీస్‌కు సంగీతం: ఇషాన్ చాబ్రా, కెమెరా: మికోలజ్ సైగుల.



"‘కోటబొమ్మాళి పీఎస్’ సినిమాలోని ‘లింగిడి లింగిడి..’ పాట ఇంత వైరల్ కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ సాంగ్ వల్లే నాకు మరింత గుర్తింపు వచ్చింది. అలాగే సినిమాకు కూడా ఇంత మంచి బజ్ వచ్చింది. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది" అని హీరోయిన్ శివానీ రాజశేఖర్ అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ జంటగా శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలకపాత్రలు పోషించిన చిత్రం ‘కోట బొమ్మాళి పీఎస్’. తేజా మార్ని దర్శకత్వం వహించారు. ‘బన్నీ’ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివానీ రాజశేఖర్ పంచుకున్న విశేషాలు...

గ్లామర్ పాత్రలు చేస్తా

- శివానీ రాజశేఖర్

- ‘నెంజుకు నీది’ అనే తమిళ చిత్రంలో నేను గిరిజన అమ్మాయిగా చేశా. నా నటన నచ్చి, ‘కోటబొమ్మాళి పీఎస్’ కథని వినిపించారు తేజామార్నిగారు. మలయాళ హిట్ చిత్రం ‘నాయట్టు’ కి ‘కోటబొమ్మాళి పీఎస్’ రీమేక్ అయినప్పటికీ తెలుగు ప్రేక్షకులకు అర్థమయ్యేలా కథలో మార్పులు చేశారు. ఒరిజినల్ చూసినవారు కూడా ఈ సినిమాని ఫ్రెష్‌గా ఫీల్ అవుతారు. ఇందులో లేడీ పోలీస్ కానిస్టేబుల్ పాత్ర చేశాను. ఈ సినిమా కోసం శ్రీకాకుళం యాస కూడా నేర్చుకున్నా.
- ఈ మూవీలో శ్రీకాంత్‌గారితో పనిచేయడం వల్ల దర్శకుడికి గౌరవం ఇవ్వడం, సమయానికి సెట్‌కి రావడం వంటి చాలా విషయాలు నేను, రాహుల్ నేర్చుకున్నాం. వరలక్ష్మీ శరత్ కుమార్‌గారి పాత్ర కూడా ఇందులో హైలెట్‌గా ఉంటుంది. ఈ సినిమాని ఇంత గ్రాండ్‌గా తీసిన ‘బన్నీ’ వాస్, విద్యా కొప్పినీడిగార్లకు కృతజ్ఞతలు. నటిగా గ్లామర్ రోల్స్, కమర్షియల్ రోల్స్‌కి నేను సిద్ధం. కానీ, రచయితలు, దర్శకులు అలాంటి పాత్రలు నాకు చెప్పడం లేదు.. వాటి కోసం వేచి చూస్తున్నా.
- చిన్నప్పటి నుంచి అమ్మానాన్నలను(జీవిత–రాజశేఖర్) చూసి పెరగడం వల్ల నాకు, చెల్లికి (శివాత్మిక) ప్రతిదీ నేర్చుకునే విషయంలో అనుభవం వచ్చింది. కష్టపడటమే మన చేతుల్లో ఉంది.. ఫలితం, విజయం అన్నవి వాటంతటఅవే వస్తాయి. నా, శివాత్మిక కథల విషయంలో అమ్మ, నాన్న జోక్యం చేసుకోరు. ప్రస్తుతం నాన్న తెలుగులో ‘ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్’, అమ్మ తమిళంలో ‘లాల్ సలాం’ సినిమాలు చేస్తున్నారు. మంచి కథ కుదిరితే మేమంతా కలిసి నటిస్తాం. మణిరత్నంగారి సినిమాలో హీరోయిన్‌లాంటి పాత్ర చేయాలన్నది నా కల’’ అన్నారు.



● ఐరా, కార్తీక్ రాజు, శశి కిరణ్, సిమ్రాన్

ట్రైలర్ చూశాక సినిమాపై ఆసక్తి పెరిగింది

- శశి కిరణ్ తిక్క

‘‘‘అథర్వ’ ట్రైలర్ చూశాక సినిమా చూడాలనే ఆసక్తి పెరిగింది. ప్రతి విషయాన్ని ఎంతో వివరంగా చూపించారు. పోలీస్ విభాగంలో క్లూస్ టీం గురించి చక్కగా వివరించారు. ఈ చిత్రం విజయం సాధించాలి’’ అని డైరెక్టర్ శశి కిరణ్ తిక్క అన్నారు. కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా మహేశ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం ‘అథర్వ’. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 1న రిలీజ్ అవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శశి కిరణ్ తిక్క, హీరో చైతన్య రావు రిలీజ్ చేశారు. మహేశ్ రెడ్డి మాట్లాడుతూ– ‘‘మా సినిమాలో క్లూస్ టీమ్ గురించి చూపించబోతున్నాం. సురేష్ ప్రొడక్షన్స్‌తో కలిసి భారీ ఎత్తున రాబోతున్నాం’’ అన్నారు. ‘‘ఎంతో కష్టపడి ఈ సినిమా తీశాం.. ప్రేక్షకులు ఆదరించాలి’’ అన్నారు సుభాష్ నూతలపాటి, కార్తీక్ రాజు. ఈ కార్యక్రమంలో సిమ్రాన్ చౌదరి, ఐరా, సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల, కెమెరామేన్ చరణ్ మాట్లాడారు.

రోటి.. కపడా.. కామెడీ



● ‘రోటి కపడా రొమాన్స్’ ఫస్ట్ లుక్

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘా లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ మూవీ ‘రోటి కపడా రొమాన్స్’. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ విడుదలైంది. ‘‘వినోద ప్రధానంగా సాగే ఈ మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. త్వరలోనే ఇతర వివరాలను వెల్లడిస్తాం’’ అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, ఆర్ఆర్ ధ్రువన్, వసంత్.జి.



● గణపతి రెడ్డి, సిమ్రాన్, విజయ్ దర్శన్

భయపెట్టే అన్వేషి

విజయ్ ధరణ్, సిమ్రాన్ గుప్తా, అనన్యా నాగళ్ల హీరో హీరోయిన్లుగా నటించిన హారర్ అండ్ కామెడీ ఫిల్మ్ ‘అన్వేషి’. వీజే ఖన్నా దర్శకత్వంలో టి. గణపతి రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు నటులు అశ్విన్‌బాబు, సోహైల్, చైతన్యారావు, సంపూర్ణేశ్ బాబు అతిథులుగా హాజరై, ఈ చిత్రం విజయం సాధించాలన్నారు. ఈ వేడుకలో హీరో విజయ్ ధరణ్ మాట్లాడుతూ– ‘‘హీరో కావాలని ఓ చిన్న పల్లెటూరు నుంచి మొదలైన నా ప్రయాణంలో అవమానాలు, బాధలు ఎదుర్కొన్నాను. ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను. ఈ మూవీ నిర్మాణంలోనూ కష్టాలు పడ్డాం. కొంతమంది సపోర్ట్ చేయడంతో బయటపడ్డాం. ఈ సినిమా బాగాలేకపోతే నేను గుండు కొట్టించుకుంటాను. వీజే ఖన్నా భవిష్యత్‌లో పెద్ద దర్శకుడు అవుతారు’’ అన్నారు. ‘‘అనన్యా నాగళ్ల పాత్ర చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది’’ అన్నారు వీజే ఖన్నా. ‘‘ప్రతి ఫ్యామిలీ చూడదగ్గ చిత్రం ఇది’’ అన్నారు గణపతి రెడ్డి. ‘అన్వేషి’ చిత్రం మెప్పిస్తుంది’’ అన్నారు సిమ్రాన్ గుప్తా.

స్పార్క్ నా ఎమోషనల్ జర్నీ

- విక్రాంత్

విక్రాంత్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘స్పార్క్: ఎల్.ఐ.ఎఫ్.ఈ’. ఇందులో మెహరీన్, రుక్సార్ థిల్లాన్ హీరోయిన్లు. డెఫ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్స్ పతాకంపై లీల నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదల అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో దర్శకులు హరీష్ శంకర్, మారుతి, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయం సాధించాలని కోరారు. ఈ వేడుకలో విక్రాంత్ మాట్లాడుతూ– ‘‘అమెరికాలో జరిగిన కొన్ని ఘటనలకు కమర్షియల్



● రుక్సార్, విక్రాంత్, హరీష్ శంకర్, మెహరీన్, లీలారెడ్డి, సుహాసిని

అంశాలు జోడించి ‘స్పార్క్’ కథ రాసుకున్నాను. నేనే కథ రాసుకుని, హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తానన్నప్పుడు కొందరు వద్దన్నారు. కానీ ఈ సినిమా నా కల. నా కలకు మా కో డైరెక్టర్ స్వామిగారి అనుభవాన్ని జోడించి ఈ సినిమాను పూర్తి చేశాను. కొన్ని కష్టాలు పడ్డాను. లీల ఎంతగానో సపోర్ట్ చేశారు. ఈ సినిమా నాకు పెద్ద ఎమోషనల్ జర్నీ’’ అన్నారు విక్రాంత్. ‘‘ఈ సినిమాలో సైంటిస్ట్ రోల్ చేశాను’’ అన్నారు సుహాసిని. ‘‘సినిమా చూశాను. బాగా వచ్చింది. ప్రేక్షకులకు కూడా నచ్చుతుందనే నమ్మకం ఉంది’’ అన్నారు లీల.

కామెడీ స్పై



● ‘వెన్నెల’ కిశోర్

‘వెన్నెల’ కిశోర్ హీరోగా నటించిన స్పై యాక్షన్ కామెడీ ‘చారి 111’. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మురళీ శర్మ ఓ కీలక పాత్రధారి. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితి సోనీ ఈ సినిమాను నిర్మించారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ‘‘ఓ కన్‌ఫ్యూజ్డ్ స్పై ఓ పెద్ద కేసును ఎలా సాల్వ్ చేశాడన్నదే ఈ సినిమా కథనం’’ అన్నారు టీజీ కీర్తికుమార్, అదితి సోనీ.

“నా మనసులో ఎలాంటి భావాలు ఉన్నాయో చెప్పలేకపోతున్నా. అంతా ఒక కలలా ఉంది. ఇదంతా నిజమేనా అనిపిస్తోంది. సెమీ ఫైనల్‌లో ఇలా చేయగలనని ఎప్పుడూ అనుకోలేదు. నా హీరో సచిన్, నా జీవిత భాగస్వామి అంతా అక్కడ కూర్చున్నారు. ఇక అభిమానులంతా తోడుగా నిలిచారు. ఇంకా వివరంగా చెప్పలేకపోతున్నా కానీ నేను ఒక చిత్రాన్ని గీసే అవకాశం ఉంటే అది ఇదే చిత్రం కావాలని కోరుకుంటా. –విరాట్ కోహ్లి

విలియమ్సన్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను వదిలేసినప్పుడు చాలా బాధపడ్డా. అయితే బౌలింగ్‌తోనే వారిని పడగొట్టాలని భావించా. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో భిన్నంగా ప్రయత్నించాల్సి వచ్చింది. ఈ ప్రదర్శనతో చాలా గొప్పగా అనిపిస్తోంది. గత రెండు టోర్నీల్లో సెమీస్ ఓడాం. ఎవరికి ఎప్పుడు అవకాశం వస్తుందో ఎవరూ చెప్పలేరు. ఈ అవకాశం చేజార్చుకోరాదని కోరుకుంటున్నాం. –షమీ

ఈ మైదానంలో ఎంత స్కోరు చేసినా సరిపోదని నాకు బాగా తెలుసు. ఆరంభంలోనే వికెట్లు పడగొట్టడం ముఖ్యం. ఫీల్డింగ్‌లో కాస్త ఇబ్బంది పడ్డాం. సెమీస్ అంటే సహజంగానే అదనపు ఒత్తిడి ఉంటుంది. కానీ ప్రశాంతంగా ఉండటం ముఖ్యం. మరో 30–40 పరుగులు తక్కువగా చేస్తే ఎలా ఉండేదో చెప్పలేను. ఎందుకంటే వారూ జాగ్రత్తగానే ఆడేవారేమో. షమీ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. టాప్–6 బ్యాటర్లంతా తమ పాత్రకు న్యాయం చేస్తున్నారు. చివరకు అన్నీ మాకు అనుకూలించాయి. –రోహిత్ శర్మ, భారత కెప్టెన్”



‘షమీ’ఫైనల్ వండర్



షమీ
7/57

భారత్ అప్రతిహత జైత్రయాత్రలో మరో అడుగు విజయవంతంగా పడింది... 1983, 2003, 2011... ఈ క్యాలెండర్‌లలో ఇప్పుడు 2023 చేరింది... అభిమానుల కలలను నిజం చేసే అంచనాలను నిలబెట్టే ప్రయత్నంలో టీమిండియా మరోసారి తుది పోరుకు అర్హత సాధించింది. లీగ్ దశలో ఒక్క ఓటమీ లేకుండా ముగించిన టీమిండియా నాకౌట్ పోరులోనూ తమ స్థాయిని నిలబెట్టుకుంది... ఆసక్తికరంగా, అక్కడక్కడా పోటాపోటీగా సాగిన సమరంలో న్యూజిలాండ్‌పై విజయం సాధించి సగర్వంగా నిలిచింది. గత వరల్డ్ కప్‌లో ఇదే కివీస్ చేతిలో ఇదే సెమీస్ మ్యాచ్‌లో ఎదురైన ఓటమికి నాలుగేళ్ల తర్వాత ప్రతీకారం తీర్చుకొని పాత గాయానికి మందు వేసింది. కోహ్లి, అయ్యర్, షమీ ఈ గెలుపులో హీరోలుగా నిలిచారు.

397 పరుగులు... ఇంత భారీ స్కోరు చేసిన తర్వాత కూడా భారత జట్టు ఒకదశలో ఆందోళనకు లోనైంది... ఆటగాళ్లలో నాకౌట్ మ్యాచ్ ఒత్తిడి కనిపించి తప్పులు చేయడం మొదలైంది... అభిమానుల్లో కాస్త ఉత్కంఠ, మరి కాస్త ఆందోళన... పోరాటానికి మారుపేరైన కివీస్ తగ్గలేదు... 32 ఓవర్ల తర్వాత చూస్తే కివీస్ స్కోరు 219/2... అంతకుముందు ఈ స్థితిలో భారత్ 226/1... పెద్ద తేడా ఏమీ లేదు. తర్వాతి ఓవర్లలో చెలరేగేందుకు బ్యాటర్లు సిద్ధంగా ఉన్నారు. అప్పుడొచ్చాడు షమీ... ఒకే ఓవర్లో రెండు వికెట్లతో కివీస్ వెన్ను విరిచి మళ్లీ కోలుకోలేకుండా చేశాడు. చివరి వరకు అదే జోరును కొనసాగించి భారత్ తరఫున అత్యుత్తమ వన్డే గణాంకాలతో జట్టును ఫైనల్‌కు చేర్చాడు.

ప్రపంచకప్ తుదిపోరుకు టీమిండియా

సెమీఫైనల్లో 70 పరుగులతో న్యూజిలాండ్‌పై విజయం • 7 వికెట్లతో మెరిసిన షమీ
కోహ్లి, అయ్యర్ సెంచరీలు • మిచెల్ శతకం వృథా • పోరాడి ఓడిన కివీస్ బృందం

ముంబై: వన్డే వరల్డ్ కప్ చరిత్రలో నాలుగోసారి భారత్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. గత రెండు టోర్నీల్లో సెమీఫైనల్‌కు పరిమితమైన టీమిండియా ఈసారి మరో అడుగు ముందుకేసి ట్రోఫీపై గురి పెట్టింది. బుధవారం వాంఖెడే మైదానంలో జరిగిన తొలి సెమీఫైనల్లో భారత్ 70 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 397 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (113 బంతుల్లో 117; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), శ్రేయస్ అయ్యర్ (70 బంతుల్లో 105; 4 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగగా... శుబ్‌మన్ గిల్ (66 బంతుల్లో 80 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కోహ్లి, అయ్యర్ 21.2 ఓవర్లలోనే 163 పరుగులు జత చేయడం విశేషం. అనంతరం న్యూజిలాండ్ 48.5 ఓవర్లలో 327 పరుగులకు ఆలౌటైంది. డరైల్ మిచెల్ (119 బంతుల్లో 134; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, కేన్ విలియమ్సన్ (73 బంతుల్లో 69; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మొహమ్మద్ షమీ (7/57) కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనతో కివీస్‌ను దెబ్బ కొట్టాడు. నేడు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య కోల్‌కతాలో జరిగే రెండో సెమీఫైనల్ మ్యాచ్ విజేతతో ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో భారత్ తలపడుతుంది.

ఒకరితో మరొకరు పోటీ పడి...

ఎప్పటిలాగే కెప్టెన్ రోహిత్ శర్మ (29 బంతుల్లో 47; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) తనదైన శైలిలో ఇన్నింగ్స్‌ను దూకుడుగా మొదలు పెట్టాడు. కివీస్ ప్రధాన పేసర్లపై తన జోరును ప్రదర్శించిన అతను చక్కటి షాట్లతో దూసుకుపోయాడు. తనను ఇబ్బంది పెట్టగలడని భావించిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్ బౌల్ట్ బౌలింగ్‌లోనే రోహిత్ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టాడు. గిల్ కూడా అండగా నిలవడంతో తొలి 8 ఓవర్లలోనే భారత్ 70 పరుగులు చేసింది. అయితే మరో భారీ షాట్‌కు ప్రయత్నించిన రోహిత్‌ను తర్వాతి ఓవర్లోనే సౌతీ అవుట్ చేయడంతో తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. అనంతరం గిల్ తన ధాటిని పెంచాడు. ఫెర్గూసన్ ఓవర్లో వరుసగా ఫోర్, సిక్స్ కొట్టిన అతను 41 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత కండరాలు పట్టేయడంతో గిల్ పెవిలియన్‌కు వెళ్లిపోగా, అతని స్థానంలో వచ్చిన అయ్యర్ మెరుపు బ్యాటింగ్‌తో కివీస్ పని పట్టాడు. 29వ ఓవర్ తొలి బంతికి భారత్ స్కోరు 200 పరుగులు దాటింది. తన సొంత మైదానంలో సిక్సర్లతో చెలరేగిన అయ్యర్‌ను నిలువరించడం ప్రత్యర్థి బౌలర్ల వల్ల కాలేదు. బౌల్ట్ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన అతను 35 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. 40వ ఓవర్ ముగిసేసరికి స్కోరు 287/1. చివరి 10 ఓవర్లలో టీమిండియా మరింతగా చెలరేగిపోయింది. రచిన్ బౌలింగ్‌లోనే మూడు సిక్సర్లతో అయ్యర్ సత్తా చాటాడు. సౌతీ ఓవర్లో భారీ సిక్స్ బాదిన అయ్యర్ తర్వాతి బంతికి సింగిల్ తీసి 67 బంతుల్లోనే వరుసగా రెండో శతకం నమోదు చేశాడు. వీరందరికి తోడు కేఎల్ రాహుల్ (20 బంతుల్లో 39 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) తన మెరుపులను జోడించడంతో చివరి 2 ఓవర్లలో 31 పరుగులు వచ్చాయి. ఆఖరి 10 ఓవర్లలో భారత్ 110 పరుగులు సాధించింది.

భయపెట్టిన భాగస్వామ్యాలు...

దాదాపు అసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కివీస్ తడబడింది. 39 పరుగులకే ఆ జట్టు 2 వికెట్లు కోల్పోయింది. అయితే విలియమ్సన్, మిచెల్ కలిసి జట్టును ఆదుకున్నారు. ఆరంభంలో జాగ్రత్తగా ఆడినా ఆ తర్వాత వీరిద్దరు భారీ షాట్లతో చెలరేగిపోయారు. భారత బౌలింగ్ కొద్ది సేపు కట్టుతప్పి వైడ్‌లు, బైస్, ఓవర్‌త్రోలు, ఫీల్డింగ్ వైఫల్యాలు, రనౌట్ అవకాశాలు చేజారడం ... ఇవన్నీ కూడా కివీస్‌కు కలిసొచ్చాయి. ముఖ్యంగా మిచెల్ ప్రతీ బౌలర్‌పై చెలరేగి పరుగులు సాధించగా, విలియమ్సన్ సరైన రీతిలో సహకరించాడు. వీరిద్దరు క్రీజ్‌లో ఉన్నంత సేపు (24.5 ఓవర్లు) భారత బృందంలో కాస్త ఒత్తిడి కనిపించింది. ఇదే జోరులో మిచెల్ 85 బంతుల్లో టోర్నీలో తన రెండో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మూడో వికెట్‌కు 181 పరుగుల భాగస్వామ్యం తర్వాత ఎట్టకేలకు భారత్‌కు వికెట్ దక్కింది. విలియమ్సన్‌ను అవుట్ చేసిన షమీ, అదే ఓవర్లో లాథమ్ (0)ను వెనక్కి పంపడంతో కివీస్ వెనకడుగు వేసింది. ఆ తర్వాత మిచెల్, ఫిలిప్స్ (33 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా 61 బంతుల్లోనే 75 పరుగులు జత చేయడం కూడా మ్యాచ్‌లో కివీస్ ఆశలు నిలిపింది. కానీ 44 బంతుల్లో 103 పరుగులు చేయాల్సిన స్థితిలో ఫిలిప్స్ అవుట్ కావడంతో న్యూజిలాండ్ పరాజయం ఖాయమైంది.



అయ్యర్



మిచెల్

4 వన్డే ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్ చేరడం ఇది నాలుగోసారి. గతంలో భారత్ 1983 (విజేత), 2003 (రన్నరప్), 2011 (విజేత) తుది పోరుకు అర్హత సాధించింది.

1 ఒకే ప్రపంచకప్‌లో మ్యాచ్‌లో 5 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు మూడుసార్లు తీసిన తొలి బౌలర్‌గా షమీ గుర్తింపు పొందాడు. గతంలో గ్యారీ గిల్మోర్ (ఇంగ్లండ్: 1975లో), అశంత డి మెల్ (శ్రీలంక: 1983లో), వాస్‌బెర్ట్ డ్రేక్స్ (వెస్టిండీస్: 2003లో), షాహిద్ అఫ్రిది (పాకిస్తాన్: 2011లో), ముస్తఫిజుర్ రెహ్మాన్ (బంగ్లాదేశ్: 2019లో), మిచెల్ స్టార్క్ (ఆస్ట్రేలియా: 2019లో) రెండుసార్లు చొప్పున ఈ ఘనత సాధించారు.

51 ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా రోహిత్ శర్మ అవతరించాడు. రోహిత్ ఇప్పటి వరకు 51 సిక్స్‌లు కొట్టాడు. 49 సిక్స్‌లతో క్రిస్ గేల్ (వెస్టిండీస్) పేరిట ఉన్న రికార్డును రోహిత్ సవరించాడు. అంతేకాకుండా ఒకే ప్రపంచకప్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గానూ రోహిత్ గుర్తింపు పొందాడు. ఈ ప్రపంచకప్‌లో రోహిత్ 28 సిక్స్‌లు కొట్టాడు. క్రిస్ గేల్ (2015లో 26 సిక్స్‌లు) పేరిట ఉన్న రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) విలియమ్సన్ (బి) సౌతీ 47; గిల్ (నాటౌట్) 80; కోహ్లి (సి) కాన్వే (బి) సౌతీ 117; అయ్యర్ (సి) మిచెల్ (బి) బౌల్ట్ 105; రాహుల్ (నాటౌట్) 39; సూర్యకుమార్ (సి) ఫిలిప్స్ (బి) సౌతీ 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (50 ఓవర్లలో 4 వికెట్లకు) 397.** వికెట్ల పతనం: 1–71, 2–164, 3–381, 4–382. బౌలింగ్: బౌల్ట్ 10–0–86–1, సౌతీ 10–0–100–3, సాన్‌ట్నర్ 10–1–51–0, ఫెర్గూసన్ 8–0–65–0, రచిన్ 7–0–60–0, ఫిలిప్స్ 5–0–33–0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) రాహుల్ (బి) షమీ 13; రచిన్ (సి) రాహుల్ (బి) షమీ 13; విలియమ్సన్ (సి) సూర్యకుమార్ (బి) షమీ 69; మిచెల్ (సి) జడేజా (బి) షమీ 134; లాథమ్ (ఎల్బీ) (బి) షమీ 0; ఫిలిప్స్ (సి) జడేజా (బి) బుమ్రా 41; చాప్‌మన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 2; సాన్‌ట్నర్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 9; సౌతీ (సి) రాహుల్ (బి) షమీ 9; బౌల్ట్ (నాటౌట్) 2; ఫెర్గూసన్ (సి) రాహుల్ (బి) షమీ 6; ఎక్స్‌ట్రాలు 29; **మొత్తం (48.5 ఓవర్లలో ఆలౌట్) 327.** వికెట్ల పతనం: 1–30, 2–39, 3–220, 4–220, 5–295, 6–298, 7–306, 8–319, 9–321, 10–327. బౌలింగ్: బుమ్రా 10–1–64–1, సిరాజ్ 9–0–78–1, షమీ 9.5–0–57–7, జడేజా 10–0–63–0, కుల్దీప్ 10–0–56–1.

కింగ్ 50



వన్డేల్లో కోహ్లి 50వ సెంచరీ • సచిన్‌ను అధిగమించి కొత్త రికార్డు

‘వచ్చే కొద్ది రోజుల్లోనే నా రికార్డును బద్దలు కొడతావని ఆశిస్తున్నా’... కోహ్లి 49వ సెంచరీ తర్వాత సచిన్ టెండూల్కర్ చెప్పిన మాట ఇది. దిగ్గజ క్రికెటర్ ఆశీర్వాదం వాస్తవంగా మారేందుకు ఎక్కువ రోజులు పట్టలేదు. సరిగ్గా పది రోజులకే 49 నుంచి 50కి చేరుకొని విరాట్ కొత్త చరిత్ర సృష్టించాడు. సచిన్ ఎదురుగా... సచిన్ సొంత మైదానంలో... సచిన్ తొలి అంతర్జాతీయ మ్యాచ్ బరిలోకి దిగిన తేదీన... సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఆఖరి సారిగా బ్యాటింగ్ చేసిన తేదీన... ప్రపంచ కప్ నాకౌట్ మ్యాచ్‌లో సచిన్ రికార్డును అధిగమించి వన్డే క్రికెట్‌లో అత్యధిక శతకాలతో శిఖరాన నిలిచాడు. దక్షిణాఫ్రికాపై సెంచరీ సాధించిన తర్వాత కోహ్లి ఫామ్ చూస్తే మిగిలిన వరల్డ్ కప్ మ్యాచ్‌లలో ఈ మైలురాయిని అందుకోవడం లాంఛనమే అనిపించింది. బుధవారం తన స్థాయికి తగ్గ ఆటతో తనదైన శైలిలో కోహ్లి దానిని చేసి చూపించాడు. 9, 1, 1... గత మూడు వరుస ప్రపంచకప్ (2011, 2015, 2019) సెమీఫైనల్స్‌లో కోహ్లి స్కోర్లు ఇవి. ఇలాంటి నేపథ్యంలో బరిలోకి దిగిన తర్వాత ‘సున్నా’ వద్ద ఎల్బీడబ్ల్యూ కోసం కివీస్ అప్పీల్, ఆపై రివ్యూ కోరడం కొద్దిసేపు అభిమానుల గుండె ఆగిపోయేలా చేసింది. ఆ తర్వాత అతని ఇన్నింగ్స్ జాగ్రత్తగా సాగింది. తొలి 40 బంతుల్లో అతను రెండే ఫోర్లతో 30 పరుగులు చేశాడు. ఆ తర్వాత మరో రెండు ఫోర్లతో 59 బంతుల్లో కోహ్లి అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సౌతీ బౌలింగ్‌లో చూడచక్కటి సిక్సర్ కొట్టాక ఫిలిప్స్ ఓవర్లో తీసిన సింగిల్‌తో వరల్డ్ కప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సచిన్ ఘనతను అధిగమించాడు. 91 వద్ద సింగిల్ తీశాక కండరాలు పట్టేయడంతో ఫిజియోతో స్వల్ప చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. భారత్ ఇన్నింగ్స్ 42వ ఓవర్ నాలుగో బంతికి కొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. ఫెర్గూసన్ బౌలింగ్‌లో డీప్ మిడ్ వికెట్ దిశగా ఆడి రెండు పరుగులు తీయడంతో 50వ వన్డే సెంచరీ విరాట్ ఖాతాలో చేరింది. దాంతో వాంఖెడే మొత్తం హోరెత్తిపోయింది. 49వ శతకం సమయంలో ఎలాంటి భావోద్వేగాలు చూపించకుండా ప్రశాంతత కనబర్చిన కోహ్లి ఇక్కడ మాత్రం నియంత్రించుకోలేకపోయాడు. గాల్లోకి ఎగిరి జంప్ చేయడంతో పాటు తన భార్య అనుష్క వైపు చూస్తూ ఫ్లయింగ్ కిస్‌లు పంపిన కింగ్... సచిన్‌ను చూస్తూ తల వంచి అభివాదంతో తన గౌరవాన్ని ప్రదర్శించాడు. మరో ఏడు బంతుల తర్వాత ఈ అద్భుత ఇన్నింగ్స్ ముగియగా, మైదానంలో ప్రేక్షకుల అభినందనల మధ్య అతను పెవిలియన్ చేరాడు. మొదటి 49 సెంచరీలు ఒక ఎత్తు... ఈ శతకం మరో ఎత్తు అన్నట్లుగా విరాట్ ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచిపోయింది.



కోహ్లి భార్య అనుష్క ఆనందం

711 ఈ ప్రపంచకప్‌లో కోహ్లి చేసిన మొత్తం పరుగులు. ఒకే ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా 20 ఏళ్లుగా సచిన్ పేరిట ఉన్న రికార్డును కోహ్లి బద్దలు కొట్టి కొత్త రికార్డు నెలకొల్పాడు. 2003 ప్రపంచకప్‌లో సచిన్ టెండూల్కర్ 673 పరుగులు సాధించాడు.

24 భారత్‌లో కోహ్లి చేసిన సెంచరీలు. ఒకే దేశంలో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్ కోహ్లినే. ఈ జాబితాలో సచిన్ 20 సెంచరీలు (భారత్‌లో), పాంటింగ్ (ఆస్ట్రేలియా), ఆమ్లా (దక్షిణాఫ్రికా) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

వన్డేల్లో అత్యధిక సెంచరీ వీరులు (టాప్‌-5)

ప్లేయర్	సంఖ్య	మ్యాచ్‌లు	ఇన్నింగ్స్	అత్యధిక స్కోరు
కోహ్లి	50	291	279	183
సచిన్	49	463	452	200*
రోహిత్ శర్మ	31	261	253	264
పాంటింగ్	30	375	365	164
జయసూర్య	28	445	433	189

1 వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లో 7 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా షమీ (7/57) గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా: 7/15 నమీబియాపై 2003లో), బికెల్ (ఆస్ట్రేలియా: 7/20 ఇంగ్లండ్‌పై 2003లో), టిమ్ సౌతీ (న్యూజిలాండ్: 7/33 ఇంగ్లండ్‌పై 2015లో), విన్‌స్టన్ డేవిస్ (వెస్టిండీస్ : 7/51 ఆస్ట్రేలియాపై 1983లో) ఉన్నారు.

1 వన్డేల్లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన భారత బౌలర్‌గా షమీ నిలిచాడు. స్టువర్ట్ బిన్నీ (4 పరుగులకు 6 వికెట్లు: 2014లో బంగ్లాదేశ్‌పై) పేరిట ఉన్న రికార్డును షమీ అధిగమించాడు. ఒకే ప్రపంచ కప్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా షమీ (23 వికెట్లు) అవతరించాడు. జహీర్ ఖాన్ (21 వికెట్లు 2003లో) పేరిట ఉన్న రికార్డును షమీ సవరించాడు.

397 ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. 2015 ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్లో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ 6 వికెట్లకు 393 పరుగులు చేసింది.

బాబర్ ఆజమ్ రాజీనామా

కరాచీ: వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ బాబర్ ఆజమ్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ‘అన్ని ఫార్మాట్ల నుంచి కెప్టెన్‌గా తప్పుకుంటున్నాను. నా నిర్ణయం కఠినమైందే అయినా రాజీనామాకు ఇదే సరైన సమయమని భావిస్తున్నా. ఆటగాడిగా జట్టులో కొనసాగుతా. నన్ను వెన్నంటే ప్రోత్సహించిన పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు కృతజ్ఞతలు’ అని బాబర్ అన్నాడు.

చోకర్స్ ముద్ర చెరిగేనా!

- ఫైనల్లో స్థానం కోసం దక్షిణాఫ్రికా ఐదో ప్రయత్నం
- నేడు ఆస్ట్రేలియాతో రెండో సెమీఫైనల్లో ‘ఢీ’
- మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రసారం



కోల్‌కతా: ఫైనల్‌ను తలపించే సెమీఫైనల్ పోరుకు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా సిద్ధమయ్యాయి. రెండు సమఉజ్జీ జట్ల మధ్య జరిగే ఈ రెండో సెమీఫైనల్ కడదాకా ఆసక్తికరంగా జరగడం ఖాయం. తరాలు మారినా హేమాహేమీలతో సరితూగిన సఫారీ జట్టు ప్రపంచకప్‌లో మాత్రం చోకర్స్‌గానే మిగిలింది. గతంలో దక్షిణాఫ్రికా ఈ మెగా ఈవెంట్‌లో నాలుగుసార్లు (1992, 1999, 2007, 2015) సెమీఫైనల్లోకి ప్రవేశించి ఆ అడ్డంకిని దాటలేకపోయింది. ఐదో ప్రయత్నంలోనైనా తొలిసారి ఫైనల్ చేరాలనే లక్ష్యంతో బవుమా సేన బరిలోకి దిగుతోంది. జట్టు కూడా జోరుమీదుంది. ఓపెనింగ్, మిడిలార్డర్ అందరూ భారీ స్కోర్లలో భాగమవుతున్నారు. పైగా ఈ టోర్నీలో గట్టి ప్రత్యర్థులపై ఐదుసార్లు 300 పైచిలుకు స్కోర్లను అవలీలగా చేసిన జట్టేదైనా ఉందంటే అది దక్షిణాఫ్రికానే! ఒక్క భారత్ తప్ప సెమీస్ చేరిన న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలపై తమ భారీస్కోర్ల తడాఖా చూపింది. డికాక్, డసెన్, మార్క్‌రమ్, క్లాసెన్, మిల్లర్ అందరూ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో రబడ కంటే కొయెట్జీ ప్రమాదకరంగా మారాడు. ఎన్‌గిడి, కేశవ్ మహరాజ్‌లతో దక్షిణాఫ్రికా పటిష్టంగా ఉంది. మరోవైపు ఐదుసార్లు జగజ్జేత ఆస్ట్రేలియా ప్రపంచ కప్‌ను ఆరంభించిన తీరు, తర్వాత మారిన విధానం, దూసుకొచ్చిన వైనం ఈ ఈవెంట్‌లో ఏ జట్టుకు సాధ్యం కాదేమో! ప్రొఫెషనలిజానికి మారుపేరైన ఆసీస్ టోర్నీ సాగేకొద్దీ దుర్భేద్యంగా మారింది. వార్నర్, మార్ష్, లబుషేన్, స్మిత్‌లు రాణిస్తుండటం జట్టుకు కలిసొచ్చే అంశం. అఫ్గానిస్తాన్‌తో వీరోచిత డబుల్ సెంచరీతో జట్టును గెలిపించిన మ్యాక్స్‌వెల్ గాయంతో తదుపరి బంగ్లాదేశ్‌తో ఆడలేకపోయాడు. అయితే కీలకమైన ఈ సెమీస్‌లో అతను బరిలోకి దిగుతాడని, ఫిట్‌నెస్‌తో ఉన్నాడని కెప్టెన్ కమిన్స్ వెల్లడించాడు. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మ్యాచ్‌కు వర్ష సూచన ఉంది. గురువారం మ్యాచ్ పూర్తికాకపోతే రిజర్వ్ డే శుక్రవారం కొనసాగిస్తారు. రెండు రోజుల్లోనూ ఫలితం రాకపోతే టోర్నీ లీగ్‌దశలో మెరుగైన స్థానంలో నిలిచిన దక్షిణాఫ్రికా ఫైనల్లోకి ప్రవేశిస్తుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
742	232
65,676	19,675

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	14,128	▲ 35
డోజోన్స్	34,958	▲ 132
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,487	▲ 46
డాక్స్	15,748	▲ 134
షాంఘై	3,073	▲ 17
నికాయ్	33,520	▲ 824

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	59,670
బంగారం (22 క్యారట్)	56,830
వెండి (కేజీ)	77,700

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.31	84.99
£	బ్రిటన్ పౌండ్	101.23	106.14
€	యూరో	88.12	92.61
¥	జపాన్ ఎన్ (100)	42.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	51.85	56.64
S$	సింగపూర్ డాలర్	59.37	64.03
SAR	సౌదీ రియాల్	21.22	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	21.74	23.53
¥	చైనా యువాన్	10.36	12.43

అంకురాలకు దన్ను

- కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం
- భారత్, అమెరికా మధ్య ఒప్పందం



న్యూఢిల్లీ: అంకుర సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించే దిశగా భారత్, అమెరికా ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. నవకల్పనలకు ఊతమిచ్చేందుకు, నిధుల సమీకరణలో ఎంట్రప్రెన్యూర్లు పాటించే విధానాలను పరస్పరం పంచుకునేందుకు, నియంత్రణపరమైన సమస్యల పరిష్కార మార్గాలను కనుగొనేందుకు ఇది తోడ్పడనుంది. ఇరు దేశాల పరిశ్రమవర్గాల రౌండ్‌టేబుల్ సమావేశం సందర్భంగా ఎంవోయూ కుదిరినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, ఆర్థిక కార్యకలాపాలు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనపై ఇది సానుకూల ప్రభావం చూపగలదని వివరించింది. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య మంత్రి జినా రైమండో నేతృత్వం వహించిన ఈ సమావేశంలో పలువురు భారతీయ వ్యాపారవేత్తలు, టెక్నాలజీ దిగ్గజాల సీఈవోలు, వెంచర్ క్యాపిటల్ సంస్థల ప్రతినిధులు, స్టార్టప్‌ల వ్యవస్థాపకులు పాల్గొన్నారు. ఇరు దేశాల మధ్య సాంకేతిక సహకారాన్ని పెంపొందించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భారత్–అమెరికా వాణిజ్య చర్చల కింద రూపొందించిన ఇండియా–యూఎస్ ఇన్నోవేషన్ హ్యాండ్‌షేక్ కాన్సెప్టును ఈ సందర్భంగా గోయల్, రైమండో ఆవిష్కరించారు. డీప్ టెక్నాలజీ, క్రిటికల్ టెక్నాలజీ వంటి విభాగాల్లో సహకారాన్ని పటిష్టం చేసుకునేందుకు రెండు దేశాల నిబద్ధతకు ఎంవోయూ నిదర్శనంగా నిలుస్తుందని గోయల్ పేర్కొన్నారు. దీని కింద వచ్చే ఏడాది తొలినాళ్లలో భారత్, అమెరికాలో ఇన్నోవేషన్ హ్యాండ్‌షేక్ ఈవెంట్లను నిర్వహించనున్నారు.

ఓఎన్‌జీసీ రూ. లక్ష కోట్లు

పెట్రోకెమికల్ ప్లాంట్ల ఏర్పాటు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ చమురు, గ్యాస్ ఉత్పత్తి సంస్థ ఆయిల్, నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) రెండు పెట్రోకెమికల్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ముడి చమురును నేరుగా అధిక విలువైన రసాయన ఉత్పత్తులుగా మార్చడానికి ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.1 లక్ష కోట్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నట్లు కంపెనీ రెండవ త్రైమాసిక ఫలితాలపై ఇన్వెస్టర్ కాల్ సందర్భంగా ఓఎన్‌జీసీ ఫైనాన్స్ డైరెక్టర్ పోమిలా జస్పాల్ వెల్లడించారు. వేర్వేరు రాష్ట్రాల్లో రెండు ప్రాజెక్టులకుగాను 2028 లేదా 2030 నాటికి రూ.10,000 కోట్లు వెచ్చించనున్నట్లు సంస్థ ఈడీ డి.అధికారి తెలిపారు. పెట్రోకెమికల్స్ సామర్థ్యం ప్రస్తుతం ఉన్న 4.2 మిలియన్ టన్నుల నుంచి 2030 నాటికి 8.5–9 మిలియన్ టన్నులకు చేర్చాలన్నది ప్రణాళిక అని పేర్కొన్నారు. ఒక ప్రాజెక్టు సొంతంగా, మరొకటి భాగస్వామ్యంలో నెలకొల్పనున్నట్లు తెలిపారు.

మళ్లీ 'ప్లస్'లోకి.. ఎగుమతులు

- అక్టోబర్‌లో 6.21 శాతం అప్
- విలువలో 33.57 బిలియన్ డాలర్లు
- 10 నెలల తర్వాత దిగుమతులూ పైకి



న్యూఢిల్లీ: భారత్ వస్తు ఎగుమతులు అక్టోబర్‌లో (2022 ఇదే నెలతో పోల్చి) 6.21 శాతం పెరిగాయి. విలువలో 33.57 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, ఉక్రెయిన్ యుద్ధం, ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం సవాళ్లు, కఠిన ద్రవ్య పరిస్థితుల నేపథ్యంలో 2023 ఫిబ్రవరి నుంచి జూలై వరకూ భారత్ వస్తు ఎగుమతుల్లో అసలు వృద్ధిలేకపోగా క్షీణతలో నడిచాయి. అయితే ఆగస్టులో వృద్ధిలోకి (3.88 శాతం) మారినా, మళ్లీ సెప్టెంబర్‌లో 2.6 శాతం క్షీణించాయి. తాజా సమీక్షా నెల అక్టోబర్‌లో మళ్లీ సానుకూల ఫలితం వెలువడింది. 2023లో ప్రపంచ వాణిజ్యవృద్ధి కేవలం 0.8 శాతంగా ఉంటుందన్న ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిరాశాపూరిత వాతావరణం, భారత్ విషయంలోనూ స్పష్టంగా కనిపిస్తోంది.

వాణిజ్యలోటు 31.46 బిలియన్ డాలర్లు

ఇక దేశ వస్తు దిగుమతుల విలువ ఎగువబాట పట్టింది. 2022 డిసెంబర్ నుంచి 2023 సెప్టెంబర్ వరకూ వరుసగా 10 నెలల క్షీణతలో ఉన్న దిగుమతుల విలువ అక్టోబర్‌లో 12.3 శాతం పెరిగి 65.03 బిలియన్ డాలర్లకు చేరింది. దీనితో ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్య లోటు సమీక్షా నెల్లో 31.46 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇది కొత్త రికార్డు.

కొన్ని ముఖ్యాంశాలు చూస్తే..

- అక్టోబర్‌లో పసిడి దిగుమతులు 95.5 శాతం పెరిగి 7.23 బిలియన్ డాలర్లకు చేరాయి.
- చమురు దిగుమతుల బిల్లు 8 శాతం ఎగసి 17.66 బిలియన్ డాలర్లుగా ఉంది.
- మొత్తం 30 కీలక రంగాల్లో 22 రంగాల్లో ఎగుమతులు సానుకూల వృద్ధిని నమోదుచేసుకున్నాయి. వీటిలో ముడి ఇనుము, మాంసం, డెయిరీ, పౌల్ట్రీ ఉత్పత్తులు, ఫార్మా, ఎలక్ట్రానిక్ గూడ్స్, కార్పెట్, ప్లాస్టిక్, మెరైన్, ఇంజనీరింగ్ గూడ్స్ ఉన్నాయి.

ఏప్రిల్–అక్టోబర్ మధ్య క్షీణ గణాంకాలే..

ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య భారత్ వస్తు ఎగుమతుల విలువ 7% క్షీణించి 244.89 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. దిగుమతుల విలువ కూడా 8.95% క్షీణించి 391.96 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. వెరసి వాణిజ్యలోటు ఈ 7 నెలల్లో 147.07 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇక ఈ కాలంలో పసిడి దిగుమతులు 23% పెరిగి 29.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. క్రూడ్ ఆయిల్ దిగుమతుల బిల్లు మాత్రం 18.72% తగ్గి 100 బిలియన్ డాలర్లకు చేరింది.

నెల గరిష్టానికి సూచీలు



- మెప్పించిన ద్రవ్యోల్బణం డేటా
- సెన్సెక్స్ లాభం 742 పాయింట్లు
- 19,650 స్థాయిపైకి నిఫ్టీ

ముంబై: అమెరికా, భారత్‌లో ద్రవ్యోల్బణం దిగిరావడంతో బుధవారం దేశీయ స్టాక్ సూచీలు నెల గరిష్టంపైన ముగిశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు, బాండ్లపై రాబడులు తగ్గడంతో పాటు 14 ట్రేడింగ్ సెషన్ల తర్వాత విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టడం కలిసొచ్చాయి. ఐటీ, బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు రాణించడంతో బుధవారం సెన్సెక్స్ 742 పాయింట్లు పెరిగి 65,676 వద్ద ముగిసింది. నిఫ్టీ 232 పాయింట్లు బలపడి 19,675 వద్ద నిలిచింది. బలిప్రతిపద సెలవు తర్వాత ఉదయం సానుకూలంగా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు రోజంతా అదే జోరును కొనసాగించాయి. ట్రేడింగ్‌లో అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 814 పాయింట్లు ఎగసి 65,748 వద్ద, నిఫ్టీ 249 పాయింట్లు బలపడి 19,693 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్లకు భారీగా డిమాండ్ నెలకొనడంతో బీఎస్‌ఈ స్మాల్, మిడ్ సూచీలు వరుసగా 1.13%, 0.91% చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.550 కోట్లు, దేశీయ ఇన్వెస్టర్లు రూ.610 కోట్ల విలువైన షేర్లు కొన్నారు. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్ సూచీ (హాంగ్‌సెంగ్) అత్యధికంగా 4% ర్యాలీ చేసింది. జపాన్ నికాయ్ 2.50%, కొరియా, థాయిలాండ్ సూచీలు 2%, ఇండోనేషియా, సింగపూర్ సూచీలు 1% చొప్పున లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 1% మేర పెరిగాయి. అమెరికా మార్కెట్లు అరశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

'అమెరికా, బ్రిటన్, భారత్‌ల్లో ద్రవ్యోల్బణం దిగిరావడంతో ఫెడరల్ రిజర్వ్‌తో సహా ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్ల పెంపుపై వెనకడుగు వేయొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. అందుకు సంకేతంగా బాండ్లపై రాబడులు తగ్గుముఖం పట్టాయి. పండుగ సీజన్, మెరుగైన కార్పొరేట్ ఫలితాలతో ఇతర వర్ధమాన దేశాలతో పోలిస్తే విదేశీ ఇన్వెస్టర్లు భారత్‌లో పెట్టుబడులకు మొగ్గుచూపొచ్చు. ఈ ఏడాది చివరికల్లా నిఫ్టీ తిరిగి 20,000 స్థాయిని అందుకోవచ్చు' అని జియోజిత్ ఫైనాన్షియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

దీపావళి బోనస్ @ రూ.3.29 లక్షల కోట్లు

దలాల్ స్ట్రీట్ ఒక శాతం ర్యాలీ చేసి ఇన్వెస్టర్లకు దీపావళి కానుకగా రూ.3.3 లక్షల కోట్ల బోనస్ ఇచ్చింది. సెన్సెక్స్ 742 పాయింట్లు పెరగడంతో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.3.29 లక్షల కోట్లు పెరిగి రూ.325.41 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ సూచీలో 30 షేర్లలో బజాజ్ ఫైనాన్స్ 2%, ఇండస్‌ఇండ్ 1%, పవర్‌గ్రిడ్ 1% మాత్రమే నష్టపోయాయి.

అదరగొట్టిన ఆస్క్ ఆటోమోటివ్ లిస్టింగ్

ఆస్క్ ఆటోమోటివ్ లిస్టింగ్‌లో అదరగొట్టింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.282)తో పోలిస్తే 8% ప్రీమియంతో రూ.305 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 12 శాతానికి పైగా ర్యాలీ చేసి రూ.317 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 10% లాభపడి రూ.310 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,115 కోట్లుగా నమోదైంది.

రూపాయి రికవరీ

జీవితకాల కనిష్ఠ స్థాయిల నుంచి రూపాయి రికవరీ అయ్యింది. డాలర్ మారకంలో 24 పైసలు బలపడి 83.09 స్థిరపడింది. అంతర్జాతీయంగా డాలర్ విలువ రెండేళ్ల కనిష్టాన్ని తాకడం దేశీయ కరెన్సీకి కలిసొచ్చింది. ఈక్విటీ మార్కెట్ల ర్యాలీతో రిస్క్ సామర్థ్యం పెరిగిందని ఫారెక్స్ నిపుణులు తెలిపారు. ఈ సోమవారం 83.33 వద్ద జీవితకాల కనిష్ఠ స్థాయి వద్ద ముగిసింది. కాగా బలప్రతిపద సందర్భంగా మంగళవారం ఫారెక్స్ మార్కెట్ పనిచేయలేదు.

ప్రశ్నార్థకంగా సహారా రూ. 25 వేల కోట్లు



న్యూఢిల్లీ: సహారా గ్రూప్ అధినేత సుబ్రతో రాయ్ మరణించడంతో సహారా–సెబీ ఖాతాలోని రూ. 25,000 కోట్ల అంశం తాజాగా మరోసారి తెరపైకి వచ్చింది. రెండు గ్రూప్ సంస్థలు సమీకరించిన నిధులను సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇన్వెస్టర్లకు వాపసు చేసేందుకు సహారా గ్రూప్ ఈ నిధులను సెబీ ఖాతాల్లో జమ చేసింది. వివరాల్లోకి వెడితే.. సహారా ఇండియా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్ (ఎస్ఐఆర్ఈఎల్), సహారా హౌసింగ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ (ఎస్‌హెచ్‌ఐసీఎల్) దాదాపు 3 కోట్ల మంది ఇన్వెస్టర్ల నుంచి నిబంధనలకు విరుద్ధంగా సమీకరించిన నిధులను వాపసు చేయాలంటూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ 2011లో ఆదేశించింది. 2012లో సుప్రీం కోర్టు కూడా సెబీ ఉత్తర్వులను సమర్థిస్తూ, 15 శాతం వడ్డీతో ఇన్వెస్టర్ల సొమ్మును తిరిగివ్వాలని ఆదేశాలు జారీ చేసింది. 95 శాతం మందికి రిఫండ్ చేసేశామని సహారా గ్రూప్ తెలియజేసినా, ఆ వాదనలను తోసిపుచ్చి రూ. 24,000 కోట్లు సెబీ ప్రత్యేక ఖాతాల్లో జమ చేయాలంటూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఖాతాల్లో మొత్తం రూ. 25,000 కోట్లు ఉన్నాయి. ఈ 11 ఏళ్లలో సహారా గ్రూప్‌లో భాగమైన రెండు సంస్థల ఇన్వెస్టర్లకు సెబీ రూ. 138 కోట్లు వాపసు చేసింది. చాలా మటుకు ఇన్వెస్టర్ల వివరాలు సరిగ్గా లేకపోవడం, క్లెయిమ్‌లు రాకపోవడంతో మిగతా నిధులన్నీ సెబీ దగ్గరే ఉన్నాయి. అనారోగ్యంతో సుబ్రతో రాయ్ మరణించిన నేపథ్యంలో పంపిణీ చేయని ఈ సొమ్ము పరిస్థితి ఏమిటనేది చర్చనీయాంశంగా మారినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఈకామ్ రుణాలు ఆపేయండి



బజాజ్ ఫైనాన్స్‌కు ఆర్‌బీఐ ఆదేశం

ముంబై: ఈకామ్, ఇన్‌స్టా ఈఎంఐ కార్డు సాధనాల కింద రుణాల మంజూరు, వితరణ నిలిపివేయాలంటూ బజాజ్ ఫైనాన్స్‌ను ఆర్‌బీఐ ఆదేశించింది. డిజిటల్ రుణాల మార్గదర్శకాలను పాటించకపోవడమే ఇందుకు కారణం. సదరు లోపాలను సంతృప్తికరమైన విధంగా బజాజ్ ఫైనాన్స్ సరిచేసుకున్నాక ఆంక్షలను పునఃసమీక్షిస్తామని పేర్కొంది.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టెస్ట్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఉన్నత విద్యకు ఓఎన్‌జీసీ అండ

స్కాలర్‌షిప్స్

ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఎన్‌జీసీ) స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తులు కోరుతోంది. ప్రతిభావంతులైన పేద విద్యార్థుల కోసం ఏటా ఈ సంస్థ ఉపకార వేతనాలు అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, జనరల్ విభాగాలకు చెందిన విద్యార్థులు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. 2023–24 విద్యా సంవత్సరానికి ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్పులకు సంబంధించిన సమగ్ర సమాచారం..

- » మొత్తం స్కాలర్‌షిప్పులు: 2000
- » రిజర్వేషన్ల వారీగా ఎస్సీ, ఎస్టీ 1000, ఓబీసీలకు 500, జనరల్ అభ్యర్థులకు 500 చొప్పున కేటాయించారు. అన్ని విభాగాల్లోనూ 50శాతం స్కాలర్‌షిప్పులు మహిళలకు దక్కుతాయి.

అందించే మొత్తం

ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.4000 చొప్పున ఏడాదికి రూ.48,000 స్కాలర్‌షిప్పు అందుతుంది. కోర్సు పూర్తయ్యేంతవరకు ఈ ఆర్థిక ప్రోత్సాహం కొనసాగుతుంది.

అర్హతలు

- » ఏదైనా విద్యాసంస్థలో ఫుల్‌టైమ్ కోర్సు రెగ్యులర్ విధానంలో చదువుతుండాలి. ఇంజనీరింగ్ (బీఈ/బీటెక్), ఎంబీబీఎస్ లేదా పీజీ స్థాయిలో జియాలజీ /జియోఫిజిక్స్/ఎంబీఏలో చేరిన ప్రథమ సంవత్సర విద్యార్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఇంటర్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. అలాగే ఎమ్మెస్సీ–జియాలజీ/జియోఫిజిక్స్ లేదా ఎంబీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులైతే డిగ్రీలో 60 శాతం మార్కులు ఉండాలి. తల్లిదండ్రుల వార్షికదాయం రూ.2లక్షలకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలైతే రూ.4.5 లక్షల వరకు అవకాశం ఉంటుంది.
- » ఏ ఇతర స్కాలర్‌షిప్పులూ పొందని వారే ఓఎన్‌జీసీ ఉపకార వేతనాలకు అర్హులు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా లబ్ధి పొందేవాళ్లు ఈ స్కాలర్‌షిప్పునకు అర్హులే.
- » వయసు: 2023, అక్టోబర్ 16 నాటికి 30ఏళ్లలోపు ఉండాలి.

ఎంపిక ఇలా

- » ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సులకు ఇంటర్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైనవారి వివరాలను ఓఎన్‌జీసీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.
- » స్కాలర్‌షిప్ కొనసాగాలంటే ప్రతి సంవత్సరం వార్షిక పరీక్షల్లో కనీసం 50శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. అంతకంటే తక్కువ మార్కులు పొందితే ఆ తర్వాత విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ అందదు.

ముఖ్యసమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 30, 2023
- » వెబ్‌సైట్: https://ongcscholar.org

డీఆర్‌డీఓలో సైంటిస్ట్ కొలువులు

జాబ్స్ ఇన్ఫో

న్యూఢిల్లీలోని భారత రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో).. పలు ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా మొత్తం 51 సైంటిస్ట్ ఎఫ్, ఈ, డీ, సీ పోస్టుల భర్తీకి డీఆర్‌డీఓకి చెందిన రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్ నియామక ప్రక్రియను నిర్వహించనుంది. ఇది ఇంజనీరింగ్ పట్టభద్రులకు చక్కటి అవకాశం. డీఆర్‌డీవో పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక తదితర వివరాలు..

- » మొత్తం పోస్టులు: 51 (సైంటిస్ట్ (ఎఫ్)–02, సైంటిస్ట్ (ఈ)–14, సైంటిస్ట్ (డి)–08, సైంటిస్ట్ (సీ)–27).
- » విభాగాలు: నావల్ ఆర్కిటెక్చర్, మెరైన్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్, మెకానికల్ అండ్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్ తదితరాలు.
- » అర్హతలు: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.అర్హత,ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.
- » వయసు: సైంటిస్ట్ ఎఫ్, ఈ, డీ పోస్టులకు 50 ఏళ్లకు మించకుండా ఉండాలి. సైంటిస్ట్ పోస్టులకు మాత్రం 40 ఏళ్లకు మించకూడదు.
- » ఎంపిక విధానం: విద్యార్హత, పని అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

వేతనాలు

- » సైంటిస్ట్ (ఎఫ్) పోస్టులకు రూ.1,31,000, సైంటిస్ట్ (ఈ) వారికి రూ.1,23,000, సైంటిస్ట్ (డి) రూ.78,800, సైంటిస్ట్ (సీ) రూ.67,700 వేతనంగా చెల్లిస్తారు.

ముఖ్యసమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » దరఖాస్తులకు చివరి తేదీ: నవంబర్ 17, 2023
- » వెబ్‌సైట్: https://www.drdo.gov.in

అధ్యాపక కొలువుకు సిద్ధమా

పీజీ, పీహెచ్‌డీ, నెట్/స్లెట్ ఉత్తీర్ణులకు..ఆంధ్రప్రదేశ్ సర్కారు శుభవార్త! యూనివర్సిటీల్లో అధ్యాపక వృత్తి చేపట్టి భావి తరాలను తీర్చిదిద్దాలని కోరుకునే వారికి వేల సంఖ్యలో కొలువులు!! ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో మొత్తం 3,220 అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఏపీలోని యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, విజయానికి మార్గాలు..

- » ఏపీ యూనివర్సిటీల్లో భారీగా అధ్యాపక ఉద్యోగాలు
- » మొత్తం 3,220 పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల
- » అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులు
- » స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక

మొత్తం 3,220 పోస్టులు

రాష్ట్రంలోని 18 ప్రభుత్వ యూనివర్సిటీల్లో మొత్తం 3,220 అధ్యాపక పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. ఇందులో ప్రొఫెసర్ పోస్టులు 418, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 801, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 2,001 ఉన్నాయి. అధ్యాపక వృత్తిలో అడుగుపెట్టేందుకు అవసరమైన పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, యూజీసీ నెట్, యూజీసీ సీఎస్ఐఆర్ నెట్, స్లెట్/సెట్ వంటి అర్హతలు సాధించిన అభ్యర్థులకు తాజా నోటిఫికేషన్ సువర్ణావకాశమని చెప్పొచ్చు.

అర్హతలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ /ఎంఫిల్/పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు నెట్ లేదా ఏపీ స్లెట్/సెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- అసోసియేట్ ప్రొఫెసర్: సంబంధిత సబ్జెక్ట్‌లో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పీజీలో 55 శాతం మార్కులు సాధించాలి. అకడమిక్/రీసెర్చ్ స్థాయిలో యూనివర్సిటీ/కళాశాల/ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్స్/ఇండస్ట్రీలో 8ఏళ్ల అనుభవం తప్పనిసరి. నిర్దేశిత జర్నల్స్‌లో కనీసం ఏడు పబ్లికేషన్స్ ప్రచురితమై ఉండాలి.
- ప్రొఫెసర్: పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు 10 రీసెర్చ్ పబ్లికేషన్స్ ప్రచురితమై ఉండాలి. యూనివర్సిటీ/కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్/అసోసియేట్ ప్రొఫెసర్/ప్రొఫెసర్ హోదాలో పదేళ్ల టీచింగ్ అనుభవం లేదా యూనివర్సిటీ/జాతీయ స్థాయి ఇన్‌స్టిట్యూట్స్‌లో పదేళ్ల రీసెర్చ్ అనుభవం ఉండాలి.
- రిజర్వ్‌డ్ కేటగిరీ వర్గాలకు అర్హత మార్కుల్లో అయిదు శాతం చొప్పున సడలింపు ఉంటుంది.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు స్క్రీనింగ్ టెస్ట్

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్ట్‌ల భర్తీకి ముందుగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. దీనికోసం అభ్యర్థులు ఒకే దరఖాస్తుతో అన్ని యూనివర్సిటీల్లోని పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే విధంగా తమ అర్హతలకు అనుగుణంగా సరితూగే అన్ని పేపర్లకు పోటీ పడొచ్చు. ఇలా 18 యూనివర్సిటీల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్ట్‌లకు ఒకే సమయంలో సన్నద్ధత పొందొచ్చు.

స్క్రీనింగ్ టెస్ట్.. 450 మార్కులు

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్ట్‌ల భర్తీ కోసం తొలిదశలో.. కంప్యూటర్ బేస్డ్ విధానంలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సబ్జెక్ట్‌పై 150 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున మొత్తం 450 మార్కులకు పరీక్ష జరుగుతుంది. బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

తదుపరి దశ పర్సనల్ ఇంటర్వ్యూ

- స్క్రీనింగ్ టెస్ట్‌లో నిర్దేశిత మార్కులు పొందిన వారికి తదుపరి దశలో 100 మార్కులకు 45 నిమిషాల వ్యవధిలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. రిజర్వేషన్ కేటగిరీని అనుసరించి ఒక్కో పోస్ట్‌కు నలుగురిని చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. మొత్తం 100 మార్కులకు జరిగే ఇంటర్వ్యూను రెండు విభాగాలుగా నిర్వహిస్తారు.
- ఇంటర్వ్యూలో విభాగం–1కు 40 మార్కులు; విభాగం–2కు 60 మార్కులు ఉంటాయి. విభాగం–1లో లెక్చర్ డిమాన్‌స్ట్రేషన్‌కు 25మార్కులు; ఇంటర్ డిసిప్లినరీ అవేర్‌నెస్, క్రిటికల్ థింకింగ్, పర్సనాలిటీ తదితర అంశాలకు 15 మార్కులు కేటాయిస్తారు.
- విభాగం–2లో బోధన పద్ధతులు, పరిశోధన దృక్పథంపై 60 మార్కులకు మౌఖిక పరీక్ష ఉంటుంది. ఇందులో డొమైన్ నాలెడ్జ్, టెక్నాలజీ ఆధారిత లెర్నింగ్‌కు 35 మార్కులు; పరిశోధన సామర్థ్యం, భవిష్యత్తు ప్రణాళికలు అంశానికి 25 మార్కులు కేటాయిస్తారు.

ఒప్పంద ఫ్యాకల్టీకి వెయిటేజీ

పర్సనల్ ఇంటర్వ్యూ తర్వాత తుది విజేతలను నిర్ణయించే క్రమంలో ఇప్పటికే ఉన్నత విద్యా సంస్థల్లో కాంట్రాక్ట్ విధానంలో ఫ్యాకల్టీగా పని చేస్తున్న వారికి వెయిటేజీ కల్పిస్తారు. వారు పని చేసిన కాలాన్ని అనుసరించి ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్ఠంగా పది మార్కులను ఒప్పంద అధ్యాపకులకు కేటాయిస్తారు.

అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్ట్‌లు.. భర్తీ ఇలా

- అసోసియేట్ ప్రొఫెసర్ పోస్ట్‌ల భర్తీకి యూనివర్సిటీల స్థాయిలో ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఆయా పోస్ట్‌లకు వచ్చిన దరఖాస్తులు, అందుబాటులో ఉన్న ఖాళీల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని, రిజర్వేషన్లను అనుసరించి ఒక్కో పోస్ట్‌కు నలుగురి చొప్పున ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు.
- అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేసే క్రమంలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని వాటికి నిర్దిష్ట వెయిటేజీ పాయింట్లు కేటాయిస్తారు. అకడమిక్ స్కోర్‌కు 80 పాయింట్లు, రీసెర్చ్ పబ్లికేషన్స్‌కు 10 పాయింట్లు, టీచింగ్/పోస్ట్ డాక్టోరల్ అనుభవానికి 10 పాయింట్లు చొప్పున కేటాయిస్తారు. అకడమిక్ స్కోర్‌లో భాగంగా గ్రాడ్యుయేషన్ నుంచి పీహెచ్‌డీ వరకు పొందిన ఉత్తీర్ణత శాతాన్ని, అదే విధంగా నెట్–జేఆర్‌ఎఫ్, నెట్, స్లెట్/సెట్, అకడమిక్ అవార్డ్‌లను పరిగణనలోకి తీసుకుంటారు.



ఏపీ ప్రభుత్వ ఉద్యోగాలు

తుది ఎంపికలోనూ వెయిటేజీ విధానం

ఆయా పోస్ట్‌లకు నియామకాలను ఖరారు చేసే క్రమంలో తుది జాబితా రూపకల్పనలోనూ వెయిటేజీ విధానం అనుసరిస్తారు.అకడమిక్/రీసెర్చ్ స్కోర్‌కు, ఇంటర్వ్యూ స్కోర్‌కు 50 శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తారు. దీనికి అనుగుణంగా అభ్యర్థులు పొందిన మార్కులను క్రోడీకరించి తుది ఎంపిక చేస్తారు.

భారీగా వేతనాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్: పే లెవల్–10: వేతన శ్రేణి రూ.57,700–రూ.1,82,400
- అసోసియేట్ ప్రొఫెసర్: పే లెవల్–13ఎ: వేతన శ్రేణి రూ.1,31,400–రూ.2,17, 100.
- ప్రొఫెసర్: పే లెవల్–14ఎ: వేతన శ్రేణి: రూ.1,44,200–రూ.2,18,200.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 20, 2023.
- ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రింట్ ఔట్‌ను పోస్ట్ ద్వారా పంపేందుకు చివరి తేదీ: నవంబర్ 27,2023.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ స్క్రీనింగ్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి: నవంబర్ 30,2023.
- అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ: డిసెంబర్ 7,2023.
- స్క్రీనింగ్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా వెల్లడి: డిసెంబర్ 8, 2023.
- అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్ట్‌లకు దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 20, 2023.
- ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రింట్ ఔట్స్‌ను పోస్ట్ ద్వారా పంపేందుకు చివరి తేదీ: నవంబర్ 27, 2023.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://recruitments.universities.ap.gov.in/Masters/Home.aspx

ప్రిపరేషన్ ఇలా

అసిస్టెంట్ ప్రొఫెసర్ స్క్రీనింగ్ టెస్ట్‌కు

ఈ పోస్టులకు తొలి దశలో నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌లో రాణించేందుకు అభ్యర్థులు పీజీ స్థాయి పుస్తకాలను అభ్యసనం చేయాలి. అదే విధంగా ఆయా అంశాలను అప్లికేషన్ అప్రోచ్‌తో చదవడం కూడా మేలు చేస్తుంది. దీంతోపాటు.. యూజీసీ నెట్, సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ తదితర పరీక్షల పాత ప్రశ్న పత్రాలను సాధన చేయాలి. పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేసే క్రమంలో ముఖ్యమైన టాపిక్స్‌ను గుర్తించడం, వాటికి సమకాలీన అంశాలను జోడిస్తూ చదవడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

ఇంటర్వ్యూలో రాణించేలా

ఎంపిక ప్రక్రియ తుది దశ ఇంటర్వ్యూలో విజయానికి అభ్యర్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ముఖ్యంగా లెక్చర్ డిమాన్‌స్ట్రేషన్‌లో ఆయా అంశాలను వివరణాత్మకంగా విశ్లేషించడంపై పట్టు సాధించాలి. యూనివర్సిటీ స్థాయిలో..ఇటీవల కాలంలో బోధన పద్ధతుల్లో వస్తున్న మార్పులు, టెక్నాలజీలను తెలుసుకోవాలి. రీసెర్చ్ కాంపిటెన్సీలో నిర్దేశిత అంశాలకు సంబంధించి సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి అవసరమైన పరిశోధన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి. తమ సబ్జెక్ట్‌కు సంబంధించి సమకాలీన పరిశోధనలు, ఆవిష్కరణలపై పట్టు సాధించాలి.

క్లుప్తంగా...



సర్వభూపాలునిపై సర్వాంతర్యామి

• వైభవంగా శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి(తిరుపతి జిల్లా): శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆరవ రోజైన బుధవారం ఉదయం హరి అంతరంగ అలిమేలు మంగ సర్వభూపాలునిపై ఉట్టి కృష్ణుడు అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు అమ్మవారిని అద్దాల మహల్ నుంచి వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చి సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చారు. పట్టుపీతాంబర స్వర్ణాభరణాలతో అమ్మవారిని చేతితో ఉట్టి కొడుతున్న శ్రీకృష్ణుడిగా అలంకరించారు. ఎనిమిది గంటలకు భక్తుల కోలాటాలు, భజన బృందాలు, మంగళ వాయిద్యాలు, జియ్యర్ స్వాముల ప్రబంధ పారాయణం నడుమ అమ్మవారు సర్వభూపాల వాహనంపై తిరువీధుల్లో ఊరేగారు. అమ్మవారు సాయంత్రం సౌభాగ్యలక్ష్మిగా స్వర్ణరథంపై తిరువీధుల్లో భక్తులను కటాక్షించారు. బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహన సేవకు ముందు స్వర్ణ రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్నపన తిరుమంజనం అనంతరం అమ్మవారిని మహాలక్ష్మి స్వరూపిణిగా అలంకరించి రథ మండపానికి వేంచేపుగా తీసుకొచ్చి స్వర్ణరథంపై కొలువుదీర్చారు.

నేడు ఆన్‌లైన్‌లో శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం టికెట్లు

తిరుమల: హిందూ సనాతన ధర్మప్రచారంలో భాగంగా అలిపిరిలోని సప్త గోప్రదక్షిణ మందిరంలో ఈ నెల 23 నుంచి శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ప్రారంభించాలని టీటీడీ బోర్డు నిర్ణయించింది. ఇందుకోసం ఆన్‌లైన్ టికెట్లను గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. టికెట్ ధర రూ.1000గా నిర్ణయించారు. ఒక టికెట్‌పై ఇద్దరిని అనుమతిస్తారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవాలని, ఈ హోమంలో పాల్గొని శ్రీవారి ఆశీస్సులు పొందాలని కోరారు. కాగా, శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ఏర్పాట్లను బుధవారం జేఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. హోమం నిర్వహణ, భక్తులు కూర్చునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

డిసెంబర్ 29 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

సాక్షి, హైదరాబాద్: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని డిసెంబర్ 29 నుంచి 2024 జనవరి 10 వరకు నిర్వహించనున్నారు. వివిధ విభాగాల్లో అగ్నివీర్ పోస్టులను ఈ సందర్భంగా భర్తీ చేయనున్నారు. స్పోర్ట్స్ కోటా కింద అర్హులైన అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు డిసెంబర్ 29న సికింద్రాబాద్‌లోని తాపర్ స్టేడియంలో హాజరుకావాలని మిలిటరీ ఉన్నతాధికారులు తెలిపారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొన్న వారికి ఈ అవకాశం ఉన్నట్టు వివరించారు. ఈ పోస్టులకు అభ్యర్థులు 10వ తరగతి అర్హులైతే సరిపోతుందన్నారు. పూర్తి వివరాల కోసం సికింద్రాబాద్, తిరుమలగిరి, ఈస్ట్‌మారేడ్‌పల్లిలోని ఏటీసీ హెడ్‌క్వార్టర్స్‌లో సంప్రదించాలని వెల్లడించారు. www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లోనూ పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయని, ఏటీసీ సెంటర్ ఈ-మెయిల్ అడ్రస్ tuskercrc-2021@gov.inలో వివరాలు పొందవచ్చని సూచించారు.

దిద్దుకోలేని దశకు వాతావరణం

(కంచర్ల యాదగిరిరెడ్డి)

ముంచుకొస్తున్న వాతావరణ మార్పుల ముప్పునకు ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రకృతి ప్రకోపం అనండి లేదా ఇంకో పేరు ఏదైనా పెట్టుకోండి. భూమ్మీద మనిషి మనుగడ కచ్చితంగా ప్రమాదంలో పడింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తయారుచేసిన నివేదిక ప్రకారం పరిస్థితిని చక్కదిద్దుకునేందుకు ఉన్న సమయం కూడా మించిపోయింది. ఇకపై ఏం జరుగుతుందన్నది చెప్పడం తమ చేతుల్లోనూ లేదంటున్నారు శాస్త్రవేత్తలు.

సెప్టెంబర్ 2023

డేనియల్ తుపాను లిబియాసహా ఆగ్నేయ యూరప్‌లోని కొన్ని ప్రాంతాల్లో అకాల వరదలకు కారణమైంది. వేల మంది నిర్వాసితులయ్యారు. ఆస్తినష్టం రూ.16,658 కోట్ల పైమాటే!

జూలై-ఆగస్టు 2023

చైనా

బీజింగ్‌లో 140 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేనంత స్థాయిలో వర్షం. 12.9 లక్షల మందిపై ప్రభావం... 1,47,000 ఇళ్లు ధ్వంసం... 33 మంది మృతి!

భారత్..

రుతుపవనాల వర్షాలు కాస్తా ఆకస్మిక వరదలుగా మారిపోయాయి. ఉత్తర భారతంలో పలుచోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయి. వంద మందికిపైగా చనిపోయారు.

అమెరికాలో...


హవాయి ప్రాంతంలోని మావుయి ద్వీపంలో కార్చిచ్చు ప్రబలి 111 మంది మృత్యువాత పడ్డారు.

2023 స్టేట్ ఆఫ్ ద క్లైమేట్ రిపోర్ట్

'ఎంటరింగ్ అన్‌చార్టడ్ టెరిటరీ'పేరుతో ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ ప్రెస్ గత నెలలో ఓ ప్రత్యేక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం... వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇక తప్పించుకునే అవకాశం లేదు. కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం వల్ల భూమి సగటు ఉష్ణోగ్రతలు పెరిగి వాతావరణంలో మార్పులు వస్తాయని, అకాల వర్షాలు, వరదలు ముంచెత్తుతాయని, కార్చిచ్చులు దహించి వేస్తాయని, పంట దిగుబడులు తగ్గడంతోపాటు సముద్రమట్టాలు పెరిగిపోయి భూమ్మీద మనిషి బతకడం అసాధ్యంగా మారుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. అయితే సంప్రదాయేతర ఇంధన వనరుల వాడకం తదితర అనేక చర్యల ద్వారా ఈ మార్పులను అడ్డుకోవచ్చని, భూతాపోన్నతిని కట్టడి చేయొచ్చని నిన్న మొన్నటివరకూ అనుకునేవారు. ఇప్పుడు ఆ ఆశ కూడా లేకుండా పోయిందంటున్నారు శాస్త్రవేత్తలు. గత ఏడాది కాలంలో ప్రపంచవ్యాప్తంగా నమోదైన ప్రకృతి వైపరీత్యాలను పరిశీలిస్తే.. అవేవీ సహజసిద్ధమైన వాతావరణ మార్పుల వల్ల వచ్చినవి కావని, మానవ చర్యల పర్యవసానంగానే ఇవన్నీ జరుగుతున్నాయని స్పష్టం చేస్తున్నారు. ఈ నివేదికను 2020లో రిపల్ అండ్ వూల్ఫ్‌లు మొదటిసారి సమర్పించినప్పటికీ తాజాగా 15,000 మంది శాస్త్రవేత్తలు ఆమోదించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అవీ.. ఇవీ..

- కోవిడ్-19 సమయంలో కర్బన ఉద్గారాలు కొంతమేరకు తగ్గినప్పటికీ ఆ తరువాతి కాలంలో మునుపటి కంటే ఎక్కువయ్యాయి.
- సౌర, పవన విద్యుత్తుల వాడకం 2021-22 మధ్య 17 శాతం వరకూ పెరిగింది.. కానీ పెట్రోల్, డీజిల్‌తో పోలిస్తే ఈ పెరుగుదల చాలా చాలా తక్కువ.
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధం యూరప్‌లో చౌక రష్యన్ సహజవాయువు నుంచి బొగ్గు వాడకం వైపు మళ్లించింది. ఫలితంగా ఇప్పటికే శిలాజ ఇంధనాలపై ఇచ్చే సబ్సిడీ విలువ 53,100 కోట్ల డాలర్ల (2021) నుంచి 1,09,700 కోట్ల డాలర్లు (2022)కు పెరిగిపోయింది.
- 2021-22 మధ్య భూమ్మీద చెట్లు వ్యాపించి ఉన్న విస్తీర్ణం ఏకంగా 9.7 శాతం తగ్గిపోయి 2.28 కోట్ల హెక్టార్లకు పరిమితమైంది.
- కెనడాలో మునుపెన్నడూ లేనిస్థాయిలో అడవులు కార్చిచ్చులకు బలవుతున్నాయి. ఈ ఏడాది కోటీ 66 లక్షల హెక్టార్లలో అడవులు బూడిదయ్యాయి.
- వాతావరణంలోని కార్బన్‌డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్‌ల మోతాదు కూడా బాగా ఎక్కువైంది. కార్బన్‌డయాక్సైడ్ ప్రతి పది లక్షల భాగాలకు 420 భాగాల స్థాయికి చేరింది.
- సముద్రాల ఆమ్లత, హిమానీనదాల మందం, గ్రీన్‌ల్యాండ్‌లోని మంచు.. అన్నీ కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఇదే సమయంలో సముద్రమట్టం, ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి.



రికార్డులు బద్దలు

2023లో అసాధారణ ప్రకృతి వైపరీత్యాలు నమోదయ్యాయి. వాతావరణానికి సంబంధించి పలు రికార్డులు బద్దలయ్యాయి. ప్రాంతాలకు అతీతంగా వడగాడ్పులు, రికార్డు స్థాయి అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం ఒక హెచ్చరికైతే.. సముద్ర ఉపరితల జలాల వేడి కూడా అనూహ్యంగా పెరిగిపోయింది. అంటార్కిటికాలోనూ మునుపెన్నడూ లేనంత తక్కువ స్థాయిలో మంచు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఏడాది జూలై మొదట్లో భూమి రోజువారీ సగటు ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదైందని రికార్డులు చెబుతున్నాయి. అలాగే జూన్-ఆగస్టు మధ్య మునుపటితో పోలిస్తే ఎక్కువ వేడి ఉన్నట్లు రికార్డు అయ్యింది. బహుశా ఇది లక్ష ఏళ్ల చరిత్ర కావచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అంచనాలకు అందని దశకు..

పారిశ్రామిక విప్లవ సమయానికి ముందునాటి ఉష్ణోగ్రతల కంటే భూమి రోజువారీ సగటు ఉష్ణోగ్రత 2000 సంవత్సరం వరకూ ఏనాడూ 1.5 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువ నమోదు కాలేదు. తరువాతి కాలంలోనూ అడపాదడపా ఈ స్థాయిని దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కానీ.. 2023లో మాత్రం సెప్టెంబరు 12 నాటికే మొత్తం 38 రోజులు 1.5 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ఏడాది పూర్తయ్యే సరికి ఇది మరింత పెరుగుతుందని అంచనా. 2023 జూలై 7న అంటార్కిటిక్ సముద్రం పరిసరాల్లోని మంచు ప్రాంతం ఉపగ్రహ సమాచారం లభించడం మొదలైన తరువాత అతితక్కువ విస్తీర్ణంలో ఉన్నట్లు స్పష్టమైంది. 1991-2023 మధ్య మంచు ప్రాంతం కంటే 26.7 లక్షల చదరపు కిలోమీటర్లు తక్కువ.

మానవ చర్యల ఫలితమే...

ఏడాది కాలంగా ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకున్న ప్రకృతి వైపరీత్యాలకు మానవ చర్యలే కారణమన్నది సుస్పష్టం. ఉదాహరణకు అట్లాంటిక్ మహా సముద్ర ఉపరితల జలాలు వేడెక్కేందుకు ఆఫ్రికాలోని సహేల్ ప్రాంతంలో రేగే దుమ్ము, కురిసే వర్షపాతానికి సంబంధం ఉండటం. ఇంకో ఆసక్తికరమైన అంశం.. నీటిలోపల ఉన్న అగ్నిపర్వతాల నుంచి కొన్ని కి.మీ. ఎత్తువరకూ ఎగజిమ్మే నీటి ఆవిరి (కర్బన ఉద్గారం మాదిరే ప్రమాదకరమైంది) మోతాదులో తేడా వచ్చినా భూతాపోన్నతి సంభవిస్తుంది. ఏడాది కాలంగా ఉష్ణోగ్రతలు పెరిగేందుకు కర్బన ఉద్గారాల నియంత్రణ చర్యల్లో భాగంగా సముద్రయానానికి గంధకం తక్కువగా ఉన్న ఇంధనాలను వాడటం తప్పనిసరి చేయడమూ కావచ్చు. ఇవేవీ కాదనుకున్నా ఈ ఏడాది ఎల్ నినో కారణంగానూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదై ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఎల్-నినో, లా-నినా వంటి సహజ ప్రక్రియలు వాతావరణ మార్పుల ప్రభావం వల్ల ఎక్కువవుతాయి.

కిం కర్తవ్యం...

పరిస్థితి చేయిదాటిపోతోంది.. మరి గట్టెక్కేందుకు ఏం చేయాలి? ఒక్కమాటలో చెప్పాలంటే ఆర్థికాభివృద్ధి పేరుతో ఇప్పుడు మనం చేస్తున్న విచ్చలవిడి కార్యకలాపాలకు తక్షణం ఫుల్‌స్టాప్ పెట్టాలి. శిలాజ ఇంధనాలు, నేల వినియోగంలో మార్పుల వల్ల వెలువడుతున్న కర్బన ఉద్గారాల కట్టడికి శక్తులన్నీ కూడగట్టుకుని యత్నించాలి. కర్బన ఉద్గారాలను సహజసిద్ధంగా నిల్వ చేసేందుకు ఉన్న అవకాశాలన్నింటినీ ఉపయోగించుకోవాలి. అదే సమయంలో వాతావరణంలోకి చేరిన అదనపు కార్బన్‌డయాక్సైడ్‌ను వేగంగా తొలగించేందుకు అన్ని రకాల వ్యూహాలను వాడుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో భూమి కొంచెం చల్లగా ఉంటుంది. వాతావరణంలోకి చేరుతున్న కార్బన్‌డయాక్సైడ్‌లో 80 శాతానికి కారణమవుతున్న బొగ్గు వాడకాన్ని వీలైనంత వేగంగా తగ్గించే ప్రయత్నం జరగాలి. ఈ శతాబ్దపు చివరి నాటికి 300 నుంచి 600 కోట్ల మంది ప్రజలు జీవించేందుకు అనువుగా లేని ప్రాంతాల్లో ఉంటారని అంచనా. ఇలాంటి మహా విపత్తుల పరిష్కార మార్గాలు కూడా అంతే పెద్దవిగా ఉండాలనడంలో సందేహం లేదు.

ఏపీ హైకోర్టు ఏఎస్‌జీగా నరసింహ శర్మ

అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్రం ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేంద్రం తరఫున వాదనలు వినిపించేందుకు అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)గా సీనియర్ న్యాయవాది బి.నరసింహ శర్మను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో ఏఎస్‌జీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు అదనంగా ఏపీ బాధ్యతలను అప్పగించింది. నవంబర్ 15 నుంచి ఆరు నెలలు లేదా రెగ్యులర్ ఏఎస్‌జీని నియమించే వరకు నరసింహ శర్మ ఆ బాధ్యతల్లో కొనసాగుతారు. 1959, నవంబర్ 22న పుట్టిన శర్మ ఉస్మానియా వర్సిటీ నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. ఎల్ఎల్ఎంలో గోల్డ్ మెడల్ కూడా సాధించారు. 1982లో ఏపీ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకున్నారు. సివిల్, క్రిమినల్, ట్యాక్సేషన్, సర్వీస్ వ్యాజ్యాల న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను హైకోర్టు గత డిసెంబర్‌లో సీనియర్ న్యాయవాదిగా నియమించింది. ఆదాయపు పన్ను, కేంద్ర పన్నులు, కస్టమ్స్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఈడీ, నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో న్యాయవాదిగా పనిచేశారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా, బీఎస్ఎన్ఎల్, కేంద్రీయ విద్యాలయతో పాటు పలు ఇతర విభాగాలకూ న్యాయవాదిగా పనిచేశారు.

'రియల్' కంపెనీలకు షోకాజ్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: 'రెరా'నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ కంపెనీలకు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. నోటీసులు అందుకున్న కంపెనీలు 15 రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో ఆదేశించారు. నోటీసులు అందుకున్న కంపెనీల్లో నీమ్స్ బోరో గ్రూప్, ఎక్సలెన్స్ ప్రాపర్టీస్, ప్రెస్టీజ్ గ్రూప్ ప్రాజెక్ట్స్, సనాలి గ్రూప్, అర్బన్ యార్డ్స్, 'హ్యాపీ డ్రీమ్ హోమ్స్, విరతా డెవలపర్స్, రీ వెండల్ ఫామ్స్, కావూరి హిల్స్, సెవెన్ హిల్స్, బిల్డాక్స్ రియల్ ఎస్టేట్స్, సుమధుర ఇన్‌ఫ్రా ప్రాజెక్టు సంస్థలు న్నాయి. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు రెరా రిజిస్ట్రేషన్ ఉండి కూడా వ్యాపార ప్రకటనలు, ఇతర వ్యాపార కార్యకలాపాల్లో రిజిస్ట్రేషన్ నెంబర్ ప్రదర్శించక పోవడం కూడా నిబంధనల ఉల్లంఘనే అని సత్యనారాయణ పేర్కొన్నారు. రెరా రిజిస్ట్రేషన్ ప్రదర్శించని జె.బి.నేచర్ వాలీ, జె.బి.ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు కూడా షోకాజు నోటీసులు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు.

వివేక్ కంపెనీ నుంచి ఓ సూట్‌కేస్ కంపెనీకి రూ. 8 కోట్లు

• ఎన్నికల ప్రధానాధికారికి చెన్నూరు సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఫిర్యాదు.. ఆ సూట్‌కేస్ కంపెనీలో ఇద్దరు డైరెక్టర్లు వివేక్ కంపెనీ ఉద్యోగులు



సాక్షి, చెన్నూరు: చెన్నూరు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ తన కంపెనీ విశాఖ ఇండస్ట్రీస్ నుంచి సోమవారం ఒక సూట్‌కేస్ కంపెనీకి రూ. 8 కోట్లు బదిలీ చేశారని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ ఫిర్యాదు చేశారు. రామగుండంలోని వివేక్ ఇంటి చిరునామాతో ఉన్న విజిలెన్స్ సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి ఐడీబీఐ బషీర్‌బాగ్ బ్రాంచ్ నుంచి బదిలీ చేశారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సూట్‌కేస్ కంపెనీలో ఇద్దరు డైరెక్టర్లు వివేక్ కంపెనీ ఉద్యోగులని, చెన్నూరు ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేసేందుకే ఈ కంపెనీకి రూ.8 కోట్లు పంపించారని సీఈవోను కలిసిన అనంతరం ఆయన మీడియా ముందు ఆరోపించారు. ఈ ఖాతాను ఫ్రీజ్ చేయాలని కోరామని సుమన్ తెలిపారు. ఈ అంశంపై ఈడీ, ఆదాయ పన్ను శాఖలతోపాటు ప్రత్యేక వ్యయ పరిశీలకుడికి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. వివేక్, ఆయన కుటుంబ సభ్యులు, కంపెనీలు, బంధువుల బ్యాంకు ఖాతాలపై నిఘా పెట్టాలని కోరామని చెప్పారు. వివేక్ తన కంపెనీ ఖాతాల నుంచి స్థానిక వ్యాపారులకు డబ్బులు పంపుతున్నారని ఆరోపించారు. రూ.వేల కోట్ల ఆస్తులున్న వ్యక్తికి, రూ. వేల కోట్లు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్న వ్యక్తికి మధ్య చెన్నూరులో పోటీ జరుగుతుందని, అభివృద్ధిపై మాట్లాడే దమ్ము లేక వివేక్ విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

నగరంలో ముగిసిన ఐటీ సోదాలు రూ. 7.5 కోట్లు సీజ్

సాక్షి, హైదరాబాద్: నగరంలో సోమవారం మొదలైన ఐటీ అధికారుల సోదాలు మంగళవారం అర్ధరాత్రితో ముగిసినట్టు సమాచారం. ఫార్మా రంగానికి చెందిన పలువురి ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ బృందాలు సోదాలు చేపట్టడం తెలిసిందే. మై హోమ్ భుజాలో నివసిస్తున్న ప్రదీప్ అనే ఫార్మా వ్యాపారితోపాటు అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్ గూడాలో అంతర్జాతీయ రసాయన పరిశ్రమకు చెందిన ఓ డైరెక్టర్, మరికొందరు ఫార్మా రంగానికి చెందిన వ్యక్తుల ఇల్లు, కార్యాలయాల్లో కలిపి హైదరాబాద్, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని మొత్తం13 ప్రాంతాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల్లో లెక్కల్లో లేని రూ.7.5 కోట్లు సీజ్ చేసినట్లు తెలిసింది. గచ్చిబౌలి మైహోం బూజాలో ఉంటున్న ప్రదీప్‌రెడ్డి మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడని సమాచారం. సోదాల్లో పలు కీలక పత్రాలను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

'కేడర్ వివాదం'లో వాదనలు 21కి వాయిదా

సలహా కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలన్న హైకోర్టు ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పునర్విభజన సమయంలో చోటు చేసుకున్న కేడర్ వివాదంలో వాదనలను హైకోర్టు ఈనెల 21కి వాయిదా వేసింది. ఆ రోజు మధ్యాహ్నం 3.30 గంటల నుంచి వాదనలు వినిపించాలని న్యాయవాదులకు సూచించింది. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో పలువురు అధికారులను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. అయితే వీరిలో కొందరు ఈ కేటాయింపులపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించి.. తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. ఈ క్రమంలోనే గత జనవరిలో తెలంగాణ సీఎస్ సోమేశ్‌కుమార్‌ను ఏపీకి వెళ్లాల్సిందేనంటూ హైకోర్టు సీజే ధర్మాసనం తీర్పునిచ్చింది. అయితే కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా తమ పిటిషన్లను విడివిడిగా విచారణ జరపాలని డీజీపీ అంజనీకుమార్ సహా ఇతర అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై బుధవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహ శర్మ వాదనలు వినిపిస్తూ.. అనంతరాములు, ఎస్ఎస్ రావత్‌లను ఏపీకి కేటాయించారని, వీరు 2014 నుంచి కొంతకాలం అక్కడ పనిచేశారని చెప్పారు. 2016, మార్చిలో ఈ ఇద్దరిని తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వరుసగా అన్ని పిటిషన్లలో విచారణ చేపడతామని చెబుతూ విచారణను వాయిదా వేసింది.

పరిశోధనలతో వ్యవసాయాభివృద్ధి

ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. దూబే పిలుపు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రఘునందన్‌రావు. చిత్రంలో డాక్టర్ దూబే తదితరులు


సాక్షి, హైదరాబాద్: మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో పురుగుమందులను తగుమాత్రంగా వినియోగించడంతో పాటు పోషక విలువలతో కూడిన అధికపంట దిగుబడులు తీసేందుకు మంచి వ్యవసాయ పద్ధతుల (గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్- జీఏపీ)ను అనుసరించాల్సి ఉందని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (సస్యరక్షణ, జీవభద్రత) డాక్టర్ ఎస్.సి.దూబే పేర్కొన్నారు. జీఏపీకి అనుగుణమైన కొత్త సాంకేతికతలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని పీజేటీఎస్ఏయూ ఆడిటోరియంలో 'సస్యరక్షణ యాజమాన్యంలో నవ్యత, సుస్థిరత'అనే అంశంపై నాలుగు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. గౌరవ అతిథిగా డా.దూబే మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధనా పత్రాల ద్వారా శాస్త్రవేత్తలు వ్యవసాయాభివృద్ధికి దోహదం చేయాలన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి ప్రసంగిస్తూ వాతావరణ మార్పులకు తోడు రసాయనిక ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల పంటలతోపాటు మానవులు, పర్యావరణ ఆరోగ్యంపై కూడా దుష్ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సదస్సులో జాతీయ జీవవైవిధ్య బోర్డు చైర్మన్ డా.అచలేంద్ర రెడ్డి, ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్‌బి. శరత్‌బాబు, శ్రీబయోటెక్ ఈస్థటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో డా.కేఆర్‌కే రెడ్డి, పీజేటీఎస్ఏయూ మాజీ కులపతి డా.ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు. పలువురు శాస్త్రవేత్తలకు జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేశారు.

లాజిక్ పసిగట్టు.. జేఈఈ ర్యాంక్ కొట్టు!

నిట్ కోసం ఓ రకం... ఐఐటీకి మరో రకం

• ఏ ర్యాంకులో సీటు ఎక్కడో చూసుకోవాలి.. దేన్ని చదివితే సీటు వస్తుందో తెలుసుకోవాలి

• జేఈఈకి ఇప్పట్నుంచే ప్రిపరేషన్ ముఖ్యం.. మెయిన్స్‌కు అప్రమత్తం చేస్తున్న నిపుణులు



ఏ ర్యాంకుకు ఎక్కడ.. ఏ బ్రాంచీలో సీటు? (తెలుగు రాష్ట్రాల్లో)

కేటగిరీ	సీఎస్ఈ	మెకానికల్	కెమికల్
ఓపెన్	25,157	75,237	60,507
ఓబీసీ	33,620	85,642	71,467
ఈడబ్ల్యూఎస్	20,671	88,023	91,530
ఎస్సీ	97,139	1,58,595	1,69,515
ఎస్టీ	48,706	1,91,389	1,78,327

తిరుచ్చి, సూరత్‌కల్, కాలీకట్, నాగపూర్ రాష్ట్రాల్లో వివిధ బ్రాంచీల్లో ఓపెన్ కేటగిరీకి ఎంత ర్యాంకుకు ఏ సీటు?

కేటగిరీ	సీఎస్ఈ	సివిల్	మెకానికల్	ఈసీఈ
ఓపెన్	8,933	50,284	41,302	12,712

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా దాదాపు పది లక్షల మంది విద్యార్థులకు జేఈఈ మెయిన్స్ అత్యంత కీలకమైంది. వచ్చే ఏడాది జనవరి, ఏప్రిల్‌లో ఈ పరీక్ష జరుగుతుంది. ఇందులో అర్హత కోసం ప్రతీ ఒక్కరూ ప్రయత్నిస్తారు. మెయిన్స్‌లో మంచి ర్యాంకు వచ్చి, అడ్వాన్స్‌డ్‌లో రాకపోయినా ఆనందించే వాళ్లూ ఉంటారు. అయితే, జేఈఈలో విజయం సాధించడానికి కృషితో పాటు కొన్ని లాజికల్ అంశాలు తెలుసుకోవడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. చాలామందికి ఏ ర్యాంకుతో ఎక్కడ, ఏ బ్రాంచీలో సీటు వస్తుందనే అవగాహన ఉండదు. మెయిన్స్ ర్యాంకుతో జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు లభిస్తాయి. ఈసారి మారిన సిలబస్ కొంత ఒత్తిడిని తగ్గించే వీలుంది. కాబట్టి మెయిన్స్ ర్యాంకుల పట్ల ఉన్న అపోహలు దూరం చేయాల్సిన అవసరం ఉంటుంది. చాలా మంది విద్యార్థులు 10,000 లోపు ర్యాంకు ఉంటేనే ఎన్ఐటీల్లో సీట్లు వస్తాయని భావిస్తారు. దీంతో తుది దశ కౌన్సెలింగ్ వరకూ ఉండకుండా ఎంసెట్‌పై దృష్టి పెడతారు. ర్యాంకర్లు కూడా రాష్ట్ర కాలేజీల్లోని మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు ప్రయత్నిస్తారు. కౌన్సెలింగ్ జిమ్మిక్కు పూర్తిగా అర్థమైతే తప్ప దీని నుంచి బయటపడటం కష్టం. అందుకే మెయిన్స్‌కు వెళ్లే విద్యార్థులు గత కొన్నేళ్ల ర్యాంకులు, సీట్ల వివరాలపై ముందే కొంత కసరత్తు చేయడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

కాలేజీ కూడా లక్ష్యం కావాలి..: మెయిన్స్‌కు ప్రిపేరయ్యే అభ్యర్థులు ముందస్తు సన్నద్ధతను బట్టి ఓ అంచనాకు రావాలి. మూడేళ్ల కటాఫ్‌ను దృష్టిలో ఉంచుకుని ఏ ర్యాంకు వస్తుందో గుర్తించాలి. దీని ఆధారంగానే ఏయే కాలేజీల్లో ఎంత వరకూ సీట్లు వచ్చాయనేది తెలుసుకోవచ్చు. జాతీయ స్థాయిలో ఐఐటీల్లో 16,050 సీట్లు, ఎన్ఐటీల్లో 23,056 సీట్లు, ఐఐఐటీల్లో 5,643 సీట్లు, కేంద్ర ఆర్థిక సహకారంతో నడిచే సంస్థల్లో 5,620... వెరసి 50,369 సీట్లు జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఉన్నాయి. అడ్వాన్స్‌డ్‌తో భర్తీ చేసే 16,050 ఐఐటీ సీట్లను పక్కనబెడితే మిగిలిన 34,319 సీట్లను జేఈఈ మెయిన్స్ ర్యాంకు ద్వారానే భర్తీ చేస్తారు. కొన్నేళ్లుగా సీట్ల కేటాయింపును పరిశీలిస్తే, వరంగల్ నిట్‌లో సీఎస్ఈకి అబ్బాయిలకు 3,089 ర్యాంకు, అమ్మాయిలకు 3,971 వరకూ సీటు వస్తుంటే, ఏపీలో అబ్బాయిలకు 14,000 ర్యాంకు, అమ్మాయిలకు 28,000 ర్యాంకు వరకు సీటు వస్తోంది. ఓబీసీలకు వరంగల్‌లో గరిష్టంగా 13,000 వరకూ, ఏపీలో 33,000 ర్యాంకు వరకూ సీట్లు వస్తున్నాయి. ఎస్సీ కేటగిరీకి గరిష్టంగా 97,139 వరకూ, ఎస్టీలకు 48,000 ర్యాంకు వరకూ సీట్లు దక్కాయి. సిలబస్ మారడంతో ఈసారి కొంత పోటీ ఉండొచ్చు. కాబట్టి దీన్ని దృష్టిలో పెట్టుకుని ర్యాంకు, కాలేజీని టార్గెట్‌గా పెట్టుకోవాలన్నది జేఈఈ అధ్యాపకుల సూచన.

బ్రాంచే టార్గెట్ అనుకుంటే...

చాలామంది విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ బ్రాంచీ కోసం ఎదురు చూస్తారు. అందుకే ఓపెన్ కేటగిరీలో ఈ బ్రాంచీ సీట్లకు పోటీ ఉంటుంది. ఒకవేళ బ్రాంచీనే లక్ష్యమైతే ఫలానా కాలేజీలో కావాలనే టార్గెట్ పెట్టుకోకూడదు. కొన్ని ఎన్ఐటీల్లో ఓపెన్ కేటగిరీకి కూడా 40,000 ర్యాంకు వచ్చినా సీట్లు వచ్చే పరిస్థితి ఉంది. ఇవేంటో విద్యార్థులు తెలుసుకోవాలి. మెకానికల్ డివిజన్‌లో ఓపెన్ కేటగిరీలోనే వరంగల్ నిట్‌లో 17,000 వరకూ, ఏపీలో 75,000 వరకూ ర్యాంకులకు సీటొచ్చే వీలుంది. రిజర్వేషన్ విభాగంలో ఏకంగా 2,96,201 ర్యాంకు వరకూ సీటు వచ్చింది. తిరుచ్చి, సూరత్‌కల్, క్యాలికట్, నాగపూర్ వంటి ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఎన్ఐటీల్లో ఓపెన్ కేటగిరీ విద్యార్థులు కూడా జేఈఈ ర్యాంకు గరిష్టంగా 50,000 దాటినా సీటు సంపాదించిన ఉదంతాలున్నాయి. కాబట్టి కోరుకున్న బ్రాంచీ, ఏ కాలేజీలో వస్తుందనే కసరత్తు చేయడం ముఖ్యం. ఈ లాజిక్ తెలిస్తే ప్రిపరేషన్ అందుకు తగ్గట్టుగా ఉండే వీలుందని నిపుణులు అంటున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.